# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక జూన్, 2013 ₹ 20



నిదుర ఒడిలో...

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 24 జూన్ 2013 సంచిక 6**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

**Bapanna Alapati**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)

LCCN 91-903060


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........................................ 3

జ్ఞానపీఠ పురస్కారానికి ఎంపికైన రావూరి భరద్వాజతో .................................. ..5

ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము(బాలాంత్రపు రజనీకాంతరావు)..12
- *ప్రొ॥ రావినూతల సత్యనారాయణ*

ఆగ్నేయ ఆసియాలో కవిత్వం........................ 21
- *ముకుంద రామారావు*

మేము-మా మిత్ర మండలి ........................... 31
- *గొర్రెపాటి వెంకట సుబ్బయ్య*

తెలుగు భాషలోని మాండలికాలు ..................... 38
- *ఎలవర్తి విశ్వనాథరెడ్డి*

జీవితానికి-సమాజానికి వారధి శివారెడ్డి కవిత్వం.... 41
- *పెన్నా శివరామకృష్ణ*

తెలుగు పలుకుల పూదోట-యశస్వి యస్వీ......... 48
- *గంగిశెట్టి లక్ష్మీనారాయణ*

భారతీయ సంస్కృతి పరిణామ క్రమాలు! ............ 51
- *గొల్లపూడి మారుతీరావు*

సింహగిరి వచనాలు .................................. 57
- *మణ్ణి వెంకట నరసింహారెడ్డి*

హిందూస్థానీ-కర్ణాటక : ఆచార్య బృహస్పతి వాదం. 60
- *నండూరి పార్థసారథి*

జ్ఞాపకాలలో ఘంటసాల .............................. 65
- *కోడూరు పుల్లారెడ్డి*

కవిత్వం ఒక ఆల్కెమీ-మరణం ఒక మిస్టరీ ......... 67
- *ముక్తవరం పార్థసారథి*

కట్టుబాట్లతో కాపురం - అదే అక్బర్ అంతఃపురం .. 70
- *ఈమని శివనాగిరెడ్డి*

మునిమాణిక్యం ........................................ 73
- *వి. ప్రమోద్ కుమార్*

తాతాచార్యులు (సమీక్ష)............................... 75
- *కాండ్రేగుల నాగేశ్వరరావు*

చదవండి (పుస్తక పరిచయం)........................ 76

పిటకేతర సాహిత్యం ................................. 78
- *ఎమ్. రాజగోపాలరావు*


| | | | |
|---|---|---|---|
| *ముఖచిత్రం* : | మెగ్దలీనా — | *చిత్రకారుడు* | ... *టీషియన్* |
| *రెండవ అట్ట* : | నిదుర ఒడిలో | ” | ... *ఆల్మా తడేమా* |
| *మూడవ అట్ట* : | కలల జడిలో | ” | ... *సెర్జి మార్షనికొవ్* |
| *నాల్గవ అట్ట* : | సొగసు తడిలో | ” | ... *సెర్జి ఇగ్నటెంకొవ్* |


*వివరాలు :* 30వ పుటలో...

*సాహిత్య హాలికులందరూ ఆశించే జ్ఞానపీఠ పురస్కారానికి ఎంపికైన రావూరి భరద్వాజ సాహితీ ప్రస్థానం **'మిసిమి'** సంస్థాపక సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ సహకారంతో మొదలయిందని రావూరి మాటల సందర్భంగా చెప్పటం **'మిసిమి'** కెంతో ఆనంద దాయకం! వారితో ముచ్చటించిన కొన్ని భాగాలు, వారు 'రవీంద్ర స్మృతికి' (2001) వ్రాసిన తమ జ్ఞాపకాలను పాఠకులకు అందిస్తున్నాం.*

*ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, రావూరికి జ్ఞానపీఠ పురస్కార కమిటీ వారు అందించే పదకొండు లక్షలకు మించి, మరో పన్నెండు లక్షల రూపాయలు అందజేయబూనటం ఆహ్వానించదగినది.*

*క్రీడాకారులకు ప్రోత్సాహకంగా ఎన్నో లక్షలు కుమ్మరిస్తున్న ప్రభుత్వాలు, ప్రతిభావంతులైన సాహిత్యకారులను సముచిత రీతిని సత్కరించి, ఆర్థిక సహకారం అందించడం కనీస ధర్మం. రావూరి భరద్వాజ విషయంలో, మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇక ముందు కూడా కొనసాగించాలని, **'మిసిమి'** సంపాదక వర్గం ఈ దిశగా తగిన కృషి చేసిందని చెప్పటానికి సంతోషిస్తున్నాం.*

*బాలాంత్రపు రజనీకాంతరావు వ్రాసిన 'ఆంధ్ర వాగ్గేయ కారుల చరిత్ర' కేంద్ర సాహిత్య అకాదెమీ పురస్కారం పొందింది. దీనిని రావినూతల సత్యనారాయణ సమగ్రంగా సమీక్షించారు. 'భారతీయ సంస్కృతి పరిణామ దశ'లను గొల్లపూడి మారుతీరావు పరిశీలించిన తీరు చదవండి.*

*మహానుభావుల కలయిక కూడ చరిత్రే. మునిమాణిక్యం నరసింహారావు కి నరసరాజు ఆతిథ్యం అలాంటిదే.*

*నాలుగు దశాబ్దాల క్రిందట మరణించిన పాబ్లో నెరుడా మృతి ఇప్పుడు ఒక రహస్య పరిశోధనాంశంగా తేలింది. ఆ వివరాలు పాఠకుల కోసం.*

***– సంపాదకులు***

# కమ్మతెమ్మెరలు

✶ "...మే నెల 2557వ బుద్ధ జయంతి ప్రత్యేక సంచిక బుద్ధుని జీవితానికి సంబంధించిన చిత్రాలు, బుద్ధుని ముఖ్యమైన బోధనలు– సమానత్వం, శాంతి, రాగద్వేషాలను విస్మరించుట, జ్ఞానం అనే పునాది మీద ధర్మాన్ని నిలుపుట, ఇంకా ఎన్నో వ్యాసాలను, రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మాగాంధీ, అంబేద్కర్ మొ॥న వారి రచనల నుండి, జపాన్‌లో ఉన్నటువంటి జన్ బౌద్ధ సాహిత్యం వరకూ ఎందరి అభిప్రాయాలనో తెలియజేసే వ్యాసాలను అందించి, ఎంతో ఉత్కంఠని, ఆసక్తిని కలిగించారు. ***మిసిమి*** ఇటువంటి ప్రత్యేక సంచికలు ఎన్నో వెలువరించాలని కోరుకుంటున్నాను..."

**– కె. విజయ చౌదరి,** హైదరాబాదు.

✶ "...***మిసిమి*** ఏప్రిల్ సంచికలో ఎన్నో విలువైన వ్యాసాలు ప్రచురించినందుకు ధన్యవాదాలు. ముకుంద రామారావు *అరబ్బీ కవిత్వం* గురించి రాసిన వ్యాసం బావుంది. గోపీచంద్ రాసిన *పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా* నవల గురించి సమీక్ష సమగ్రంగా ఉంది. సత్యనారాయణగారు అభినందనీయులు. 'చైతన్య స్రవంతి' టెక్నిక్‌తో *మూడో వ్యక్తి* అని నేను రాసిన కథ 1999లో ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయినదని చెప్పడానికి సంతోషిస్తున్నాను. సాహిత్య వ్యాసాల పరంగా ఇప్పుడు వచ్చే పత్రికలన్నింటిలోకి ***మిసిమి*** ధృవతారగా వెలుగుతోందంటే అతిశయోక్తి కాదు..."

**– మూల వీరేశ్వర రావు,** బెర్హంపూర్.

✶ "...బౌద్ధ సంచికలోని వ్యాసాలు – రచనలు బౌద్ధాన్ని మళ్ళీ తెలుసుకోవాలని ఎంతో ఉత్సుకతను కల్గిస్తున్నాయి– మీరు ఏరి కూర్చి వేసే రచనల ఉద్దేశ్యం నెరవేరుతుంది. ఇక బొమ్మల సంగతి – మీరు ఎలా ఎక్కడ సేకరిస్తున్నారో ఆశ్చర్యం – అవి అద్భుతంగా – కొత్తగా – అందంగా అర్థవంతంగా వుండి నయనానందం కలిగిస్తున్నవి..."

**– తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి,** రాజమండ్రి.

✶ "...***మిసిమి*** మే నెల ప్రత్యేక బుద్ధ జయంతి సంచిక ఈ రోజే వచ్చింది. ముందుగా అట్టమీద బొమ్మలు ఆకట్టుకున్నాయి. సిద్ధార్థ గౌతముడు బుద్ధత్వం పొందకమునుపు కౌమార దశలోని బొమ్మలతో ఒక కొత్త అనుభూతినందించారు. ఇంకా లోపల, మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, అంబేద్కర్ వంటి మహామహులు బౌద్ధంపై తమ అభిప్రాయాలను తెలియజేసిన తీరు, మాలాంటివారికి ఎంతో మార్గదర్శకం...

... ముఖ్యంగా మిమ్మల్ని అభినందించవలసింది దాదాపు అన్ని పుటల్లో బుద్ధుని జీవితఘట్టాలను బొమ్మలుగా ప్రచురించటం. యశోధర, రాహులునికి భిక్షువుగా శిష్యులతో సాగిపోతున్న తండ్రిని చూపిస్తున్న చిత్రం నా కన్నుల్లో నీరు తెప్పించింది. మిగతా చిత్రాలు వేటికవే సాటి. పిటకేతర సాహిత్య వ్యాసం నా వరకు నారికేళ పాకంగా వుంది. అయినా తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. ఇంత చక్కటి బుద్ధపూర్ణిమ సంచికను వెలువరించిన మీకు నా ధన్యవాదాలు..."

**– లక్ష్మణ పటేల్,** పాల్వంచ.

✶ "...సంపాదక మహాశయా నమస్కారం! **మిసిమి** మార్చి సంచికలో గొల్లపూడి మారుతీరావు రచన
*థర్టీనైన్ స్టెప్స్* చదివాక – మన తెలుగు నాటకరంగం తన పయనాన్ని వేగవంతం చేయాల్సిన
అవసరం వుందని భావిస్తున్నాను. తెలుగు నాటకరంగంలో కృషి చేస్తున్న నటీనటుల నుండి టెక్నీషియన్ల
వరకూ లండన్ థియేటర్స్ వారి ప్రతిభను అభినందించడమే కాదు – మనమూ వారి కౌశల్యాన్ని
అందుకోవడానికి కృషి చేయాలనిపించింది...

... *మధ్య ప్రాచ్యంలో అరబ్బీ* కవిత్వపు లోతులు – చవి చూపిన ముకుంద రామారావు అభినందనీయులు...

ఏప్రియల్ నెల సంచికలో *ఉగాదికి ఆది శక సంవత్సరాది* గురించి తెలుసుకోదగిన విషయాలు
అనేకం. శివనాగిరెడ్డి తన ప్రతిభకు తగిన రచనలు మరిన్ని అందించాలని ఆశించడంలో తప్పు
లేదనుకుంటాను... ఇదే సంచికలో *విషాద నాటకాల* గురించి మృణాళిని రచన చదువ దగిందే. కాని,
ఇంకా విశ్లేషణాత్మకంగా రాసివుంటే బావుండేది...

... *ఎన్వీ రామారావు*ను బాలి సరికొత్తగా పరిచయం చేశారు. తన *జీవితాన్నే చరిత్రగా మలుచుకొన్న*
*ధన్యజీవి* – అక్కినేని వారితో **మిసిమి** ఇంటర్వ్యూ; యింతకాలంగా తన అంతరంగంలో దాగిన
బాధను, భావాలను ఎంతగానో కదిలిపోయి చెప్పడం సాహసమే!...

... తన మేనమామ కూతుర్ని తనకు యివ్వటానికి ఒప్పుకోని దుస్థితిని ఎదుర్కోవడానికి ఎంతో
సంయమనం కావాలి. తనూ–తన తల్లి ఎంతగా బాధపడిపోయారో! అమ్మ, నాన్న పైన
మేనమామలుండాలంటారు. మరిదేమిటి? శిఖరాగ్రం చేరుకోవడానికి ఎక్కిన ఎత్తు పల్లాలు బాధించే
సంఘటనలు– అయినవారివి, కానివారివి ఎన్నో వ్యాఖ్యానాలను ఎదుర్కొనవలసి ఉంటుంది. బంధువుల
చూపులు గూడ ఓ నికృష్టుణ్ణి చూసినట్లుగా తనను చూశారనడం, అబ్బ! నాగేశ్వరరావుగారి జీవితం
పూలపాన్పే అనుకున్నాం కానీ, యింత హాలా హలాన్ని యింతకాలంగా తనలో ఇముడ్చుకున్నాడన్న
విషయం అభిమానులకు తెలియనే తెలియదు. ఎన్నో నైచ్యపు అనుభవాలను ఎదురు చూడవలసి
రావడం దురదృష్టకరం. తన పదేళ్ల వయస్సులోనే తల్లి, సోదరుడితో, తండ్రి నుండి దూరంగా వైదొలిగి
పోవడం మరింత విషాదం. ఇల్లు అమ్మి అప్పు తీర్చడం లాంటి విషయాలు – ఒక విజేత తన వెనుక
ఎన్ని విషాదకర ఘటనలు చోటు చేసుకున్నాయో చెప్పడానికి ఎంతో ధైర్యం కావాలి... నాగేశ్వరరావు
గారి చలనచిత్ర జీవితానికి ఒక్క *దేవదాసు*– ఒక్క *బాటసారి* చాలదా – తెలుగు ప్రేక్షకుల మదిలో
సదా నిల్చి వుండడానికి!... నటసామ్రాట్ ద్వారా ఎన్నో కొత్త విషయాలను చెప్పించిన **మిసిమి**కి
అభినందనలు...

... 2557 బుద్ధ జయంతి సంచిక – ముఖచిత్రం మహాభినిష్క్రమణం నేపథ్యంలో పూర్ణ చంద్రుణ్ణి
చిత్రించడం ఎంత యాదృచ్ఛికమో అంత అర్థవంతం! బుద్ధుడు ఆవిర్భవించింది–నిష్క్రమించింది
వైశాఖ పౌర్ణమి అన్న విషయం పాఠకులు మదిలో గుర్తుంచుకుంటే చాలు. అజ్ఞాత చిత్రకారుడికి
అభినందనలు అందచేయలేని అశక్తుణ్ణి. ఎన్నో వ్యాసాలు! అన్నీ బుద్ధుణ్ణి గురించే –

... ఏ శషభిషలూ పోకుండా, అందరికీ లలిత లలితంగా – అలవోకగా బౌద్ధం గురించీ, జీవనవిధానాన్ని
గురించిన మంచి రచన గువ్వల కోటయ్యగారి 'మార్గదర్శి'..."

– **గుడిపూడి సుబ్బారావు**, హైదరాబాదు.



### జ్ఞానపీఠ పురస్కారానికి ఎంపికైన

# రావూరి భరద్వాజతో...

*అందరూ మరిచి పోయిన రావూరి భరద్వాజ, జ్ఞానపీఠ పురస్కార గౌరవానికి ఎంపిక కావటం ఎందరినో ఆలోచనలో పడవేసింది. మరెందరికో 'కంటికి నిద్ర రాదే..' చేసింది. తెలుగు 'వాడి'ని అందలమెక్కించి జ్ఞానపీఠానికి అలంకారం చేసింది.*

*నిజాయితీగా బ్రతకటంలోని ధృతిని, జీవితాన్ని కాచి వడపోసిన రచనల్లోని ఫిల్టర్ కాఫీ రుచిని తెలిపిన రావూరి, చీకటి బ్రతుకుల్లోని 'పాకుడు రాళ్లను', జారుడు బండలను వెలుగులోకి తెచ్చిన ఒక సామాన్య వ్యక్తి, నిగర్వి, ఎంత కష్టంలోను తననూ, తన తోటి వానినీ తప్ప ఏ రాయినీ నమ్మని రాయిస్టు – రావూరి. వారి అసలు పేరు గోవిందాచారి – 'భరద్వాజ' పేరును ఆత్రేయ సూచించినట్లు చెప్పారు.*

*గత రెండు మూడేళ్లలో రావూరి భరద్వాజను తలచిన వారు అరుదు. (**మిసిమి** వీరి ప్రసంగ వ్యాసాన్ని 2010 సెప్టెంబరు సంచికలో ప్రత్యేక చిత్రంతో ప్రచురించింది). గత కొన్నేళ్ళుగా ఆయన రాసిందేమి లేదు. గత అర్ధ శతాబ్దంగా, ఆయనను రచనకు ప్రోత్సహించిన స్థితిగతులను, పరిస్థితులను తెలుసుకుంటే 'ఔరా' అని అనకుండా ఉండలేము. ఎటువంటి 'గతి' లోను తలవంచని ఆయన ధీరత్వానికి 'ఓహో' అని అనకుండానూ ఉండలేము.*

*పురస్కారాలు కూడా పాకుడు రాళ్ళ వంటివే– రావూరికి కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారం, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు డాక్టరేటు, ఇప్పుడు జ్ఞానపీఠం – ఇవి వారి నిజాయితీకి, నిబద్ధతకు, ప్రతిభకు గీటురాళ్లు.* **– మిసిమి**

**రావూరితో ఒక ఉదయం :**

అప్పటికే అక్కడ ఫొటోగ్రాఫర్ భరత్ భూషణ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లెన్స్‌మన్, మరికొందరు ఔత్సాహికులు ఉన్నారు. ఉదయం ఎనిమిది గంటల సమయం. ఆ చిన్న ఇంటి గోడలకు కొత్తగా పసుపు రంగు వేసి ఉంది. ఆ లోపలే జ్ఞానపీఠం పురస్కారానికి ఎంపికైన రావూరి భరద్వాజ సేదదీరుతున్నారు.

మా అభినందనలు అందజేసి ఆయనతో మాటామంతీ జరిపాం. అందులో కొన్ని భాగాలు :

***మిసిమి :*** ఈ పురస్కారం మీకెంతో ఆనందాన్ని తెచ్చిందనుకుంటాను. ఇంతకు ముందు మీరు ఇలా ఆనందాన్ని పొందిన సందర్భమేమైనా ఉందా?

**రావూరి :** ఆఁ వుంది. నాకు రేడియోలో ఉద్యోగం వచ్చినప్పుడు. అప్పటికి నా నెల ఖర్చు ఎనభై రూపాయలు. రేడియోలో జీతం నూట ఎనభై. నా భార్య కాంతాన్ని అడిగాను 'ఈ మిగతా డబ్బులు ఏమి చేద్దాం' అని!

***మిసిమి :*** మీ మొదటి సంపాదన గురించి చెప్పండి.

**రావూరి :** 1947–48 ప్రాంతాల్లో నేను నెల్లూరు, ఒంగోలు, తాడికొండలలో తిరుగుతున్నపుడు నాకు తెనాలి జ్యోతి పక్షపత్రిక నుంచి ఒక కార్డు వచ్చింది. అందులో ఉన్నది ఇప్పటికీ నాకు గుర్తే. అది నన్ను వెంటనే తెనాలి రమ్మని

ఆలపాటి రవీంద్రనాథ్ కబురు. ఆ విధంగా *జ్యోతి, రేరాణి, సినీమా* పత్రికలలో పనికి చేరాను. అంటే ప్రూఫ్ రీడింగ్, ఎక్కడైనా నాలుగైదు లైన్లు ఎక్కువైతే తగ్గింపు. నాకు నెలకి ఇరవై అయిదు రూపాయలు జీతం. ముప్పై రోజుల భోజనానికి ముప్పై రూపాయలు టికెట్లు. నాకు అయిదు రూపాయలు తగ్గింపు ఇచ్చారు. అప్పటికి నాకు బీడీలు అలవాటుంది. 'అయ్యా, ఇరవైఅయిదు రూపాయలు మీకిస్తే నాకు బీడీలకు ఏమీ మిగలవు. ఎంతైనా తగ్గించ'మని అడిగాను. అప్పుడు హోటలాయన అయిదు రూపాయలు తగ్గించి ఇరవై రూపాయలకే ముప్పై టిక్కెట్లు ఇచ్చాడు. ఈ విధంగా ఒక ఆరునెలలు ఆలపాటి రవీంద్రనాథ్ గారి దగ్గర పనిచేశాను. అప్పుడప్పుడు కథలు కూడా వ్రాసేవాణ్ణి.

ఈ ఉద్యోగానికి అంతరాయం నాలుగు గుండు సూదుల మూలంగా కలిగింది. నాతో పాటు *జ్యోతి ప్రెస్‌*లో పనిచేసే కుర్రవాడు (పేరు గుర్తులేదు) ఒకరోజు ఉదయం 'అయ్యా! ఇక్కడ నాలుగు గుండుసూదులు పెట్టాను. ఇప్పుడు రెండే ఉన్నాయి. మిగతా రెండు మీరు తీశారా' అని అడిగాడు. 'అరె! ఇక్కడ యాభై రీములు పేపరుంది. డెబ్భై పుస్తకాలున్నాయి. నాకు ఈ రెండు గుండుసూదులే కావాలా?' అని కొంత నొచ్చుకున్నాను. తరువాత ఏమి జరిగిందో నాకంతగా గుర్తులేదు కాని నేనక్కడ ఉద్యోగం మానివేయటానికి ఇదీ ఒక కారణం. అయినా నేను రవీంద్రనాథ్ గారిని అంటిపెట్టుకునే ఉన్నాను. నెలకి రెండు మూడు కథలు వ్రాసి యిచ్చేవాణ్ణి. కథకు పది రూపాయల లెక్కన నాకు ముప్పై, నలభై రూపాయలు ఇచ్చేవారు, కథలు వారు వేసుకున్నా, వేసుకోకపోయినా, అదే వారి ఔదార్యం.

తెనాలిలో ఉన్నప్పుడే నాకు ధనికొండ హనుమంత రావు, త్రిపురనేని గోపీచంద్ పరిచయ మయ్యారు. తరువాత ఆ పరిచయంతో ధనికొండ హనుమంతరావు మద్రాసు పిలిపించారు. అక్కడ ఆయన మూడు పత్రికలు నడిపేవారు. అవి : *జ్యోతి, అభిసారిక, చిత్రసీమ.* కోగంటి రాధాకృష్ణగారి *నలంద ప్రెస్‌*లో ఇవి ముద్రించేవారు. *చిత్రసీమ* పత్రిక ద్వారా నాకు చాలా మంది సినిమా జనం పరిచయ మయ్యారు. నేను ఏది రాసినా బ్రహ్మాండంగా ఉందనేవారు. వారి వ్యక్తిగత విషయాలే కాక ఇతరుల విషయాలు కూడా ఎన్నో నాకు చెప్పేవారు. ఇవన్నీ నా రచనలకెంతో ఉపయోగపడినాయి.

***మిసిమి*** **:** మీ మొదటి కథ? అది ఎందులో అచ్చయింది.

**రావూరి :** నా మొదటి కథ *విమల* 1946 ఆగష్టు నాలుగవ వారంలో బెజవాడ నుంచి వస్తున్న గూడవల్లి రామబ్రహ్మంగారి *ప్రజామిత్ర*లో అచ్చయింది. దానికి నాకు పది రూపాయలు పారితోషికం వచ్చినట్లు గుర్తు. తరువాత భారతిలో ఒక కథ అచ్చయింది. దాని పేరు *పరిస్థితుల వారసులు.* నేను రాసిన మొదటి సినిమా కథ *మాయ జలతారు.* అది మల్లంపల్లి సోమశేఖర శర్మ అచ్చువేశారు. నాకు డైరీ రాసే అలవాటు మొదటినుంచి ఉంది. నా డైరీలోని విషయాలు కూడా నా రచనలకు ఎంతో ఉపయోగపడినాయి. నా రేడియో ఉద్యోగం నన్ను హైదరాబాదు తీసుకువచ్చింది. 1959, నవంబరు-డిసెంబరులలో హైదరాబాదులో త్రిపురనేని గోపీచంద్ ద్వారా రేడియో ఉద్యోగంలో చేరాను. అక్కడ నాకు వారితో పాటు బుచ్చిబాబు, ఆచంట సూర్యనారాయణ, (బెజవాడలో పనిచేసేవారు) వీరందరూ నాకెంతో సహకరించారు.

***మిసిమి*** **:** మీరు రేడియోలో చేసిన కొన్ని కార్యక్రమాలు చెప్పగలరా?

**రావూరి :** ఆc, మహనీయుల మహితోక్తులు : ఈ శీర్షిక కింద ఎన్నో మంచి మాటలు, సూక్తులు శ్రోతలకు అందించేవాణ్ణి. ఇది కాక ఉచ్చారణ మీద, కొన్ని తెలుగు పదాలకు నానార్థాలు ఇలాంటి కార్యక్రమాలు కొన్ని చేశాను. నేను ఈ విధంగా ఇరవైయేళ్లు ఆకాశవాణిలో హైదరాబాదులోనే పనిచేసి విశ్రాంతి తీసుకున్నాను.

***మిసిమి*** **:** మీరేమైనా అనువాదాలు చేశారా?

**రావూరి :** ఒకే ఒకటి చేశాను. అది *రిటర్న్ ఆఫ్ ది రెడ్ రోజ్.* నేను ఎక్కువ ఆంగ్ల సాహిత్యం చదవలేదు. ఒకవేళ బలవంతాన చదివినా అది ఆకళింపు చేసుకొని ఆనందించే శక్తి నాకు లేదు. అందుకని అనువాదాల జోలికి పోలేదు. అలా అని అసలు చదవలేదని కాదు. ఎక్కువగా రష్యన్ రచయితల (రచనల) ఆంగ్లానువాదాలు చదివాను.

***మిసిమి*** **:** మీకు తెలుగులో యిష్టమైన రచనలేవి?

**రావూరి :** ప్రాచీన సాహిత్యంలో *కళాపూర్ణోదయం, వేమన శతకం,* మరికొన్ని *శతకాలు,* కృష్ణశాస్త్రి రచనలు, నండూరి వారి *ఎంకి పాటలు*-ఇప్పటికీ నాకు గుర్తే 'ఎన్నెలంతా మేసి ఏరు నెమరేసింది' అనేవి ఎంత చక్కని పదాలు!

గోపీచంద్ రచనలు, మునిమాణిక్యం *కాంతం కథలు.*

కాంతం- నా భార్య, నాకు వరం. నా వివాహం 1948, మేలో తోటవరప్పాడులో జరిగింది.

***మిసిమి :*** మీ సంతానం...

**రావూరి :** నాకు నలుగురు కొడుకులు. పెద్దవాడు రవీంద్రనాథ్. నాకు మొదటి ఉద్యోగం ఇచ్చి ఆదుకున్న ఆలపాటి రవీంద్రనాథ్ పేరు పెట్టాను.

రెండవ వాడు గోపీచంద్. అదికూడా నాకు రేడియోలో ఉద్యోగం ఇచ్చి నా జీవితాన్ని దారిలో పెట్టిన త్రిపురనేని గోపీచంద్ పేరు.

మూడవ వాడు బాలాజీ. మద్రాసులో నాకు, నా కుటుంబానికి ఎంతో వైద్య సేవచేసిన వైద్యులు గాలి బాలసుందరరావు పేరు కలిసేట్లు బాలాజీ అని పెట్టాను. నాలుగవ వాడు వెంకట కోటేశ్వరరావు. కోటేశ్వరరావు మానాన్నగారి పేరు. ఇప్పుడు నేను వున్న యీ ఇల్లు నాకు చిననాటి మిత్రులైన ఆలపాటి వెంకట్రామయ్య (ఒకనాటి పురపాలక శాఖామాత్యులు) ఇప్పించారు. ఆయన పేరు కలిసేట్లు వెంకట కోటేశ్వరరావు అని పెట్టాను.

***మిసిమి :*** మీ మత విశ్వాసాలు?

**రావూరి :** నేను పరమ నాస్తికుణ్ణి. పూజలు-పునస్కారాలు, దేవుడు-దయ్యాలను నమ్మిన వాణ్ణి కాదు. అయితే గత నాలుగైదేళ్ళుగా నాకు ఆధ్యాత్మిక పరమైన ఆలోచనలు, చింతనలు కలుగుతున్నాయి. ఇవి కూడా కాశీ వెళ్ళి గంగలో మునగాలనో, రామేశ్వరం వెళ్ళి పాపాలు కడిగేసు కుందామనో కాదు. ఈ ఆధ్యాత్మిక ఆలోచనలు మానసిక నెమ్మది కోసం. పరలోక చింతనగాని, రంభా మేనకల పొందు కోసం కాదు. ఇది నిర్మలమైన ఆధ్యాత్మిక ఏకాంతమే. మి

---



# నా స్మృతి పథంలో... రవీంద్రనాథ్ ఆలపాటి

***– రావూరి భరద్వాజ***

**అ**మ్మతోడు!

మీ మీద వొట్టేసి చెబుతున్నాను! చాలా విషయాలు నాకు తెలియనట్లే, కథలను గురించి కూడా తెలీదు.

నా చిన్నప్పుడు, మా అమ్మమ్మ, మా నాన్న, ఉయ్యాల లూపుతూ చాలా కథలు చెప్పారు అవన్నీ నాకు నచ్చాయి. "ఎందుకు నచ్చాయని" అడక్కండి. నేను చెప్పలేను.

కాస్త ఎదిగాక, బడికెళ్ళడం మానేశాను. మానేశాక జీవితం చాలా కథలు చెప్పింది. ఆ కథలు ఎంత చేదుగా ఉన్నాయో, ఎంత మంటగా ఉన్నాయో ఎంత దుస్సహంగా ఉన్నాయో, ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడు కూడా నేను చెప్పలేను. కాకపోతే సూక్ష్మంగా సూచించగలను.

నేను కథలు రాస్తానని, నన్ను తెలిసిన వాళ్ళు అనుకోలేదు; నేనూ అనుకోలేదు. కానీ రాశాను. రాశాక మిత్రులకు వినిపించాను. వారేమో, 'ఆహా?' అనో 'ఛా ఛా' అనో అన్నారు.

'ఛా ఛా' అనిపించుకొన్న కథలను తిరగరాశాను. 'ఆహా' అనిపించుకున్న కథలను పత్రికలకు పంపించాను.

మీరు నమ్మండి !

కథలు రాయడం తెలియనట్లే, రాసిన వాటిని పత్రికలకు పంపించడం కూడా నా కప్పట్లో తెలియదు!

పత్రికలకు పంపించిన వాటిల్లో కొన్ని కథలు తిరిగొచ్చాయి. అవి అలా ఎందు కొచ్చాయో కూడా నా కప్పట్లో తెలియదు!

1946 ఆగష్టు 25వ తేదీతో ఉన్న *ప్రజా మిత్ర* వార పత్రిక పోస్టులో నా కొచ్చినపుడు, ఎందు కొచ్చిందో తెలీదు.

రేపర్ చింపి చూశాను. రెండవ పేజీలో *విమల* అన్న

నా కథ అచ్చయి ఉంది. అచ్చులో నా కథను చూసుకోవడం అదే మొదటి సారి.

1946 చివరిలో, యువజన శిక్షణ పొందడం కోసం నెల్లూరు వెళ్లాను. అక్కడికి చాలామంది నాయకులొచ్చారు. అలా వచ్చిన వారిలో ఆచార్య రంగాగారొకరు. వారు – మా నాన్నకు దగ్గర వారు. ఆర్థికంగా నేను పడుతున్న యాతనలు చూసి, నెల్లూరు వెంకట్రామానాయుడు గారికి నన్ను పరిచయం చేశారు. దాని ఫలితంగా *జమీన్ రైతు* వార పత్రికలో, నాకో చిన్న ఉద్యోగం దొరికింది. అందువల్ల నా యాతనలు కాస్త సద్దుమణిగాయి.

ఆ ఉద్యోగంలో 1947 చివరి దాకా ఉన్నానని గుర్తు.

అప్పట్లో – తెనాలి నుండి ఓ కథల పత్రిక వస్తుండేది. దాని పేరు *జ్యోతి!* అది 'పక్ష పత్రిక – నిష్పాక్షికం' అని కింద ఎంబ్లం ఉండేది. సంపాదకులు : రవీంద్రనాథ్.

*జమీన్ రైతు* పత్రికలో పని చేస్తూనే, తీరిక సమయాల్లో కథలు రాస్తుండే వాణ్ణి. అలా రాసిన వాటిల్లో ఒక దాన్ని *జ్యోతి* పత్రికకు పంపించాను. రెండు మూడు వారాల తరువాత, ఆ కథ అచ్చయింది. దాని పేరు *దేవుడు పుట్టాడు.* ఆ కథకు అయిదు రూపాయల ప్రతి ఫలం కూడా నాకు లభించింది. "కథలు రాస్తే డబ్బులు కూడా వస్తాయి" అన్న విషయాన్ని అప్పుడే తెలుసుకొన్నాను.

ఆ తరువాత చాలా కథలు *జ్యోతి* లో వచ్చాయి. పక్ష పత్రిక *జ్యోతి* ముందుగా వచ్చింది. *రేరాణి* అన్న మాస పత్రిక ఆ తరువాత వచ్చింది.

ఈ రెండు పత్రికలూ, ఆ రోజుల్లో గొప్ప సంచలనాన్ని సృష్టించాయి. ఈ రెండింటి సంపాదక వర్గంలో, ధనికొండ హనుమంతరావుగారుండేవారు.

రకరకాల కారణాల వల్లా, నేను *జమీన్ రైతు* పత్రికలో ఉద్యోగం మానుకోవలసి వచ్చింది. పెళ్ళకూరు గోపాల కృష్ణారెడ్డిగారు ప్రారంభించిన *దీనబంధు* వార పత్రికలో చేరాను. అక్కడున్నప్పుడే, ఓ చిన్న ప్రేమ వ్యవహారంలో ఇరుక్కొన్నాను. విధిలేక ఆ ఉద్యోగాన్ని వొదిలేసి, మా స్వగ్రామం తాడికొండకొచ్చేశాను.

తాడికొండలో చాలా రకాల పనులున్నమాట నిజమేగానీ, అవేవీ నేను చేయలేను. నేను చేయగలిగిన పనులేమో తాడికొండలో లేవు. అందువల్ల తిండికీ, గుడ్డకూ నానా అవస్థలూ పడ్డాను.

"మన కోటయ్యగారబ్బాయి రాసిన కథ పత్రికల్లో వచ్చిం"దన్న ప్రచారం నా కడుపు నింపలేదు. నాకో మూరెడు గుడ్డను, బారెడు నీడను ఇవ్వలేదు.

సరిగ్గా – ఆ క్లిష్టదశలోనే, మా వూరి పోస్టు మాస్టరు పున్నయ్యగారు నాకో ఉత్తరమిచ్చారు.

అది – *జ్యోతి* పక్షపత్రిక నించి వచ్చింది !

అందులో ఉన్న పంక్తులు నాకిప్పటికీ గుర్తున్నాయి. ఎప్పటికీ గుర్తుంటాయి...

*"మిత్రులు భరద్వాజ గారికి*

*ఈ ఉత్తరం అందగానే, తగినన్ని గుడ్డలు తీసుకొని తెనాలి కొచ్చేయండి."*

మీ

**ఆ. రవీంద్రనాథ్**

ఆ చిన్న కార్డు, ఆ కార్డులోని పంక్తులు, నా జీవితాన్ని అద్భుతంగా మార్చేశాయి.

తెనాలి, నాకు మరీ కొత్తదేం కాదు. ఎప్పుడైనా వెళ్లినా, ఒకటి రెండు పూటల కన్నా ఎక్కువ ఉండే వాణ్ణి కాదు. అంతకు మించి ఉండవలసి వస్తే, హోటల్లో తిని, రైలు స్టేషన్లో పడుకునే వాణ్ణి!

తెనాలి – ఓ రకంగా నాకు అమ్మ వొడి లాంటిది.

అక్కడ నాకు ఉద్యోగం దొరకడం నా అదృష్టం!

*జ్యోతి* కార్యాలయం, గాంధీచౌక్‌కు దగ్గరగా, మెయిన్ రోడ్డు మీద ఉండేది. రెండు షాపుల మధ్య, ఇరుగ్గా ఉండే సందులోంచి నాలుగడుగులు లోపలికొస్తే, విశాలమైన భవంతి, క్రింది భాగంలో ప్రెస్ ఉండేది. పైన రవీంద్రనాథ్ గారి గది. ఆ గదికి ముందు వరుసలో కుర్చీలు, బల్లలు, బీర్వాలు చిత్తువత్తుగా ఉండేవి. నా కుర్చీ, నా బల్ల, కింది భాగంలో ప్రెస్ నానుకొని ఉండేవి.

*జ్యోతి* పక్షపత్రిక, *రేరాణి* మాస పత్రికతో బాటుగా *సినీమా* అన్న మాస పత్రికను కూడా రవీంద్రనాథ్ గారు ప్రచురించేవారు. రవీంద్రనాథ్‌గారిని, దగ్గరగా ఎరిగిన వారెంత మంది ఇప్పుడున్నారో నాకు తెలీదు. వారు– సన్నగా, ఎత్తుగా, ఎర్రగా ఉండే వారు, ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. తనకిష్టమైన విషయాన్ని నవ్వుతూ ఆమోదించేవారు. తన కిష్టం లేని అంశాన్ని నవ్వుతూనే తిరస్కరించేవారు. ఎప్పుడూ నవ్వుతూ ఉండడంతో బాటుగా, ఎప్పుడూ సిగరెట్లు కాలుస్తూ ఉండేవారు.

తన ముందు కొచ్చిన వారు బయట వారయినా, తన ఉద్యోగులే అయినా, నవ్వుతూ ఆహ్వానించే వారు. నవ్వుతూనే సిగరెట్‌ను ఆఫర్ చేసేవారు. వారి ముందు సిగరెట్ కాల్చడానికి, ముందుగా నేనూ భయపడ్డాను. ఎంతయినా వారు యజమాని, నేను పనివాణ్ణి.

నా భయాన్ని పోగొట్టినవారు రవీంద్రనాథ్‌గారే! వారు, నేను, ధనికొండ, కొలను బ్రహ్మానందరావు, మాగాపు రామన్... కలసి ధూమ యజ్ఞం చేసేవాళ్ళం.

*జ్యోతి* ప్రధానంగా కథల పత్రిక. అయినా – అందులోనూ కవితలు, వ్యాసాలు, విమర్శలు, నాటికలు కూడా వస్తూ ఉండేవి. ఆనాటి ప్రసిద్ధ కథకులు చాల మంది జ్యోతికి రాశారు. చలం, కుటుంబరావు, గోపీచంద్, మల్లాది రామకృష్ణశాస్త్రి, పి.వి. సుబ్బారావు, జి.వి. కృష్ణరావు లాంటి వారు రాసేవారు. ఎంద రెందరో నూతన రచయిత లను తెలుగు పఠితులకు పరిచయము చేసిన ఘనత కూడా రవీంద్రనాథ్ గారిదే! ముఖ్యంగా శివం, పి.శ్రీనివాసరావు, శారద, ప్రకాశ రావు, శార్వరి, సులోచన,చౌడేశ్వరీ దేవి, హితశ్రీ లాంటి వారెందరో ఉన్నారు.

అప్పుడే – బెజవాడలో, ఆకాశవాణి కేంద్రం ఏర్పాటయ్యింది. అయ్యగారి వీరభద్రరావు, జనమంచి రామకృష్ణ, బుచ్చిబాబు, ఆచంట సూర్యనారాయణ మూర్తి, వింజమూరి శివరామారావు, ఇంకా చాలా చాలా మంది అందులో పనిచేస్తూ ఉండేవారు.

ఆ కార్యక్రమాలను గురించి, *జ్యోతి* పక్షపత్రిక, నిష్పాక్షికంగా విమర్శలు ప్రచురించడం ప్రారంభించింది. ఆ విమర్శలు రాసిన వారు కొప్పరపు సుబ్బారావుగారు, ప్రోత్సహించిన వారు ఆలపాటి రవీంద్రనాథ్ గారు.

ఈ విమర్శలను సమన్వయింప చేయడం కోసం, ఆకాశవాణి బెజవాడ కేంద్రం వారు, ప్రత్యేకంగా ఒక చర్చా కార్యక్రమాన్ని రూపొందించారు. అందులో కొప్పరపు సుబ్బారావు గారిని, ఆలపాటి రవీంద్రనాథ్ గారిని పాల్గొనేట్టు చేశారు. ఆ తరువాత వెలువడిన *జ్యోతి* పత్రికలో ఈ ప్రత్యేక కార్యక్రమం ఎంత చచ్చుగా, చప్పగా, నిర్జీవంగా ఉన్నదో రవీంద్రనాథ్ గారు అచ్చేశారు.



ఫోటో : ఎ.కె

నాకు తెలిసినంతలో, తెనాలి నుండి వెలువడిన తొలి సినిమా పత్రిక *సినీమా!* సంపాదకులు రవీంద్రనాథ్‌గారు.

నాకు తెలిసినంతలో తెనాలి నుండి వెలువడిన తొలి మనో వైజ్ఞానిక మాస పత్రిక– *రేరాణి* మాత్రమే! దీని సంపాదకులు రవీంద్రనాథ్ గారు. సిగ్మండ్ ఫ్రాయిడ్, హావలాక్ ఎల్లిస్, వంటి పేర్లను ఆనాటి తెలుగు వారి ముంగిళ్ళదాకా చేర్చిన వారు రవీంద్రనాథ్ గారు.

ఆ రోజుల్లో *రేరాణి* సర్క్యులేషన్ 15 వేల దాకా ఉండేది. దాదాపుగా ప్రతి సంచికలోనూ, చలం గారి కథో, చౌడేశ్వరీదేవిగారి కథో, లేదా నా కథో తప్పకుండా ఉండేది.

స్థలాభావం వల్ల, ఒక సంచికలో నా కథ అచ్చు

కాలేదు. చాలామంది పాఠకులు రవీంద్రనాథ్ గారికి ఉత్తరాలు రాశారు.

కృష్ణాజిల్లాలోని ఒకానొక జమీందారు కుటుంబీకులు *రేరాణి* పత్రికను రిజిస్టర్డ్ పోస్టుద్వారా తెప్పించుకోవడం నాకింకా జ్ఞాపకం ఉన్నది.

ధనికొండ హనుమంతరావు గారు విడిపోయి *అభిసారిక* పత్రికను సొంతంగా ప్రారంభించారు. ఇపుడు *రేరాణి* పత్రిక సంపాదకత్వ బాధ్యత యావత్తూ, కొలను బ్రహ్మానందరావు గారి మీదకు వాలింది. *జ్యోతి* పత్రికను పూర్తిగానూ, *రేరాణి* పత్రికలో కథా విభాగం వరకూ, నేను చూస్తూ ఉండేవాణ్ణి.

నేను *రేరాణి* పత్రికలో పని చేస్తున్నప్పటికీ, దానికి పోటీగా వచ్చిన *అభిసారిక* పత్రికలో కథలు రాయడానికి, రవీంద్రనాథ్ గారు ఎప్పుడూ అభ్యంతరపెట్టలేదు. ఆయన అనుమతి తీసుకొన్నాకనే, ఇతర పత్రికలకు నేను రచనలు పంపుతుండేవాణ్ణి. *రేరాణి, జ్యోతి* పత్రికలలో పని చేస్తున్నాను గనక, నేను రాసినప్పటికి ప్రతిఫలం తీసుకునే వాణ్ణి కాదు.

అప్పట్లో – నా జీతం నెలకు రూ. 25/- (పాతిక) రూపాయలు మాత్రమే! అందులో ఇరవై రూపాయలు భోజనానికి పోతే, మిగిలిన అయిదు రూపాయలు కాఫీలకూ, బీడీలకూ ఖర్చు చేసుకొనే వాణ్ణి.

ఏదన్నా గది అద్దెకు తీసుకొంటే నెలకు – అయిదు రూపాయలన్నా చెల్లించాలి. అంత శక్తి నాకు లేదు. అందుకని, *జ్యోతి* ప్రెస్‌లోనే పడుకొంటూ ఉండేవాణ్ణి. తాళాలు నాదగ్గరే ఉండేవి! రమారమిగా 9,10 మాసాలపాటు అంతా సవ్యంగానే ఉంది. అలాగే పదికాలాలపాటు కొనసాగుతుందను కొన్నాను. కానీ...

బైండింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఒక కుర్రవాడి ఆరోపణ కారణంగా, నేను నా ఉద్యోగానికి రాజీనామా చేశాను. రవీంద్రనాథ్‌గారు కూడా వెంటనే దాన్ని ఆమోదించారు.

ఇపుడు నాకు రెండు సమస్యలు ఎదురయ్యాయి. ఒకటి: తిండి, రెండు: నివాసం.

రెండవ సమస్యను శార్వరిగారు పరిష్కరించారు. మొదటి సమస్యను నా కథలు పరిష్కరించాయి.

ఉద్యోగం మానుకున్నా – దాదాపుగా రోజూ మేం కలుసుకొంటూనే ఉండేవాళ్ళం. కాఫీలు తాగుతూనే ఉండేవాళ్ళం. సిగరెట్లు కాలుస్తూనే ఉండేవాళ్ళం. ఉద్యోగం ప్రసక్తిని వారు గానీ, నేనుగానీ, ఎప్పుడూ రానివ్వలేదు.

ఇదివరకు– రెమ్యునరేషన్ తీసుకొనేవాణ్ణికాదు – అక్కడే పనిచేస్తున్నవాణ్ణి గనక ఇప్పుడు బయటివాణ్ణి గనక, అడిగి మరీ తీసుకోవడం ప్రారంభించాను.

*జ్యోతి* లో వచ్చిన కథకు రూ. 25/- లిస్తే, *రేరాణి* లో వచ్చిన కథకు రూ. 50/- లిచ్చేవారు.

నేను, శారద, తాళ్ళూరి నాగేశ్వరరావు, శార్వరి, అమరశ్రీ, వీరమల్లు రామకృష్ణ, కవిరావు, భుజంగరావు, నాగభూషణం ఆ డబ్బును హాయిగా ఖర్చు చేసుకొనేవాళ్ళం.

ఈ లోగానే, ఓ ఆపత్తు నన్ను ముసురుకొంది.

1948లో, 1949లోనో – సరిగ్గా గుర్తులేదు – రేరాణి పత్రికలో నాదో కథ అచ్చయింది. ఆ కథ పేరు *అలవాటయిన ప్రాణం* ఇతర కథలతో పోలిస్తే, అదేమంత ఘాటయింది కాదు. కానీ – పోలీసులు ఆ కథమీద కేసు పెట్టారు. ఈ ఆపద నుండి బయట పడడానికి, ఒకరిద్దరు న్యాయవాదులు నాకు ఉపాయాలు చెప్పారు.

"ఆ కథ నేను రాయలేదు" అని చెప్పమన్నారు.

నేనందుకొప్పుకోలేదు.

"రవీంద్రగారు బలవంత పెడితే రాశానని చెప్పండి. శిక్ష తగ్గుతుంది" అని చెప్పారు. దానికీ నేనొప్పుకోలేదు.

ఈ సంగతి రవీంద్రనాథ్ గారికి చెప్పాను.

"నీకేం ఇబ్బంది లేదు. నేను చూసుకొంటాను" అన్నారు రవీంద్రనాథ్‌గారు. కోర్టుకు హాజరయ్యాను. నాతోబాటు ధనికొండ హనుమంతరావు, కొలను బ్రహ్మానందరావు కూడా హాజరయ్యారు.

నాకు – అయిదు వందల రూపాయల ఫైన్ వేశారు. అది చెల్లించకపోతే, ఆరు మాసాల జైలు శిక్ష అనుభవించాలన్నారు.

న్యాయమూర్తిగారి అనుమతితో, నేను కోర్టు నుండి బయటికొచ్చాను. రవీంద్రనాథ్ గారికి విషయమంతా చెప్పాను. ఫైను చెల్లించడానికి సత్యశ్రీ అన్నవాణ్ణి ఏర్పాటు చేశారు. బ్యాంకు నుండి డబ్బు తెప్పించారు. ఈ ఏర్పాట్లన్నీ చూసుకొని, నేను మళ్ళీ కోర్టుకు హాజరయ్యాను.

సాయంకాలం నాలుగ్గంటలయింది. నన్ను జైలుకు తీసుకెళ్ళడానికి పోలీసువారి వాన్ వచ్చింది. నాకేమో గుండెల్లో దడ, చెమటతో శరీరమంతా చిత చితలాడి పోతోంది. సుమారు నాలుగున్నర గంటల ప్రాంతంలో

సత్యశ్రీ వచ్చి డబ్బు చెల్లించాడు.

నా ప్రాణం తెరిపిన పడింది.

అయిదు గంటలయ్యేసరికి మెజిస్ట్రేటుగారు కుర్చీ దిగారు. సరాసరిగా, నా ముందుకొచ్చారు. "ఆ *రేరాణి* పత్రికను నాకోసారిస్తారా? ఇంకోమాటు ఆ కథను చదువుకొంటాను" అన్నారు.

ఆనాడు, రవీంద్రనాథ్ గారు చెల్లించిన ఆ అయిదు వందల రూపాయలనూ, 1996 జనవరి 14వ తేదీన నేనూ + మా పెద్దబ్బాయి రవీంద్రనాథ్ + వాడి పెద్దబ్బాయి రామోజీరావు కలిసి, చెక్కు రూపంలో ఇచ్చాం. ఆ చెక్కు నెంబరు : 0182519 తేది: 13-1-1996.*

ఆ రోజున నా డైరీలో ఇలా రాసుకొన్నాను...

"...1948లో నేను రాసిన *అలవాటైన ప్రాణం* అన్న కథకు కోర్టు వారు విధించిన, అయిదు వందల రూపాయల జుల్మానాను చెల్లించి, నాకు జైలు శిక్షను తప్పించిన ఆలపాటి రవీంద్రనాథ్ గారికి, నేను + రవి + రామోజీ వెళ్ళి, ఆ డబ్బుకు మరో రూ. 58/- చేర్చి, నూతన వస్త్రాలతో, తాంబూలంతో, మిఠాయితో సమర్పించుకొన్నాను. డబ్బు పరంగా, నేనెవరికీ బాకీ లేను. దయాపరంగా చాలామందికి ఋణపడి ఉన్నాను.

(1996 జనవరి 14వ తేదీ ఆదివారం నాటి నా డైరీ నుండి) :

రవీంద్రనాథ్ గారు 1952లో హైదరాబాదు వచ్చారు. నేను 1959లో వచ్చాను. ఆకాశవాణిలో ఆర్టిస్టుగా చేరాను. అప్పుడప్పుడు వారిని కలుసుకొంటూ ఉండేవాణ్ణి. 1975లో, నేను ప్రొడ్యూసర్ నయ్యాక, ఆకాశవాణికి వారిని ఆహ్వానించాను. సహజంగానే ఆయన తిరస్కరించారు. అయినా నేను మొహమాట పెట్టి, వారి ప్రసంగాలను ప్రసారం చేశాను.

దానిక్కారణాలు రెండు మూడున్నాయి.

ఒకటి: విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తారు.

రెండు: సాధ్యమయినంత సరళంగా రాస్తారు.

మూడు: సముచితమని తోచిన సవరణలను ఎవరు ప్రతిపాదించినా వారు సంతోషంతో అంగీకరిస్తారు.

రవీంద్రనాథ్ గారు ఆనాడు నాకిచ్చిన అవకాశం, నా జీవితాన్ని అనూహ్యంగా మార్చివేసింది. చాలా రకాల పత్రికలతోనూ, చాలా మంది రచయితలతోనూ, నాకు పరిచయాలేర్పడ్డానికి వారిచ్చిన ఉద్యోగమే కారణం!

ఆ అనుభవమే, ఆ ఆత్మవిశ్వాసమే నన్ను మద్రాసు నగరానికి చేర్చింది. అక్కడి అనుభవం కూడా కలిసి నాలోని పట్టుదలను మరింత గట్టి పరిచింది. ఆ దృఢ దీక్ష- ఆకాశవాణిలో నాకు కాస్త చోటును ప్రసాదించింది. నా మాటలకు రెక్కలను ప్రసాదించింది.

దీనికంతా - మూలకారణం - ఆనాడు రవీంద్రనాథ్ గారు నాకిచ్చిన అవకాశం. అందుకే వారి పేరును పదే పదే స్మరించుకొనేందుకే - మా పెద్దబ్బాయికి 'రవీంద్రనాథ్' అని పేరు పెట్టుకున్నాను.

1996 ఫిబ్రవరి 11న, ఆలపాటి రవీంద్రనాథ్ గారు కన్నుమూశారు.

అప్పటి నా ప్రతిస్పందనలివీ...

"...నన్ను తెనాలికి ఆహ్వానించి, ఉద్యోగమిచ్చి, ఆదరించిన ఆలపాటి రవీంద్రనాథ్గారు మరణించారన్న వార్తను, ఇంతకు ముందే విన్నాను. చాలా క్షోభించింది నా హృదయం".

(1996 ఫిబ్రవరి 11వ తేదీ ఆదివారం నాటి డైరీ నుండి)

"...నా జీవితానికింత స్థిరత్వం ప్రసాదించిన, ఆలపాటి రవీంద్రనాథ్ గారికి, పాదాభివందనం చేశాను. జీవించి ఉంటే తిరస్కరించేవారు. స్మశానానికి ప్రయాణమయి, కొంత దూరం వెళ్ళి కూడా వెనక్కొచ్చేశాను. మనుషుల్ని కట్టెల్లా కాల్చడాన్ని నేను చూడలేను..."

(1996 ఫిబ్రవరి 12వ తేది సోమవారం డైరీ నుండి)

"...రవీంద్రనాథ్ గారు - చాలా ముందు చూపున్న భావుకులు. అర్ధ శతాబ్ది కిందటనే, లైంగిక విజ్ఞానాన్ని గురించీ, కుటుంబ నియంత్రణను గురించీ నిర్భయంగా ప్రచారం చేశారు. మి

---

'రవీంద్ర స్మృతి' (2001) సందర్భంగా
రావూరి భరద్వాజ రాసిన వ్యాసం.

---

*కళాజ్యోతి వారు ఈ చెక్కును బ్యాంకులో వేయలేదు.*



బాలాంత్రపు రజనీకాంతరావు

# ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము
## బాలాంత్రపు రజనీకాంతరావు

*– రావినూతల సత్యనారాయణ*

(కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన పుస్తకాలు : 3)

**భూమిక :**

**కేం**ద్ర సాహిత్య అకాడెమీ 1955 నుండి నేటి వరకు అనేక తెలుగు పుస్తకాలకు జాతీయ స్థాయిలో పురస్కారాలు ప్రకటించింది. వరుస క్రమంలో శ్రీయుతులు బాలాంత్రపు రజనీకాంతరావు గారి రచన "ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము" అయిదవది. ఈ గ్రంథం రజనీకాంతరావు గారి అనేక సంవత్సరాల పరిశోధనా ఫలితం. సంగీత శాస్త్రపరమైన యీ రచన, యెంతో పరిశోధనతో, పరిజ్ఞాన సంపదతో కూడిన ప్రామాణిక గ్రంథం. దీని ప్రశస్తిని పూర్తిగా అవగాహన చేసుకొనుటకు పాఠకునికి సహితం సంగీతాన్ని గురించిన కొన్ని సామాన్య విషయాలు వివరింప వలసిన ఆవశ్యకత, ప్రాముఖ్యతను సంతరించు కొంటుంది. ఆ కారణాన, సంగీత విషయాలు యీ వ్యాసంలో సూచన ప్రాయంగా పేర్కొనడమైనది.

**భారతీయ సంగీతం :**

సంగీతం 64 కళలలో శ్రేష్ఠమైనదని విజ్ఞుల భావన. సంగీతం సామ వేదానికి అనుబంధ వేదముగా చెప్పబడిన గాంధర్వ వేదమైన ఉపవేదం. ప్రాచీన కాలంలో గంధర్వులు యీ విద్యను అభ్యసించి, వృద్ధి పరచి వ్యాప్తి లోనికి తెచ్చిన మూలాన యీ విద్యకు గాంధర్వమని పేరు వచ్చి యుండును! ఇతిహాస కాలానికి పూర్వమే సంగీతం అభ్యసించ బడిన విషయం గమనిస్తే, ఇది అతి ప్రాచీన కళ అని దృఢమవుతుంది. కాల క్రమాన భారతీయ సంగీత వాహిని రెండుగా చీలి ఉత్తర, దక్షిణ సాంప్రదాయాలుగా రూపొందినది. "ఆధునిక కర్ణాటక సంగీత పద్ధతిని" స్థాపించినది శ్రీ వేంకట మఖి ("చతుర్దండి ప్రకాశిక" గ్రంథ కర్త – క్రీ. శ 1637) అని కొంత మంది సంగీత శాస్త్రజ్ఞులు అభిప్రాయ పడితే, మరి కొందరు భిన్నాభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఏది ఏమైనప్పటికి, తెలుగు వారు ఆదినుండి సంగీతజ్ఞులన్న విషయం స్పష్టపడుతుంది. భారతీయ సంగీత కళ రెండుగా చీలిపోయి రెండు విధములుగా రూపొందిన కాలంలో ఉత్తరాదిని వ్రజ భాష, దక్షిణాపథమున తెలుగు భాష సంగీత భాషలుగా ప్రాముఖ్యం గడించాయి. తెనుగు మాతృ భాష కాని దక్షిణాది కవులు, గాయకులు, పండితులు, కళా వేత్తలు కూడా తెలుగు భాషను అభ్యసించి ఆ భాషలో సంగీత రచనలు చేసి, కర్ణాటక సంగీతాన్ని అభివృద్ధి పరిచారు. దీనికి ముఖ్య కారణం తెనుగు భాషలోని మాధుర్యం!

రజనీకాంతరావు యీ విషయాన్ని గ్రహించిన వారు కాబట్టి తమ రచనకు "ప్రసిద్ధ వాగ్గేయ కారులను గురించి ఆంధ్రము (తెలుగు)లో వ్రాసిన చరిత్రము" అనే అర్థాన్ని పురస్కరించు కొని పేరు పెట్టుకొని వుంటారని మనం భావించ వచ్చును. అందుకే కాబోలు, యీ పుస్తకంలో ఆంధ్రేతర వాగ్గేయకారులైన జయదేవుడు, గోవింద దీక్షితులు మొదలైన వారి జీవిత విశేషాలను పొందుపరిచారు.

మన పెద్దలు (పూర్వీకులు) సంగీతాన్ని రెండు వర్గాలుగా పేర్కొన్నారు. అవి: మార్గ సంగీతము, దేశీ సంగీతము. శాస్త్ర సమ్మతమై పూర్వమున లాక్షణికులు అమర్చిన లక్షణ విధులను తప్పక, వాటిని అనుసరించి అభ్యసించు రాగమును, గీతమును, రెండు లక్ష్యముల చేరిక మార్గ సంగీతముగా నిర్వచించారు. (అనగా విద్వాంసులు, పండితులు వ్యాకరణ విధులను అనుసరించి వ్రాయు నట్టిదియో, ప్రసంగము చేయు నట్టిదియో నుండు భాష వలె నుండునది) అంటే (classical language) గ్రాంథిక భాష అని అర్థం

చేసుకోవచ్చు. అలాగే, శాస్త్ర నియమాలను పాటించక, ఆయా ప్రాంత పామరులకు కూడా హృదయ రంజకమైన గానము దేశీసంగీతము. (ఇది ఒకే భాషను అనేకులు వారి వారి ప్రాంతములలోని వాడుకను బట్టి వేరు వేరు విధములుగా వాడు వ్యవహారిక భాష వలె నుండును. అంటే, (ordinary, colloquial or spoken language) వ్యవహారిక భాష. సంగీత లక్షణమును వివరిస్తూ మన పూర్వీకులు యీ విధంగా పేర్కొన్నారు. వీణా, వేణు వాదనలు గాత్ర గీత గానమును అనుసరించియు, నాట్య, నృత్యము ఆ వాద్య వాదనల ననుసరించి యుండుటను బట్టి, గీతమే సంగీతమునకు ముఖ్యమైన లక్ష్యముగా చెప్ప బడినది. ఆ కారణాన గాన విద్య 'సంగీత' మను పేరు గాంచినది. పౌరాణిక మతములో బ్రహ్మ సామ గానలోలుడు, శివుడు నృత్య గీత ప్రియుడు, కృష్ణ పరమాత్మ వేణుగాన లోలుడు, సరస్వతి వీణాపాణిగా వర్ణించ బడినారు!

దక్షిణాది శాస్త్రీయ సంగీతాన్ని అయిదు విధములుగా చెప్పవచ్చును. అవి :

1. సంకీర్తన సంప్రదాయము
2. పద సంగీతము
3. యక్షగాన సంప్రదాయము
4. కలాప, ప్రబంధ సంప్రదాయము
5. గాత్ర కచ్చేరీ పద్ధతి.

పైన వివరించిన సంగీత పరిజ్ఞాన అవగాహనతో *ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము* అనే రచనను గురించిన విశేషాలు తెలుసుకొని ఆనందించే ప్రయత్నానికి ఉపక్రమిద్దాం!

**ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము :**

ప్రసిద్ధ వాగ్గేయ కారులను గురించి తెలుగులో వ్రాసిన పరిశోధనాత్మక రచన యీ మహా గ్రంథం. దీనిని రచించిన వారు బాలాంత్రపు రజనీకాంతరావు. వీరు ఆకాశవాణిలో అనేక ఉన్నత పదవులను అత్యంత దక్షతతో నిర్వహించి 1978లో పదవీ విరమణ చేసినారు. రజనీ గారు సంగీత సాహిత్యాలలో అపార ప్రజ్ఞావంతులు. అశేష శేముషీ సంపన్నులు. *శతపత్ర సుందరి* కవితా సంపుటితో ప్రారంభించి, అనేక యక్ష గానములను రచించుటయే గాక, దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారిచే క్షీరసాగర మథనం, విప్రనారాయణ, యక్షగానాలను రచింప జేసి, తన సంగీతం ద్వారా వాటిని రేడియోలోను, కూచిపూడి వేదికలపైన ప్రదర్శింప చేశారు. అనేక యక్షగానాలను రచించి వాటి ప్రదర్శనలకు దర్శకత్వం వహించి, ఆధునిక యక్షగాన ప్రగతికి మార్గ దర్శకులయ్యారు.

ఆంధ్ర వాగ్గేయకార చరిత్రమునకు తెలుగు భాషా సమితి వారి పురస్కారమే కాకుండా, కేంద్ర సాహిత్య అకాదెమీ జాతీయ అవార్డును కూడా పొందారు. ఈ గ్రంథములో భరతముని మొదలు, బాల మురళీకృష్ణ వరకూ గల కర్ణాటక వాగ్గేయకారుల వివరాలు, విశేషాలు యేర్చి కూర్చే సాహస ప్రయత్నం జరిగింది. పాఠక మహాశయుల సౌలభ్యం కోసం యీ గ్రంథం యొక్క విశిష్టతను విశ్లేషించడమైనది. వాగ్గేయకార చరిత్రము రెండు సంపుటాలుగా ప్రచురితమైనది. తొలి భాగంలో 21 అధ్యాయాలున్నవి.

మొదటి అధ్యాయములో గ్రంథ రచనను క్రమణిక అందు నిమిత్తం రచయిత పరిశీలించిన ఆధారాలు వివరింప బడినవి. ఆధారాలు సమకూర్చు కొనుటలో రచయిత చేసిన పరిశోధన శ్లాఘనీయం. విద్వాంసుల మన్ననలను తప్పక పొందుతుంది.

రెండవ అధ్యాయంలో సంగీత పరిణామ చరిత్ర, విశేషించి ప్రాచీన యుగానికి సంబంధించిన పద్ధతులను, ముఖ్యముగా *పాణీయం* లోనూ, నారదుడు వ్రాసిన *శిక్షా* అనే ప్రాచీన సంగీత శాస్త్ర గ్రంథము లోను, వివరింప బడిన విధానాలను గురించి, ఆ కాలపు గాయన పద్ధతి సాంఘిక పరిణతిని, ఆ కాలంలో మన దేశంలో వాడుకలో నున్న తాళ వాద్యాలను చక్కగా విశ్లేషించారు. స్వర సప్తకంతో కూడిన స్థాయీ పరిజ్ఞానం కలగడం మూలాన సంగీత శాస్త్రాభి వృద్ధికి బీజారోపణ క్రీస్తు పూర్వం 2500 ఏళ్ళకు 1500 ఏళ్ళకు నడుమ జరిగిందని నిరూపిత మైనది.

భరతుడు, నారదుడు, మతంగుడు, మమ్మటా చార్యుడు, పార్శ్వ దేవుడు, చాళుక్య సోమేశ్వరుడు, సోమసూర్యుడు, జాయప సేనాని, శార్ఙ్గదేవుడు సింహ భూపాలుడు యిత్యాదులు సంగీత శాస్త్ర వికాసానికి చేసిన విశిష్ట సేవలను, వారి వారి ప్రత్యేకతలను ఉదాహరణ సహితముగా సులభశైలిలో పాఠకుల ముందుంచారు.

*సంగీత రత్నాకరం* కాలం వరకూ ఉత్తర దక్షిణ దేశాలకు ఒకే సంగీత పద్ధతీ, ఒకే ప్రామాణికత వుండేవని పేర్కొన్నారు. దాదాపు 16వ శతాబ్దిలో అనగా వేంకటమఖి కాలంలో సంగీత పద్ధతులు మార్పు చెంది కర్ణాటక సంగీత

సాంప్రదాయం వికసించి, ప్రాముఖ్యత సంతరించు కొందని రచయిత నిరూపించారు. స్థూలంగా సంగీత పరిణామ క్రమం, దానికి కారకులైన లక్షణ కర్తల వివరాలు ఈ అధ్యాయంలో చర్చితమైనవి.

**వాగ్గేయకారుల లక్షణం:**

శార్ఙ్గదేవుడు తన *సంగీత రత్నాకరం* లోని ప్రకీర్ణ కాధ్యాయంలో వాగ్గేయకారుని లక్షణాలను పండ్రెండు శ్లోకాలలో చెప్పాడు. గొప్ప వాగ్గేయకారులు ముఖ్యముగా అనుసరించ వలసిన పద్ధతిని శార్ఙ్గదేవుడు ఈ విధంగా పేర్కొన్నాడు. తన రచన యితరులకు అనుసరణీయం కావాలి కాని తాను యితరులను అనుసరించ కూడదు. అంతేకాక తాను రచించిన గేయం ఇతరుల ఆనందానికి మాత్రమే కనుక, గేయం ఎలా వ్రాస్తే వారికి ఆస్వాద యోగ్యమవుతుందో తెలుసుకొని, ఎప్పటి కప్పుడు కొత్తగాను వారికి తెలిసిన పుంతలలోను రచించ వలెనని పేర్కొన్నాడు.




16వ శతాబ్దం నుంచీ వాగ్గేయకారుడు అనే శబ్దానికి పర్యాయంగా 'బయకారుడు' అనే మాట వ్యవహారంలో వుంది. ఈ 'బయకార' శబ్దానికి వ్యుత్పత్తి *సంగీతసుధా* అనే గ్రంథంలో తృతీయ ప్రకరణంలో ఈ విధంగా చెప్ప బడివుంది. మాతువునూ, ధాతువునూ, ఉభయమునూ(రెండింటిని) బాగుగా తెలిసినవాడు ఉభయకారుడు. లోకులంతా ఉభయకారుడు అనడానికి బదులు దాని అపభ్రంశమైన 'బయకార' శబ్దంతో పిలుస్తారు.

గ్రంథ రచయిత రజనీగారు కేవలం వాగ్గేయకారుల లక్షణ నిర్వచనముతో సంతృప్తి పొందక, వివిధ వాగ్గేయ కారుల సంగీత రచనకు ఆలంబములై, లక్షణ కర్తల నిర్వచనాలకు ఉదాహరణలైన ప్రబంధ రీతులు, ఆయా రీతుల స్వభావాలను పరిశీలించి ఏయే వాగ్గేయ కారులు ఏయే ప్రబంధాలను ఏ విధంగా రచించారో, ఎలా గానం చేశారో కూడా విశ్లేషించారు.

**ప్రఖ్యాత వాగ్గేయకారులు :**

12-20 శతాబ్ద కాలంలో ప్రఖ్యాతి వహించిన కర్ణాటక సంగీత వాగ్గేయకారుల వివరణాత్మక పరామర్శ ఈ గ్రంథం. ఇంతటి బృహత్తర ప్రయత్నం ఈ గ్రంథ రచయితకు పూర్వం ఎవరూ ప్రయత్నించ లేదన్న, అది అతిశయోక్తి కానేకాదు.

**జయదేవుడు :**

12వ శతాబ్దిలో గౌడ దేశాన్ని సేన వంశీయులు పరిపాలించారు. వారిలో లక్షణసేనుడనే రాజు 1116-1160 కాలంలో పరిపాలించాడు. ఆయన కవి పండిత గాయక పోషకుడే గాక, స్వయంగా సంగీత సాహిత్య పాండిత్యమూ, ప్రబంధ రచనా దక్షత కలవాడు.

ఆయన ఆస్థానంలో వెలిశాడు జయదేవుడు. భారత దేశంలో సంగీత సాహిత్యాత్మకమైన తొలి రచన *గీత గోవిందం* వీరి లిఖితమే! తనను గూర్చి జయదేవుడు చెప్పుకొన్న మాటలు "సందర్భ శుద్ధిః గిరాం జానీయతే జయదేవ ఏవ" అని. అంటే తన సహచర కవులందరి లోనూ కూడా శబ్దముల సందర్భ శుద్ధి నెరిగినవాడు జయదేవు డొక్కడే అని!! జయదేవుని చరిత్రంతా చంద్రదత్త విరచితమైన *భక్తమాల* అనే గ్రంథంలో విపులంగా వున్నట్లు రజనీకాంతరావు పేర్కొన్నారు.

సాహిత్య రీత్యా *గీత గోవిందం* ప్రామాణికమైనదని, సాహిత్య దర్పణ కారుడైన విశ్వనాథ కవిరాజు పేర్కొనిన విషయం విజ్ఞులకు విదితమే.

గోవిందుని గూర్చిన గేయ ప్రబంధము కాబట్టి దీనికి గీతగోవిందమనే నామం ఏర్పడింది. 24 అష్టపదులతో, 80 మించిన శ్లోకాలతో కూడిన 12 సర్గల గేయ ప్రబంధం *గీత గోవిందం.* దీనిలో ఏ పంక్తి పరికించినా రసం చిప్పిల్లుతూ, హృదయాన్ని పరవశం చేసే మధుర కోమల పదజాలం ఆహ్లాదాన్ని చేకూరుస్తుంది.

జయదేవుడు *గీత గోవిందా*న్ని పాటలుగా పాడుతూ రచించాడని, అప్పుడు అతని భార్య నాట్యం చేస్తూ అభినయించేదని ప్రతీతి.

పరాశరుడు మొదలైన అతని మిత్రులు కూడా అష్టపదులను గానం చేసేవారని చెప్పుకొంటారు. 17వ శతాబ్దములో రాముడు భాగవతార్ ఈ అష్టపదులకు దక్షిణాదిని ప్రామాణికంగా ప్రచారంలో వున్న సంగీత స్వరాలు రచించారు.

**లీలాశుకుడు :**

జయదేవుని తర్వాత యావద్భారత ఖ్యాతి పొందిన వాగ్గేయకారులలో లీలాశుకుడు అగ్రగణ్యుడు. ఇతడు సంగీత శాస్త్రములో గాని, గానంలో గాని ప్రత్యేక కృషిచేసి ప్రసిద్ధి పొందినట్లుగా పేర్కొనడానికి తగిన ఆధారాలు లేవు. కాని ఈ మహాకవి రచించిన *కృష్ణకర్ణామృత* శ్లోకాలు గానం చేయని సంగీత సభలు గాని, గోష్ఠులు గాని, ఈనాటికీ ఉత్తర భారతంలో గాని, దక్షిణ భారతంలో లేవనుట అతిశయోక్తి కానేరదు.

లీలాశుకుడు 13వ శతాబ్ది వాడని చాగంటి శేషయ్యగారు తన కవి తరంగిణిలో ఉల్లేఖించారు. లీలాశుకుడు ఆంధ్రుడా? కాడా? అన్న విషయమై అభిప్రాయ భేదాలున్నవి. అతడు ఆంధ్రుడేనని కొందరు విద్యాంసులు అభిప్రాయ పడితే, మరికొందరు భిన్న అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కాని బాలాంత్రపు రజనీకాంతరావుగారు లీలాశుకుడు ఆంధ్రుడేనని తీర్మా నించారు.

**తాళ్ళపాక వాగ్గేయకారులు :**

తాళ్ళపాక వంశంలో అన్నమాచార్యుడు, ఆయన రెండవ కుమారుడైన పెద తిరుమలాచార్యుడు, పెద తిరుమలాచార్యుని పెద్ద కుమారుడు చిన తిరుమలయ్య, నాల్గవ కుమారుడైన చిన్నన్న సుప్రసిద్ధ కవులు. వీరిలో మొదటి ముగ్గురూ సంగీత, సాహిత్య కళా నిష్ణాతులైన వాగ్గేయకారులు చిన్నన్న *అన్నమాచార్యుల చరిత్ర* ద్విపదలో రచించాడు.



అన్నమాచార్యులు

సుప్రసిద్ధ పరిశోధనాచార్యులైన వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, వారు జీవించిన కాల నిర్ణయాన్ని ఈ విధంగా సూచించారు. అన్నమాచార్య (1408–1502), పెద తిరుమలాచార్య (1460– 1547), చిన తిరుమలయ్య (1485–1550), చిన్నన్న (1498–1561).

రజనీకాంతరావు తాళ్ళపాకవారి సంగీత పరిజ్ఞానము, వారు సంగీత వికాసానికి చేసిన అకుంఠిత సేవలను వివరణాత్మకముగా విశ్లేషించారు. తెలుగు వాగ్గేయకారులలో భీష్ముని వంటి వారు తాళ్ళపాక అన్నమయ్య. పరిణామంలోను, వైవిధ్యంలోను, ఈయన రచనలు సాటిలేనివి! వీరు దాదాపు 3200 సంకీర్తనలు రచించారని ప్రసిద్ధి. ఈయన రచనలలో వివిధములైన దేశీ ప్రబంధముల స్వరూపం మనకు తెలుస్తుంది. అన్నమాచార్య తన సంకీర్తనలలో శృంగార, భక్తి, వైరాగ్యములను సమాన దక్షతతో నిర్వహించారు. అన్నమాచార్య వారి కీర్తనలు వారి తరువాత వాగ్గేయకారులకు మార్గ దర్శకాలుగా పరిణమించాయి అనుటలో అతిశయోక్తి వీసమాత్రం కూడా లేదు. అన్నమయ్య *సంకీర్తన లక్షణం* అనే గ్రంథాన్ని రచించారు. పదము, ఏలా అనే సంగీత ప్రబంధాల లక్షణా లిందులో నిర్వచించ బడ్డాయి. అన్నమయ్య మనుమడు చిన తిరుమలాచార్యుడు (చిన తిరుమలయ్య) తెనిగించాడు. రజనీగారి విశ్లేషణ ప్రకారం అన్నమయ్య అద్వితీయ ప్రతిభాశాలీ, ఋషి కల్పుడూ. పదం యొక్క అనంత రూపాలను తన రచనలలో ప్రదర్శించిన ప్రజ్ఞాశాలి.

చూచిన దేవుళ్ళందరూ తిరుపతి వేంకటేశ్వరునితో అభేద వ్యక్తులుగా భావించి వాళ్ళపై ఆయన సంకీర్తనలు పాడారు. అన్నమయ్య దృష్టిలో దేవుడొక్కడే! అన్నమయ్య శృంగార సంకీర్తనల కొమ్మ క్షేత్రయ్య పదాల తోటలో ఎన్నో పూవులు పూచింది. అలాగే, వారి ఆధ్యాత్మిక సంకీర్తనల శాఖ త్యాగరాజు పెరట్లో కల్పకమైంది. అన్నమయ్య వాడిన కొత్త పదాల మొగ్గలు తర్వాత వచ్చిన వాగ్గేయకారుల రచనలలో విప్పారి వికసించాయి.

**పురందర దాసు :**

ఈయన క్రీ.శ. 1484–1564 మధ్య కాలమున జీవించిన వాడని విద్యాంసులు నిర్ణయించారు. ఈయన కొంతకాలం ఆనాడు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల సరిహద్దుల్లో వున్నటువంటి పునహానగరం (నేటి పూణె) లోను, తరువాత కన్నడ దేశంలోని విజయనగరం లోను గడిపినట్లు పూర్వీకుల రచనల వలన తెలియుచున్నది. విజయనగర రాజులైన సాళువ నరసరాయలు, తుళువ వీరనరసింహ రాయలు, శ్రీకృష్ణదేవరాయలు, పురందరదాను సమకాలికులుగా పేర్కొనబడ్డారు.

పురందరదాసు అన్నమయ్య కాలంలో యువకుడై తరువాత కాలాన కన్నడంలో లక్ష వరకు సంకీర్తనములు *దాసరపదగళు* రచించి, కర్ణాటక దేశంలోనేగాక ఆంధ్ర, ద్రావిడ, మహారాష్ట్ర ప్రాంతములలో ఆరాధ్యుడైన వాగ్గేయ కారునిగా ఖ్యాతి గడించారు. సంగీత చరిత్రలో 15, 16 శతాబ్దాలలో వుండిన ఈయన రచనలలో సంకీర్తనలే ఎక్కువ. భారతీయ సంగీతానికి భక్తి సంకీర్తనములను ప్రసాదించిన కాలము ఇదే. సూరదాస్, తులసీదాస్, మీరాబాయి ఆ కాలము వారలగుట ముదావహం. మతతత్త్వ ప్రబోధకములైన భక్తి రసాత్మకమైన పురందరదాసు *పదగళు* మధ్య పీఠాలలో నేటికీ వేదముగా పరిగణిస్తారు. పురందరదాసుకు వ్యాసరాయలు ఉపదేశ గురువు. తమ గురువుల కన్నడ పదాలకు తోడు, మహారాష్ట్రంలోని జ్ఞానదేవాదుల సంకీర్తనముల ప్రభావం పురందరదాసు రచనలకు ఉద్బోధకమై ఉండవచ్చును.

పురందరదాసు తన 40వ ఏట సుప్రసిద్ధ మధ్వ గురువులైన శ్రీవ్యాస తీర్థుల ఉపదేశం పొంది, పురందర దాసుగా తన పేరు మార్చుకొనినట్లు తెలియు చున్నది. ఈ పురందరదాసు అనే పేరు వ్యాసతీర్థుల తర్వాత, వారి మతమునకు అధికారియైన సత్యధర్మ తీర్థులనేవారు ఇచ్చినట్లున్నూ, అప్పటి నుండి ఆ పేరు వ్యవహారంలో నిలిచినట్టున్నూ, సాంబమూర్తి గారు వ్రాశారు. శ్రీ త్యాగరాజ మహాశయులు తన ప్రహ్లాద *భక్తి విజయం*లో పురందరదాసును స్తుతించాడు. పురందరదాసు కీర్తనలను *దాసపదగళు* అనీ, దేవరనామ అనీ వ్యవహరిస్తుంటారు. సులభ గ్రాహ్యమైన సంవాద శైలిలో చక్కని జాతీయములైన సామెతలతో, అందమైన సామ్యాలతో, ఉదాత్త భావాలతో ఈయన కీర్తనలు వేదాంత పరతత్త్వ బోధకములై, లోకవృత్త విమర్శాత్మకములై, స్వానుభవ ప్రబోధకములై ఉంటాయి. పురందరదాసు మాయామాళవ గౌళ మేళానికిచ్చిన ప్రాముఖ్యం వల్లనే తర్వాత 72 మేళకర్తల పరిణామం కలిగినట్లు విజ్ఞులు పేర్కొంటారు. పురందరదాసును కర్ణాటక సంగీత పితామహుడని కీర్తించారు.



నారాయణ తీర్థులు

అయినప్పటికీ, ఈయన అన్ని పద్ధతులను ఆకళించుకొనిన తర్వాతనే కర్ణాటక పద్ధతికి ఒక రాచబాట వేశాడని విద్వాంసులు పేర్కొంటారు. అన్నమాచార్య తర్వాత పురందరదాసు ద్వారా సంకీర్తన రచన వ్యాప్తి పొందినది.

**నారాయణ తీర్థులు :**

అన్నమయ్య తర్వాత వాగ్గేయకారులుగా సర్వ జనాదరణ పొందినవారు నారాయణ తీర్థులు. సంగీత వికాసానికి వీరు చేసిన సృజనాత్మక సేవలు పేర్కొన దగినవి. ఆంధ్ర, కేరళ, కర్ణాటక ప్రాంతాలలో వీరి తరంగాలను గురించి తెలియని వారు కాని, పాడనివారు గాని, సంగీత విద్వాంసులు అరుదుగా ఉంటారు. వారి రచన *శ్రీకృష్ణలీలా తరంగిణి* ఒక మహా యక్షగానమని కొందరి విద్వాంసుల అభిప్రాయం. యక్షగానం ఒట్టి సాహిత్య ప్రక్రియ కాదు. సంగీత, నృత్య కళలకు కూడా సంగమ స్థానమై మన దేశీయ సంస్కృతికి ప్రతీకగా రాణించింది. తెలుగులో నేటికి తెలియవచ్చినంతలో కందుకూరి రుద్రకవి రచించిన *సుగ్రీవవిజయం* ప్రాచీనమైనదిగా పరిగణింప బడుతూ వుంది. ఈనాడు యక్షగానాన్ని దేశీసరళికి చెందిన నాటకంగా పండితులు పరిగణిస్తారు.

*శ్రీకృష్ణలీలా తరంగిణి* కర్త శివనారాయణ తీర్థులు. క్రీ.శ. 1580-1680 కాలము వాడని పరిశోధకులు నిర్ణయించారు. తీర్థుల వారి జన్మస్థలాన్ని గురించి విద్వాంసులు భిన్నాభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. *శ్రీకృష్ణ లీలా తరంగిణి భాగవత పురాణ* దశమ స్కంధములోని కృష్ణ గాథలో ప్రధానమైన వాటిని తీసుకొని నారాయణ తీర్థులు *శ్రీకృష్ణలీలా తరంగిణి* 12 తరంగములు (అంకాలు) గా రచించారు. ప్రతి అంకము ప్రారంభించే ముందు దానిలోని కథను శ్లోకాలలో సూచించి, తర్వాత పాటలతో, శ్లోకాలతో, సంధి గద్యాలతో ఆ కథనే విపులీకరించారు.

*తరంగిణి*లోని 156 కీర్తనలలోనూ, ఆంధ్ర ప్రదేశంలో భజనపరుల ద్వారాను జనరంజకత పొందిన తరంగాలు 16. ఈ కీర్తనల స్వరాలు ఏ తాళపత్ర గ్రంథాలలోను

దొరకలేదు. సాంప్రదాయ గాయకులు పరంపరాగతంగా నేటికీ పాడుతూ వస్తున్న కీర్తనలు చాలానే వున్నవి. 150 కీర్తనలకూ మొత్తం 36 రాగాలు వాడబడుతున్నాయి.

తీర్థులవారి గేయ (తరంగ) రచన తన ముందు తరం రచయితల స్వభావ సిద్ధమైన సంకీర్తన సౌరభాన్ని యినుమడింప చేసుకొని, తమ తర్వాతి యుగానికి చెందిన వాగ్గేయ కారుల లక్షణమైన యక్షగాన స్వరూపం పరిపూర్ణంగా అవలంబించుకొని, జయదేవాదుల శృంగార భక్తి భావం కంటే వేరైన భక్త్యాధ్యాత్మిక భావంతో ఉదాత్త తరంగములై, నారాయణ తీర్థులను "సంకీర్తన యక్షగాన సార్వ భౌమత్వమనే" పదవికి అర్హునిగా చేశాయి.

**సిద్ధేంద్ర యోగి :**

నారాయణ తీర్థులవారి తర్వాత, కర్ణాటక సంగీత వికాసానికి ఉపకరించిన ముఖ్యులలో సిద్ధేంద్ర యోగి పేరు తప్పక స్మరించదగినది.




మామూలు ప్రజలు చెప్పుకొనే కథలు తప్ప, సిద్ధేంద్రుల జీవిత విశేషాలను గూర్చి స్పష్టమైన చారిత్రక ఆధారాలు పరిశోధకులకు లభ్యం కాలేదు. ఆయన రచించారని భావింప బడుతున్న *పారిజాతాదులను* సహితం మరెవ్వరో వ్రాస్తే, సిద్ధేంద్రుడు కూచిపూడి నటకులకు అభినయ, నాట్యాలు నేర్పి, నటింప జేశారని కొందరి విద్వాంసుల అభిప్రాయం. ఆచార్య పి.ఎస్.ఆర్.అప్పారావుగారి పరిశోధనలను బట్టి సిద్ధేంద్రుడు క్రీ.శ. 14వ శతాబ్ది చివరి భాగంలో వుండిన వారని మనం గ్రహించాలి. ఏది ఏమైనా, ప్రసిద్ధ యోగీశ్వరుడూ, సిద్ధుడు, వాగ్గేయకారుడైన సిద్ధేంద్రుడు కూచిపూడి వారి సాంప్రదాయాన్ని ప్రతిష్ఠాపించిన వాడని పారంపర్యంగా వస్తున్న చరిత్రను మనం త్రోసిరాజనలేము. వీరిని గూర్చిన పూర్తి విశేషాలు రజనీ అత్యంత నిబద్ధతతో గ్రంథస్థము చేశారు. అది వారి పరిశోధనా పటిమను వెల్లడిస్తుంది!

**భద్రాచల రామదాసు :**

భద్రాచల రామదాసు అని పేరుపొంది, నాటినుండి నేటివరకు ఆంధ్రదేశంలో ఆబాల గోపాలానికే కాక, భారత దేశంలోని భక్తాగ్రేసరులలో ఒకడుగా గణుతి కెక్కిన వాగ్గేయకారుడు రామదాసు. ఈయన అసలు పేరు కంచర్ల గోపన్న. కీర్తిశేషులు భావరాజు వెంకట కృష్ణారావుగారు రామదాసు జీవితంలోని ముఖ్య ఘట్టాలకు కాలనిర్ణయం చేస్తూ, ఆ నిర్ణయం ప్రకారం రామదాసు క్రీ.శ. 1620-1687 మధ్య కాలం వాడని, వారు *భారతిలో* రచించిన వ్యాసంలో పేర్కొన్నారు. ఈయన సిద్ధేంద్రయోగికి, క్షేత్రయ్యకు ఇంచు మించు సమకాలికుడని చెప్పుకొంటారు. భక్త కబీరుకు శిష్యుడని కొందరి అభిప్రాయం. కొంతమంది భక్తులు రామదాసు చరిత్రను యక్షగానం గాను, హరికథా రూపంలోనూ వ్రాసి పాడు కొనేవారు. వీరి జీవితంలోని అనేక ముఖ్య ఘటనలు రజనీ విపులంగా వివరించారు.

రామదాసు త్యాగరాజు స్వామినే ప్రభావితం చేసిన వాగ్గేయకారుడు! ముఖ్యంగా భజన భక్తి పాటలలో నేటి దివ్యనామ సంకీర్తనలూ, ఉత్సవ సాంప్రదాయ సంకీర్తనలు ఈ కోవలోనికి చెందినవి.

**రామదాసు కీర్తనలు, సంగీతం :**

"రామదాసు రచనలుగా గుర్తుపట్ట దగిన కీర్తనలు దాదాపు 100 నుండి 108 దాకా దొరుకుతాయి. పరిశోధనలు చేసి రామదాసు కీర్తనలు ఇన్ని అనిగాని, ఇవే అనిగాని నిర్ణయించే ప్రయత్నాలు చేయలేదు. సంప్రదాయ సిద్ధంగా భజన కూటాలలోను, గాయకవర్యుల పాఠాలలోను ఈ కీర్తనలు పాడదగిన స్వరాలను సేకరించి గ్రంథరూపంలో ప్రకటించటం ఎంతైనా అవసరం. రామదాసు కీర్తనలలోని రమ్యతా, రక్తి వినాలంటే ఆంధ్రదేశం లోని చిన్న గ్రామాలలోని రామ మందిరాలలో పామరులు పాడేటప్పుడు వినాలి. తికాలాల చిరతలు వాయిస్తూ, చిటిదళం వేస్తూ, బృంద గానం చేస్తున్నప్పుడు రామదాసు రచనలోని రసరూపం ప్రత్యక్షం కాగలదు. కచేరి పద్ధతిలో ఈ పాటలు పాడి రక్తి కట్టించడం ఏ బాలమురళీకృష్ణ లాంటి కొందరికే సాధ్యమౌతుంది. ఈ సంర్భములో పామరజనానికి ఇంతగా ప్రమోద దాయకాలైన ఈ కీర్తనలలోని సంగీతాన్ని ఆంధ్రులు పునరుద్ధరించుకొని త్యాగరాజ సంగీతంలాగా స్వరనిబద్ధం చేసి, సంగీత సభలకు తీసుకొని రాకపోతే, ఇప్పటికే నష్టపడి లుప్తమై పోతున్న, తెలుగు కళలకు మరింత

ద్రోహం చేసుకున్న వార మవుతాము” అన్న రజనీ ఆతురతను విజ్ఞులందరూ గమనిస్తారని ఆశిద్దాం.

**క్షేత్రయ్య :**

ఇంతకు ముందు పేర్కొనిన నారాయణ తీర్థులు, సిద్ధేంద్ర యోగి, భద్రాచల రామదాసు సమకాలికులని విజ్ఞులైన పరిశోధకుల అభిప్రాయము. కాని క్షేత్రయ్యకు ఆ ముగ్గురిలో ఏ ఒకరి తోను సంపర్కం కలిగి ఉన్నట్లు నిష్కర్ష చేయడానికి తగిన చారిత్రక ఆధారాలు లభ్యం కాలేదు. ఒక్క విషయం మాత్రం గట్టిగా చెప్పవచ్చు. 17వ శతాబ్దం లో సంకీర్తన రచన మూడు నవ్య మార్గాలు తొక్కింది. “తీర్థుల కృషిలో సంకీర్తనం ఆత్మబోధను ఆదర్శంగా పెట్టుకొని శృంగారాన్ని ఔపచారికంగా ఉంచుకొని, ఒక ప్రక్క నాట్యాభినయ యుక్తము లైన యక్షగానాలకు ఉపాంగం అవుతూ, ఇంకొక భజన పద్ధతి ప్రాచుర్యానికి దారి తీసింది. ఇది మొదటి మార్గం. ఇక రామదాసు కీర్తనలు-భక్తిరస పరమావధి పొంది పామరజనం కూడా భక్తి మార్గంలో సాధన చేయడానికి అనువయిన భజనగోష్ఠుల వ్యాప్తికి కారణమైనాయి. ఇది రెండో మార్గం. మూడవది- సిద్ధేంద్ర, క్షేత్రయ్యలకు ఆలంబనమైన మార్గం”.

సిద్ధేంద్రుని యక్ష గానములు, క్షేత్రయ్య పదములూ, తీర్థుల తరంగాలతో పాటు నాట్యాభినయ ప్రదర్శనలకు అనుకూలమైనవి. క్షేత్రయ్య అనుసరించిన పద్ధతి తర్వాత వాగ్గేయ కారులకు మార్గ దర్శకమైనది. క్షేత్రయ్య అసలు పేరు వరదయ్య. ఈయన నివసించిన కాలం క్రీ.శ. 1600-1680 అని పరిశోధకులు తేల్చారు. ఆయన స్వస్థలము కృష్ణా జిల్లాలోని మొవ్వ అనే గ్రామం. క్షేత్రాటనం చేసినందువలన ఆయనకు క్షేత్రయ్య అనే పేరు వచ్చిందని విజ్ఞుల అభిప్రాయము. విస్సా అప్పారావు, మల్లాది రామకృష్ణ శాస్త్రి క్షేత్రయ్యను గూర్చి పరిశోధనలు చేసి, ఆయన జీవిత విశేషాలను విశ్లేషించారు. వారి నిష్కర్షలను పేర్కొంటూ, తాము సంగ్రహించిన మరి కొన్ని విషయాలతో రజనీకాంత రావు విపులమైన వ్యాసాన్ని *వాగ్గేయకారుల చరిత్రము* రెండవ భాగంలో పొందుపరిచారు. అందులో క్షేత్రయ్య జీవిత ఘటనా చక్రం సంపూర్ణంగా చర్చించారు. (చూడు : *వాగ్గేయకార చరిత్రము*, 2వ భాగం: 204-231 పుటలు).

క్షేత్రయ్య తీర్థయాత్ర వాంఛ తోనో, లేక రాజ సందర్శన సత్కారాల ఆశతోనో ఇదమిత్థమని చెప్పలేము కాని, స్నేహితులు పురిగొల్పగా దక్షిణయాత్ర చేశాడు. ఈ క్షేత్రాటనంలో ఆయన దాదాపు 18 పుణ్య క్షేత్రాలు దర్శించి అచ్చటి దేవతలకు అంకితముగా పదాలు రచించాడు. ఆ సమయంలోనే నాలుగు రాజాస్థానాలకు వెళ్ళి, అక్కడి రాజుల కోర్కె కూడా చెల్లించి వారిపై పదాలు చెప్పాడు.

వెళ్ళిన క్షేత్రాలలో వున్నటువంటి వేల్పులను గూర్చి పదాలు రచించినప్పటికీ, ఆ వేల్పులకు మువ్వ గోపాలునితో



సంగీత మూర్తి త్రయం : ముద్దుస్వామి దీక్షితులు, త్యాగరాజు, శ్యామశాస్త్రి

అభేదం పాటించాడు. తను స్వయంగా గోపాల భక్తుడైన శివ కేశవ భేదం పాటించాడు. క్షేత్ర దైవాంకితములుగా క్షేత్రయ్య రచించిన పదాలలో కంచిలోని వరదరాజును గురించి 13 పదాలు, చిదంబర మందలి చెవంది లింగని గురించి 2 పదాలు వున్నాయి. క్షేత్రయ్య పదాలలోని సంగీత రచనను గురించీ, వాటిని పాడవలసిన పద్ధతిని గురించీ విస్సా అప్పారావు వ్యక్త పరచిన అభిప్రాయం గమనార్హం.

"క్షేత్రయ్య పదముల లోని పల్లవి, అనుపల్లవి చరణము లతో క్రమముగా రాగ వృద్ధి ఎట్లు చేయబడినదో, ఒకే రాగ మందలి వివిధ పదముల లోని స్వర సంచారములు, గమక భేదములకు ఒక్క సంగీతానుభవము ఎంత ప్రభావ వంతమైనదో వ్యక్తము కాగలదు. ఎత్తుగడ, తర్వాతి నడక, స్వర సంచారములు, కూడికలు, పోకడలు రాగము యొక్క జీవకళను పద గమనములో చిప్పిల్లజేయు చుండును... రాగమునకు గల ఉన్నత స్థానమును నిర్ణయించి, క్షేత్రయ్య తర్వాత వాగ్గేయకారులకు, సంగీత వేత్తలకు మార్గదర్శి యైనాడు". *(చూడు.పుటలు : 220-222).*

**సంగీత త్రిమూర్తులు :**

దక్షిణ భారత సంగీతానికి అఖండ పరివ్యాప్తిని చేకూర్చిన అవతార మూర్తులైన వాగ్గేయకారులు: త్యాగరాజు, శ్యామ శాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు, వీరి ముప్పురిని సంగీత రత్నత్రయమని పేర్కొంటారు. శ్యామ శాస్త్రులు (1762-1827), త్యాగరాజు (1767-1847), ముత్తుస్వామి దీక్షితులు (1776-1836) కాలాల్లో వున్నవారు. ఒక విధంగా చెప్పాలంటే సమకాలికులు. అంతే కాక, ముగ్గురూ తమిళనాడు లోని తంజావూరు జిల్లాలోని తిరువయ్యూరుకు సంబంధించిన వారు. వారి రచనలలో రాగస్వరూపము పరిపూర్ణమై స్పష్టంగా దర్శిస్తుంది. సౌమ్యమైన పద శిల్పానికి, విశిష్టమైన సంగీత శిల్పానికి మొట్టమొదట వీరిని స్మరించిగాని, మిగిలిన వారిని తలచు కొనరు. ముగ్గురూ వేదశాస్త్ర నిష్ణాతులు. ముగ్గురూ వర ప్రసాదులైన కారణజన్ములు. త్యాగరాజులవారి సాహిత్య శైలి ద్రాక్షా పాకంగాను, శ్యామశాస్త్రుల వారిది కదళీ పాకం గాను, దీక్షితుల వారిది నారికేళ పాకంగాను పేర్కొన వచ్చును. ఇక సంగీత రచనను పరిశీలిస్తే, త్యాగరాజుది గోదావరి వలె విస్తృతమైతే, శ్యామశాస్త్రుల వారిది కృష్ణవలె గంభీరమై, దీక్షితుల వారిది ఉభయ తారకంగా త్రివేణి ప్రవాహము వలె సాగింది. ఆధునిక సంగీతానికి వీరి రచనల కంటే మంచి లక్ష్యాలు (ఉదాహరణలు) కనిపించవు. ముగ్గురూ ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు మాత్రమే కాక అంతర దృష్టి కల యోగి పుంగవులు. విడివిడిగా వీరిని గూర్చిన విశేషాంశాలను క్లుప్తంగా పాఠకమహాశయులకు తెలియ జేయడమైనది.

**త్యాగరాజు :**

శాహభూపాలుని ఆస్థాన వాగ్గేయ కారుడైన గిరిరాజ కవికి పౌత్రుడు మన త్యాగయ్య. సీతమ్మ, రామబ్రహ్మం దంపతులకు త్యాగరాజ స్వామి స్వప్నంలో కనిపించి, కుమారుని పుట్టుకను సూచించి, అతడు మహా వాగ్గేయకారుడు అవుతాడని, ఆ పుత్రునికి త్యాగరాజ స్వామి అని పేరు పెట్టమని చెప్పారుట.

త్యాగయ్య క్రీ.శ. 1767వ సంవత్సరం, ఆ దంపతులకు వర ప్రసాదిగా జన్మించాడు. తల్లి తండ్రులు ఆ బాలునికి త్యాగరాజ బ్రహ్మమని నామకరణం చేసుకొన్నారు. త్యాగయ్య ఇలవేల్పు శ్రీరాముడు. తల్లి దండ్రుల పూజా మందిరం వద్ద బాల్యంలోనే త్యాగయ్య రామ భక్తుడైనాడు. తల్లి పూజా సమయాలలో త్యాగయ్యకు జయదేవుని అష్టపదులూ, పురందరదాసు కీర్తనలనూ నేర్పి, ఆయన చేత పాడించే వారట. తండ్రిగారి వద్ద సంస్కృతాంధ్ర భాషలు అభ్యసించి, పాండిత్యాన్ని సంపాదించారు. నాటి వారి కుటుంబ పరిస్థితులను, మరియు జీవిత విశేషాలను ఆధార సహితంగా విశ్లేషించారు గ్రంథ రచయిత రజనీకాంతరావు. *(చూడు: ఆ.వా.చ.పు: 322-351).*

త్యాగయ్య అపార పాండిత్య ప్రతిభ తెలిసి కొనిన కాంచీపుర పీఠాధిపతి ఉపనిషద్బ్రహ్మేంద్ర స్వాములవారు త్యాగయ్యను కాంచీపురం రమ్మని ఆహ్వానించారు. శిష్యులను వెంటబెట్టుకొని త్రోవలోని క్షేత్రాలను దర్శిస్తూ, త్యాగయ్య కాంచీపుర యాత్ర చేశారు. కొన్ని చోట్ల వింత అనుభవ, అనుభూతులకు లోనైనారు. ఈ విశేషాలన్ని రజనీకాంత రావు చక్కగా చిత్రించారు. ముఖ్యంగా తిరుపతిలో త్యాగయ్య పొందిన అనుభూతి విద్వాంసులను ఎక్కువగా ఆకర్షించింది.

**త్యాగయ్య కీర్తన రచనా శిల్పము :**

ఆ కాలంలో త్యాగయ్యకు వున్నంత మంది శిష్యులు మరే వాగ్గేయ కారునికి లేరని ప్రతీతి. దీనికి కారణం త్యాగరాజు నిరాడంబర జీవితం, వారి సంగీత శిక్షణా విధానమని చెప్పుకొంటారు. త్యాగయ్య కీర్తనలన్నీ ఆయన

పారవశ్య స్థితిలోనో, ఆవేశంలోనో ఉండగా వెలువడినవే! ఆ సమయంలో గురువుగారిని చుట్టుముట్టిన శిష్య బృందం పలకలపై వ్రాసేవారని చెప్పుకొంటారు. కీర్తన పూర్తి అయ్యేసరికి శిష్యులలో ఒకరు స్వరాల కూర్పులో పల్లవినీ, ఇంకొకరు చరణాన్నీ, వేరొకరు సాహిత్యాన్నీ, పలకల మీద వ్రాసు కొనేవారట! అటు తర్వాత, అందరూ కలిసి కీర్తన పాఠం నేర్చుకొని, గురువుగారి సమక్షాన వినిపించే వారని చెప్పబడినది.

అన్నమాచార్యతో మొదలైన సంకీర్తన కాలక్రమేణ మార్పులతో త్యాగరాజు నాటికి పరిపక్వత పొంది కృతి అనే పేరు వహించింది. కృతులు బయలుదేరేనాటికి, రాగాల స్వరూపంలో వివిధ మార్పులు సంతరించు కొన్నాయి. రాగ స్వరూప దర్శనానికి త్యాగరాజ కృతులు అద్దం పడతాయి. సాహిత్యంలోని అంతరార్థం సులభంగా తెలియడానికి రాగ సంచారంలోని విశేష ప్రయోగాల ద్వారా రాగ భావాన్ని సాహిత్య భావంతో కలిపి విస్తరించడానికి 'సంగతుల' ప్రయోగాన్ని విరివిగా చేశారు త్యాగయ్య. పటిష్ఠమైన పద్య కవిత్వ భాషకంటే, ఉదాత్తమైన గద్యమే పాటలకు యోగ్యమైనదని త్యాగయ్య భావన. గద్యంలోనే యమక, అంత్య ప్రాసాది అలంకారములు వుంటే, కృతి శ్రావ్యత పొందగలదని నిరూపించారు ఆ మహనీయులు.

"సులభంగా అర్థమయ్యే లలితమైన పదజాలమూ, ఉదాత్తములైన భావాలూ, సదాశయాలూ, నిత్య జీవిత సంభాషణలలో వాడుకొనే లోకోక్తులూ, త్యాగరాజ కృతులను, సంగీతాన్ని సామాన్య జనులకు కూడా ఆస్వాద యోగ్యాలుగా చేసినవి. ఉపనిషత్తులలోని పరమ సత్యాలను కూడా సులభ శైలిలో తన కృతులలో చొప్పించి నందు వలన త్యాగయ్య పాటలను తాత్త్వికులు 'త్యాగ బ్రహ్మోపనిషత్తు' అని కొనియాడారు". త్యాగరాజు దాదాపు 2400 కీర్తనలు రచించారని చెబుతారు పెద్దలు. కాని, ఇప్పటికి అచ్చయిన పుస్తకాలలో 660 వరకూ ప్రచురితమైనాయి.

త్యాగరాజు 72 మేళకర్త రాగాల లోను కీర్తనలను రచించారు. ప్రాచీన సంగీత కర్తలకు కూడా తెలియని రాగాలలో కొన్ని కృతులను రచించారని ప్రతీతి. ఈ రాగాలు కర్ణాటక సంగీతానికి అమూల్య నిధులుగా సంగీత విద్యాంసులు పరిగణిస్తారు.

**ఘన రాగ పంచరత్న కీర్తనలు :**

జగదానందకారక, జయ జానకీ ప్రాణనాయక - (నాట-ఆది), దుడుకుగల నన్నే దొర కొడుకు బ్రోచురా - (గౌళ-ఆది), సాధించెనే ఓ మనసా- (ఆరభి-ఆది), కనకనరుచిరా కనక వసన నిన్ను - (వరాళి-ఆది), ఎందరో మహానుభావులు అందరికి వందనములు - (శ్రీ-ఆది).

పైన పేర్కొనిన కీర్తనలలో భాషా శైలి జటిలంగా వుంటాయి. వీటిని గానం చేసేటప్పుడు ఎన్నో సంగతులతో విస్తరించి విజ్ఞులైన విద్వాంసులు పాడడానికి అనుగుణంగా వుంటాయి. వీటిలో కొన్నింట్లో అనర్గళ గంగా ప్రవాహం లాంటి సంస్కృత కవితా, మరి కొన్నింటిలో జాను తెనుగు కవితా, యమక, అనుప్రాసాది శబ్దాలంకార మాధుర్యం నిక్షిప్తమై వుంటుంది. త్యాగయ్య రచించిన పంచ రత్నములలో అత్యంత ప్రసిద్ధి చెందినవి : *నారద పంచ రత్నములు, తిరువత్తియూరు పంచ రత్నములు, కోవూరు పంచ రత్నములు, నాగపూర పంచ రత్నములు, శ్రీరంగ పంచరత్నములు* మొదలయినవి.

త్యాగయ్య దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు, సులభమైన 'ధాతుమాతు' నిర్మాణంతో సామాన్య జనానికి భక్తి సాధనకు గాని, భగవత్సేవా కైంకర్య సమయాలలోను, పాడుకొనుటకు వీలుగా వుంటాయి. రాగాలను శాస్త్ర పరిధి నుంచి, కళా శిల్ప ప్రపంచానికి తీసుకొనివచ్చిన త్యాగయ్య, కీర్తన రచనలో నూతన పోకడలకు ఆద్యుడయ్యాడు. త్యాగయ్య కాలం వరకూ, కీర్తనా క్రమం పల్లవీ, అనుపల్లవీ, యీ రెంటి ధాతువుల కలయిక వల్ల ఏర్పడిన చరణం సూత్రం గానే ఉండేది. త్యాగయ్య తన భావావేశాన్ని వ్యక్త పరచడానికి ఎక్కువ పరిపూర్ణత గల కృతిని సాధించారు.

భాషలు వేరైనా, రాష్ట్రాలు వేరైనా, ఆంధ్రులుగాని, తమిళులుగాని, కేరళీయులుగాని - అందరిదీ ఒకే సంస్కృతి, సంగీతం, ఒకే వేదాంతమని తమ కీర్తనల ద్వారా చాటిన నాదబ్రహ్మ త్యాగయ్య. ఆయనను భారతీయ అవతార పురుషులలో ఒకరినిగా పూజించుట మన ధర్మం. ఋ

*ఇంకావుంది....*

* * *

ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
ఫోన్ : 9618524702




# ఆగ్నేయ ఆసియాలో కవిత్వం

*- ముకుంద రామారావు*

**చైనా**కి దక్షిణాన, భారతదేశానికి తూర్పున, కొత్త గయానాకు పశ్చిమాన, ఆస్ట్రేలియాకు ఉత్తరాన. సరిహద్దులుగా ఉన్న దేశాల్ని ఆగ్నేయాసియా దేశాలుగా పిలుస్తారు. ఇప్పటి ఆధునిక దేశాలైన బర్మా, థాయిలాండ్, కంబోడియా, లావోస్, వియత్నాం, ఫిలిప్పైన్, బ్రూనై, తైమోర్, సింగాపూర్, హ్మోంగ్, ఖ్మేర్, లావో, తాయివాన్, మంగోలియా, మలేసియా, ఇండోనేసియా, ఇండోనేసియా ద్వీపాలు (17000 ద్వీపాల్లో జనావాసాలున్నా 1000 వరకే గుర్తించబడ్డాయి - వాటిల్లో ముఖ్యమైనవి: జావా, సుమత్రా, కాలీమంతన్ మొదలైనవి) ఆగ్నేయాసియా లోనివే. ఒకప్పుడు ఆగ్నేయాసియా అనేక ప్రాంతాల్లో సంస్కృతం, పాళీ, చైనా భాషలు రాజ్యమేలాయి. రానురాను తమ తమ భాషల్ని ఆయా దేశాలు అభివృద్ధి చేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్లేముందు - వియత్నాం కాక, మాతృభాషాపరంగా ఈ దేశాల్ని ఇలా విభజించుకుందాం. 1. మయన్మార్ 2. థాయ్ లాండ్, లావోస్, కంబోడియా 3. మలేసియా, ఇండోనేసియా, ఇండోనేసియా ద్వీపాలు 4. ఫిలిప్పైన్ 5. తతిమావి.

**మయన్మార్ లేదా బర్మా :**

ఈ దేశానికి భూటాన్, బంగ్లాదేశ్, చైనా, లావోస్, థాయిలాండ్ సరిహద్దులుగా ఉన్నా మూడవవంతు భాగమంతా అండమాన్ సముద్ర కోస్తా తీరమే. అన్ని దేశాల్లానే బర్మా కూడా వివిధ సామ్రాజ్యాలకింద ఉంటూ వచ్చింది. ముఖ్యంగా 1. బగన్ (1044-1287), 2. ఆవా (1287-1752), 3. కొంబౌంగ్ (1752-1885), 4. వలసవాదులు (1885-1941) రాజ్యాలు కొనసాగాయి. అయితే, చివరి బర్మా సామ్రాజ్యపు రాజధాని మాండలే ఆంగ్లేయుల హస్తగతమయ్యాకనే, అక్కడ ఆధునిక సాహిత్య యుగం ఆరంభమయింది. కానీ ఆ కాలమంతా అనేక ఒడిదుడుకుల మధ్య సాగింది. కారణం (1886-1942) వరకూ ఆంగ్లేయుల పాలనైతే, (1942-1945) మధ్య జపాను ఆక్రమణలో పరిపాలన, (1942-1945) మధ్య ఆంగ్లేయుల పరిపాలన పునరుద్ధరణ, 1948 లో స్వాతంత్రం సిద్ధించినా 1962 నుండి సైనిక పరిపాలన మూలాన.

బర్మా లో బర్మీస్, కచిన్, ఛిన్, షన్, మొన్, వ, పలౌంగ్ లాంటి 100 కంటే ఎక్కువ మాట్లాడే భాషలున్నాయి. అయితే 70 శాతానికంటే ఎక్కువ ప్రజలు, అక్కడ బర్మీసే మాట్లాడు కుంటారు. అదే అక్కడ అధికారిక భాష. బర్మా భాషలో పాళీ పదాలు ఎక్కువ. అయినా వారి కవిత్వం పురాతన పాళీ పద్ధతుల్ని విడిచిపెట్టి వారిదైన సంప్రదాయ జానపద గీతశైలినే వాడుకున్నారు. ఈ భాషలో పదాలు ఏకాక్షరాత్మకాలు. ఒకే పదానికి స్వరాన్ని బట్టి అర్థాలు మారుతుంటాయి. అందుకని అది స్వరప్రధానమైన భాషగా గుర్తింపబడింది.

11 వ శతాబ్దం నుండి లిఖితరూపంలో ఈ భాష ఉన్నట్టు ఆధారాలున్నాయి. అయితే 15వ శతాబ్దం నుండే సాహిత్య ఛాయలు మొదలయాయి. అప్పటి బౌద్ధ చక్రవర్తులు, బౌద్ధ సన్యాసులు, సాహిత్య సృజనకు ఎంతగానో తోడ్పడ్డారు. మొదట్లో తాటాకులమీద గంటంతో రాసేవారు. అప్పటి కవిత్వాన్ని నాలుగు భాగాలుగా విభజించి చూస్తారు.

1. ప్యో పద్ధతి - బర్మా నేపథ్యంతో బుద్ధుని పుట్టుక, బోధనలతో కూడిన బౌద్ధ జాతక కథల పద్య కావ్యాలు.
2. మాగన్ పద్ధతి - బౌద్ధ ధర్మ గ్రంథాల ఆధారంతో రాసిన నీతి కథల పద్యాలు, చారిత్రక స్తుతి పద్యాలు.
3. ఎగియిన్ పద్ధతి - రాజ వంశీకుల్ని కీర్తిస్తూ వారి పిల్లలకోసం రాసిన జోలపాటలు.
4. చిన్న గేయాల లింకర్ పద్ధతి - భక్తి సంబంధమైన

పారలౌకిక పాటలు. ఈ శతాబ్దంలో ముగ్గురు ప్రముఖ సాహిత్యకారులు కనిపిస్తారు. ఆ ముగ్గురూ బౌద్ధ భిక్షువులే. అందులో ఒకరు షిన్ మహ రప్త థార (1468-1530) ఆవా ఆస్థాన పండితుడు. తతిమ్మా ఇద్దరూ షిన్ మహ థిల వుంథ (1453-1518), షిన్ ఉత్తమాగ్యవ్. వారిరువురూ వారి వారి స్వగ్రామంలో ఉంటూనే కావ్యాలు రాసారు. అప్పటి చక్రవర్తుల ప్రోత్సాహంతో ఎందరో స్త్రీ పురుషులు సాహిత్యం పట్ల ఆసక్తి కనపర్చారు. రాజ ధర్మాల్ని ఉద్బోధిస్తూ రాసిన లేఖా కావ్యం, మియిట్జ పద్ధతి అప్పుడే మొదలయింది.

16వ శతాబ్దానికి థాయి కాల్పనిక సాహిత్య ప్రభావం, బర్మా కవిత్వం మీద పడింది. ఫలితంగా భావావేశంతో మేధా సంబంధమయిన కవిత్వం - యదు (రుతువులు) పద్ధతికి బీజాలేర్పడ్డాయి. వీటి ఆవిర్భావానికి కారకులు ఆస్థాన కవులు ఫ్యూ, న్యో సైన్యాధ్యక్షులు నవాడే (1498-1588), నాట్షిన్నౌంగ్ (1578-1613). ఈ పద్ధతి ఎక్కువగా ఆదరించబడటంతో కొన్నాళ్లకు యగన్ (యదును నిరసించు) పద్ధతికి కారణభూతమయింది.

19వ శతాబ్దం వరకూ ఇలానే కొనసాగినా, బందీలుగా వచ్చిన థాయి ఆస్థాన విద్వాంసులు బర్మా సాహిత్య వికాసానికి 19వ శతాబ్దంలో పూనుకున్నారు. రామాయణం అధారంగా కావ్య నాటకాలు, శృంగార కావ్యాలు అప్పటినుండి బర్మాలో మొదలయ్యాయి. థాయి ప్రభావాన్ని ఆక్షేపిస్తూ వచ్చిన సాహిత్యమూ ఉంది. గ్రామాలు నగరాలతో కూడిన సాంఘిక నవలలు, కథలు కూడా అప్పుడే రూపుదిద్దుకున్నాయి. సాహిత్యపరంగా బర్మా సాహిత్యానికిది గొప్ప శతాబ్దంగా పరిగణిస్తారు.

13వ శతాబ్దపు కుబ్లై ఖాన్ సామ్రాజ్యం తరువాత బర్మాకి అతిపెద్ద పరాజయం 1824-26 మధ్య ఆంగ్లేయుల మూలంగా జరిగింది. అది ఒక విధమైన విషాదపూరిత సాహిత్యానికి నాంది అయింది. ఆ విషాద గీతాలకు సంగీతం కూడా సమకూర్చారు. అప్పటి కవుల్లో ముఖ్యులు ఆస్థాన కవులు యూ క్యిన్ యూ (1773-1838), యూ పోన్ న్యా (1812-1868). 1870 నాటికి ముద్రణాలయాలు కూడా రావడంతో సాహిత్యానికి కొత్త ఊపొచ్చింది. అయితే ఆంగ్లాధిపత్యం మూలంగా, ఆంగ్ల సాహిత్య ప్రభావంలోకి బర్మా వెళ్లింది. అయినా 1920 లో రంగూన్ విశ్వ విద్యాలయం, 1948 లో బర్మా యూనియన్ స్థాపనతో బర్మా భాషనే, అధికార భాషగా చేయకతప్పలేదు. తత్ఫలితంగా ఆంగ్ల సాహిత్య ప్రభావం చాలావరకు తగ్గింది.

వలసవాదుల పాలనలో థఖిన్ కొదవ్ హ్మాయింగ్ (1876-1964) కవి, ఆంగ్లేయులమీద తిరుగుబాటు కవిత్వం రాసారు. ఇటీవల కాలంలో జావ్ యీ (1907-1990), మిన్ థు వున్ (1909-2004) మరీ ముఖ్యంగా పరిసరాలపట్ల ధ్యానానికి సంబంధించిన కవిత్వం రాశారు. అమెరికాలో నివసిస్తున్న తిరుగుబాటు కవులు టిన్ మొరె థోర్న్ (1933-, మౌంగ్ స్వాన్ యి (1936-), దేశ సైనిక పాలకులపట్ల తమ ఆక్రోషాన్ని ఆవేదనని వారి కవిత్వంలో వ్యక్తపరుస్తున్నారు. బర్మాలోని కవులకిపుడు, వారి అనుభూతుల్ని పంచుకునేందుకు ఆధునిక ఇతివృత్తాలు వేదికయింది. అయినా మొదటి నుండి ప్రభోదాత్మక కవిత్వమే ఎక్కువగా కనిపిస్తుంది. ప్రజాస్వామ్యం కోసం పోరాటంలో అనేక సంవత్సరాలు జైలులో గడిపిన అంగ్ సన్ సూ క్యీ కూడా కవయిత్రి, అనువాదకురాలు. కిప్లింగ్ ప్రసిద్ధ కవిత “if - అయితే” ని ఆమె అనువాదం చేసారు.

బర్మాలోని కొందరి ప్రముఖ కవుల కవిత్వాలు :

**విముక్తి చాలా దూరంలో ఉండదు:**

**వినడం, ఆలోచించడం, ప్రశ్నించడం, బదులివ్వడం**
**పరీక్షించడం, రాయడం, అభ్యసించడం, వల్లించడం,**
**ఈ ఎనిమిది ఉపదేశాలు -**
**రోజూ దండల్ని ధరించినట్టు ధరించాలి**

**ఆరంభకుడు శ్రద్ధతో**
**ప్రాథమిక విద్య అభ్యసిస్తున్నట్టు**
**పోటీ తత్వంతో నిరంతరం చదువుకోవాలి ..**
**ఎవరి శక్తిమేర వారు ప్రయత్నిస్తే**
**వారే గొప్ప పండితులౌతారు**

**రాబందు, సాహసంతో దృఢంగా కోడిని పట్టుకున్నట్టు**
**కౌతూహలంతో ప్రయత్నించకపోతే**
**చదవక, ఆలోచించక,**
**ప్రశ్నించక, చర్చించకపోతే,**
**ప్రసంగించలేరు -**
**కేవలం తాటాకుల్ని ఎలా చదవాలో తెలిసి**
**ఎవరైనా గొప్ప పండితుడు ఎలా కాగలరు?**

**ప్రత్యేకమైన ఆనందంతో పిల్లి, రొయ్యని తింటున్నట్టు**
**ఏదీ వదలకుండా విద్యార్థి అన్నింటినీ చదువుకోవాలి**
**అన్నీ కంఠతా రావాలి.**

చర్చించుకున్న విషయాలన్నింటిలోకీ లోతుగా
రంపపు పళ్లంత పదునుగా చొచ్చుకుపోవాలి
చెరగని శిలాశాసనంలా ఆకళింపు చేసుకోవాలి
అంత బాగా అర్థమయ్యాక-
ఏ విషయం మీదైనా, ఏ జన సమూహంలోనైనా
సింహంలా భయం లేకుండా -
అన్నీ తనకు తానుగానే మాటాడగలరు.
రాతి స్థంభంలా స్థిరంగా / జనమధ్య నిల్చుని
ప్రతీ వివరాల్లోకి పోయి / అన్నింటికీ బదులిస్తూ
మొదటినుండి చివరివరకూ చిక్కుల్ని విప్పుకుంటూ
సంపూర్ణమైన ప్రసంగం చేయగలరు.

పాళీభాష అతనికి బాగా తెలిసుండాలి
కఠినమైన పదాలు వివిధమైన సంబోధనలు
వాటి అర్థాలు, ప్రథమ భాగాల నిర్మాణాలు,
రూపకాల వాడుక, కవితలల్లటం,
వ్యాకరణ పద్ధతి, వ్యాఖ్యానం
ముందువెనకల్ని ఎలా తర్కించడం,
అన్నీ తెలిస్తే తప్పకుండా అతనికి గుర్తింపొస్తుంది
తాను పరిపక్వుడుగా
ఈ జీవితంలోనే కొనియాడబడతాడు
ఈ సంసారపు రాబోయే పునర్జన్మల్లో
బౌద్ధ ఆర్య మైత్రేయుడవుతాడు / (రాబోయే బౌద్ధుడవుతాడు)
అతనికింక నిర్వాణం ఎంత దూరంలోనో ఉండదు.

- షిన్ మహ రహ్తు థార (1468-1530) గొప్ప బౌద్ధ భిక్షువు. ఈ కవిత అన్ని కాలాలకు పనికొచ్చే సందేశంలా కనబడుతుంది. 'సౌ బ్రమ్హదత్' రాజుని 'లోక్ నాథ్' గా *భూరిదత్* కవితలో అభివర్ణించారు. బర్మాలో జనరంజకమైన తోలుబొమ్మలాటల మీద కూడా అద్భుతమైన కవితలు రాశారు.



సైన్యం కవాతు :
జయించిన రోజుగా / నిర్ణయమైన ఈ రోజు
పర్వహైన్ రాజనగరానికి / కవాతుగా పోతున్నపుడు
మేము దేనికీ భయపడటం లేదు
తెగువగల సాహసీకులం మేము
మా ప్రాణాల్ని త్యాగం చేయడానికి సిద్ధం

మా అడవి శిబిరంలో / చిన్న పూల మొగ్గలతో నిండుగా
పచ్చని కొమ్మలు / మృదువైన సాయంత్రపు సంజవేళ
సైనిక ఢంకాలు గంటల మధుర శబ్దాలు

పెద్దన్నయ్యా జెయథైన్ -
మబ్బులు మంచుతెరలు చెదరగొట్టబడినట్టు
మనం కూడా శతృవుని నాశనం చేయాలి

- యూ క్యిన్ యూ (1773-1838) (*పర్వహైన్ పైజత్* నాటకంలో జెయథైన్ ఊహాత్మక యువరాజు. పర్వహైన్ మీద అతని తమ్ముడు జరిపిన దాడి సందర్భంలోని కవిత).

అడవి పాట :
కొమ్మలన్నీతాజాగా / కొత్తజీవితంతో నిండి
పరిమళభరితం. / బంగారపు కాంతితో
ఆకులన్నీ ప్రకాశవంతం.
థింగ్యన్ పండగ కాలమంతా /
అడవులు ఆనందభరితం.

లింగప్యా పక్షులు గూళ్లు కట్టుకోడం
జతలు జతలుగా కోకిలలు
దివ్యమైన మాధుర్య శబ్దాలు చేయటం
పంజరంలో ఆహారంకోసం
చిరు పక్షుల వింత అరుపులు
ఎవరికైనా చూస్తే ముచ్చటేస్తుంది

"ఓ ముద్దైనదానా / ఆలసించక అతన్ని పట్టుకో
ఎగిరిపోడానికి అతను సిద్ధపడుతున్నాడు"

- హ్లైంగ్-టైక్-ఖౌంగ్-టిన్ (1833-1875) - రాజకుమార్తె, కవయిత్రి, గాయని కూడా. మాండలే రాజు సోదరునితో వివాహమైంది.

మల్లెలు :
రాజప్రాసాదపు తోటల్లో / మల్లెలు పూయనపుడు
కన్ పూలనే / ఆస్థానంలోనివారు
అలంకరించుకోవాలి

మాండలే రాజప్రాసాదపు తోటల్లో
మల్లెలు విరగబూసినపుడు
ఆస్థానంలోనివారెపుడూ / కన్ పూలు
అలంకరించుకోరు

**కన్ పూలకపుడు / గ్రామీణులనుండే ఆదరణంతా**

– యూ పొన్న్య (మిండన్ రాజు (1853-1878) కాలపు ముఖ్య కవి.) (కన్ పూలు – మల్లెలంత అందంగానే ఉన్నా, వాసన లేనివి)

**థాయిలాండ్:** ఒకప్పుడు సియాం గా పిలవబడ్డ థాయిలాండ్ ఆగ్నేయాసియాకి మధ్య భాగంలో ఉంది. బర్మా, లావోస్, కంబోడియా, మలేసియా, అండమాన్ సముద్రం సరిహద్దులు. వలసవాదుల చేతిలోకి పోని ఆగ్నేయాసియా లోని ఒకే ఒక్క దేశమిది. అక్కడ మాట్లాడే భాష థాయి లేదా సియామీస్. ఈ భాష ఏకాక్షర పద రూపం. బర్మీస్ లానే ఒకే పదానికి స్వరాన్ని బట్టి అర్థాలు మారుతుంటాయి. బౌద్ధం మూలాన సంస్కృత, పాళీ పదాలు ఈ భాషలో ఎక్కువగా చేరాయి. 13వ శతాబ్దంలో భారతదేశ బ్రాహ్మీ లిపిని అనుసరించి థాయి లిపి తయారైంది. అప్పటినుంచే థాయి సాహిత్యం కూడా మొదలయిందని చెప్పుకోవచ్చు.

అక్కడి కవిత్వం ఎక్కువగా బౌద్ధం, రాచరికం, దాని అనుసరుల ప్రేరితం. 1824 వరకూ థాయి రాజులు, వారి ఆస్థాన పండితులకే సాహిత్యం పరిమితమయింది. ఎవరు రాసినా ఆ రాజుపేరు మీదనే రాయటం ఆనవాయితి. ప్రతిఫలంగా ఆయా కవులు, రచయితలకు రాజునుండి బహుమతులు లభించేవి. రాజులే రచయితలకు, సాహిత్యానికి పోషకులుగా కొనసాగారు. సంస్కృతం ఆధారంగా వచ్చిన రచనలు ఎక్కువ. వారి మొట్టమొదటి కవితలుగా యూన్ పాయ్ (యూనా పరాజయం), మహాజతి (ఘనమైన జాతక) మొదలైనవి, 1475-85 మధ్య వచ్చినవే.

సాహిత్యపరంగా థాయి దేశానికి రెండు స్వర్ణయుగాలుగా నిర్ణయించారు. 1. రాజు నారై (1657- 88) కాలం 2. రాజు రామా II (1809-24) కాలం. 16వ శతాబ్దంలో బర్మా అధీనంలోకి పోయి, సాహిత్యానికి గడ్డుకాలంగా పరిణమించిన దశలో, నారై రాజు థాయి దేశాన్ని బర్మా నుండి విడిపించడమే కాక



శుంథొర్న్ పు

సాహిత్య పునరుద్ధరణకు పూనుకున్నారు. నారై రాజు కూడా స్వయాన గొప్ప కవి. ఆ దేశంలోని జానపద కథల్ని పాళీ భాషలో 'యాభయి జాతక కథలు' పేరుమీద ఒక శృంగార కావ్యాన్ని (ఒక అనామక థాయి భిక్షువు రాసిన వాటిని అనుసరించి) నారై రాజే రాసారు. అలాగే అంతకు ముందెప్పుడో ఒక అనామక రచయిత అసంపూర్ణంగా రాసి వదిలేసిన 'ప్రలో' (ప్రభువదిగో) ఒక రాజకుమారుని విషాదాంత ప్రణయ గాథని నారై రాజే పూర్తిచేశారు. ఇందులో అర్థాలంకారాలు కంటే శబ్దాలంకారాలే ఎక్కువ. థాయి అత్యుత్తమ గ్రంథాల్లో దీన్నే ముందుగా పేర్కొంటారు. ఆస్థానకవుల్లో ముఖ్యులు మహరాజగురు, సి ప్రత్ (ప్రముఖ నిరుద్ధ కావ్య కవి), ఖున్ దేవకవి (బర్మీస్ ని అనుసరించి రాసిన జోలపాటల కవి), సి మహాసొత్ (నారై రాజుని కీర్తిస్తూ రాసిన కావ్యంతో ప్రసిద్ధులు). యాత్రా కావ్యాలు కూడా మొదటిసారిగా ఆ కాలంలో రాయబడ్డాయి. వీటన్నింటి వెనక నారై రాజు సంలగ్నత, ప్రోత్సాహం కనిపిస్తుంది.

1767 లో థాయిని బర్మా జయించింది. ఆయుత్తయ నుండి బ్యాంకాక్‌కి దాని రాజధాని మార్చబడింది. కవి రాజైన రామా II కాలంలో థాయి దేశానికి సాహిత్య పరంగా మరో స్వర్ణయుగం. మొదటి సారిగా స్త్రీలు సాహిత్య సృష్టిలో పాలుపంచుకున్నారు. రాజు ఆస్థానంలో ప్రముఖ కవుల్లో – యువరాణి పరమనుచిత్ (తెలెంగ్ ఫై – వోన్ పరాజయం కవయిత్రి), శుంథొర్న్ పు (అతి సామాన్యుడైనా కేవలం కవిత్వం మూలానే రాజుకి ఆంతరంగిక కార్యదర్శి అయిన కవి) మొదలైనవారు ఉన్నారు. రాజు ఆస్థానం నుంచి తొలగించబడ్డాక శుంథొర్న్ పు, గొప్ప దీర్ఘ కావ్యం *ఫ్ర అభైమని* ఒక కల్పిత ప్రణయ గాథని రాసారు. ఆస్థానం బయటకొచ్చి రాసిన మొట్టమొదటి కావ్యమది. ఆస్థానం బయటనున్న బహుముఖ కవుల్ని అది ఎంతగానో ప్రోత్సహించి వారి నుండి మరిన్ని రచనలు రావడానికి దోహదపడింది. క్లోంగ్ రూపంలో రాసిన ప్రముఖ కవి శుంథొర్న్ పు.

శుంథొర్న్ పు (26 జూన్ 1786 – 1855): థాయి సాహిత్యానికి తండ్రిగా, ప్రజా కవిగా గుర్తింపు పొందిన గొప్ప కవి. నలుగురు రాజుల కాలంలో ఉన్న ఏకైక కవి. రామా 1 (1772 – 1809), రామా 2 (1809 – 1824),

రామా 3 (1824 – 1848), రామా4 (1848 – 1868). సహజంగానే అందరు రాజులు ఒకేలా ఉండరు కాబట్టి, కొన్ని కష్ట నష్టాలున్నా అందరూ వీరిని గొప్ప కవిగా ఆదరించారు. ఎక్కువగా చదువుకోకపోయినా, ప్రజల భాషలో అతి సహజంగా రాసిన కవిత్వం వీరిది. ఆయన కవిత్వాన్ని ఇప్పటికీ ఎంతో ఇష్టంగా అందరూ చదువుకుంటారు. 1986లో UNESCO వీరి ద్విశతాబ్ది ఉత్సవాలను జరపడమే కాక, థాయిలాండ్ ప్రజాకవిగా ప్రకటించారు. అతని ముఖ్య కావ్యాల్లో ప్రముఖంగా పేర్కొనదగ్గది ముప్పయి వేల పంక్తుల దీర్ఘ కావ్యం *ఫ్ర ఆఫై మని*. ఆయన అసలు పేరు ఫు, రాజు ఇచ్చిన బిరుదు ఫ్ర శుంథొర్న్ వొహర తో కలగలిపి, శుంథొర్న్ ఫు పేరు అయింది.

శుంథొర్న్ ఫు కవిత్వంలోని కొన్ని భాగాలు –

**అయ్యో ఇదేమిటి**
**అన్నీ నాకు వ్యతిరేకమవుతున్నాయి**
**తెల్లచీమలు సైతం నా పడకగదిలోకి ప్రవేశించాయి**
**నా పుస్తకాల్ని పక్కని అవి నాశనం చేసాయి**
**ఆ పుస్తకాల విషయం ఆలోచిస్తేనే బాధేస్తుంది**
**నేను వేసుకునే పచ్చటి రాజదుస్తులకు రంధ్రాలు**
**అచ్చం ఏడుస్తున్న నా కళ్లులా ఉన్నాయి**
**....**
**మేము తాగి ఉండొచ్చు**
**అయినా మేము ప్రేమలో కూడా మత్తెక్కి ఉన్నాం**
**నా మనస్సును నేను ఎదిరించలేను**
**మేము తాగే ఉన్నా**
**రేపు సూర్యుడు ప్రకాశిస్తాడు**
**ఆ నిషా పోయుంటుంది**
**కానీ రాత్రొచ్చేసరికి**
**ప్రేమ మత్తు మళ్లీ తిరిగొస్తుంది**
**...**
**ఆకాశం, భూమి, సముద్రం లేకున్నా**
**నా ప్రేమ శాశ్వతంగా ఉంటుంది**
**నేల, నీటిలో ఎక్కడ పుట్టినా**
**నీ ప్రేమనే నిరంతరం నేను కోరుకుంటాను**
**నువ్వొక విశాల సముద్రమైతే,**
**నేను చేపనై నా మోహాన్ని తీర్చుకుంటాను**
**నువు పద్మమైతే,**
**నీ తీయని పుప్పొడిలో**
**ఉండటానికి నేనొక తేనెటీగ నౌతాను**
**చిన్న గుహపైనా,**
**సింహంలా గంటగంటకీ వెంటాడుతాను**
**ప్రతి జీవితంలోనూ నీ సహచరునిగా ఉండాలని**
**ఎక్కడున్నా నిన్ను అనుసరిస్తూనే ఉంటాను**

ఆంగకర్న్ కలయన పొంగ్ (13 ఫిబ్రవరి 1926 – 25 ఆగష్ట్ 2012) ప్రఖ్యాత కవి, జాతీయ చిత్రకారుడు, చనిపోయే ముందు ఒక భేటీలో కవిత్వం పట్ల తాను పంచుకున్న భావాలివి. సమాజాన్ని మార్చగలిగేది కవిత్వమని నేను నమ్ముతాను. అది మనం ఒక్కరవే చేయగలమని, నాలాంటి వాళ్లు ఎప్పుడూ అనుకోలేదు.



ఆంగకర్న్

కవిత్వం కవుల గుండెల్లో కొట్టుకోవాలి. భూమ్యాకాశాల వారసులు కవులు. కవిత్వం కవుల శ్వాసలాంటిది. కవులుగా పుట్టాము కాబట్టి మన జీవితాన్ని, ఆత్మని కవిత్వానికి అంకితం చేయాలి. నువు కవివయితే, నీ హృదయం ఒక కవిత్వం. అదంత ముఖ్యమైనది. కవిత్వం హృదయానికి ఆహారం, ఆత్మకి విటమిన్. నేను రాసినదాన్ని నేనెప్పుడూ సరిచేసుకుంటుంటాను. బతికుండగానే అది సాధ్యం. చనిపోయాక శవపేటిక నుండి బయటకొచ్చి దేనినీ మార్చలేము కదా!

(1851–68) లో మోంగ్కుట్ రాజు ప్రవేశపెట్టిన విద్యాసంబంధమైన సంస్కరణలు, ఇతర భాషల ప్రభావం నుండి థాయి సాహిత్యాన్ని కాపాడాయి. 1914 లో కేంబ్రిడ్జ్ లో చదివిన వజిరవుధ్ రాజు, షేక్స్పియర్ లాంటి కవుల కావ్యాల్ని అనువాదం చేసి బయట భాషల రుచి చూపించినా, అది వారికి నచ్చలేదు.

కానీ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పశ్చిమ దేశాల సాహిత్య ప్రభావానికి థాయి సాహిత్యం లోను కాక తప్పలేదు. క్లోంగ్, క్లోన్, లిలిత్, రాయ్, టొట్టోక్ వారి ముఖ్యమైన కవిత్వ రూపాలు. ప్రపంచ సాహిత్యంలోని ఉత్తమ కావ్యాలెన్నో థాయి భాష లోకి అనువదించ బడ్డాయి.

**లావోస్ :** మూడు విభిన్న రాజ్యాలుగా ఉన్నవి, 1893 లో ఫ్రెంచి అధీనంలోకి వచ్చాక లావోస్‌గా మారింది. 1945 లో జపాను అధీనంలోకి పోయి, తిరిగి 1949 లో ఫ్రెంచి స్వాధీనపర్చుకుంది. 1953 లో స్వాతంత్ర్యం సిద్ధించినా

దేశంలో అంతర్యుద్ధం మూలాన 1975 వరకూ అశాంతితోనే గడిచింది. చైనా, బర్మా, వియత్నాం, కంబోడియా, థాయిలాండ్ సరిహద్దులుగా ఉన్న దేశమిది. ఆ సరిహద్దు దేశాల సాహిత్య ప్రభావం లావోస్ సాహిత్యం మీద కూడా కనిపిస్తుంది. వారి తొలి కవిత్వమంతా బౌద్ధంతో నిండి ఉంటుంది. లావోస్ సాహిత్యం చాలావరకు థాయి సాహిత్యానికి ఒక మాండలిక అనుబంధం. థాయిలాండ్ లానే, రాజాస్థానాలకు పరిమితమైంది. అప్పటి ప్రముఖ బౌద్ధ భిక్షువుల కవిత్వం అనామకులు రాసిందిగా, రాతలో కంటే పాటగానే ప్రచారంలో ఉండిపోయింది. అధికారిక భాష అక్కడ లావో.

**కంబోడియా:** వియత్నాం, థాయిలాండ్ , లావోస్ సరిహద్దులుగా ఉన్న దేశం కంబోడియా. 19వ శతాబ్దం వరకూ రామాయణం, బౌద్ధ మూలాలు, ప్రార్థనలు మొదలైన రచనలన్నీ తాళపత్ర గ్రంథాల్లోనే ఉండేవి. కంబోడియాని కంపూచియా అని కూడా పిలుస్తారు. అధికారికంగా అది కంబోడియా రాజ్యం. నిజానికి సంస్కృత పదం కంబుజ్ దాని అసలుపేరు. హిందూ, బౌద్ధాలు కొన్ని వందల ఏళ్లు అక్కడ రాజ్యమేలాయి. 15 వ శతాబ్దం నుండి పొరుగు రాజ్యాల అధీనంలో ఉండి, 19 వ శతాబ్దం మధ్యకి ఫ్రెంచి అధీనంలోకి పోయింది. 1953 లో స్వాతంత్ర్యం పొందినా వియత్నాం యుద్ధం, కంబోడియా వరకూ వ్యాపించి 1970 లో జరిగిన జాతి విధ్వంసంలో అప్పటి పోల్ పోట్ సైన్యం, ఖ్మెర్ దుర్మార్గుడు ఆ దేశాన్ని 11వ శతాబ్దానికి తీసుకుపోయే ప్రయత్నంలో ఆ దేశాన్ని సర్వనాశనం చేసాడు. 1993 నుండి దాని పూర్వవైభవాన్ని పొంది, అభివృద్ధి దిశగా పోయేందుకు కంబోడియా ప్రయత్నిస్తూనే ఉంది.

కంబోడియా రాజులు థాయిలాండ్ రాజులకు దాసులుగా చలామణి కావడంతో అక్కడ సాహిత్య సృజన దాని మూలంగా జరగలేదనే చెప్పుకోవాలి. ఉన్న సాహిత్యం కూడా పాళీ భాషలో రాసిన అప్పటి ఆశ్రమాల్లోని బౌద్ధ భిక్షువులదే. 19వ శతాబ్దం నుండి కవిత్వం ఉన్నా, అది పాటగా మౌఖికంగానే చలామణి అయింది. అయినా ఎక్కువ భాగం కవిత్వం మొదటి నుండి ధార్మికమైనదే.

సంప్రదాయ కంబోడియా కవిత్వాన్ని ఖ్మెర్ కవిత్వం లేదా స్మోట్ కవిత్వం అంటారు. ఈ స్మోట్ కవిత్వం కంబోడియా నుండి దాదాపు అంతరించి పోయింది. అంత్యక్రియలు, బౌద్ధ వేడుకల్లో, ప్రదర్శన రూపంలో ఈ స్మోట్ వాడేవారు. కనీసం 60 పద్ధతుల్లో స్మోట్ కవిత్వాన్ని పాడేవారు. అప్పటి సందర్భం, మానసికావస్థని అనుసరించి ఏదో ఒక పద్ధతిలో పాట సాగేది. ఖ్మెర్ అధికారిక భాష అక్కడ.

**ఎక్కడైతే**
**నీళ్లు మెరిసేవో, తాటిచెట్లు నాట్యం చేసేవో**
**తెల్ల కొంగలు, కాంక పక్షులు**
**చేపలకోసం రెక్కలల్లార్చేవో**
**ఒకదానిమీద ఒకటి నీటి బర్రెలు**
**ఆవేశంతో రాక్షసుల్లా గుర్రుమనేవో**

అది నా కంబోడియా అని కంబోడియా నుండి అప్పటి పరిస్థితులకు భయపడి అమెరికాలో తలదాచుకుని ఇప్పుడు కంబోడియాకు తిరిగొచ్చిన కవి, యూ శాం ఓయుర్ రాసుకున్న కవితలో భాగం.

అప్పటి భయానక సమయాన్ని గుర్తు చేసుకుంటూ ఆయనే రాసిన కొన్ని కవిత్వ పంక్తులు అప్పటి జీవితానికి అద్దం పడతాయి.

**దాక్కునేందుకు చోటులేదు**
**విశ్రాంతి తీసుకుందుకు ఏ ఆకాశమూ లేదు**
**పిల్లల మూలుగులు / తల్లుల ఏడుపులు**
**జ్వలిస్తున్న మంటల్లో ప్రదేశమంతా**

మలేసియా, ఇండోనేసియా, ఇండోనేసియా ద్వీపాలు: ఈ దేశాల్లో దాదాపు 300 వరకూ వివిధ భాషలు, మాండలికాలు ఉన్నాయి. అయినా వాటన్నింటికీ ఒకే ప్రచలిత భాషా సంబంధమైన ఆధారాలున్నాయి.

14 వ శతాబ్దంలో ఇస్లాం అక్కడ ప్రవేశించక పూర్వం, జావా భాష వాడుకలో ఉండేది. ఆ తరువాత మలయ్ భాష ముఖ్యమైన భాషగా మారింది. అదే భాష ఇండోనేసియాలో అధికారిక భాషగా 1949లో ప్రకటించ బడింది.

భారతీయ సాంస్కృతిక ప్రభావం ఉన్నప్పుడు, మలయ్ ద్వీపకల్పాల్లోను, ఇప్పటి ఇండోనేసియా ద్వీపాల్లోను చాన్నాళ్లు సంస్కృతమే ముఖ్యభాష. 11వ శతాబ్దానికి ఐర్లంగ చక్రవర్తి కాలంలో సంస్కృతంతో కలగలిసిన జావా భాష తయారైంది. కవిత్వ పద్ధతుల్లో మాత్రం సంస్కృతాన్నే అనుసరించేవారు. 14వ శతాబ్దానికి అది మారి, తమదైన జావా పద్ధతుల్లో, జనసామాన్య భాషలో కవిత్వం మొదలైంది.

1365 లో వచ్చిన ప్రసిద్ధ కావ్యం *నాగరకెర్తగమ* (రాజును కీర్తిస్తూ ఉన్నా, అప్పటి జావా ప్రజల జీవన విధానాల్ని అందులో చూడొచ్చు). భారతీయ తోలు బొమ్మలాట అక్కడి సంస్కృతిలో భాగమైపోయింది. మొదట్లో భారతీయ కథల ఆధారంతో ఉన్నా, రానురాను వాటిల్లో అక్కడి పరిస్థితుల కనుగుణంగా అనేక మార్పులు చేర్పులూ చేయబడ్డాయి. 'హికాయత్' పేరుమీద కల్పిత గాథలు, కావ్యాలు వచనాల్లో వచ్చాయి. దాదాపు అవే ఇతివృత్తాలు బాలినీస్, సుడనీస్, మాదురీస్ స్వభాషా సాహిత్యాలు అనుసరించాయి.

ఇస్లాం ప్రవేశంతో అప్పటి వరకూ ఉన్న సాహిత్యంలో అరబ్బీ, ఫారసీల ప్రభావం ఎక్కువయింది. అరబ్బీ, ఫారసీ సాహిత్యాల అనువాదాలు మొదలయ్యాయి. 15వ శతాబ్దంలో మలయ్ భాషలో వచ్చిన మలయ చరిత్ర ఒక గొప్ప గ్రంథంగా కొనియాడబడింది. రాజప్రాసాదంలో రోజువారి జీవనాన్ని కళ్లకు కట్టినట్టు రాసిన వ్యంగ గ్రంథమది. మలయ ద్వీపకల్పంలో కాలంతో బాటు సాహిత్యంలో మార్పు లెక్కువగా రాకపోయినా ఇండోనేసియాలో మార్పులు ఎక్కువగానే కనిపిస్తాయి.

మలేసియాకి థాయిలాండ్, ఇండోనేసియా, బ్రూనై సరిహద్దులు. 14వ శతాబ్దం నుండి అక్కడ కవిత్వం ఉంది. అనేక కవిత్వ రూపాల్లో కవిత్వం అక్కడ అభివృద్ధి చేయబడింది. ముఖ్యమైన రూపాల్లో ఫాంటన్, ఎంపట్ ఎంపట్, షైర్ , హికాయట్ మొదలైనవి ఉన్నాయి.

మలేసియాలో వార్తాపత్రికలు అక్కడి భాషను మలుపుతిప్పాయి. 1876 నుండి జనజీవన మలయ్ భాషని ఒక కొత్త ఒరవడిలో అవి ప్రవేశపెట్టాయి. 1920 ప్రాంతానికి వార్తాపత్రికల మలేసియా మలయ్ భాష, అప్పటి వరకూ ఉన్న పురాతన సాహిత్య మలయ్ భాషకు ప్రత్యామ్నాయం కాగలిగింది. 1926లో ఆంగ్ల ప్రభుత్వం నెలకొల్పిన అనువాదాల విభాగం మితంగా ఆంగ్ల సాహిత్యాన్ని ఈ కొత్త భాషలోకి అనువాదం చేయించింది.

### A. సమద్ సైద్ (1935–) :

1985 నుండి మలేసియా జాతీయ కవి. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు, పర్యావరణం, ప్రజల పక్షాన కవిత్వం రాసినందుకు, అనేక నిర్బంధాలకు గురయ్యారు.

**ఖాళీ ఇల్లు :**

**నిద్రలేని ఒక రాత్రి / అమ్మ అడిగింది**
**నువ్వు ఇల్లు ఎప్పుడు కొంటున్నావని**
**చిరునవ్వుతో వాగ్దానం చేసాను**
**తొందర్లోనే, ఒకటి రెండేళ్ల లోపే అని**
**తన బిడ్డ ఇల్లు చూడలేని విచారంతో**
**ఒక నెల తరువాతే అమ్మ పోయింది**
**ఆ రహస్యాన్ని కళ్లు దాస్తున్నా**
**ఆమె చూపు శాంతంగానే ఉంది**
**ఇదే నా దుఃఖం / ఇంకేమీ లేదు**
**నా యాతన ఎప్పటికీ అదే**

**చచ్చిన కాకి :**

**పోస్టాఫీసు దగ్గర / ఒక చచ్చిన కాకిని**
**అతను మురుగు కాలవలో చూసాడు**
**కిక్కిరిసిన వైద్యశాలలో ఉదయం**
**కష్టశ్వాసతో ముసలివాణ్ణి**
**శ్వాస తీసుకోలేకపోతున్న చంటిదాన్ని చూసాడు**
**ఇంత సంపన్నమైన ఈ దేశంలో**
**ఎందుకు ఇలా మనం కష్టపడాలి?**
**నా పిల్లల పిల్లలకోసం / స్వచ్ఛమైన గాలి నాకు కావాలి**
**పాపిష్టి మూర్ఖులు / అడవుల్ని ఏకాంతంగా వదిలేయాలి**
**చెట్లు పెరగాలి / నదులు స్వేచ్ఛగా ప్రవహించాలి**
**పచ్చని పచ్చికని భూమి కప్పుకోవాలి / ఇప్పుడూ ఎప్పుడూ**
**ఎలా గౌరవంగా మనం బతకాలో**
**రాజకీయవేత్తలు ఆలోచించాలి**

ఇండోనేసియాలో కూడా పురాతన సాంస్కృతిక భాష, సాహిత్య జావానీజ్ భాష, 19వ శతాబ్ది చివరికి దాదాపు అంతరించిపోయింది. డచ్ సాహిత్య ప్రభావం ఎక్కువ కావడం మొదలైంది. 1920 వచ్చే సరికి రాజకీయ కారణాలతో, డచ్ ప్రభుత్వమే పూనుకుని డచ్ ప్రభావం నుండి తగ్గించే ప్రయత్నం చేసింది. అది అక్కడి సాహిత్య కారులకు సైతం సమ్మతం కావడంతో దేశీయ భాష తిరిగి పుంజుకుంది. 1933 నాటికి సాహిత్య పత్రికలు కొత్త మలయ్ భాషలో రావడం మొదలయ్యాయి. కానీ ఆ భాషనే వారు ఇండోనేషియన్ భాషగా చెప్పుకున్నారు. జపాన్ ఆక్రమణ లో ఈ ఇండోనేసియన్ భాష మలేసియా లో కూడా ప్రజాదరణ పొందింది.



**ఎ. సమద్ సైద్ -**

1949లో ఇండోనేసియన్ భాషని బహస మలయ్ పేరుతో అధికార భాషగా ప్రకటించబడింది. అది మలేసియా ఇండోనేసియా రెండు దేశాల్లోనూ సాహిత్య సృజనకు ఎంతగానో తోడ్పడింది. ఇండో నేసియాలోనే చైరిల్ అన్వర్, సిటొర్ సిటుమొరంగ్ లాంటి ప్రముఖ కవులు బాహ్యా ప్రపంచానికి పరిచయమయ్యారు.

ఇండోనేసియా, మలేసియాలో ప్రాముఖ్యత సంతరించుకున్న మలయ్ భాష, మలయా ద్వీపకల్పంలోనే కాక, సుమత్రా, బోర్నియో, మరికొన్ని దీవులలో కూడా వాడుకలో ఉన్న భాష. ఇప్పుడు అధికార భాషగా ఉన్న మలయ్ భాషకు దక్షిణ మలయా ద్వీపంలోని మాండలికం ఆధారం. 7వ శతాబ్దంలో మలయ్ భాష తొలి లిఖిత ఆధారాలు దొరికాయి. ఈ భాష ఇప్పుడు లాటిన్ వర్ణమాలతో కొద్ది మార్పులున్న రెండు విభిన్న లిపులలో రాస్తున్నారు. ఒకటి ఇండోనేసియాలోను, రెండవది మలేసియాలోను వాడుతున్నారు. ఈ భాషలో పద సంపద ఎక్కువే. దానికి కారణం సంస్కృతం, అరబ్బీ, ఆంగ్లం, డచ్, తమిళం, కొన్ని భారతీయ భాషలు, జావనీజ్ భాషల పదజాలాలెన్నో కాలానుగుణ్యంగా ఇందులో చేరుతూ వచ్చాయి. ఇండోనేసియా సాహిత్యంలో అతి పురాతనము అతి సంపన్నమూ అయిన భాష జావానీజ్. నిజానికిది ఇండోనేసియా ద్వీపాల్లో అతి పెద్దదైన దీవుల్లో నాలుగోదైన జావాలో వ్యావహారిక భాష. ప్రాచీనకాలంనుండి జావాతో భారతదేశానికి సన్నిహిత సంబంధాలున్నాయి. అది వారి భాష, సాహిత్యాలమీద అమితంగా ప్రభావం చూపింది.

ఈ భాషకు రెండు మూలాలు కనిపిస్తాయి. 1. స్థానిక సంప్రదాయం 2. భారత ప్రాచీన ప్రబంధాలు. ఈ భాషలో మాండలిక భేదాలున్నా 'కవి' గా పిలవబడే భాషా భేదం వారికి ప్రాచీనం, పవిత్రం. అందులో సంస్కృత పదాలు చాలా ఎక్కువ. లిపి కూడా దేవనాగరి లిపిని పోలి ఉంటుంది. కవి భాషలో వచ్చిన *చంద కిరణ* (778) కవిత్వ సూత్రాలతో కూడిన పురాతన గ్రంథం. అది కథనాత్మక కవిత్వం 'కకవిన్'కి మూలమైంది. 10-12 శతాబ్దాల మధ్య భారతీయ పురాణాలు, భారతం, బౌద్ధ కథలే ఆధారమైనా, తరువాత *కణ్వ అర్జున వివాహం* (1035) లాంటివి స్థానిక నేపథ్యంలో రాయబడ్డాయి. 14వ శతాబ్దంలో తంతులర్ రాసిన దీర్ఘ కవిత *అర్జున విజయ* పూర్తిగా జావానీజ్‌దని భావిస్తారు. ప్రపంచ కథనాత్మక కావ్యం *నాగరకెర్తగమ* (1365) అప్పటి జావా చారిత్రక పరిస్థితుల్ని జీవనగతుల్ని మొట్టమొదటిగా గ్రంథస్థం చేయగలిగింది. 16-17వ శతాబ్దానికి ఇస్లాం జావాలో ప్రవేశించాక, అరబ్బీ ఫారసీ సాహిత్యాల ప్రభావంలోకి జావానీజ్ రాకతప్పలేదు. 18వ శతాబ్దం ద్వితీయార్థంలోను, 19వ శతాబ్దం ప్రథమార్థంలోను జావానీజ్ పునరుద్ధరణ మొదలై, పురాతన గ్రంథాల్ని అప్పటి పరిస్థితుల కనుగుణంగా మార్చుకోడం మొదలైంది.

20వ శతాబ్దం మధ్యలో, 1945లో ఇండోనేసియా స్వాతంత్ర్యానంతరం జావానీజ్ కూడా తగ్గి ఇండోనేసియా సంస్కరించబడిన మలయ్ భాష ప్రాముఖ్యంలో కొచ్చింది.

ఆశ్చర్యంగా ఉంటుందిగాని, ఇండోనేసియాలో ఆధునిక కవిత్వంతోనే కవిత్వం మొదలయింది. మధ్య యుగంలో గాని, ఆ ముందుగానీ ఇండోనేసియా అన్న దేశమే లేదు. ఇండోనేసియాలో కవిత్వం 20వ శతాబ్దం మొదట్లో జాతీయ స్వాతంత్ర్య పోరాటంగా మొదలయింది. మొహమ్మద్ యమిన్ (1903-1962), సనోసి పనె (1905-1968), రోస్తం ఎఫ్పెంది (1902-1979), ఆమిర్ హంజహ్ (1911-1946), చైరిల్ అన్వర్ (1922-1949). ఆస్రుల్ సని (1926-2004), రివై ఆపిన్ (1927-1995), సిటొర్ శ్శితుమొరంగ్ (1924), సుబగిఒ సస్త్రొఅర్దొయొ (1924-1995), రెంద్ర (1935-2009), సుతర్జి చాల్జొం బచ్రి (1941), ఆఫ్రిజల్ మల్న (1957) మొదలైన కవులెందరో ఇండేనేసియాలో కవిత్వ వ్యాప్తికి అంతర్జాతీయ గుర్తింపుకు కృషిచేశారు.

**చైరిల్ అన్వర్ (1922-1949) :**

27 ఏళ్లే బతికిన చైరిల్ అన్వర్ మలయ్ భాషలో ఇండోనేసియా ఠాగూరుగా పేరుపొందారు. చితికిపోయిన కుటుంబం కారణంగా స్కూలు విద్యతోనే చదువు ముగించాల్సొచ్చింది. జకార్తా కొచ్చాక కవిత్వ రచన మొదలెట్టినా, అనేక కవితలు అప్పటి జపాను ప్రభుత్వం నిశితంగా పరిశీలించి, ప్రచురణకు అనుమతించేది.

వీరి కవిత్వంలో ఎక్కువభాగం వైయక్తిక వాదం, అస్తిత్వవాదం, మృత్యువు కనిపిస్తుంది. అనేక సంకలనాల్లో చోటుచేసుకుని ప్రసంశలు పొందిన చైరిల్ అన్వర్ వి ఓ రెండు కవితలు.

**నేను :**

**నా సమయమొచ్చినపుడు / నాకోసం ఎవరు ఏడ్చినా నాకు నచ్చదు**
**నువ్వైనా సరే / వెక్కి వెక్కి ఏడ్పులు అవసరం లేదు**
**గుంపునుండి తోలబడ్డ / క్రూర మృగాన్ని నేను**
**తూటాలు నా చర్మాన్ని చీల్చుకుపోయినా**
**నేను ముందుకు నడుస్తూనే ఉంటాను**
**హింస బాధ మాయమయేవరకూ**
**గాయాల్ని, విషాన్ని మోస్తూనే ఉంటాను**
**కొద్దిగానైనా నేను ఖాతరు చేయను**
**మరో వెయ్యేళ్లు నేను బతకాలనుకుంటున్నాను**

**మసీదు దగ్గర :**

**అతనొచ్చేవరకూ / అతనినే పిలిచాను**
**ఒకరినొకరు ఎదురెదురుగా కలుసుకున్నాం**
**ఆ తరువాత నా హృదయంలో, అతను మండుతున్నాడు**
**అతనిని ఆర్పడానికి నా శాయశక్తులా పోరాడుతున్నాను**
**చెమటతో నగ్నంగా తరిమేయలేని నా శరీరం.**
**ఒకరొనొకరు ధ్వంసం చేసుకుంటూ**
**ఈ గది ప్రదేశంలోనే / అతను నేను పోట్లాడుకునేది**
**ఒకరు దూషిస్తూ, ఇంకొకరికి పిచ్చెక్కి.**

**ఫిలిప్పైన్ :** పశ్చిమ పసిఫిక్ సముద్రతీరం హద్దుగా ఉన్న దేశం. టగలోగ్ భాషలో ఉన్న వారి కవిత్వం సంగీత ప్రధానం. టనగా అక్కడ ప్రసిద్ధ కవిత్వ రూపం. అయినా మౌఖికంగా శతాబ్దాల తరబడి పండగల్లో పాటలుగా వస్తూ వచ్చిన ఫిలిప్పైన్ సాహిత్యమే 16వ శతాబ్దం వారి సాహిత్యం. 16వ శతాబ్దంలో స్పానిష్ రాజ్యంలో ఫిలిప్పైన్ ఒక భాగమైనాక, రాతలో వారి సాహిత్యం రావడం మొదలయింది. అంతవరకూ వారి దేశీయ భాష టగలోగ్. కానీ 19వ శతాబ్దానికి వారిది స్పానిష్ భాషగా మారిపోయింది. ఫలితంగా వారి సాహిత్యం స్పానిష్ లోనే రావడం ఆరంభమయింది. జోసే ప్లమ లాంటి కవులు రాసిన కవిత ఫిలిప్పినాస్ వారి జాతీయగీతమయ్యింది. అమెరికా అధీనంలోకి వెళ్లిపోయాక ఆంగ్లం కూడా సాహిత్యం లోకి అక్కడ ప్రవేశించింది. స్పానిష్ సంస్కృతి కనిపిస్తున్నా, ఇప్పటికీ అక్కడి సాహిత్యం టగలోగ్, స్పానిష్, ఆంగ్లంలోనూ వస్తూ ఉంది.

**సింగపూర్ :** ఆంగ్లేయుల వలసరాజ్యం నుండి విముక్తి పొంది, మలేసియా సమాఖ్య నుండి బయటకొచ్చి 1965 లో స్వాతంత్ర్యం పొందిన అతి చిన్న దేశం సింగపూర్. మలయ్ ద్వీపకల్పానికి దక్షిణాన, హిందూ మహాసముద్రానికి -దక్షిణ చైనా సముద్రానికి మధ్యనున్న 63 దీవుల ద్వీప నగర దేశం. మలేసియా, చైనా, భారతదేశం నుండి అనేకమంది ప్రవాసులు ఆ దేశాన్ని అన్నివిధాలా అభివృద్ధి చెందిన దేశంగా ఈ 40-50 ఏళ్లలోనే తీర్చి దిద్దారు. వ్యాపారం, వాణిజ్యం మీద ఉన్న ఆసక్తి రచనలమీద అక్కడ అంతగా లేదనే చెప్పాలి. రచనలు చేస్తూ కూర్చోడం అంటే, సమయాన్ని వృధా చేసుకోవడంగా భావించే తత్వం కనిపిస్తుంది. ఆంగ్లం మొదటి భాష, అయినా, తమ మాతృ భాష రెండవ భాషగా వివిధ చైనా మాండలికాలు, అల్పసంఖ్యాకుల మలయ్, హిందీ, తమిళం కూడా అంతే ప్రముఖంగా అంగీకరించ బడింది. ఆ కారణంగా అక్కడ ఆంగ్లం, చైనా, మలయ్, తమిళంలో కవిత్వం ఉంది. ముఖ్యమైన కవుల్లో పేర్కోదగ్గవారు-ఎడ్విన్ థుంబూ, ఆర్థర్ యాప్, లీ ట్జు ఫెంగ్, లెవొంగ్ లియెవ్ గెవొక్.

వీరిలో ఎడ్విన్ థుంబూ (1933-) సింగపూర్ కవిత్వానికి దశదిశ ఇచ్చినవాడిగా గుర్తింపు పొందారు. ఎడ్విన్ తండ్రి తమిళుడు, తల్లి చైనాకి చెందినది. ఆంగ్లంలో, సింగపూర్ జాతీయ కవిగా అనధికారంగా పేర్కొనబడతారు. చరిత్ర, అస్తిత్వం మీద ఎక్కువగా వీరి కవిత్వం ఉంటుంది. తండ్రి మూలాన అనేక కవితల్లో భారతీయత కనిపిస్తుంది.

**శివ :**

**దానిమ్మ విత్తనాలతో**
**నీ దేవాలయ ద్వారానికి నేను నమస్కరిస్తాను**
**మనస్సు దుఃఖంతో ఉన్నా, చాలా చురుకుగా**
**ధ్వనించే మాటల్లో పద్యాన్ని కోరుకుంటాను**

**నా కళ్లలో ప్రాణముంచాలని / ఆకాశంలో రంధ్రాన్ని**
**నీ హోమాగ్ని కాల్చడం చూడాలని / నీ పూజారి దగ్గరకొచ్చాను**
**నర్తిస్తున్న నీ పాదాలు / డోలు పోగుల్ని చింపేస్తూ**
**సాయంత్రం సూర్యునిలో ఒక లయగా**
**అక్కడొక ఆకృతి నేను చూసాను**

ఆగ్నేయాసియాలో భారతీయ పద్యకావ్యాల ప్రభావం మొదట్లో ఉండేది. ఆ తరువాత బౌద్ధం ఎక్కువగా ప్రభావితం చేసింది. మలేసియా, ఇండోనేసియా కొన్నాళ్లకు ఇస్లాం ప్రభావంలోకొచ్చాయి. థాయిలాండ్ తప్ప తతిమ్మా ప్రాంతాల్లో వలసరాజ్యాల మూలాన, పశ్చిమ వేష భాషలు అక్కడి సాహిత్యం సంస్కృతుల్లోకి చొచ్చుకుపోయాయి. అయినా కవిత్వం ఎక్కువగా ప్రదర్శనగా మిగలడంతో, ఆమాత్రం అస్తిత్వాన్నయినా అవి నిలబెట్టుకున్నాయి.

---

ముకుంద రామారావు,
హైదరాబాదు. ఫోన్ : 9908347273

# అట్టమీద బొమ్మలు



**ముఖచిత్రం :** మెగ్దలీనా – చిత్రకారుడు : టీషియన్

క్రీస్తు చివరి మజిలీలో ఆయనతో పాటు ప్రయాణం సాగించిన వారిలో ఆమె ముఖ్యురాలు. క్రీస్తు శిలువ వేసిన తరువాత ఆయన శిష్యులు, అనుచరులు అందరూ వెళ్ళిపోయారు. ఒక్క సెయింట్ జాన్ తప్ప. అప్పుడు కూడా ఆమె శిలువ వేసినచోటే ఉంది. క్రీస్తు పార్థివ శరీరాన్ని సిలువపై నుంచి దించి రాతిగుహలో పెట్టి ఒక బండ రాయితో ఆ కొండ గుహను కప్పి సమాధి చేసినపుడు ఆమె ఉంది. ఆ తరువాతి ఆదివారం వచ్చి కొండ గుహ బండరాయి తొలిగి పోయినపుడు లోపలికి వెళ్ళి చూసి, క్రీస్తు శరీరం అక్కడ లేదని తెలుసు కొని బయటకు వచ్చి పునరుత్థానం పొందిన 'క్రీస్తును చూసి అతడు తిరిగి లేచాడు' అని ప్రపంచానికి చాటి చెప్పిందామె. అందుచేతనే ఆమెను apostles కు apostle గా పేర్కొంటారు.



**టీషియన్**

క్రైస్తవ మత కొత్త నిబంధనల ప్రకారం, స్త్రీలలో మేరీమాత తరువాత స్థానం ఆమెదే. అందుచేతనే క్రైస్తవ మత చిత్రాలలో జీసస్ క్రీస్తు, మేరీ మాత, సెయిట్ జాన్‌ల తరువాత ఎక్కువగా చిత్రించ బడినవి ఆమె చిత్రాలే! నాలుగు గాస్పెల్స్‌లో ఆమె పేరు 12 సార్లు వస్తుంది. ఆమె క్రీస్తు పాదాలు కడిగి ఆ తరువాత తన కురులతో (ఆమెవి పొడవైన కేశాలు. అవి ఎరుపు, బంగారు వర్ణాలతో మెరిసి పోతుండేవి.) ఆయన పాదాలను శుభ్ర పరిచిందని పేర్కొని వుంది. 'మెగ్దలీనా' అంటే ఉంగరాల జుట్టు కలది అని అర్థం. ఈ చిత్రంలో కనిపించే పుర్రె, పుస్తకం గురించిన వివరాలు ఇంతవరకు తెలియరాలేదు.

అట్టమీద ఉన్న ఈ చిత్రం 16వ శతాబ్దానికి చెందిన టీషియన్ వేసినది. ప్రసిద్ధ చిత్ర కారులలో అతను మొదటి పదిమందిలో ఒకడు. చిత్ర కళను రేఖల నుంచి విముక్తి కలిగించిన నిజమైన మొట్టమొదటి చిత్రకారునిగా ప్రసిద్ధుడు. అతని కాలం నాటికి మెగ్దలీనా పై నీలినీడలు ఉన్నాయి. అందుకే అతను ఈ చిత్రానికి 'పశ్చాత్తాప పడుతున్న మెగ్దలీనా' అనే పేరు పెట్టాడు. ఈ చిత్రం ఖండాంతరాలు దాటి రాష్యాలోని హెర్మిటేజ్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంది.



**రెండవ అట్ట :** *నిదుర ఒడిలో* – చిత్రకారుడు : ఆల్మా తడేమా





**మూవడ అట్ట :** *కలల జడిలో* – చిత్రకారుడు : సెర్జి మార్షనికొవ్





**నాల్గవ అట్ట :** *సొగసు తడిలో*– చిత్రకారుడు : సెర్జి ఇగ్న టెంకొవ్



# మేము-మా మిత్ర మండలి

*-గొర్రెపాటి వెంకట సుబ్బయ్య*


గొర్రెపాటి వెంకట సుబ్బయ్య

**మాకు** అనగా మా మిత్రమండలికి ఓ సంఘం ఉంది. మా సంఘంలో అంతా వావివరుసతోనే పిలుచుకుంటూ వుంటాం... బాబులు-బాబాయిలు, అన్నలూ-తమ్ములు, అల్లుళ్ళు-మామలు, బావ-మరదులు, తాతా-మనుమలు, అన్నా-చెల్లెళ్ళు, అక్కా-తమ్ముళ్ళు వున్నారు. తాతగారూ! అని పిలిచి మనుమనిగా మారే తాతలు, మనుమడుగారూ అంటూ వాత్సల్యం చూపించే తాతలుగా మారే మనుమలున్నారు. మా సంఘంలో చెల్లాయిని అక్కా అంటూ ఆప్యాయంగా పిలుస్తూ తమ్ముళ్ళుగా మారే అన్నలున్నారు. ఇంతెందుకు? అన్ని విధాలైన ఆప్యాయతలు, వాత్సల్యాలు పుణికి పుచ్చుకున్నది మా మిత్రమండలి.

మా సంఘంలో పండితులు, కవులు, కళాకారులుగా ప్రసిద్ధి గాంచిన గాయకులు, నటకులు వగైరా వగైరా ఎందరెందరో మహానుభావులున్నారు. గేయాలు వ్రాసే వారున్నారు. గాయాలు మాన్పేవారు వున్నారు. కలాన్ని, హలాన్ని, కుంచెను పట్టి సమంగ నడిపించే నేర్పరులున్నారు.

"శాంతి రస మొలుకు బ్రహ్మతేజస్సు" తో వెలిగే మహాత్ములున్నారు.

"కర్తవ్య నిష్ఠతో కర్మసాక్షి"ని మరపించే "బ్రహ్మ" లున్నారు. దేవులున్నారు. రావులున్నారు. రాజులున్నారు, రెడ్లున్నారు. కథలు చెప్పేవారే కాదు, కథలు వ్రాసేవారు కూడా వున్నారు. దృశ్యాలు వర్ణించేవారే కాదు, దర్శింపజేసే వారు కూడ వున్నారని సగర్వంగా చెప్పుకుని మురిసే, మురిపింపచేసేదే మా యీ సంఘం.

"నిస్వార్థత", "అనురాగం", "ఆప్యాయత" అనే వాటిని లోకం మమ్ముచూసే నేర్చుకుంటోందనే అనుమానం మాకు లేక పోలేదు. ఎందుచేతంటే మాలో ఎన్ని "వర్గా"లున్నా అందరం ఒక్కటే. ఒకే మాటగా, బాటగా పురోగమిస్తూ వుంటాం. మాలో "ఛలోక్తులు", "సరసోక్తులు", "చతురోక్తులు" తప్ప మరో వక్తలు మచ్చుకు కూడ లేరు అని అనిపించు కుంటూ వున్నదే మా యీ మిత్రమండలి. మాదంతా ఓ "మధుర జీవన" నికుంజం. ఆ నికుంజంలోని "మధువు"ను మాలో తృప్తిగా నింపుకుంటూ వున్న "మధుపాత్రలం" మేమంతా. ఆ "పాత్ర"ల నిండా "మధు" వొలికిస్తూ మా జీవితాలను మధురంగా మార్చు మహనీయులు, మహాత్ములూ వున్నదే మా సంఘం. ఆదర్శాలకు ఆదర్శాలు నేర్పు ఆదర్శ సంఘం మా సంఘం.

మేమంతా ఎంతెంతో దూరతీరాల్లో నివసిస్తూ వుంటూ వుంటాం. కాని అన్ని వేళలా అందరం అతి సన్నిహితంగా వుంటూ వున్నట్టుగానే వుంటూ వుంటాం. పత్రాల ద్వారా, పత్రికల ద్వారా. అందుకే దూరతీరాలు లేనిది అని అనిపించుకుంటూ పురోగమిస్తూ వున్నది మా యీ మిత్రమండలి. అన్ని విషయాల్లోనూ నిండుదనం సంతరించుకున్న పండు మనస్సులు గల "పవిత్ర" మనుషులున్నది మా సంఘం. మూఢాచారాలు, మూఢ నమ్మకాలు మాకు కడు దూరంగా వుంటాయి. నలుగురు మేచ్చేవి, నలుగురకు నచ్చేవి, ఆదర్శ సంస్కార సంస్కరణలే మా ఆచరణాలు. మేము అందించేవి, ఆచరించేవి, అవే అని నిరూపించే సంస్కారులు, సంస్కర్తలు కలిగింది అని నిరూపించుకున్నట్టిదే మా యీ మిత్రమండలి.

ఇటువంటి మా యీ సంఘం ఈనాడు ఇక్కడ "అపర రవీంద్రు"లనదగు ప్రతిభావంతుల ఇంట సమావేశమై తన ఉనికిని (జన్మను) సార్థకత గావించుకుంటూ వున్నది.

14.1.70

గూడవల్లి నరసింహారావు

అంకెలకు అంకితమైన రామబ్రహ్మంగారెంత మధుర రచయితో వేరే చెప్పనక్కరలేదు. ఈయన ప్రతి సమావేశంలోను చదువుతాడు, యీ వృత్తాంతాన్ని. దీనికి వశుడనై అనుబంధంగా ప్రచురించాను. ఈయన సోదరుడు నరసింహారావు గారు, ఈ సంక్రాంతి సమావేశాన్ని గురించి, ఇందులో పాల్గొనే వారిని గురించి, చిత్ర విచిత్రంగా, వాస్తవంగా రచన చేశారు.

ఈ అన్నదమ్ములను వదిలి పెట్టలేను- రచలున్నా మరి ! మిత్రబృందం మాత్రం! ●

# మా మనః కేదారాల్లో మధురిమలు పండించిన మా సంక్రాంతి సమావేశాలు - స్మృతి రేఖలు

*- వేగుంట కనకరామబ్రహ్మం*

**మైత్రి**లోని పవిత్రతకూ, దివ్యత్వానికీ లోటు రాకుండా వాటిని కాపాడుకుంటూ ఎన్నో సంక్రాంతుల కొరకు ఎదురు చూస్తూ ప్రతి సంక్రాంతినీ క్రాంతిమంతంగా గడుపు కోవాలనీ, ఆ సంవత్సరమంతా ఆ మధుర స్మృతులను నెమరువేసుకుంటూ "ఎవరెంత దూరాన వున్నా సుహృద్భావపు వంతెనలను ఏర్పరచుకుంటాం" అనుకునే స్నేహాభిలాషులందరకూ శుభాకాంక్షలు!

యాంత్రికములైన వృత్తుల్లో ప్రవృత్తులై జీవితాన్ని దొర్లించే ప్రతి వ్యక్తికీ ఆటవిడుపు ఆనందప్రదం ఆ అవకాశాన్ని ఆత్మీయులయిన మిత్రుల మధ్య వుల్లాసంగా, మధురంగా గడపటంవల్ల కొంత వరకయినా అతని బాధల్నీ, జీవన భారాన్నీ దైనందిన కష్టాన్నీ మనఃక్లేశాల్నీ మరపించి ఒక వినూత్న శక్తిని ప్రసాదిస్తుందనడంలో సందేహం ఏమాత్రం లేదు.

ఎప్పటి సంగతి! ఏడేళ్ళనాటి మాట!

అది 1963వ సంవత్సరం. జనవరి ఒకటో తేదీకి నూతన సంవత్సర శుభాకాంక్షలను అందజేస్తూ నాకు ఆత్మీయులయిన శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, రంధి సోమరాజుగారలు వ్రాసిన జాబులలో మనసులు కలిసిన మిత్రులమంతా సంక్రాంతికి ఒకచోట కలుసుకొని ఒకటి రెండు రోజులపాటు ఆనందంగా కాలక్షేపం చేస్తే బాగుంటుందని సూచించారు. ఆ సూచన నా కెంతగానో నచ్చి వెంటనే ఆ సమావేశం ఆ సంక్రాంతికి వట్లూరులో మా యింటివద్దే ఏర్పాటు చేయడం జరిగింది.

రెండు రోజులపాటు జరిగిన ఆ గోష్ఠిలో దాదాపు ముప్పైమంది మిత్రులు పాల్గొని లలిత లలితంగా, మధుర మధురంగా తమ తమ రచనలను చదివి, ప్రసంగాలను చేసి, పాటలను పాడి, చిత్రాలను ప్రదర్శించి ఎంతో ఆనందంగా గడపడం జరిగింది. అందులో పిన్నల నుండి పెద్దల వరకు, స్త్రీలు, పురుషులు, కులమత వర్గ ఆర్థిక భేదములకతీతులై పాల్గొనడం గమనార్హం.

ఈ సమావేశం ఒక సభ కాదు. ఒక గోష్ఠిలాంటిది. దీనికి అధ్యక్షుడుండడు. కార్యదర్శి వుండడు. వచ్చిన వారంతా మాట్లాడాలనీ లేదు. ఇది కేవలం కవుల, కళాకారుల సమావేశం కాదు; మనస్సులు కలిసిన మిత్రుల కలయిక.

సాధారణంగా సంక్రాంతి పండుగ దినాలలో తెలుగు ప్రజలు అనేక విధాలయిన కాలక్షేపాలు చేయడం పరిపాటి. అటువంటిది యీ ఆటవిడుపు కాలాన్ని విజ్ఞాన యుతంగాను, రసాత్మకంగాను, సాంస్కృతికంగాను వినియోగించుకొని మిత్రులం ఒకరి కొకరం యింకా యింకా సన్నిహితులమవుతూ ఒక అలౌకిక ఆనందాన్ని పొందడం అన్ని విధాలా బాగుంటుందని ఆనాటి అనుభవాన్ని పురస్కరించుకొని మాకందరకు అనిపించి యీ సంప్రదాయాన్ని అనూచానంగా ప్రతి సంక్రాంతికి పాటిద్దామనే నిర్ణయానికి వచ్చాం.

ఆ మొదటి సమావేశాన్ని గురించి గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారు తమ డైరీలో యిలా వ్రాసుకున్నారు– "ఉదయం 9 గంటలకు ప్రారంభయిన గోష్ఠిలో వచ్చిన మిత్రులు చాలా మంది ప్రసంగించారు. బి.వి. నరసింహారావు గారు తమ పాటలను హృదయంగమంగా పాడారు. సంజీవదేవ్ గారు తమ చిత్రాలను చూపుతూ ప్రసంగించారు. శ్రీమన్నారాయణమూర్తి పద్మనాభం గారలు మాట్లాడిన మాటలు చక్కగా వున్నై. కృష్ణాబాయి ముక్తసరిగా చేసిన ప్రసంగం అందర్నీ ఆకర్షించింది. సోమరాజు చదివిన కవితలు రసస్ఫోరకంగాను, భావ ఔన్నత్యంతోను తొణికిసలాడినవి. ఆ సాయంకాలపు సమావేశంలో సామవేదం జానకిరామశర్మ, జానకీ జాని, కొండముది శ్రీరామచంద్రమూర్తి, రామకృష్ణారెడ్డి, ముక్తేవి లక్ష్మణదాసు, వల్లభనేని కాశీవిశ్వనాథం మొదలయిన వారు పాల్గొని గోష్ఠిని రక్తి కట్టించారు అని.

అదే సమావేశాన్ని గుర్తుచేస్తూ సంజీవదేవ్ సోమరాజుకు వ్రాసిన లేఖలో యిలా అంటారు :

''అవును - ఆనాడు వట్లూరులో మనందరి సమావేశంలో అభివ్యక్తమయిన భావావేశం, అవ్యక్తమయిన ఆత్మప్రకాశం, అదంతా ఒక అందగలిగిన అనుభవం - అందరాని ఆశయం" అని.

ఆ రోజున మా యింటివద్ద జరిగిన ఆ సమావేశాన్ని

పురస్కరించుకొని నేను శ్రీ గొర్రెపాటి వారికి వ్రాసిన లేఖలో–

"మనమంతా ఒక 'వసుదైక కుటుంబ'మనీ – మన ఆత్మీయతలకు అవధులు లేవనీ, ప్రతిఫలాపేక్షలు లేని ప్రేమలు మనవనీ – అట్టి వారమంతా కలుసుకొనుట కంటే స్వర్గం వేరే ఏముందనీ– ఆ రెండు రోజులూ నిజంగా స్వర్గధామమే అయిపోయింది మా యిల్లనీ – చాలా రోజుల వరకు ఆ సమావేశపు మధుర స్మృతులే మనస్సులో మెదిలాయనీ, అకారణ కారణమయిన మనలోని మైత్రీభావం యింకా పెంపొందాలనీ వ్యక్త పరచడ మయింది. ఆ కాస్సేపు నిష్కల్మషం, నిస్వార్థం అయిన ముఖాలే మనం గమనించాం. మానవుని సంకుచితత్వం నుండి విశాలత్వంలోకి తీసుకు వెళ్ళాలంటే విభేదాలు లేని యిటువంటి సమావేశాలు అవసరం. అట్టి వాతావరణం కోసం వాచిపోతూ వుంటాం మనమంతా –" అంటూ ఆ లేఖ సాగింది.

ఆ సందర్భంలోనే మా సోమరాజు "కవిత్వానికి మారుపేరు ఆప్యాయత అయితే ఎంత బాగుండును! అదే వట్లూరులోని మన కలయిక. అవును, అది ఎంత ఆహ్లాదకరమయింది! అందరిలోను అంతటి అనుబంధం ఎట్లా ముడిపడిందో, మట్టి బొమ్మ ఆనాడు ఎట్లా మాట్లాడిందో! ఏమిటా సమ్మేళనం! ఏమిటా విచిత్రమయిన వెన్నెల రేఖ! ఒక మాట కాదు, ఒక పాట కాదు, మూగతనం లేదు, అల్లరి అసలే కాదు. చైతన్యం కిన్నెరయింది. సౌజన్యం సంగీతమయింది. సంజీవి గుభాళించింది. అమరత్వం విశ్వవ్యాప్తమయింది. ఔను ఔను – అప్పుడు మేధ కో క్షణం రిలీఫ్ ఎవరయినా అందుకోండి ఆలీఫ్ – అదే అదే అందరికీ లైఫ్" అంటూ పరవశుడై కవిత్వమే వ్రాసేశాడు. ఆ సమావేశం ప్రేరణకు మూలం అయింది Source of Inspiration ఇదంతా ఆరు సంవత్సరాల క్రితం మాట. అయినా యింకా కొత్తగానే వుంది; వుంటుంది కూడా.

ఆ తరువాత మరొక సంవత్సరానికి 1964లో సరిగ్గా యిదే రోజున యీ సమావేశం విజయవాడలో కీ॥శే॥ బొందలపాటి శివరామకృష్ణ గారి శరత్ భవన్‌లో జరిగింది. ఆ సమావేశంలో నేను నా దక్షిణ దేశయాత్రానుభవాలను ముఖ్యంగా రమణాశ్రమం, అరవిందాశ్రమాలను గురించి నాలుగు మాటలు మాట్లాడాను. జానకీరామ్ సోమరాజు, పల్ల సుబ్బారావు, కాళోజీ, కృష్ణాబాయి తమ తమ రచనలను చదివి వినిపించారు. తరువాత సంజీవదేవ్ చిత్ర ప్రదర్శనం ద్వారా అందరినీ ముగ్ధులను చేశారు. గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు జీవిత చరిత్ర రచనా పద్ధతులను గురించిన వ్యాసం చదివారు. పెద్దలు గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, డాక్టరు సదాశివరావు గారు, వేగుంట సుబ్బారావు గారు కూడా ఆనాటి సమావేశంలో పాల్గొన్నారు. పువ్వాడ శేషగిరి రావుగారి పద్య పఠనంతో నాటి సమావేశం ముగిసింది.

"సహృదయులు ఊరక ప్రేమింతురు. కళానుభూతి కలిగిన సహృదయులు, కళావేత్తలు, కవులు వారి వారి రచనా విశేషాలు ఒండొరులు విని ఆనందించుటకు అవకాశము కల్గినది" అని ఒక మిత్రులు వ్రాశారు ఏలూరు నుండి. నేను ఆ సమావేశాన్ని సమీక్షిస్తూ గొర్రెపాటి వారికి యిలా వ్రాశాను – "అన్నగారి (సంజీవదేవ్) గంభీరతతో బాటు హాస్యోక్తులు, చెల్లాయి (కృష్ణాబాయి) సౌమ్యతతో బాటు సరసోక్తులు, విజ్ఞతతో కూడిన మీ ముక్తాయింపులు, కాళోజీ, జానికిరామ్ గారల కవ్వింపులు, నవ్వింపులు, మునసబు శ్రీమన్నారాయణమూర్తి గార్ల ప్రసంగాలు, పల్లవారి పద్యాలు, సోమరాజు గేయాలు గోష్ఠిని రక్తి కట్టించాయి" అని – ఏది ఏమయినా యిటువంటి కవుల, రసజ్ఞుల కలయిక నా జీవితంలో చాలా విలువయినదంటూ వ్రాశారు.

కాలం దొర్లిపోతూ వుంది. 64వ సంవత్సరం వెళ్ళింది. 65లో సమావేశం. దివితాలూకా పెదసనగల్లు లింగం వీరభద్రయ్య చౌదరి గారింటి వద్ద. సంజీవదేవ్ మిత్రులకు వ్రాసిన ఉత్తరాలను సేకరించి *సంజీవదేవ్ లేఖలు* అనే పుస్తకాన్ని అచ్చువేశారు దేశికవితామండలివారు. ఆ పుస్తక సంకలనకర్త గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు. తమ బాల్యమిత్రులు లింగం వీరభద్రయ్య చౌదరి గారికి దాన్ని అంకితమిచ్చారు. ఇక్కడ ఒకటి రెండు మాటలు చౌదరిగారిని గురించి చెప్పడం అనుచితం కాదేమో! విదేశంలో చదువు సాగించి బారిష్టరు పట్టాతో మన దేశానికి వచ్చి చాలా ఉన్నతమయిన ఉద్యోగాలు నిర్వహించారు. అయినప్పటికీ ఆయనకు వ్యవసాయంపైనా, పశుపోషణ పట్లా మిక్కుటమయిన శ్రద్ధ.

సాహిత్యం, సంగీతం, నాట్యం, శిల్పకళ, చిత్రకళ మొదలయిన లలితకళలపట్ల అభిరుచి మెండు. అట్టి కళలను అంత ఉదాత్తం గాను ఆచరించారు. ఆదరిస్తున్నారు కూడ. దీనికి తార్కాణం వారి యిల్లే.

ఆయన మనమెవరము ఊహించలేనంత గొప్ప

కళాపోషకుడు కూడ. ఉత్తమ చిత్రకారుల ఉత్తమ చిత్రాలను ఎక్కువ మూల్యముతో ఖరీదు చేసి వారింట్లో ఎంతో అందంగా ప్రదర్శించారు. వారి యిల్లు చూచిన నా కనిపించింది. అది యిల్లు కాదు. ఒక చిన్న ఆర్ట్ మ్యూజియం అని. ఒక చక్కటి స్వంత గ్రంథాలయం కూడ ఏర్పాటు చేసుకున్నారు ఆయన. ఇంతటి ఉదాత్త కళాహృదయులు మన మిత్రుల్లో ఒకరయినందుకు మనం ప్రతి ఒక్కరం గర్వించవలసినదే. వారి యింట ఆతిథ్యం ఆ సంవత్సరం లభించటం ఒక గొప్ప విశేషం. *సంజీవదేవ్ లేఖలు* గ్రంథావిష్కరణను పురస్కరించుకొని, వెలమాటి శ్రీమన్నారాయణమూర్తి గారు, సంజీవదేవ్, వీరభద్రయ్య చౌదరి, వెంకట సుబ్బయ్య గార్లను ప్రశంసిస్తూ ఒక చిన్న అభినందన పత్రం చదివారు.

కాకాని, బి.వి., పువ్వాడ, పల్ల, సోమరాజు ప్రభృతులు కవితాగానం చేశారు. గొర్రెపాటి, గూడవల్లి నరసింహారావు, పద్మనాభం, శ్రీమన్నారాయణ మూర్తి వంటి పెద్దలు ప్రసంగించారు. కలిదిండి నారాయణరాజు గారితో పరిచయం ఈ సమావేశంలో ఏర్పడింది. సంజీవదేవ్ చిత్ర రచనను గురించి ప్రసంగించారు. తమ డైరీలో కొన్ని ముఖ్య భాగాలను రసాత్మకంగా చదివారు.

మామూలు ధోరణిలో మళ్లీ సంవత్సరం అంటే 65 జనవరి సంక్రాంతికి పెద్దపుల్లేరులో నారయణరాజుగారింటి వద్ద సమావేశం.

ఈ సమావేశానికి నలుగురైదుగురు స్త్రీలు రావడం విశేషం. ప్రఖ్యాత చిత్రకారుడు హెచ్.వి.రామగోపాల్ ఉపన్యసించారు. అప్పటికప్పుడు కొన్ని చిత్రాలు వేశారాయన. అవి యెంతో బాగున్నై. ఉదయం 9 గంటలకు ఆరంభమైన గోష్ఠి మధ్యాహ్నం 2 గంటల వరకు అలా అలా సాగిపోయింది. గూడవల్లి నరసింహారావు గారి *వింటే భారతం వినాలి – తింటే గారెలు తినాలి* అన్న వ్యంగ్య రచన శ్రోతలను నవ్వించడమే కాక ఆలోచన రేకెత్తించింది. రాజుగారి బంధువు రామకృష్ణం రాజుగారు మంచి రాగధోరణిలో చేసిన కవితాగానం ప్రత్యేకంగా పేర్కొనాలి. ప్రఖ్యాత కవులు స్వర్గీయులు వడ్లపట్ల రామచంద్రయ్య గారు చదివిన కవితను మరచిపోలేం. వచ్చిన పెద్దలు చాలా మంది వివిధ విషయాలపై ప్రసంగాలు చేశారు. రాచ పద్ధతులతో నిండిన రాజుగారి ఆదరణ, ఆతిథ్యం ఆప్యాయతను మరచిపోలేం. అన్ని సమావేశాలకంటే అధికంగా యీ సమావేశానికి వచ్చారు చాలామంది మిత్రులు.

నారాయణరాజుగారు ఎంతో స్నేహపాత్రులే గాక చిత్రకళలో మంచి ప్రతిభావంతులు. ఆయన వేసిన వర్ణ చిత్రాలే అందుకు సాక్షి. ఏ స్కూలులో గాని, గురువు వద్దగాని, నేర్చుకొనకుండా కేవలం స్వయం కృషి వల్ల ఆయన అరవిందులు, వివేకానందులు, రామకృష్ణ పరమహంస, స్వామి శివానంద మొదలగు మహాపురుషుల తాత్త్వికవేత్తల వర్ణచిత్రాలను, ఎంతో చక్కగా చిత్రించి వారింటిని అలంకరించారు. మళ్ళా ఈ దార్శనికులంతా గూడి వారింట్లో సభ చేస్తున్నారా అనేట్లు వుంటాయి. ప్రతి చిత్రం జీవకళ వుట్టిపడుతూ, ఆ సమావేశానికి వరంగల్లు నుండి రెడ్డి, రాజు, రావుగార్లు రావడం ఒక ప్రత్యేకత. ఆనాడు సత్యన్నారాయణ రాజు, రామకృష్ణం రాజు (రాజుగారి అబ్బాయి) గార్ల లలితసంగీతం గొప్ప రసానుభూతి ఆ గోష్ఠిలో పాల్గొన్న మిత్రుల కందరకు.

ఆ మరుసటి సంవత్సర సమావేశం వరంగల్ జిల్లా రామప్ప చెరువు దగ్గర రెస్ట్‌హౌస్‌లో రెడ్డి, రావు, కాళోజీగార్ల ఆహ్వానంపై రామప్ప దివ్యానుభూతిని ప్రసాదించింది. "అన్ని సమావేశాలు ఒక ఎత్తు, అదొక్కటి ఒక ఎత్తు. Out door లో జరగడమే కాదు. స్వచ్ఛమైన హృదయాల మధ్య ప్రశాంత ప్రకృతిలో చాల హాయిగా హోమ్‌లీగా జరిగింది. మరువలేని మధురమైన అనుభవం అందరూ యిలాగే ఫీలవుతున్నారని ఆశిస్తా" నంటూ మా చెల్లాయి కృష్ణాబాయి వ్రాసిన ఉత్తరంలోని ప్రతిమాట, అక్షరాల సత్యం, ఎవరూ యింకోలా భావించడానికి అవడానికి వీల్లేదు.

ఆంధ్ర ప్రాంతం నుండి వెళ్ళిన వాళ్ళం ఓ 15 మందిమి వరంగల్లు మిత్రమండలి సభ్యులు ఓ పాతికమంది వరకు కలిసి వరంగల్లు నుండి బస్సులో బయలుదేరి ఉదయం 8.30 కల్లా రామప్ప చేరాం. కాఫీలు ముగించుకొని పదింటికి గోష్ఠి ప్రారంభించాం. కృష్ణాబాయి నేటి నవలను గురించి చక్కటి పరశీలనాత్మక రచన చదివింది. పొట్లపల్లి రామారావు గారు *మా గ్రామం* అంటూ చదివిన *గ్రామ చరిత్ర* గుండెలను పిండివేసింది. వరంగల్లు మిత్రమండలి యువరచయితలు గేయాలు, వ్యాసాలు చదివారు. మిత్రమండలిలోని ప్రతివారు చాల ప్రతిభావంతులని అనుకున్నాం. వచ్చిన వారిలో చక్కని చిక్కని కవిత్వం చెప్పిన కవులు అనుముల కృష్ణమూర్తి గారు. వారి

*సరస్వతీ సాక్షాత్కారం* నిజంగా మాకందరకు నిజంగా సాహితీ సరస్వతిని సాక్షాత్కరింప జేసింది. అజంతా చిత్రాల గురించి వ్యాసం చదివి ఆ చిత్రాలను తమ అత్యున్నత వ్యాసం ద్వారా మా ముందుంచారు. మా చిన్నన్న చిన్నారావుగారు, మాచిరాజు దేవీప్రసాద్, సురమౌళి, నరసింహారెడ్డి, మురళీధర్ మొదలగు వారెందరో తమ తమ రచనలను చదివి వినిపించారు. ఆ సమావేశంలోనే మిత్రులు సోమరాజు రచించిన *ఆదర్శాలు అవరోధాలు, సోమరాజు కథలు,* గ్రంథాలను వరుసగా నాకు, సంజీవదేవ్ గారికి అంకితం చేసి మా స్నేహ బంధానికి ఒక రూపాన్నిచ్చారు. ఆ సాయంత్రం రామప్పగుడిని సందర్శించాము. అదొక దివ్యానుభూతి.

మరల సాయంకాలపు సమావేశంలో వేగుంట మోహన ప్రసాద్ తన ఆంగ్ల కవితను మధురమైన ఉచ్చారణతో చదివారు. రామప్పగుడి చరిత్రను గురించి నారాయణరాజుగారు చక్కటి వ్యాసం చదివారు. రామేశ్వరరావుగారు, కాళోజీ, కవితలతో మరిపించారు. ఫొటోగ్రాఫర్‌ను గురించి ఆయన వినిపించిన రచన అద్భుతం. అది విజ్ఞానంతో బాటు వినోదాన్ని పంచింది. అందరకు మళ్లీ మళ్లీ వినాలనిపించేలా వుంది అంటూ *కన్నీరు* అనే ఆయన ఉర్దూ కవిత వారి నిశితదృష్టిని, భావ సౌకుమార్యాన్ని వెల్లడించింది. కాళోజీ *తెగబలుస్తోంది గొర్రె* అన్న రచనను హృదయం స్పందించేలా చదివారు.

కృష్ణారావు గారి *మహారాజకుమార మాదీ మీ వూరే* అన్న గేయం నరసింహారెడ్డి గారి *అంగుళీమాలుడు* మురళీధర్ గారి *అంపకాలు* అన్న కథా కవితలు, సోమరాజు గారి వచన కవితలు అందరినీ వూపివేశాయి. కొమ్మన రాధాకృష్ణగారి కవిత్వం అందరినీ ఆకట్టుకుంది. సంజీవదేవ్ చిత్రకళా ప్రదర్శనం, అందుకు సంబంధించిన వివరణలు శ్రీమన్నారాయణ మూర్తి గారి ప్రసంగం అందరికీ నచ్చాయి. వీరభద్రయ్య చౌదరి ఆ సమావేశపు కవితా సౌరభాన్నంతా తమ మృదుమధుర శైలిలో చేసిన సమీక్ష మరపు రానిది. అందరూ సోదరభావముతోను మెలిగి రామప్ప వద్ద ఆ రెండు రోజులు రెండు క్షణాలుగా గడిపారంటే అతిశయోక్తి కాదు.

ఆ మరు రోజు ఉదయానికి అందరం మళ్ళా వరంగల్లు తిరిగి వచ్చాం. ఆ మధ్యాహ్నం వరంగల్లులోని వేయి స్తంభాలగుడి యితర చారిత్రక ప్రదేశములను దర్శించి పునీతులమయ్యాం. కాకతీయుల కాలంలో శిల్పకళ ఎంతగా అభివృద్ధి చెందిందో ఆ దేవాలయాలు ఆ అవశేషాలు దర్శించిన మాకు ఎంతగానో అవగాహన అయ్యింది. ఆ తరువాత మతపరమైన అసహనాలతో అటువంటి అత్యుత్తమ శిల్పాలు ఆ విధంగా నాశనం గావింపబడటం చాల దురదృష్టం.

మిత్రమండలి సభ్యులు వరంగల్లు టౌను హాలులో ఒక చిత్రకళా ప్రదర్శనను ఏర్పాటు చేసి సంజీవదేవ్ గారితో ప్రారంభోత్సవం చేయించి అచ్చట ఒక చక్కటి సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో సంజీవదేవ్, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, లింగం వీరభద్రయ్య చౌదరి, రంధి సోమరాజు, కాళోజీగార్లు ప్రసంగించారు. ఆనాడు మా పట్ల మిత్రమండలి సభ్యులు చూపిన గౌరవం, ఆప్యాయత ఎనలేనివి. రామప్ప సమావేశాన్ని గురించి నేను సత్యనాయణ గారికి ఇలా రాశా.

ప్రియమిత్రులు రాజుగారికి.

మధుర మందాకిని వలె వచ్చింది మీ లేఖ. హైదరాబాద్ నుండి 20 వ తేదీన సుఖంగా చేరా యింటికి.... ఆ వారం రోజులు అన్ని అమృత హృదయాల మధ్య గడిపిన మధుర స్మృతులు ఎదదలో మెదులుతూ ఉండగా, అదొక దివ్యాను భూతి! స్వర్గలోకం అని చెప్పబడేది మన యీ లోకం ముందు దిగదుడుపు. అందని ఆనందాన్ని, నిరంతర శాంతిని, చిరంతన చైతన్యాన్ని కలుగజేసే ఇట్టి మన సమావేశాలు ఒక అలౌకిక ప్రమోదాన్ని ప్రసాదిస్తే, ప్రతి వ్యక్తిలోని దివ్యత్వాన్ని చవిచూశాం ఆ మూడు రోజులూ! ఒకరికి ఒకరికి అరమరికలు లేవు. అసూయలు లేవు, ద్వేషాలు లేవు. అందరి హృదయాలు ఐక్యమైపోయాయి. హృదయ తటాకాలు సుళ్ళు తిరిగి తెప్పలు కొట్టినై అమృతజలాన్ని, ఆ జలాల్లో మనమంతా ఓలలాడామంటే అసత్యం కాని, అతిశయోక్తి కాని కాదు. అంతా ప్రేమమయం. అది ప్రతిఫలాపేక్ష లేనిది. అటువంటి దివ్యమైన ప్రదేశంలో కాక దైవం ఇంకెక్కడ ఉంటాడండీ! ఆ దైవమే కదా మనకందరికీ అంతటి చిదానందాన్ని చిందించాడు!

మానవుడు చీకు చింతలతో వుంటాడు. ఈ సంసార సాగరంలో పడి సతమతమవుతూ ఉంటాడు. కబీరు చెప్పిన కస్తూరి మృగంలాగా– తనలోని దివ్య పరిమళాన్ని గాంచలేక ఆ సుగంధం ఎక్కడ నుండి వస్తుందోనని అడవినంతా గాలించినట్లు మనలో ఆ దివ్య జ్యోత్స్నను దర్శించలేక

చీకటిలోనే చిందులాడుతూ వుంటాం! అయితే మాటలలో ఎన్నైనా చెప్పగలం కాని, దాన్ని అనుభవంలో సిద్ధించుకోవాలంటే ఆత్మోపలబ్ధి ఎంతయినా అవసరం. నిత్యసిద్ధమై మానవునిలో తెగ తెంపు లేని శాశ్వతానందం, పూర్ణ ప్రకాశం, అంతర్ దృష్టులను పెంపొందించుకోవడానికి కూడ ఇట్టి మన సమావేశాలు, గోష్ఠులు అవసరం. ఇవి మానవుణ్ణి ఒక ఉన్నత పథానికి తీసుకువెళ్లడానికి కొంతవరకయినా ఉపయోగిస్తవనే దానికి ఎట్టి సందేహమూ లేదు. ఈ ప్రపంచంలో ఇది ఒక పిచ్చిగానే ఉంటుంది. అయితేనేం "ఎవరిపిచ్చి వారికానందం" అన్నారు కదా!

ఈ పెద్దపండుగకు మీరు రామప్పలాంటి రమణీయ ప్రదేశంలో అంత చక్కటి సమావేశం ఏర్పాటు చేసి మా కందరకూ మహానందాన్ని కలుగజేశారు. మీకందరకూ ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పుకోగలం! కమనీయమైన ఆ ప్రకృతి! మనోహరమైన ఆ సరస్సు, ఉల్లాసమైన ఆ చల్లని వాతావరణం పరవశత కలిగించాయి. అచ్చట ఉన్న భావాన్ని చెప్పగలిగే భాషలేదు. అందువల్ల ఇక్కడ ఎక్కువగా చెప్పకుండా పులకితమైన మా ఆనందాన్ని మూగభాష ద్వారానే వ్యక్తం చేస్తా!

అన్నిటినీ మించి రామప్ప దేవాలయ శిల్పాలు దర్శించి మంత్ర ముగ్ధులమయిపోయాం! ఆ శిల్పులు తమ తపస్సు యొక్క వేడిమి చేత ఆ నల్లని రాళ్ళను కరిగించి పోతపోసిన కళాఖండాలివి. ఆ శిల్పాలన్నీ సజీవంగా కదులుతున్నట్లు, చైతన్యంతో నడయాడుతున్నట్లు సర్వత్రా చికిలి మెరుంగు నగిషీపని మెరిపిస్తూను, అతి లావణ్య యుతంగానూ ఉన్నవి, ప్రతి కళాఖండంలోనూ! ప్రతి చిన్న అలంకరణ విశేషం కూడ అత్యాకర్షణీయంగా నిరూపింపబడి అలంకార చిత్రణలోని విశిష్టతలు దర్శనీయమయ్యాయి. రాళ్ళపైన రమణీయమయిన చెక్కడాలతో మానవమూర్తులనే గాక జంతుజీవన సౌందర్యాన్ని, చెట్లు, లతలు, పువ్వులు, కాయలు – ఇలా అత్యద్భుతంగా, అందాల్ని ఒలికించే నగిషీపనితో సుందరాతి సుందరంగా మలిచారు ఆ మహనీయులు.

ఆశిల్పాల్లోని ప్రతీ చిన్న రేఖావంపులూ నిమ్నోన్నతాలూ, నునుపూ అన్నీ అద్భుత భావ వ్యక్తీకరణకు జయపతాకాలు. నిజంగా అచ్చట పనిచేసిన శిల్పులు ఒక్కొక్కరు ఒక్కొక్క సృష్టికర్త. వారంతా మయబ్రహ్మలై ఆ శిల్పాలకు ప్రాణప్రతిష్టలు చేశారంటే అతిశయోక్తి కాదు. మనకు వారి నామములు తెలియకపోయినా వారిని భౌతికంగా చూడకపోయినా వారంతా అమరులు. అమర శిల్పులు, వారి మూర్తులు మన కళ్ళకు కట్టకపోయినా వారి ఆత్మలను మన ఆత్మలతో స్మరించుకుంటూ వారికి జేజేలు చెబుదాం! మనజాతి వారు కనుక గర్విద్దాం! మనజాతి అనేక రంగాలలో ప్రపంచంలో తలలు వంచుకుంటున్నా ఆధ్యాత్మిక రంగంలోనూ, లలిత కళారంగంలోనూ పూర్వపు ఔన్నత్యం ఇటువంటి కళాఖండాలను దర్శించినప్పుడు కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది.

ఇచ్చట మళ్ళా మామూలు ప్రపంచం. అంకెలకు అంకితం అయిపోయి క్షణం తీరుబడి ఉండదు. అట్టి జీవితానికి ఇట్టి సమావేశాలు ఆత్మవికాసాన్ని కలుగజేస్తాయి. అట్టి వికాసానికి చక్కటి అవకాశం కల్పించి ఈ సంక్రాంతికి నిజమయిన కాంతిని కలుగజేసిన మీకు, మిత్రులు ఆదినారాయణ రెడ్డి గారికి, సత్యనారాయణ రావు గారికి, కాళోజీ గారికి వరంగల్లు మిత్రమండలి సభ్యులకు ఇవే నా నమోవాకాలు.

ఆ తరువాత సంవత్సరం 1968. ఆ సంక్రాంతికి జరిగిన కలయిక మన మామూలు సమావేశాల వలెగాక నిడుబ్రోలు పి.బి.నాయుడు కాలేజీలో ఒక పెద్ద సభ వలె జరిగింది. ఆలాటి ఆ సభలో ఆంధ్రదేశంలోని దిగ్దంతుల వంటి పండితులు, కవులు చాలమంది పాల్గొన్నారు. గొర్రెపాటి వారు వారి *సరోజినీ దేవి చరిత్ర*ను ఆ కళాశాల స్థాపకులు, కవులు, రసహృదయులు అయిన పాముల పాటి బుచ్చినాయుడు గారికి ఆ సభలోనే అంకితం ఇచ్చారు. డాక్టరు సదాశివరావు గారు, సంజీవదేవ్, మిగతా పెద్దలు చాలా మంది ప్రశంసించారు. అయితే అది మన మామూలు పద్ధతిలో జరిగే గోష్ఠి లాంటిది గాకపోవడం వల్ల మన మిత్రులు చాలా మంది అందులో పాల్గొనలేక పోయారు.

రామప్ప సంక్రాంతి సమావేశపు స్మృతి సంపుటాన్ని ఎంతో కళాత్మకంగా తమ ముత్యాలకోవ వంటి హస్తాక్షరాలతో *మధుచక్ర* అను పేరుతో తయారు చేసి ఆ సమావేశానికి తెచ్చారు సత్యనారాయణరాజు. దాన్ని చూచిన ప్రతివారూ ముచ్చట పడిపోయారు. సత్యనారాయణరాజు కళాభిరుచి ప్రత్యేకంగా ప్రశంసించాలి. అనుకుంటూ వుండగానే మళ్ళా 1969 జనవరి వచ్చేసింది. చరిత్ర ప్రసిద్ధమయిన ఘంటసాలలో గొర్రెపాటి వారి యింట ఆ

సంక్రాంతికి మా సమావేశం. 13 ఉదయానికల్లా చాలామంది మిత్రులు విచ్చేశారు. ముఖ్యంగా తెలంగాణా నుండి రామేశ్వరరావు, కాళోజీ, అనుముల కృష్ణమూర్తి, సి.వి. కృష్ణారావు, డాక్టరు వెంకట్రామ నర్సయ్య గార్లు రావడం మా కందరకు ఎంతో ఆనందం కలిగించింది. స్త్రీలు కూడా చాలా మంది రావడం గమనార్హం. భోజనాలయిన తరువాత గోష్ఠి ప్రారంభమయింది.

మావూరు, అన్న ఘంటసాలను గురించి బ్రహ్మయ్య గారు వ్రాసిన వ్యాసాన్ని దోనేపూడి రామసుబ్బయ్య గారు చదివారు. చెల్లాయి కృష్ణాబాయి మా నాన్నగారు అంటూ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య గారిని గురించి స్కెచ్ చదివింది. తెనాలి కాలేజీ లెక్చరరు వి. అంజిరెడ్డి, రంథి సోమరాజు, సి.వి. కృష్ణారావ, అనుముల కృష్ణమూర్తి, కొమ్మన రాధాకృష్ణ, కాళోజీ, పల్ల సుబ్బారావు, సంజీవదేవ్, బి.వి. నరసింహారావు తమ తమ కవితలను కమనీయంగా గానం చేశారు. ముఖ్యంగా రామేశ్వరరావు గారు *మా సురమౌళి నాస్తికత్వము* అంటూ చదివిన వ్యాసం ఎంతో పరిశీలనాత్మకమైంది. రావెల సాంబశివరావు గారి జానపద గేయాలు శ్రోతలను పల్లవింప జేసినై. లింగం వీరభద్రయ్య చౌదరి గారి ప్రసంగం, విస్సన్నపేట సమితి అధ్యక్షుల ప్రసంగంతో రాత్రి 7 గంటల వరకు సాగిన గోష్ఠి ఆ రోజు పూర్తయింది.

ఆ మరుసటి రోజు 14వ తేదీ సంక్రాంతి పర్వదినం. ఉదయం 8 గంటలకు ఆ గ్రామ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గాంధీ దర్శనం ఫొటో ఎగ్జిబిషనుకు సంజీవదేవ్ గారిచేత ప్రారంభోత్సవం చేయించారు, ఆ గ్రామ పెద్దలు. అదయిన వెంటనే మళ్ళీ గోష్ఠి ప్రారంభమైంది. ఆ సమావేశానికి ఆంధ్రజ్యోతి సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు, ఆంధ్రపత్రిక ఉప సంపాదకులు వి.వి. నరసింహారావు, జమీన్ రైతు సంపాదకులు బండి గోపాలరెడ్డి, డాక్టరు సదాశివరావు గార్లు రావడం ముదావహం.

వెలమాటి సూర్యనారాయణమూర్తి తమ అమెరికా పర్యటనను గురించి, అచ్చటి జీవన విధానం గురించి మ్యాప్ సహాయంతో ఎంతో మంచి ప్రసంగం చేశారు. గొర్రెపాటి మహలక్ష్మమ్మ రచయితల బాధ్యతల గురించి తమ మృదుమధుర శైలిలో మాట్లాడారు. బండి గోపాలరెడ్డి గారు బ్రిటిషు ప్రభుత్వపు రోజుల్లో అజ్ఞాత విప్లవకారులను గురించి ప్రసంగించారు. ఆంధ్ర యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగు ప్రొఫెసర్ తుమ్మల వేణుగోపాలరావు గారు, వి.వి.నరసింహారావుగారు నేటి దైన్యస్థితిలో ఉన్న రాజకీయాలను గురించిన్నీ, యువకుల కర్తవ్యాన్ని గురించిన్నీ చక్కటి ప్రబోధం చేశారు. వెలమాటి శ్రీమన్నారాయణమూర్తి రామకృష్ణ పరమహంస ఆధ్యాత్మిక తత్త్వం గురించి తమ సహజమయిన గ్రాంథిక భాషలో గంభీరమైన ప్రసంగం చేశారు. డాక్టరు వెంకట్రామ నర్సయ్య గారు తెలంగాణా గ్రామీణ భాషలో చదివిన స్కెచ్చి అందరినీ ఆకట్టుకొంది. ఆ సాయంత్రం గొట్టిపాటి బ్రహ్మయ్య గారింట వచ్చిన మిత్రులకందరకు అల్పాహారవిందు ఏర్పాటు చేసి మమ్ములనందరినీ తమ ఆప్యాయతతో ముంచెత్తారు. మాలో కొంతమందిమి ఆ గ్రామం లోని బౌద్ధయుగం నాటి చారిత్రావశేషాలను దర్శించి పునీతులమయ్యాం.

కాలం గిర్రున తిరుగుతూంది. 1970లోకి వచ్చేశాం. గుంటూరు జిల్లా తుమ్మపూడిలో సంజీవదేవ్ గారి ఆహ్వానంపై వారింట యీ సమావేశం జరుపుకోవడం ఆహ్లాదకరం. ఇంతటి మధురానుభూతులకు కారకులు మధురజీవన కర్తలు మధురజీవనం పట్ల ఆసక్తిని కలిగిస్తూ, సౌభ్రాత్వం, సౌమనస్యం, సర్వమానవలోకంలో వెల్లివిరియడం సాధ్యమేనని తలుస్తూ, విశ్రాంతి తీసుకొనే వయస్సులో కూడ ఓపిగ్గా, శ్రద్ధగా తెలిసిన ప్రతి యొకరిని పరామర్శిస్తూ చెప్పడానికే తప్ప–సామాన్యుడు ఆచరించడానికి వీలులేని అనేకములయినవి ఆయన జీవితంలో మేళవించి మాలో ప్రతి ఒక్కరికి ఆదర్శ ప్రాయులయ్యారు గొర్రెపాటి వారు.

"పాత స్నేహితులతో మైత్రిని దృఢపరచుకోవడానికి, కొత్త వారిని మిత్రులుగా భావించుకొనడానికి, ఆనందించి ఆనందింపజేయడానికి ఏర్పడిన యీ సంక్రాంతి సమావేశాలు చిరకాలం మన అందరి ప్రోత్సాహంతో యింకా వర్ధిల్లాలని ఆశిస్తా". మా అన్న సంజీవదేవ్ అన్నట్లు Moral Values తప్ప Material Values లేని యీ మిత్రమండలి ధ్యేయం విశ్వప్రేమ. అదే మానవుని దానవునిగానీక మానవునిగా కాపాడుతుంది.

ఉదాత్తమయిన, దివ్యమయిన, అపురూపమయిన అమరమయిన ఆ భావాన్ని మనమంతా పెంపొందించు కుందాం. అందుకు ఈ సమావేశాలు దోహదం కావాలని ఆకాంక్షిద్దాం.

# తెలుగు భాషలోని మాండలికాలు

- ఎలవర్తి విశ్వనాథ రెడ్డి

మండలమంటే దేశభాగం అని అర్థం. ఈ పదానికి రాశి లేదా గుంపు అనే అర్థం కూడా ఉంది. నిర్ణీత జన సముదాయానికి లేదా పరిమిత వ్యవహార ప్రాంతానికి మండలమని పేరు. మండల సంబంధమైనది మాండలికం. నిర్ణీత మండలంలో ప్రధాన భాషలో భాగమై స్థానిక విశిష్టతలతో వెలుగొందేదే మాండలిక భాష. దీనికి విభాష, ఉపభాష, ప్రాదేశిక భాష, ప్రాంతీయ భాష అనే పర్యాయ పదాలు ఉన్నాయి. దీనిని ఆంగ్లంలో 'Dialect' అంటారు. 'Dialectology' అంటే మాండలిక విజ్ఞానం అని అర్థం.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా వ్యవహారంలో ఉన్న భాష 'తెలుగు' అని అందరికీ తెలుసు. ఆంధ్రులందరూ ఒకే రకంగా మాట్లాడరు. తెలుగు మాటలలోను, క్రియా రూపాలలోను తేడా ఉంటుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ప్రజల తెలుగు భాషా స్వర విశేషం, గోదావరి జిల్లాల ప్రజల తెలుగు భాషా స్వర విశేషంతో భేదిస్తుంది. వీరిరువురి స్వర విశేషం గుంటూరు వారి స్వర విశేషంతో భేదిస్తుంది. తెలంగాణా వారి ఉచ్చారణకు, రాయలసీమ వారి ఉచ్చారణకు, కోస్తావారి ఉచ్చారణకు ఎంతో తేడా ఉంది. ఉత్తరాంధ్ర వారు 'ఒళు పొచ్చాను' అని సాధారణంగా మాట్లాడుతుంటారు. ఈ వాక్యానికి 'వచ్చాను' అని అర్థం. "వెళ్ళిపోయి వచ్చినాను" అనే పదాల సంఘటన వల్ల 'ఒళు పొచ్చాను' అనే క్రియా పద సంపుటి ఏర్పడింది. ఉచ్చారణలో కొన్ని శబ్దాలలోని వర్ణాలు లోపించి ఈ విధమైన రూపాలు భాషలలో ఏర్పడుతుంటాయి. భాషా వ్యవహర్తల భిన్న భిన్న ప్రాంతాలలో ఈ విధమైన ధ్వనుల మార్పులు జరగటం వల్ల భాషలో మాండలికాలు ఏర్పడుతుంటాయి. కోస్తా జిల్లాలలో 'చూశాను' అంటారు. రాయలసీమ వారు 'చూసినాను', అంటారు. కోస్తావారు 'పప్పుబద్దలు' అని వ్యవహరిస్తుండగా రాయలసీమ వారు కన్నడ భాషా ప్రభావం వల్ల 'బేడలు' అంటారు. తెలంగాణా వారు 'పెండ' అంటుండగా మిగిలిన ప్రాంతాలకు చెందిన తెలుగు భాషా వ్యవహర్తలు 'పేడ' అంటారు. ఇవన్నీ మాండలిక భేదాలు. భాషా వ్యవహర్తలలోని భిన్న భిన్న వృత్తుల్ని బట్టి, ప్రాంతీయ భేదాలను బట్టి, చదువును బట్టి, సంస్కారాన్ని బట్టి ప్రాంతీయ భేదాలు ఏర్పడి మాండలికాలు ఏర్పడ్డాయి. మాండలికాలు లేని భాషలు ప్రపంచంలో లేవని భాషా శాస్త్రవేత్తల పరిశీలన వల్ల తేలిన సిద్ధాంతం.

భాషకు ఉచ్చారణయే పరమ ప్రమాణం. భాష వ్యక్తుల ద్వారా వ్యాపిస్తుందని అందరూ అంగీకరించారు. పరస్పర అవగాహన క్షమత్వం కలది భాష. వక్త, శ్రోతల ఆధారంగా భాషాభివృద్ధి జరుగుతుంది. వ్యక్తుల ఉచ్చారణ సంఘానికి పాకుతుంది. ఆ ప్రాంతంలోని ఆ సంఘంలో ఆ భాషకు ప్రామాణ్యం, ఆదరం కలుగుతుంది. ఏ ప్రాంతం భాష ఆ ప్రాంతం వారికే ఆదరపాత్రమవుతుంది. ఈ విధంగా ప్రాంతీయ భాషలు ఏర్పడతాయి.

భిన్న ప్రాంతీయులకు పరస్పర అవగాహన క్షమత్వం లోపిస్తే ప్రత్యేక భాషలు అంటారు. పరస్పర అవగాహన క్షమత్వానికి లోపం లేకపోతే మాండలికాలు అంటారు. పూర్వకాలంలో కొండలు, కోనలు, నదులు, అడవులు అడ్డంగా ఉండి ఒక ప్రాంత ప్రజలు ఇంకో ప్రాంతానికి వెళ్లినప్పుడు స్వజనులతో వ్యవహారం జరపటానికి ఇప్పటిలాగా అవకాశం ఉండేది కాదు. కాబట్టి వలస పోయిన వారి భాష వలస పోని వారి భాష చెప్పుకోదగినంతగా మారి కొంత కాలానికి మాండలిక భేదాలు ఏర్పడి చివరకు ప్రత్యేక భాషలుగా మారిపోయాయి. సంస్కృత భాషనుంచి ప్రాకృతాలు ఈ విధంగానే ఏర్పడ్డాయి.

మాండలికాలు ఏర్పడటానికి అనేక కారణాలున్నాయి.

1. రాకపోకలు సరిగా లేని కారణంగా ప్రజలలో సంబంధాలు విచ్ఛిత్తిని పొంది భాషా సమరూపత లోపించటం.
2. వ్యవహార ప్రాంత విస్తృతి.
3. భాషలో శబ్దాలకు అర్థాలు మారటం. భిన్న ప్రాంతాల ప్రజలలో భిన్న భిన్న భాషా పరిణామాలు జరగటం.
4. భిన్న ప్రాంతాలకు చెందినది ఒకే భాష అయినప్పటికి

తద్భాషా పరిసర భిన్న భాషా పదాలు స్వీయ భాషలో ప్రవేశించటం.

5. భిన్న ప్రాంతాలలోని చెట్లు, జంతువులు, వాతావరణం, ఆచార వ్యవహారాలు ఆ ప్రాంత భాషను ప్రభావితం చేసి నూతన భాషా వైలక్షణాలకు దోహదం చేయటం.
6. రాజకీయ కారణాలు. భాషా వ్యవహర్తలు ఉండే ఒక ప్రాంతానికి వేరే భాషా వ్యవహర్తలు పాలకులుగా ఉండటం. ఉదాహరణకు హైదరాబాదు కేంద్రంగా నిజాం పరిపాలించటం వల్ల అనేక ఉర్దూ పదాలు ఆ ప్రాంతం తెలుగు భాషలో ప్రవేశించాయి.

ఇదే విధంగా మాండలిక భాషలో కొన్ని ప్రధాన లక్షణాలున్నాయి.

1. ప్రధాన భాషలో అంటే ప్రామాణిక భాషలో అంగంగా ఉండటం.
2. పరస్పర అవగాహన క్షమత్వం కొరవడ కుండా ఉండటం.
3. పరిమిత ప్రదేశం అంటే నిర్ణీత మండలంలో మాత్రమే వ్యవహరింపబడటం.
4. న్యూన ప్రామాణికంగా ఉండటం.
5. సాహిత్యం విరివిగా వెలుగొందక పోవటం.
6. కొన్ని పదాలలో, క్రియా రూపాలలో వైలక్ష్యం కలిగి ఉండటం.
7. క్రమ క్రమంగా ప్రధాన భాషలో అభిన్నం కావటానికి ప్రయత్నించటం.
8. పరిసర భాషలలోని పదాలను గ్రహించి ప్రామాణిక పదాలకు మారుగా వాడుకోవటం.

వ్యక్తులు పుట్టి పెరిగిన ప్రాంతాల ఆధారంగా ఏర్పడిన మాండలికాలను 'స్థల మాండలికాలు' అంటారు. వీటినే ఆంగ్లంలో 'Regional Dialects' అని అంటారు. వ్యక్తులు పుట్టి పెరిగిన కులాలు లేక సంఘాల ఆధారంగా ఏర్పడిన మాండలికాలను కుల మాండలికాలు అని, ఆంగ్లంలో 'Social Dialects' అని అంటారు.

స్థల మాండలికాలు భౌగోళిక కారణాల వల్ల ఏర్పడతాయి. పట్టణాలు, నగరాలలోని భాషా ప్రభావం చుట్టు పక్కల గ్రామాలకు వ్యాపిస్తుంది. ఇక్కడి ప్రజలకు నదీ నదాల వల్ల, పర్వతాల వల్ల, అడవుల వల్ల, ఇతర ప్రాంతాలతో సంబంధాలు లేకపోతే ఇవి భిన్న ప్రాంతాలైన కారణంగా వారి వ్యవహార భాషలో కలిగిన మార్పుల వల్ల స్థల మాండలికాలు ఏర్పడతాయి.

రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలు పూర్వం కళింగ దేశంలో క్రీ.శ. 1600 వరకు భాగంగా ఉండేవి. అందువల్ల ఈ జిల్లాలలోని భాష ఇప్పటికీ మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లోని భాషకంటే విలక్షణంగా ఉంది. దీనిని పూర్వమండలం అంటారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని తెలుగు భాషను మధ్య మండల భాష అంటారు. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాల భాషను దక్షిణ మండల భాష అంటారు. తెలంగాణా జిల్లాలలోని తెలుగు భాష ఉర్దూ ప్రభావానికి లోనై ప్రత్యేక మాండలిక భాషగా మొదటి నుండి వెలుగొందింది. దీన్ని ఉత్తర మండల భాష అని అంటారు.

ఒకే పదార్థాన్ని సూచించటానికి భిన్న మండలాల్లో వేర్వేరు మాటల్ని ఉపయోగిస్తున్నారు. ఈ భిన్న పదాలు ఒకటి కంటే ఎక్కువగా ఉంటాయి. అన్ని పదాలు పూర్తిగా భిన్నాలు కావు. కొన్ని పదాలలో మాత్రమే ఈ పూర్తి భిన్నత్వం కనిపిస్తోంది. క్రియా ధాతువుల్లో మార్పులేదు. కాబట్టే ఈ క్రియా పదాల అర్థావగతికి లోపం లేదు. ఇలాంటి వాటినే మాండలికాలు అంటారు. ఆయా ప్రాంతాన్ని వాటిలో ప్రయుక్తమయ్యే ఒకే పదార్థాన్ని సూచించటానికి ఉపయోగింపబడే భిన్న పదాలను పరిశీలిద్దాం.

దక్షిణ మండలంలో 'కపిల' అనే పదాన్ని ఇతర మండలాల్లో 'మోట' అంటారు. పూర్వ మండలంలో 'మదుం' అంటుండగా మిగిలిన చోట్ల 'తూము' అంటారు. దక్షిణ మండలంలో పిలువ బడే 'మడక' ను మిగిలిన మండలాల్లో 'నాగలి' అంటారు. ఆనపకాయను సొరకాయ, అనెగెం కాయ, ఆనబకాయ అనే పేర్లతో వ్యవహిస్తున్నారు. 'గునపం' అనే దాన్ని గడ్డపార, గడారు అనే పేర్లతోను, పశువుల్ని పూర్వమండంలో మాత్రం 'సొమ్ములని' పిలుస్తారు. గెదెను గేద, బర్రె, ఎనుము, పశువు అనే మాండలిక పదాలతో వ్యవహరిస్తున్నారు. ఇదే విధంగా కళింగాంధ్రలో చేదను 'రేక' అని, యజమానిని 'బుగత' అని అంటారు. క్రియా పదాలలో కూడా మాండలిక భేదం నియతంగా కన్పిస్తుంది. ధాతువులు సమానంగా ఉంటాయి. కాని ధాతువులపై చేరే ప్రత్యయంలోని మార్పులు నిర్ణీత

రీతుల్లో ఉంటాయి. పూర్వ మండలంలో "కట్టేశాడు, చేసేశాడు, వచ్చేశాడు అని, మధ్యమండలంలో కట్టాడు, చేశాడు, వచ్చాడు అని, దక్షిణ మండలంలో కట్టినాడు, చేసినాడు, వచ్చినాడు అని, ఉత్తరమండలంలో కట్టిండు, చేసిండు, వచ్చిండు అని అంటారు.

భావార్థక 'ట' ప్రత్యయం గుంటూరు మండంలో వినిపిస్తుండగా 'డ' ప్రత్యయం మిగిలిన ఆంధ్ర ప్రాంతంలో వ్యవహరింపబడుతోంది. ఉదాహరణకు గుంటూరు మండలంలో కనటం, తినటం, వినటం అంటుండగా మిగిలిన చోట కనడం, తినడం, వినడం అంటారు.

పరిసర భాషల ప్రభావం వల్ల కొన్ని పదాలు మాండలిక విశేష పదాలుగా భాసిస్తాయి. చిత్తూరు, నెల్లూరు జిల్లాలు తమిళనాడుకు దగ్గరగా ఉండటం వల్ల ఈ జిల్లాలలోని తెలుగులో ఆళ్వారు, ఉళవాయి, కనక పిళ్ళె, కూటు, సాపాటు మొదలైన తమిళ పదాలు చేరాయి. అనంతపురం, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలు కన్నడ దేశ సరిహద్దులో ఉండటం వల్ల ఈ జిల్లాల తెలుగు భాషలో అరువు, ఉద్దులు, ఓళిగలు, బాడుగ, గెనుసు గడ్డ, కాలేపండు వంటి కన్నడ పదాలు చేరాయి. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలు మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న కారణంగా కులకర్ణి, చెకడాబండి, బీగడ బోరెం, రాతాళం మొదలైన మరాఠీ పదాలు తెలుగు భాషలో చేరాయి.

విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు ఒరిస్సా రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కారణంగా ఉభాలు, కంబారు, బుగత, పన్నె, భోగట్టా, రేక మొదలైన ఒరియా పదాలు తెలుగు భాషలో చేరాయి. తెలంగాణా ప్రాంతాన్ని మహమ్మదీయ పరిపాలకులు చిరకాలం పరిపాలించటం చేత అంగూరు, గరీబు, గల్లీ, జరూరు, నజరానా, హమేషా మొదలైన ఉర్దూ పదాలు తెలుగు భాషలో ప్రవేశించాయి.

భిన్న కులాలలో పుట్టిన వారు భిన్న జాతులతో మాట్లాడుతారు. వారి అంతస్తులలో ఉన్న భేదం వారు మాట్లాడే భాషల్లో ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఈ అంతస్తులలో భేదాన్ని మన దేశంలో వర్ణాలు లేదా కులాలు అంటారు. వీరు మాట్లాడే భాషను కుల మాండలికాలు అంటారు.

కులమాండలికాల్ని మూడు రకాలుగా చెప్పవచ్చు. 1. బ్రాహ్మణ మాండలికం, 2. అబ్రాహ్మణ మాండలికం, 3. దళిత మాండలికం. సంఘంలో బ్రాహ్మణులు కులం రీత్యా ఉన్నతంగా భావింప బడుతున్నందు వల్ల వీరి భాష ఉన్నత శ్రేణికి చెందిందిగా భావింప బడుతోంది. వీరు సాధారణంగా ప్రామాణిక భాషనే వాడుతున్నా ఒక్కోసారి ప్రాంతాన్ని బట్టి ఆయా మాండలికాలు వారి భాషలో చోటు చేసుకుంటాయి. ఉదాహరణకి ఉదయం, మధ్యాహ్నం, వేడినీళ్ళు, తీర్థం, దధ్యోజనం, సంప్రోషణ, సంకల్పం, మడి మొదలైన పదాలు వీరు వాడుతుంటారు. బ్రాహ్మణులు కాని వారు అబ్రాహ్మణులు. అన్నం, కూడు, ఇంటికాడ, పెద్దోడు, ఉడుకునీళ్ళు, తిరగమోత మొదలైన పదాలు వీరు మాట్లాడే భాషలో ఉంటాయి. దళిత మాండలికంలో పదాలు చాలా భేదం కలిగి ఉంటాయి. తరతరాలనుండి వీరు మిగతా నాలుగు జాతులకన్నా తక్కువగా, అస్పృశ్యులుగా చూడబడినందువల్ల, గ్రామాలకు దూరంగా వెలివాడలు అనబడే గుడిసెలలో ఉండడం వల్ల, కూలినాలిపై ఆధారపడి జీవించడం వల్ల వీరిభాషలో చాలా తేడా కన్పిస్తుంది. అసింకం, పినపెద్ద, యాసకాలు వోడ్సి, ఆరె, వారు, కిలాలించు, ఆరంజోతి లాంటి పదాల్ని ఈ మాండలికంలో మనం గమనించవచ్చు.

మాండలికాల్ని ఇంకా లోతుగా పరిశీలించి నట్టయితే వయసును బట్టి పిల్లలు, యువకులు, వృద్ధులు, లింగ భేదాన్ని బట్టి, స్త్రీలు, పురుషులు మాట్లాడే భాషలో బువ్వ, అప్ప, పాచి, లాల, జిజ్జి, బూచి, ఇజ్జులాంటి పదాల్ని వినవచ్చు. యువకులు మాట్లాడే భాషలో సైటు, సుత్తి, లైనేశాడు, దిల్, సోగ్గాడు, దమ్ముంటే లాంటి పదాలు, వృద్ధుల భాషలో దుడ్డుకర్ర, వక్కరోలు, అడపం, సున్నపకాయ, గంటు, పిల్లకుంక, గోసి లాంటి పదాల్ని వింటుంటాం. లింగభేదాన్ని బట్టి స్త్రీలు మాట్లాడేభాషలో నాసయితి, గుడిసేటి, నీజిమ్మడి పోనూ, దానితాడుతెగ, వెధవ సచ్చినోడు లాంటి పదాల్ని, పురుషుల భాషలో వాడి అంతు చూస్తా, నాజోలికి రాకు, అంత మొనగాడా, ఎన్ని గుండెలు వాడికి లాంటి పదాల్ని వినవచ్చు. ఈ విధంగా అనేక కారణాల వల్ల తెలుగుభాషలో వివిధ మాండలిక పదాలు చోటు చేసుకున్నాయి. మారుతున్న మానవుడి జీవన విధానం, శైలి వల్ల క్రమంగా మాండలికాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. ✿

ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి,
ఫోన్ : 9849258010

## జీవితానికి - సమాజానికి వారధి

# శివారెడ్డి కవిత్వం

**- పెన్నా శివరామకృష్ణ**

విప్లవ కవిత్వానికి సంబంధించి ఉన్నతశ్రేణికి చెందిన కవులెవరని ప్రశ్నించుకొంటే, శ్రీశ్రీ, శివసాగర్‌లతో పాటు వెంటనే స్ఫురించే పేరు శివారెడ్డి. గొప్ప వస్తు విస్తృతిని సమకూర్చుకొని, అభివ్యక్తి రీతులలో నిత్యనూతనతను ప్రదర్శిస్తూ ఎడతెగకుండా కవిత్వ రచనకు అంకితమైన కవులెవరని ప్రశ్నించుకుంటే మొదట శివారెడ్డి పేరే గుర్తుకు వస్తుంది. వి.ర.సంలో సభ్యుడు కాకపోయినా (సభ్యుడు కావడం, కాక పోవడం కేవలం సాంకేతిక అంశమే నన్నది శివారెడ్డి అభిప్రాయం.) వి.ర.సం భావజాలానికి నిబద్ధుడయి, వి.ర.సంతోనే తన కవిత్వ జీవితం ముడిపడి ఉందని స్పష్టంగా ప్రకటించుకున్న కవి. తమ సభ్యుడు కాకపోయినా, తమ సొంత కవిగా వి.ర.సం ప్రకటించు కోదగిన కవి శివారెడ్డి. అజ్ఞాత కార్యకర్తలుగా మారిన కవులను, కవులైన అజ్ఞాత కార్యకర్తలను ప్రభావితం చేసిన కవులలో శ్రీశ్రీ, శివసాగర్, వరవర రావులతో పాటు పేర్కొన దగిన కవి శివారెడ్డి. వి.ర.సంలో సభ్యుడు కాకపోవడం అనే వెసులు బాటును శివారెడ్డి ఎప్పుడూ దుర్వినియోగం చేయలేదు. రష్యన్, ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ కవులు మొదలుకొని, వామపక్షాన నిలిచిన ప్రాచ్య పాశ్చాత్య కవులను విస్తృతంగా అధ్యయనం చేసి ఆయా కవుల జీవన, కవిత్వ ప్రస్థాన సారాన్ని రక్తనిష్ఠం చేసుకొని, తన దేశీయ స్థితిగతుల కనుగుణంగా అన్వయించుకొని, తన కవిత్వ వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకుంటూ సాగుతున్న విశిష్ట కవి శివారెడ్డి.

ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఏ పూర్తి చేసుకొని 1967 ఆగష్టులో హైదరాబాదు వచ్చి ఇంగ్లీషు లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరాడు శివారెడ్డి.

దిగంబర కవుల మూడవ సంపుటం 1968లో వెలువడింది. సాయుధ ప్రతిఘటనను ప్రబోధిస్తూ *తిరుగబడు* (1969) కవులు రంగం మీదికి వచ్చారు. మరో వైపు వచన కవితా రూపాన్ని గూర్చి చర్చలు జరుగు తున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఊపందుకున్నది. సామాజిక సాహిత్య రంగాలు అవ్యవస్థ నుంచి, అనిశ్చిత దశనుంచి పరిష్కారాలకు దారులు వెతుక్కుంటున్న కాలమది. నక్సల్బరీ ఉద్యమం, శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం, శ్రీశ్రీ షష్ఠి పూర్తి, విశాఖ విద్యార్థుల సవాల్, వి.ర.సం ఆవిర్భావం మొదలైన వేగవంతమైన పరిణామాలు సంభవించాయి.



కె. శివారెడ్డి

స్వాతంత్ర్య ఫలాలు దక్కని దేశదుస్థితిని గూర్చి, సామాజిక సాహిత్యరంగాలలోని సంచలనాల నేపథ్యాన్ని గూర్చి తనలో చెలరేగుతున్న ప్రశ్నలకు, సందేహాలకు శివారెడ్డి జవాబులను అన్వేషిస్తున్నాడు. కార్యకారణ సంబంధాలను విశ్లేషించుకుంటున్నాడు. ఆనాటి శివారెడ్డి మనఃస్థితి 'వాన రాత్రి తప్పి పోయిన పక్షి చందమయింది'. సామాజిక సిద్ధాంతాల అధ్యయన, పరిశీలనల సారాన్ని అన్వయించుకొంటూ సందేహాలను తీర్చుకొంటున్న దశలో ఆవిర్భవించిన వి.ర.సం ఆయనకు ఒక పట్టుకొమ్మ అయింది.

1970లో తానే సంపాదకుడుగా *వేకువ* పేరుతో సాహిత్య త్రైమాసిక పత్రికను ప్రారంభించాడు. 1972 వరకు కొనసాగి ఆరు సంచికలు వెలువడిన తర్వాత తాను కేవలం సంపాదకుడుగానే మిగల కూడదనుకొని, పూర్తి సమయాన్ని కవిత్వ రచనకే వినియోగించాలన్న లక్ష్యంతో ఆ పత్రికను ఆపేశాడు. అలాగే అప్పటివరకు *భారతి* మాస పత్రిక కోసం రాస్తూ వచ్చిన పుస్తక సమీక్షలనూ మానేశాడు.

తన అధ్యయనం అందించిన సామాజిక విశ్లేషణా పద్ధతులకు వి.ర.సం సిద్ధాంతాలకు శ్రుతి కుదిరింది. వి.ర.సం ఇచ్చిన స్ఫూర్తి, మరింత విస్తృతమైన మార్క్సిస్టు సిద్ధాంతాధ్యయనం, ప్రపంచ కవితాధ్యయనం ఆయన కవిత్వ యాత్రకు మార్గాన్ని, లక్ష్యాన్ని నిర్దేశించాయి. "వి.ర.సం పుట్టుక, క్రమాభివృద్ధికీ, నా కవిత్వాభివృద్ధికీ ఒక అవినాభావ సంబంధం ఉంది'' అంటాడు. తాను వి.ర.సంలో సభ్యుడు కాకపోయినా తనపైన వి.ర.సం

ప్రభావాన్ని, దానితో తనకున్న మమైకత్వాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించుకున్నాడు.

శివారెడ్డికి 70 ఏళ్లు వచ్చిన సందర్భంగా ఆయన కవిత్వమంతా మూడు విభాగాలుగా (సంపుటాలుగా) ప్రచురింపబడింది. అవి —

**మొదటి విభాగం :** *రక్తం సూర్యుడు* (1973) నుంచి *భారమితి* (1983) వరకు ఐదు కవితా సంపుటులు.

**రెండవ విభాగం :** *మోహనా ఓ మోహనా* (1988) నుంచి *వృత్తలేఖిని* (2003) వరకు ఐదు కవితా సంపుటులు.

**మూడవ విభాగం :** *అంతర్జ్వనం* (2002) నుంచి *గగన మంత తలతో* (2010) వరకు నాలుగు కవితా సంపుటులు.




"ఈ మూడు విభాగాలు మూడు దశల్ని సూచిస్తాయేమో!" నని ఈ సమగ్ర కవితా సంపుటుల ముందు మాటలో శివారెడ్డి అన్నారు. కాని శివారెడ్డి కవిత్వ ప్రస్థానాన్ని మూడు దశలుగా విభజించుకుంటే నా దృష్టిలో ఆ మూడు దశలు ఈ కింది విధంగా ఉంటాయి.

1. *రక్తం సూర్యుడు* (1973) నుంచి *ఆసుపత్రి గీతం* (1976) వరకు – ఆరంభదశ.
2. *నేత్ర ధనుస్సు* (1978) నుంచి *అజేయం* (1994) వరకు – విప్లవ కవిగా పరిణత దశ
3. *నా కలల నది అంచున* (1997) నుంచి *గగన మంత తలతో* (2010) వరకు మరియు కొనసాగుతున్న దశ– వస్తు సంవిధానాల దృష్ట్యా పూర్ణ వికాస దశ.

ఆరంభదశ నుంచి ఆయన రచనలను, నేపథ్యాలను విశ్లేషించుకుందాం. 1970వ దశకంలో తీవ్రమైన రాజ్యహింసనెదుర్కొంటూ విప్లవోద్యమం ముందుకు సాగుతున్నది. దీనికి తోడు అత్యవసర పరిస్థితి – ఇలాంటి ఉద్రిక్తతలతో కూడిన 'కల్లోల నక్సల్బరీ దశాబ్దం'లో శివారెడ్డి నాలుగు కవితా సంపుటాలు ప్రచురించాడంటే ఆయన ఎంతటి నిబద్ధతతో, ఎంత విస్తృతంగా కవిత్వం రాశాడో, ఆ దశాబ్దంలో తనను సాంస్కృతిక సైనికుడిగా ఏ విధంగా రూపొందించుకున్నాడో తెలుస్తుంది. *చర్య* (1975). *ఆసుపత్రి గీతం* (1976), అత్యవసర పరిస్థితిలోనే వెలువడినాయన్నది గమనించదగిన అంశం.

వర్గ వైరుధ్యాలు, పీడకుల మనస్తత్వం, పీడక వర్గం మీద కసి, పెటీ బూర్జువా మనస్తత్వ నిరసన. వలస పాలనా వశేషమైన విద్యావిధాన వ్యతిరేకత (శాస్త్రీయ విద్యావిధానం కోసం విద్యార్థి సంఘాలు నినదించిన కాలమది) మొదలైనవి మొదటి దశలోని ప్రధాన కవితా వస్తువులు.

మొదటి రెండు సంపుటాల్లో చమత్కారం, వ్యంగ్యం, అధిక్షేపాలతో కూడిన ముక్తాయింపులు ఎక్కువ. మార్క్స్, లెనిన్, మావో, చే గువేరా, హోచిమన్ మొదలైన సిద్ధాంత ప్రవక్తల, స్ఫూర్తిదాతల ప్రస్తావనలున్నాయి.

*రక్తం సూర్యుడు*లో కన్నీళ్ళు, చిరునవ్వులు కలిపి తయారు చేసిన రసగుళికగా జీవితాన్ని సంభావిస్తాడు. 'గతాన్ని ద్వేషించకుండా గుడ్డిగా ఆరాధించకుండా, గుడ్డి వెలుగునైనా తోడు కుంటా'నంటాడు. ఏ విశ్వాసాల ప్రవాహంలో కొట్టుకు పోకుండా నిలిచి ఆలోచించి, ఆచరణలో నిగ్గు తేల్చుకునే వివేచనను ప్రకటిస్తాడు. జీవితం పట్ల అపారమైన ప్రేమ, ఆశావహ దృష్టిని ప్రదర్శిస్తాడు. మొదటి సంపుటిలోనే ఇంతటి స్పష్టమైన, నిర్దిష్టమైన అభిప్రాయాలు, విశాల దృక్పథం ప్రతిబింబించటం అరుదైన విషయమే.

మొదటి రెండు సంపుటాల్లో వర్గ విశ్లేషణ ప్రధాన వస్తువు. *నేత్ర ధనుస్సు*లో వర్గ చైతన్యం నేపథ్యంలో వస్తు 'తాదాత్మ్యత' కనిపిస్తుంది. *నేత్ర ధనుస్సు* నుండి వెలువడిన చూపుల బాణాలు పాఠకుల అంతరంగాన్ని స్పృశిస్తాయి.

**"విచక్షణలో తెరచిన నేత్రం – కలం**
**కోటాను కోట్ల సూర్యుళ్లను ప్రభవిస్తుంది."**

ఇక్కడ గుణ దోష విశ్లేషణ, వర్గ చైతన్యాలే 'విచక్షణ'. ఇది బౌద్ధిక ప్రక్రియ

**"ఆకుల్లో ఆకాశాన్ని**
**ఆకాశంలో అడవుల్ని చూడలేని వాడు**

**మనుషుల్లో మహత్తర ఆకాశ అటవీ సౌందర్యాల్ని చూడలేదు".**

అంటూ కవికి ఉండాల్సిన 'దర్శన' శక్తిని సూచిస్తాడు. మూడవ పాదంలోని 'సౌందర్యం' కూడ వస్తువులో కవికి దర్శనమిచ్చే మరో వస్తువును సూచిస్తుంది.

ఉద్యమం, వర్గ వైరుధ్యాలు మాత్రమే కవితా వస్తువులైన నాటి (1970–80) కవిత్వంలో ఏ రకంగానైనా అందం, ఆనందం అనే పదాలే అంటరాని వైనాయి. వర్గ వైరుధ్యాల నేపథ్యంలోనే, సమస్త 'వికృతాల' మధ్య కూడా వెలుగు రేఖలా అనుభూతమయ్యే సౌందర్యాంశను తదనుగుణమైన భాషలో కవిత్వీకరించడం *నేత్రధనుస్సు*లో కనిపించే మరో సుగుణం.




**"నాలోని కీ నీడల మరకల్ని**
**నిర్మూలించిన భాసురోదయమా!**
**నాలోని ఒక్కొక్క అణువు నుండి**
**నాదమై వీస్తున్న ఉదయమా!**

ఇలాంటి వాక్యాలు ఆనాటి కవిత్వానికే వినూత్నమైనవి. మొదటి పాదంలోని 'కీ నీడలు' అనే ప్రతీకకు 'మరకలు' అనే ఉపమానాన్ని చేర్చడం, రెండవ పాదంలో 'నాదం' అనే ఉపమానానికి 'వీస్తున్న' అనే క్రియద్వారా మరో ఉపమానాన్ని జోడించటం, 'భాసురోదయమా!' అనే సార్థక సంబోధన– అనుభూతిగా పర్యవసించిన ఆలోచనకు క్లుప్తత, గుప్తతలతో కూడిన అభివ్యక్తి ద్వారా సాధించిన సాంద్రత, పరిణతి చెందుతున్న శివారెడ్డి కవితా శిల్పానికి తార్కాణాలు.

అసభ్య పదప్రయోగ పరిహరణ, అంతర్దృష్టి, సూర్యుడు, రక్తం, విప్లవం లాంటి అర్థ స్ఫూర్తి కోల్పోయిన ప్రతీకల ఉపసంహరణ, వస్తు ఉదాత్తీకరణ, పదునైన భావనాశక్తి మొదలైనవి *నేత్రధనుస్సు* లోని కవిత్వ పరిణామానికి కారణాలు. "వెలుగు వేళ్ళకి ఎక్కడైనా చీకటి మరకలంటుకున్నాయేమో చూసుకోవాలి, శబ్దాన్ని కూడా పుటం పెట్టి పరీక్షించుకోవాలి'' అంటూ ఆత్మ పరిశీలనావశ్యకతను గ్రహించాడు. ఇలాంటి లక్షణాలే ఆయన కవిత్వంలోని వేగవంతమైన పరిణతికి కారణాలు.

"ఈ తరం కవుల్లో ఈయన గొంతు విలక్షణమైనది. శక్తివంతమైనదిన్నూ. చెప్పదలచుకున్న భావాన్ని నంగిరి పింగిరి మాటల్లో నాన్చకుండ కంఠం చీల్చుకు వచ్చి గుండెల్లో గుచ్చుకునేలాగ చెప్పగల కవి ఈయన. కవితా శిల్పాన్ని విడిచి పెట్టకుండానే తీవ్రమైన పదజాలాన్ని అతి పొడుపుగా, కవితగా మలచగల నేర్పరి'' అని కె. రామమోహన రాయ్ గారన్నారు. (చూడు: తెలుగు కవితా వికాసం (1947–80) పుట. 363).

"వీరికి నవ్య కవి లోకమున నొక విశిష్టస్థానము గలదు. నిసర్గ నిర్మలమగు ననుభూతియు, అనుభవ పరిపుష్టమగు భావుకతయు, భావుకతా పేశలమగు విషయావగాహనము వీరి కవిత కొక విశిష్టతను చేకూర్చుచున్నవి". కె.వి. ఆర్. నరసింహం (1982) గారన్నారు. (చూడు: ఆధునికాంధ్ర కవితా సమీక్ష పుట. 681).

ఆ తర్వాత వచ్చిన ఆయన కవిత్వంతో పోల్చుకుంటే ఇది ప్రాథమిక దశే. కాని ఆనాటి విప్లవ కవితా రంగంలో శివారెడ్డి కవిత్వం విలక్షణమైనదే. పై ఇద్దరు విమర్శకులు 1982లో వెల్లడించిన అభిప్రాయాలు, నాటికి వచన కవిత్వంలో శివారెడ్డి స్థానాన్ని రుజువు చేస్తాయి.

విస్తృత సాహిత్యాధ్యయనము, దశాబ్దికాలపు కవిత్వాభ్యాసాల నేపథ్యంలో వస్తు, సంవిధానంలో గుణాత్మకమైన పరిణామాన్ని సాధించాడు. విస్తృతమవుతున్న విప్లవ చైతన్యం, రాజ్యహింస, విప్లవ సిద్ధాంత ప్రాశస్త్యం, పీడన, వర్గవైరుధ్యాలు, వర్గకసి ఆనాటి విప్లవ కవుల ప్రధాన కవితా వస్తువులు.

'భారమితి' (Barometer) అనే పదానికి వాతావరణంలోని పీడనాన్ని కొలిచి వాతావరణ పరిస్థితులను సూచించే సాధనమనే కాక పరిస్థితులలోను, అభిప్రాయాలలోను పొడచూపుతున్న పరిణామాలను సూచించటమని కూడ అర్థముంది. *భారమితి* సంపుటి సామాజిక జీవితంలోని

విధ్వంసానికి, వ్యవస్థలో మార్పును కోరుతున్న చైతన్యానికి కొలమానం.

వర్గ వైరుధ్య నిర్మూలన సఫలం కావాలంటే ఆ వైరుధ్యాలను పెంచి పోషిస్తున్న వ్యవస్థల నన్నింటినీ నిర్మూలించాలి. వర్గ శత్రువును అమూర్త రూపంగా కాకుండా వివిధ రంగాలలో వివిధ రూపాలలో వ్యక్తమయ్యే నిర్దిష్టమైన ఆధిపత్య భావాలను నిర్మూలించాలి. ఈ దృష్టి నుండే పురుషాధిపత్యం, మతం, న్యాయ పరిపాలనాది వ్యవస్థలలోని ఆధిపత్య, పీడక స్వభావాలను శివారెడ్డి ఇతివృత్తాలుగా స్వీకరించాడు.

శ్రీకాకుళ ఉద్యమకాలంలో కార్యకర్తలే ఆ తర్వాత కవులు కావటం, సకృత్తుగా కవులు కార్యకర్తలుగా కూడ మారటం వలన వారి వ్యక్తీకరణల్లో కవికి, విప్లవ కారునికి అభేదం ఏర్పడింది. "ప్రజలను సాయుధుల్ని చేస్తున్న రివల్యూషనరీ నేడు కవి" అనే శివసాగర్ గారి మాటలు కవి కూడ ఒక రకంగా విప్లవ కారుడేనన్న భావాన్ని వ్యక్తం చేస్తాయి. శివారెడ్డి కూడ కవిత్వ రచన విప్లవ కార్యాచరణలో భాగమేనంటాడు. అందుకే ఆయన అభివ్యక్తిలో విప్లవ కారుని కంఠస్వరమూ మిళితమైంది.

అధ్యయనం, అనుశీలనల ద్వారా భ్రమలను, సంకోచాలను తొలగించుకున్న శివారెడ్డి దృశ్యమాన ప్రపంచంలోని ఏ అంశమూ నిషిద్ధం కాదని గ్రహించాడు. జీవితంలో అరుదుగానైనా అనుభూతమయ్యే, వివశుల్ని చేసే క్షణికమైన అనుభవాల్నీ అక్షరీకరించాడు. నిశితంగా పునర్వివేచన చేస్తే తప్ప గ్రహించుకోలేని అనుభూతుల్ని కవితలుగా మలచాడు.

గ్రామీణ ప్రాకృతిక సౌందర్యం ఆత్మీయమైన అనుబంధాలు, తల్లిలేని బాల్యపు విషాద స్మృతులు ఆయన వ్యక్తిత్వాన్ని బాగా ప్రభావితం చేశాయి. కనుక ప్రకృతితో తాదాత్మ్యం, సున్నితమైన భావుకత ఆయన కవిత్వానికి ప్రాణప్రదాలైనాయి. పెరుగుతున్న అవగాహనకు తొలగుతున్న సంకోచాల కనుగుణంగా ఆయన కవిత్వంలో భావుకత, ప్రకృతి చిత్రాలు వ్యాపిస్తూ వచ్చాయి.

నాణానికున్న రెండు వైపులను ఒకేసారి చూపించినట్లు వస్తువులోని అనుకూల, ప్రతికూల పార్శ్వాలను ఏకకాలంలో ప్రదర్శిస్తాడు. అలా ప్రదర్శించడంలో బీభత్సాన్ని, సౌందర్యాన్ని ఒకదాని తర్వాత ఒకటిగా చిత్రించి వస్తువును, సమగ్రంగా దర్శింపజేస్తాడు.

**"నా జ్ఞాపకాల్లో బతుకుతున్న మోహనా!**
**హేమంతగాన చిరులేత ఎండల కళ్ళ మోహనా!**
**నా స్మృతి పేటికలో పదిలంగా వున్న వరిమొవ్వులోని**
**మంచు బిందువా!**
**తొలగించే కొలది మిగిలిపోయే తెరల్లో మరిగి**
**పోతున్న మోహనా!**

. . . . . . . . . . . . . . . . . . . . . .

**బతకటాన్ని ఓ పెద్ద పాపకార్యం చేసిన**
**బతకటాన్ని ఓ పెద్ద బండ బరువు చేసిన**
**బతకటాన్ని ఓ బడా వ్యాపారం చేసిన**
**ఈ సుందరమయ వ్యవస్థలో**
**బతుకు మోహనా! బతుకు !"**

మొదటి నాలుగు పాదాలలోని భావుకత్వం, భాషా సౌకుమార్యం, చివరి నాలుగు పాదాలలోని క్రోధాని కనుగుణమైన పదకాఠిన్యం గమనించదగినవి. అవ్యవధానమైన కటు, మృదుస్వర ప్రస్తారం, వాటి పరస్పర మిశ్రితమైన తనదైన శైలిని రెండవ దశలో సాధించాడు.

వస్తుదర్శన ప్రదర్శనల్లో భారమితి, *మోహనా ఓ మోహనా* విమర్శకుల ప్రశంసలు పొందాయి. యువ కవులను ప్రభావితం చేశాయి. దానికి తోడు *మోహనా ఓ మోహనా* కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందింది. జీవితంలోని బహు పార్శ్వాలను స్పృజించిన *అజేయం.* శివారెడ్డి విప్లవ కవి అనే పరిధుల్ని చెరిపేసిన సంపుటి *అజేయం.* అజ్ఞాతవాసం నుంచి *అజేయం, పిట్టల తలలపైన* మొదలైన విప్లవ కవితలతో పాటు, *ఆమె, ఆమె ఎవరైతే మాత్రం, నెత్తుటి మొగ్గ, తల్లి తల్లినే వర్షిస్తుంది, వాంఛ, కమల కుమారి స్వగతం* లాంటి బహు చర్చితమైన స్త్రీ ఇతివృత్త కవితలు, *కుక్క చనిపోయినప్పుడు, ఒకానొక పొద్దుటి పూట, నాక్ ది డోర్, నగరంలో తెల్లార గట్ట, ఓ దృశ్యం* లాంటి అనుభవ ప్రధానమైన కవితలు *అజేయం*లో ఉన్నాయి.

వివిధ సాహితీ సంస్థల సమావేశాలకు, కళాశాలల వార్షికోత్సవాలకు, విద్యార్థి సంఘ సమావేశాలకు ముఖ్య అతిథిగా, ఉపన్యాసకుడుగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించే అవకాశం ఆయనకు వచ్చింది. తద్వారా విప్లవోద్యమానికి

పునాదులైన విద్యార్థి సంఘాలతో, ఉద్యమాలతో ఏర్పడ్డ సాన్నిహిత్యం, ఆయన నిరంతరం చైతన్యవంతుడుగా ఉండడానికి దోహదం చేసింది. అంతవరకూ పరిమితమైతే శివారెడ్డి గొప్ప వక్తగానో, మేధావిగానో మిగిలేవాడు. ఆ పర్యటనలు, ఉపన్యాసాలు, విద్యార్థులలో చైతన్యం కలిగించడానికే కాక తాను ఎప్పటికప్పుడు సామాజిక పరిణామాలను విశ్లేషించుకోవడానికీ తోడ్పడినాయి. వాటిని తన కవిత్వానికి పోషక ద్రవ్యాలుగా ఉపయోగించుకోవడంలో, నిత్యనూతనమైన జవసత్వాలను సమకూర్చుకోవడంలో సఫలమైనాడు.

అలా విద్యార్థి సమూహాల ముందు ఉపన్యాసాలతో పాటు కవితా పఠనమూ అనివార్య కర్తవ్యమైంది. విద్యార్థులను ఉ్రదూతలూగించే పాటలతో సమానంగా తన కవిత్వమూ ఆకట్టుకోవాలనీ, ఆవేశం కలిగించాలనీ అనుకున్నాడు. ఆ ప్రయత్నంలో భాగంగా ఆయన కవిత్వానికి సంభాషణాత్మకమైన వక్తృత్వ శైలీ, ఆయనకు ఆవేశపూరితమైన కవితాపఠన నైపుణ్యమూ అలవడినాయి. ఆయనే చెప్పుకున్నట్లు గాఢోద్వేగ పూరితమైన ఉపన్యాసశైలిని (Hightened, Intensified, Emotional speech). రూపొందించుకున్నాడు. ఇదే శివారెడ్డి శైలిగా ప్రాచుర్యం పొందింది.

అంతరంగం అగాధలోయల్లోంచి భౌతిక చైతన్యంలోకి, బాల్య స్మృతుల సముద్ర గర్భంనుండి వర్తమాన తీరానికి చేసిన నిరంతర లోలకపు యాత్ర మూడవ దశ. గ్లోబలైజేషన్ పరిణామాలు, మానవ సంబంధాలను భగ్నం చేస్తున్న సాంకేతిక విప్లవాలు మొదలైన అంశాలన్నిటినీ గత దశాబ్దపు ఆయన కవిత్వంలో చూడవచ్చు. *భారమితి* లోని 'సార్వజనీనత' ఆ తర్వాత రెండు సంపుటాలలో 'నిర్దిష్టత' వైపు పయనించింది.

మూడవ దశలోని గొప్ప పరిణామం ప్రాంతీయ ముద్రతో కూడిన వస్తునిర్దిష్టత. వరకట్న బాధితురాలి ఆత్మహత్యను గూర్చిన *నీటి మీద తేలే* (భారమితి), ఒక మగవాడి వంచనకు గురైన కమలకుమారి స్వగతం (అజేయం), తన మనసుపై చెరగని ముద్రవేసిన నలుగురు స్త్రీలను గూర్చిన 'మంచు' (నా కలల నది అంచున) అనే మూడు కవితలను తులనాత్మకంగా చూస్తే ఈ పరిణామం తెలుస్తుంది.

మొదటి రెండు దశల్లో వ్యవసాయ సంబంధితాంశాలు సకృత్తుగా కనిపించినా వాటిలో ప్రాంతీయ ప్రత్యేకతలు మృగ్యమే. అవి కూడ యాదృచ్ఛికాలే, అప్రయత్న పద చిత్రాలే. మూడవ దశలో వివిధ రుతువులలోని తెలుగు దేశపు గ్రామీణ వాతావరణం, సాంస్కృతికాంశాలు, వ్యావసాయిక నాగరికత, నిష్కల్మషమైన మానవ సంబంధాలు ఒక్కుమ్మడిగా చుట్టుముడతాయి, సమ్మోహకతను కలిగిస్తాయి. అందుకే "నేను ఒక చోట ఉండను, మిమ్మల్ని ఉండనీయను" అంటాడు. దీనికి ప్రధాన కారణం ఆయనే చెప్పినట్టు బాహ్య ప్రపంచం నుండి అంతర్లోకాల్లోకి ప్రయాణించడం. తన వ్యావసాయిక కుటుంబ జీవనం, బాల్య స్మృతులు, తనను బాగా ప్రభావితం చేసిన వ్యక్తులు, ఇప్పటికీ తనలో ఇంకా పచ్చిపచ్చిగా ఉన్న ఆ గ్రామీణ నేపథ్యం ఈ దశ కవిత్వంలో సజీవంగా సాక్షాత్కరిస్తాయి. నిర్దిష్టతవైపు పయనించిన కొద్దీ శివారెడ్డి కవిత్వంలో nativity పెరుగుతూ వచ్చింది. దీని వల్ల మరింత (Authenticity, Integrity) చేకూరాయి.

**"నేను దేన్నీ స్తంభింపజేయను**
**నేనన్నింటిని వాటి వాటి స్వాభావిక సహజాభివృద్ధికి వదిలేస్తా."** – *నా కలల నది అంచున*

తనకు వస్తు పరిధులు కాని, పరిమితులు కాని లేవంటాడు శివారెడ్డి. వ్యక్తిగత జీవితంలోని అనుభవాలని, సహజమైన హృదయ స్పందనలని, మానవీయ సంవేదనలని, సహజాతాలని కవితా వస్తువులుగా స్వీకరించడానికి వెనుకాడ లేదు. ఇతర విప్లవ కవులు వస్తుపరమైన సంకోచాలకు గురికావడాన్ని, కొన్ని వస్తువులను ఉద్దేశ్యపూర్వకంగా స్పృశించకపోవడాన్ని బహుశా 'స్తంభింప' చేయడం అనే మాటద్వారా సూచిస్తాడు. విప్లవ కవిత్వంలో వస్తు వైవిధ్యానికి శివారెడ్డి కవిత్వం ఒక ఒరవడి.

శివారెడ్డి రాసినంత విస్తృతంగా స్త్రీ ఇతివృత్త కవితలు రాసిన తెలుగు కవి మరెవరూ లేరు. శిశువుగా, బాలికగా, మగవాడి వంచనకు గురైన అభిమానవతిగా, ప్రపంచానికి ముకుతాడేసి తన వెంట నడిపించుకుపోతున్న ధీరగా, తన ప్రాణాన్ని పంచుతూ పురిటి నొప్పులు సహించే మాతృమూర్తిగా, జీవకారుణ్యాన్ని వర్షించే తల్లిగా, పురుషుడి అన్ని దాష్టీకాలను భరించే నిశ్శబ్దపు పసుపు ముద్దలాంటి మధ్యతరగతి గృహిణిగా, స్కూటీ గుర్రం మీద దౌడు తీసే

నేటి తరం విద్యార్థినిగా, యువతిగా, ఉద్యోగినిగా స్త్రీ జీవితంలోని వివిధ దశలను, వివిధపార్శ్వాలను అత్యంత స్పష్టంగా, గాఢంగా, ఆత్మీయంగా శివారెడ్డి పరామర్శించాడు. భౌతిక, సామాజిక జీవితాలలో స్త్రీ ఎదుర్కొంటున్న పక్షపాతాలతో పాటు, స్త్రీ పురుషుల సంబంధాలలోని అనేకానేక సమస్యలతో పాటు, ఉద్వేగ పరమైన సంఘర్షణలను, స్త్రీ, పురుషులని చిరకాల సాంగత్యానికి మూలమైన సర్దుబాట్లను కూడా అంత వాస్తవికంగా విశ్లేషించడం ఈయన రాసిన స్త్రీ ఇతివృత్త కవితలలోని ప్రధాన వైశిష్ట్యం.

సామాజిక, రాజకీయ అంశాలతో పాటు మానవ సంబంధాలు, కౌటుంబిక బంధాలు, వాటిలోని సంక్లిష్టతలు, వ్యక్తిగత సామాజిక జీవితాలలోని వైవిధ్య భరితమైన నిత్య ఆంతరిక సంఘర్షణలు, రుతువుల కనుగుణంగా మారే ప్రాకృతిక సౌందర్యం, దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్త అనుభవాలు, సమస్త దృశ్యాలు ఆయన కవితా వస్తువులైనాయి. సగటు మనిషి యాంత్రికంగా అనుభవించే సర్వ సుఖదుఃఖాలను శివారెడ్డి సచైతన్యంగా అనుభవిస్తాడు. ఆ సుఖదుఃఖాల మూలాలను అన్వేషిస్తూ హార్దికంగా, బౌద్ధికంగా చేసుకునే విశ్లేషణలు కవితా ఖండికలవుతాయి. ఇలాంటి ఆయన కవితలను చదివినప్పుడు - ఇది నేను అనుభవించినదే అయినా నే నెలా విస్మరించాను? నే నెలా ఉపేక్షించాను? అని పాఠకుడు ఆశ్చర్యపోతాడు. ఈ ఆశ్చర్యమే శివారెడ్డి కవిత్వం కలిగించే ప్రాథమిక ఆనందం. గత పది, పన్నెండు సంవత్సరాల నుంచి ఆయన కవిత్వంలో వస్తు విస్తృతి, తాత్త్విక గాఢత అంతకంతకూ పెరుగుతూ వచ్చాయి. తన ప్రాపంచిక దృక్పథాన్ని ఉపేక్షించకుండానే, వైరుధ్యాలు లేకుండానే, మనిషి వ్యక్తిగత, సామాజిక, ఆంతరిక జీవితాలలోని సకల పార్శ్వాలకు విస్తరించడంలో శివారెడ్డి కవిత్వసాఫల్యానికి మూలాలున్నాయి.

"An artist, however committed he may be in life, should be a clown in art" అంటాడు గుంతర్ గ్రాస్. సిద్ధాంతాల కంటే సహజంగానే జీవితమూ, మనిషి అంతరంగమూ అగాధమైనవి. సంక్లిష్టమైనవనే ఎరుక కలిగిన కవి శివారెడ్డి. జాగ్రత్తగా పరిశీలిస్తే ఆయన కవిత్వ వస్తు, రూప, వ్యక్తీకరణల్లో నిబద్ధతలోనే అనిబద్ధతను, అనిబద్ధతలోనూ నిబద్ధతను గమనించగలుగుతాం.

ప్రతి వస్తువుకు, ప్రతిస్థితికి, ప్రతి ఉద్వేగానికి, ప్రతి సిద్ధాంతానికి వుండే రెండు చివరలను ఈ కవి అర్థం చేసుకున్నాడు. ప్రతి దానికీ వుండే పరస్పర వ్యతిరేక పార్శ్వాలను ఏకకాలంలో దర్శిస్తూనే దేనిని ఎక్కడ, ఎంత వరకు అన్వయించు కోవాలో గ్రహించ గలగడమూ, అన్ని చలన సూత్రాలనూ గమనిస్తూనే తక్షణ సన్నివేశాలలో అనుభవాలలో తనను మిళితం చేసుకోవడమూ, హృదయ పూర్వకంగా, సంకల్ప సహితంగా అనుభవించ గలగడమూ ఒక అంతర్ముఖసాధన, అభిప్రాయాల పరంగా, దృష్టికోణాల పరంగా, సిద్ధాంతాల పరంగా వైరుధ్యాలు లేకుండా కవితాత్మకంగా వ్యక్తీకరించ గలగడం బహిర్ముఖ అక్షర తపస్సు.

వస్తువు ఏదైనా, కవితను ఎక్కడ, ఎలా మొదలు పెట్టినా, క్రమంగా ఏ సామాజిక అంశానికో, ఏ విప్లవ భావజాలానికో సమన్వయిస్తూ, వీలయినంత విస్తరించటం *అజేయం* వరకు ఆయన అనుసరించిన ఒక ప్రధాన పద్ధతి. దీని వలన శీర్షికను బట్టి, కవిత్వారంభ వాక్యాలను బట్టి కవితాఖండికలోని ప్రధాన వక్తవ్యాంశం బోధ పడక పోయేది. ఆ తర్వాత క్రమంగా ఈ రకమైన కవిత్వ నిర్వహణ ధోరణి మారింది. వస్తు పరిధులు దాటకుండా, ఆ వస్తువుకు సంబంధించిన పలు అంచులను స్పృశిస్తూ, లోతుల్లోకి వెళ్ళి, తాత్త్వికంగా భాషించడం మూడవ దశ కవితలలో గమనిస్తాం. ఒక సంఘటన, సన్నివేశం, ఒక స్వల్ప మానసిక సంచలనం లాంటి వాటిని ఒకటి రెండు భావ చిత్రాలతో లఘు కవితలుగా మలచడానికి వెనుకాడక పోవడం ఈ మూడవ దశలోని మరో ప్రత్యేకత. *భారమితి, మోహనా ఓ మోహనా, అజేయం* సంపుటులలో ఇలాంటి లఘు కవితలు అత్యల్పం. దీనికి నిర్దిష్టంగా ఇదీ కారణమని చెప్పడం కష్టం. ఆయన వ్యక్తిగత జీవితంలోని అనూహ్య పరిణామాలు, నాటి ఆయన మానసిక స్థితి, ప్రేక్షక శ్రోతల కంటే పాఠకులే కవి దృష్టిలో ఉండడం, ఏకంసత్ అన్నట్లు సత్యం ఒక్కటే కాదని, స్థల కాల సమయ సందర్భాల ననుసరించి, సత్యానికి కూడా రూప భేదాలుంటాయన్న ఎరుక, మొదలైన కారణాల ప్రభావంతోనే మూడవ దశలో లఘు కవితల *(అంతర్జనం* తో సహా) సంఖ్య పెరిగిందని భావించవచ్చు. రెండవ దశలోని కవితలతో పోల్చుకుంటే మూడవ దశలోని కవితల పాద విభజనారీతిలో, పాదాల

కూర్పులో సమూలమైన మార్పులు గుర్తించదగినవి. ఎంత హార్దిక తాదాత్మ్య స్థితిలో, ఎంత హృదయైక గమ్యమైన అంశం చెబుతున్నా, ఆయనలో ఎప్పుడూ బౌద్ధిక విశ్లేషణా దృష్టి, తార్కిక ధోరణి సమాంతరంగా కొనసాగుతుంటాయి. ఒక అంశాన్నో, దృశ్యాన్నో, సమస్యనో వర్ణించేటప్పుడు హార్దిక దృష్టితో పోలికలను పేర్చుకుంటూ పోతాడు.

వెంట వెంటనే అంతస్సూత్రాలను, మూలాలను అన్వేషించే మేధోస్థాయి లక్షణాలను ప్రతిఫలించే పోలికలను సమాంతరంగా కూరుస్తుంటాడు. దీనివల్ల చాల కవితలలో క్లుప్తత కంటే విస్తరణ ఎక్కువగా కనిపిస్తుంటుంది. అలాగే చాల కవితలు హృదయానికి, (ఆలోచనాశీలుర) మేధకు ఏకకాలంలో తృప్తి కలిగిస్తాయి. ప్రతి అనుభవాన్నీ సగటు మనిషిలా స్వీకరిస్తూనే, ప్రతి సంఘటనలోనూ సంలీనమవు తూనే, ఎక్కడికక్కడ ఎప్పటి కప్పుడు మెలకువగా ఉండడం, బుద్ధి పూర్వకంగా సచైతన్యంగా వ్యవహరించ గలగడం బహుశా ఆయన వ్యక్తిత్వంలోని ప్రధాన అంశం. ఇదే ఈ విశ్లేషణాత్మకతకు మూలంగా భావించవచ్చు. శివారెడ్డి కవిత్వం ఎంత సంశ్లేషణాత్మకమో, అంత విశ్లేషణాత్మకం.

తెల్లవారుఝాము నుంచే వీధులు ఊడ్చే శ్రామికులు ఒక చోట చేరి చాయ్ తాగటం, ట్రాఫిక్ జామ్, తన కర్ర కాళ్ళను తలకింద పెట్టుకొని పడుకున్న కుంటివాడు, స్కూటీ గుర్రాల మీద పయనించే విద్యార్థినులు, ఉద్యోగినులు, ఇరానీ హోటళ్ళ కోలాహలం – ఇలా ఉద్ధృత నగర జీవన ప్రవాహ దృశ్యాలనూ, సమస్త దృశ్యమాన ప్రపంచాన్నీ, ఆంతరంగిక కల్లోలినిలోని అన్ని ఆటు పోట్లను అక్షర చిత్రాలుగా మలచాలన్న ఆరాటం ఈ కవిలో కనిపిస్తుంది.

"...Politics became part of my poetry and my life. In my poems I could not shut the door to the streets, just as I could not shut the door to love, joy or sadness in my young poet's heart." (Memories, P.53). అనే నెరూడా మాటలు శివారెడ్డికీ వర్తిస్తాయి.

ఈ కవి ఎప్పటికప్పుడు తన శైలిని తానే ప్రయత్న పూర్వకంగా మార్చుకుంటూ వస్తున్నాడు. విమర్శకుల అభిప్రాయాలను గమనిస్తూ, సహేతుకమైన నిష్పాక్షికమైన విమర్శలను పట్టించుకుంటూ, ఎప్పటి కప్పుడు ఆత్మ విమర్శా పూర్వకమైన సాధనతో శివారెడ్డి తన కవిత్వ రచన కొనసాగిస్తూ వస్తున్నాడు. శైలి, వ్యక్తీకరణ, నిర్వహణ పద్ధతులు, కవితా ఖండిక నిర్మాణ శిల్పం ఇత్యాది అంశాలలో మూస ధోరణులను అధిగమిస్తూ, ఏకనాదతను (Monotony) పరిహరించుకుంటూ పయనిస్తున్న నిరంతర కవిత్వ యాత్రికుడు శివారెడ్డి. ఈయన వచన కవితా ఖండిక నిర్మాణ శిల్పంలోను అనంత వైవిధ్యాలను ప్రదర్శించాడు.

సుమారు నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రంలోని, రాష్ట్రేతర ప్రాంతాలలోని సాహిత్య సంస్థలతోమమేకమై, ఆయా సంస్థల సాహిత్య కార్య క్రమాలలో పాల్గొంటూ నిరంతర సంచారకవిగా జీవిస్తూ, తాను సంచరించిన ప్రతిచోటా ప్రగతిశీల సాహిత్య బీజాలు చల్లుకుంటూ తన కవిత్వానికి అనుభవ వైవిధ్యాన్ని, పరిపుష్టిని సమకూర్చుకుంటూ సాగుతున్న కవి శివారెడ్డి.

ఆదర్శాలకు, ఆచరణకు మధ్య వైరుధ్యం లేకపోవడం కూడ ఆయన కవిత్వానికి అదనపు శక్తిని చేకూర్చింది. సుదూర భవిష్యత్తులో కవిత్వ పరిశీలనలో కవి వ్యక్తిత్వం ఒక ప్రమాణం కాకపోవచ్చు. కాని సమకాలంలో కవి వ్యక్తిత్వం అతని కవిత్వంలోని విలువలకు విశ్వసనీయతను పెంచుతుంది.

మిగిలేదే చరిత్ర, మనేదే కవిత (అజేయం) అన్నట్టు కాల ప్రవాహవేగాన్ని తట్టుకొని నిలువగలగడం కవిత్వ మహత్త్వానికి, ఒక ప్రమాణమని నేననుకుంటాను. ఆయన చాలా కవితలకు ఈ జీవలక్షణముంది.

జీవితం బహుముఖీనమైనదన్న తెలివిడితో జీవితానికి, సమాజానికి సంబంధించిన అన్ని కోణాల్ని తన కవిత్వంలో ప్రతిఫలింప చేయటానికి ప్రయత్నిస్తున్న కవి శివారెడ్డి. వస్తు నిర్వహణల పరంగా శివారెడ్డి నిత్య అన్వేషి. నిత్య ప్రయోగశీలి.

"The true artist learns all the time... all from life itself, which constantly sets him new *tasks* and makes him search for new means and devices of expression." - *E.S. Gromov*

- Marxist Leninist Aesthetics and the Arts. P.208.

---

పెన్నా శివరామకృష్ణ,
హైదరాబాదు,
ఫోన్ : 9440437200

# తెలుగు పలుకుల పూదోట - యశస్వి యస్వీ

- చెన్నరాయ

మాటలకు "రంగు, రుచి, వాసనలున్నాయని" కృష్ణశాస్త్రి గొంతుతో భావకవితా యుగం సూత్రీకరించింది. ఆ అందాలను వచనంలో విరబూయించడానికి ఆచంట జానకిరామ్ మార్గదర్శనంలో, ఆకాశవాణి ప్రసంగ మాలికల కొత్త దారులు పరిచింది. "అప్పుడు పుట్టి ఉంటే" అన్న కృష్ణశాస్త్రితో పాటు నాటి భావకవితా ప్రముఖులందరూ, ఆ ప్రసంగాల పేరిట తెలుగు వచన మాగాణంలో కొత్త కొత్త పూదోటలు వేసి పండించారు. తెలుగు బాలను "తారుణ్యోజ్జ్వల రాజకుమారి" గా తీర్చిదిద్దారు. కృష్ణశాస్త్రి గుండెకు వారసుడిగా, ఆ అందాల రాకుమారి విహారానికి తానూ ఓ మల్లె పూదోటను పెంచిన యశస్వి యస్వీ.

యస్వీ అంటే కావలిలో తెలుగు ఆచార్యులుగా, కళాశాల ప్రాచార్యులుగా పనిచేసి, తెలుగు జగత్తులో కావలికి ఓ కొత్త గౌరవాన్ని కూర్చిన వారు **యస్వీ భుజంగరాయ శర్మ**గారు. అప్పట్లో కావలి అంటే ఇద్దరే. యస్వీ భుజంగరాయశర్మగారు, కె.వి.రమణారెడ్డి గారు. (వారు అక్కడ ఉండడానికి కారణమైన కావలి నవ సాంస్కృతిక నిర్మాత డి.ఆర్. గారి విషయం వేరు). పై ఇద్దరూ రెండు భిన్నభావ జాలాల ప్రతినిధులైనా తెలుగును నిండుగా పండించడంలో ఇద్దరికిద్దరూ సమానమే. అయితే రవీంద్రుని *విశ్వభారతి* లా *విశ్వోదయ* సంస్థను నిర్మించడంలో డి.ఆర్.(దొడ్ల రామచంద్రారెడ్డి) గారి సంకల్పానికి ప్రేరణ యస్వీ గారు కావడం వల్లనైతేనేమి, ఆయన లలితకళాభి నివేశం వల్లనైతేనేమి ఆప్తులు ఆయన్ని ఆత్మీయంగా విశ్వోదయ రవీంద్రులని పిలుచుకొనేవారు. ఆత్మీయుల మనస్సుల్లో ఆయన అలాటి గురుదేవులు గానే నిలిచిపోయారు. అలాటి గౌరవం ఒక్క మాతృభాషను బోధించే మాష్టారే, ఆయనలో భావుక సౌందర్య సౌజన్యముంటే, దక్కించుకోగలరన్న మాటకు దృష్టాంతంగా నిలిచిపోయారు.

* * *

72లో ... మద్రాసు వాణీమహల్ లో కృష్ణశాస్త్రి కవితా స్వర్ణోత్సవపు వేడుకలు ... చివరి రోజు ... అంతకు మునుపే ఎస్. రాజేశ్వరరావు మధురాతి మధురంగా 'ఎంత హాయి ఈ రేయి నిండెనో' అనిపాడి, పగలే పూయించిన సిరివెన్నెల మేఘ మాలికల్లో, చెంపల పైన, పక్కల్లో చెదరిపోతున్న ఉంగరాల వెండి జుత్తుతో, చివరగా కృతజ్ఞతలు 'చెప్పడానికి' తడికళ్ళతో నిల్చున్న కృష్ణశాస్త్రి... ఆ పక్కనే ఆ గొంతును అనువదించడానికి నిల్చున్న నిలువెత్తు మేఘ గంభీర స్వర మూర్తి భుజంగరాయశర్మ గారు... జీవితంలో మరచి పోలేని మహాద్భుత ఘట్టాలలో అదొకటి... శర్మగారి మధుర గంభీర ప్రసంగ శైలి అప్పటికే తెలుగునాట అంతటా సుప్రసిద్ధం... అయితే... నిజం చెప్పొద్దూ, శర్మగారి గొంతు ఎంత రసార్ద్రవంతమైనదైనా, కృష్ణశాస్త్రిగారి నాటి తడికనుల తళుకు పలుకులు ధ్వనించడానికి సరిపోలేదు.

* * *

"నేలమీద నడుస్తున్నా కాళ్ళకు రెక్కలున్న మనిషిని ఎక్కడైనా చూశారా మీరు?

వెన్నెలకడలిలో తెరచాపలెత్తిన కలలు తూగుతూ ఊగుతూ సాగిపోవటం ఎవరి కళ్ళల్లోనైనా చూచారా?

బ్రతుకంటా ఎడతెగని దారంట పలుకుతూ పలకరిస్తూ పాడుకొంటూపోయే వింతబాటసారిని చూచారా?

చూచివుంటే కృష్ణశాస్త్రిగారిని సులభంగా గుర్తు పట్ట గలరు."

"నిత్య పథికులు కృష్ణశాస్త్రిగారు" అనే ఆకాశవాణి ప్రసంగంలో శాస్త్రిగారి మూర్తిమత్వాన్ని పరిచయం చేస్తూ శర్మగారు పేర్కొన్న ప్రారంభ పంక్తులు ఇవి. చిన్న ప్రసంగ వ్యాసమే అయినా కృష్ణశాస్త్రి గారి కవితా వ్యక్తిత్వంలోని రెండు దశలను *కాల్పనికోద్యమం, మానవోద్యమం* ప్రభావితం చేసిన రెండు దశలను సమగ్రంగా పరిచయం చేశారు శర్మగారు. కృష్ణశాస్త్రి పై సమగ్ర సంక్షిప్త వ్యాసమంటే ఇప్పటికీ ఇదే.

ఇంతకన్నా శాస్త్రిగారిబొమ్మను ఏ చిత్రకారుడు రంగులద్ది చిత్రించగలడు. శర్మగారే ఒక మాటను పరిచయం చేస్తారు- ''వాక్చిత్రం'' అని. అలాటి వాక్చిత్రమిది. "ప్రాణవిభుని కలుసుకోడానికి తలిరు తోరణంగా, సుమదామంగా మారి సాగిపోయే" ఆ నిత్య పథికుణ్ణి కళ్ళుమూసుకొని దర్శించుకొనే భావనాశక్తి మనకుంటే చాలు, ఎంత అద్భుతంగా దర్శనమిస్తాడు ఆ అజరామర కవితాసుందరమూర్తి!

భుజంగరాయశర్మగారి అద్భుతమైన శైలికి, సుకుమార మైన పదాలతో చిత్రించే సుందర భావాలకు, భావనామయ వచన రచనకు, వాక్చిత్రాలకు ఈ పంక్తులు ఓ చిన్న ఉదాహరణే.

* * *

తమ గురుదేవులు పింగళి లక్ష్మీకాంతం గారూ, గురుదేవసములు కాటూరి వేంకటేశ్వరరావుగారూ అంటే అమితమైన భక్తి. వారి మహత్తర కావ్యం సౌందరనందమంటే కూడా అంతే భక్తి. దాన్ని మరో ప్రసంగంలో పరిచయం చేసిన తీరు చూడండి :

"అనగనగా రెండు చిలకలు, ఆడా, మగా...

ఆ చిలకల మనస్సుల్లో రాగ పంజరాలున్నాయి. ఆ పంజరాలు బలంగా అవే కట్టుకొన్నాయి... ఆ పంజరాల్లోనే తమకు స్వేచ్ఛ వుందనుకొన్నాయి. వుందనుకొని ఒకదాని పంజరంలో ఒకటి వుండిపోయాయి...

లోపల పంజరాలుండే చిలకల్నీ, పంజరాల్లోపల వుండే చిలకల్నీ (*సుందరీనందుల్ని) పట్టుకుపోయి, రెక్కలిచ్చి, అవి సహజంగా తిరగవలసిన ఆకాశంలోకి వదిలేందుకు కపిలవస్తు పురానికి వచ్చిన గౌతమబుద్ధుడు ఈ కథకు సూత్రధారుడు.

పంజరంలో స్వేచ్ఛలేదు.

ఆకాశానికి చెర వుండదు.

పంజరపు చెర వైయక్తికమైన ప్రేమ. ఆకాశపు స్వేచ్ఛ విశ్వమానవీయమైన కరుణ.

ఈ చెరలోంచి ఆ స్వేచ్ఛలోకి ఎగరటం - ఈ ప్రేమలోంచి ఆ కరుణలోకి ఎదగటం.

ఇది మానవతకు సహజమైన పరిణామం. ఈ పరిణామమొక్కటే నిర్వాణానికి దారి..."

సూటిగా, సంక్షిప్తంగా బౌద్ధధర్మంలోని జీవశక్తిని ప్రస్తావించిన పంక్తులివి. గాఢమైన భావుకత ఉంటే తప్ప చక్కటి విమర్శ రాదనటానికి, అప్పటికి కాని విమర్శ ఓ మౌలిక సాహిత్య ప్రక్రియగా రాణింపు పొందలేదనటానికి ఈ మాటలు గొప్ప ఉదాహరణ. కవితాత్మకమై, అపారంగా అభిమాన శ్రోతలను సంపాదించి పెట్టిన, ఇలాటి భావుక ప్రసంగాలు ఎన్నెన్నో, ఎందరిమీదో... వాల్మీకి, కాళిదాసాదు లతో మొదలు, పెద్దన వరూధిని, తిమ్మన సత్యనూ వెంట బెట్టుకొని, ఎంకీ మధురవాణిలను చిత్రంగా ఎదురెదురు నిలిపి, ఒకప్పటి తన రూమ్మేటు ఆత్రేయ పద్యరచన సౌరభాలను తొలిసారిగా లోకానికి పరిచయం చేసేదాకా ఎన్నెన్ని పందిళ్ళ కిందికి తీసుకు వెళ్తారు తన ప్రసంగాల పూదోటలో శర్మగారు!

* * *

తెలుగులో వెలసిన బౌద్ధ సాహిత్యంలో మణిపూసలాటిది, శర్మగారి నృత్య రూపకం, *చండాలిక*. ప్రాయికంగా ఇది రవీంద్రుని రచనకు అనుసరణ. అనువాదం కాదు. "రవీంద్ర కవితాగళ మాలిక *చండాలిక!* కవీంద్ర మధురోహాడోలిక *చండాలిక!*" అని శర్మగారే మధురంగా ప్రస్తుతించారు. దాహార్తిని తీర్చమని బుద్ధుని ప్రథమ శిష్యుడైన ఆనందుడు ఓ రోజు ఓ చండాలికను అభ్యర్థిస్తాడు. తొలిసారిగా తన్నూ ఓ మానవిగా మన్నించిన ఆ బుద్ధగురువు పట్ల అమితారాధన నెలకొంటుంది ఆ అమాయక బాలకు. ఓ అభవోపాసిక సాయంతో ఆనందుని మాయాజాల బద్ధుని చేసి రప్పించుకొన్నా, వెంటనే తన అపచారం గుర్తెరిగి పశ్చాత్తాప తప్తురాలవుతుంది.

**"అనుతాపము కన్న వేరు**
**అనుగ్రహము లేదు తల్లి!**
**పరితాపాశ్రువులే పాప**
**పరిమార్జన చేసెనమ్మ"** అంటూ...

ఆమె కోర్కె మేరకే బౌద్ధధర్మదీక్షనిస్తాడు ఆనందుడు.

**"ప్రియహిత సుత నిహితమ్మై**
**వ్యయమైపోయెడు ప్రేమము**
**అఖిలభూత నిహితమ్మై**
**అవ్యయమలమ్మగు**
**ఇదె నిర్గతి యని తెలిసె / ఇదె నిర్వృతి యని తెలిసె"**

అంటూ... బౌద్ధధర్మ అంతశ్శక్తిని ఆత్మగతం చేసుకొంటుంది ఆ రాగమాలిక.....

అందంగా, అతిసహజంగా పడే అనుప్రాసలతో, రచనలోనే చక్కటి సంగీతగుణం రవళిస్తుండగా, కనుల ముందు నృత్య భంగిమలను సాక్షాత్కరింపచేస్తూ సాగుతుంది ఈ నృత్యరూపకం. శర్మగారి నృత్యరూపకాలన్నీ ఇలాటివే. తొలికూచిపూడికి చేరువలో జన్మించిన వీరికి బహుశ ఈ కళ జన్మసిద్ధమేమో! అందుకే కూచిపూడికి కొత్త కళాకాంతులిచ్చిన డా. వెంపటి చినసత్యం గారు కోరి కోరి వారి చేత కొత్త రూపకాలను రాయించుకొని కొంగ్రొత్త ప్రయోగాలను అలా చేశారు! వారిద్దరి సహయోగంతో అవతరించిన *చండాలిక, శ్రీ కృష్ణ పారిజాతం, పద్మావతీ శ్రీనివాసం, అభిజ్ఞాన శాకుంతలం, అర్ధనారీశ్వరం* మొదలైనవి రెండున్నర దశాబ్దాల పైబడే కూచిపూడి నృత్యరంగాన్ని దేశదేశాంతరాలలో జనప్రియం చేశాయి... వివిధ దేశాలలో శ్రీ కృష్ణపారిజాతం రెండువేల పర్యాయాలు ప్రదర్శింప బడిందంటే అది శర్మగారికి, చినసత్యం గారికి, శోభానాయుడు గారికి కాదు, తెలుగువారికి గర్వకారణం!

* * *

**"ఏ కొండ కొమ్ముపై ఎపుడు రాలినదో**
**తొలికారు గుండెలోతుల నుండి చినుకు!"**

ఇది ఎత్తుగడ. లలిత భావగీతిలాటి ఎత్తుగడ...

**"అభ్రంకషమ్ము శీతాచల మ్మెవ్వాని**
**మేటి స్థైర్యమున కామ్రేడితమ్ము..."**

ఇది ముగింపు సీసంపు బిగింపు...దేనికి?

**"అతడు గాంధి, అతడు నేత, అతడు త్రాత"**

శిల్పమంటే ఇది. ఆధునిక మనోజ్ఞ కవితాశిల్పమంటే ఇది.. లాలిత్యం పాటయై, ప్రౌఢిమ పద్యమై సమసించిన భావకవితా యుగ శిల్పమంటే ఇది. శర్మగారు దానికి వారసులు కావడమే కాదు, దానికి కొత్త నగిషీలు చెక్కారు. పద్యాన్ని ఎంత గౌరవించారో, పాటని అంత ప్రేమించారు. సంప్రదాయ సాహితిని ఎంత పూజించారో, జానపద సాహిత్యాన్ని అంత ఆరాధించారు. కృష్ణశాస్త్రి గుండెను ఎంత కైవసం చేసుకొన్నారో, శ్రీశ్రీ మేధను అంత స్వంతం చేసుకొన్నారు. ప్రేమనూ, కరుణనూ రెండుకళ్ళుగా చేసుకొని నిండుమనిషిగా జీవించారు. ఆ రెండూ లాలిత్యం, ప్రౌఢిమలుగా, పాటా పద్యాలుగా, రూపం మార్చుకొని, ఆయన సాహిత్య శిల్పాన్ని శాసించాయి. గాంధీ పైని పై ఖండికలోని పంక్తి "వాసంతమంజరీ వైభవమ్మెవ్వాని పలుకు మెత్తన కనుప్రాసయుక్తి" అక్షరాలా ఆయన శైలికన్వయించే మాటే! అది అరవిందుల మీద రాసిన లఘు కావ్యమైనా, జానపద బాణీలో అసంఖ్యాకంగా కూర్చిన 'సంకురాతిరి, ఉయ్యాలో' పాటలైనా, ఠాగోర్ కి ప్రియాతి ప్రియమైన స్త్రీ 'విక్టోరియా ఒకేంపో' రాసిన ఆరాధనా లేఖల అనువాదమైనా ఆ మంచు బిందువుల శైలిలో తడిసి ముద్దయి పోవాల్సిందే! 'ఎన్ని సొగసుల మూట ఈ తెలుగు పాట!' అన్న ఆయన పాటనే గొంతెత్తి పాడుకోవాలనిపిస్తుంది! నిత్యం తెలుగు నాట నినదించాల్సిన ఆ పాట ఎందుకో ఎక్కడా వినిపించకుండా వుంది. ఎంత వారికైనా పోషకత్వ మేనేమో నికషోపలం! లేకుంటే, "ఇంతేరా ఈ జీవితం, తిరిగే రంగుల రాట్నమూ" అంటూ బి. ఎన్. గారి 'రంగులరాట్నం' సినిమాకు అంత గొప్ప ప్రజాదరణ పొందిన తాత్త్వికగీతాన్ని అందించిన లలితభావుకుడు ఆ ఒక్క పాటతోనే ఆగిపోవడమేమిటి?

* * *

ఇరవై శతాబ్దం పారంభం నుండి, అరవైల ఆఖరుదాకా, స్వాతంత్ర్య స్పృహ మొదలై, పొందిన స్వాతంత్ర్యం పిల్లిమొగ్గలు వేసేదాకా, అదొక సాంస్కృతిక పునరుజ్జీవన యుగం. బుద్ధుణ్ణి రీడిస్కవర్ చేసుకొన్నయుగం. తెలుగునాట స్వాతంత్ర్యానంతరం ఆ సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమంలో ఓ భాగంగా వెలసి, తనకంటూ ఓ చరిత్ర సృష్టించుకొన్నది కావలి విశ్వోదయ సంస్థ. దాని నిర్మాత డి.ఆర్., స్ఫూర్తి స్వర ప్రదాత యస్వీ. ఆ స్వరం చిలికించిన తేనె తెనుగు పలుకు సోనలను, ఇంతకు మునుపొచ్చిన సంపుటాలతో కలిపి, సరికొత్తవాటిని కూర్చి, జ్ఞాపకాలను చేర్చి ఆయన శిష్యులు,మిత్రులు, అభిమానులు 'యస్వీ భుజంగరాయశర్మ సంపూర్ణ రచనలు' పేరిట రెండు సంపుటులుగా, ఎమెస్కో నుంచి పరమ సుందరంగా, వెలలో సరసంగా ఇటీవలే వెలువరించారు. తెలుగు పలుకుల మేలి చిన్నెలు తెలుసుకోవాలనుకొనే వారికి, చక్కటి శైలి అంటే ఏమిటో పాఠంగా చదువుకోవాలనుకొనేవారికి, ఒకనాడు సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాషాధ్యాపకులెంత మహత్తర పాత్ర పోషించారో గ్రహించాలనుకొనే వారికి ఇవి అవశ్యం దాచుకోదగ్గ మంచి సంపుటాలు. ఖ

చెన్నరాయ,
హైదరాబాదు,
ఫోన్ : 9441809566



# భారతీయ సంస్కృతి
## పరిణామ క్రమాలు

– గొల్లపూడి మారుతీరావు

చరిత్ర, కాలం రాసుకున్న ఆత్మకథ అన్నారెవరో. కాలం చేతనున్న కలం సంస్కృతి అంటాను నేను. కాలం రాస్తున్న కాగితం కళ. కాలం దస్తూరీ సంప్రదాయం. ఇది చాలా ఆలోచనతో చేసిన అన్వయం. వ్యక్తికీ వ్యక్తికీ దస్తూరీ మారుతుంది. సంప్రదాయ సరళీ అంతే. కాగితం నిక్షిప్తమవుతుంది. పాత బడుతుంది. పాడుబడదు. రచన చేసే కలం అతి ముఖ్యమయింది– సంస్కృతి. అన్ని రంగాల మేళవింపు సంస్కృతి. సాహిత్యం, సంగీతం, శిల్పం, వృత్తులు, జానపద కళలు, జీవన విధానాలు, నైతిక విలువలు, సమిష్టి జీవనం – అన్నిటి సమగ్ర రూపం సంస్కృతి. ఇందులో మానవ సంబంధాలు, వనరులు, నీటిపారుదల, సామాజిక స్పృహ, నిబద్ధత, న్యాయ వ్యవస్థ ఒకటేమిటి? జీవన యోగ్యం చేసే అన్ని పార్శ్వాల విశ్వరూపం –సంస్కృతి.

మా మిత్రుడు ఎన్.ఆర్. నందితో నేనెప్పుడూ తగాదా పడేవాడిని – అతని నాటకం మరో మొహంజొదారో గురించి. ఒక వ్యవస్థలో నైతిక పతనానికి సంబంధించిన ఇతివృత్తమది. కాని శీర్షిక ఒక సంస్కృతికి సంబంధించినది. అదిన్నీ శిథిల సంస్కృతి కాదు. మొహంజొదారో, హరప్పా, పాంపే ఆనాటి ఉజ్జ్వలమైన సంస్కృతీ వైభవానికి ప్రతీకలు. వాటి శైథిల్యానికి కాదు. శంకరాచార్య, రామకృష్ణ పరమహంసని జీవిత అశాశ్వతత్వానికో, మృత్యువుకో అభిజ్ఞులుగా ఉదహరించం. ఒక గొప్ప సందేశానికీ, ఒక ఉద్యమ ఔన్నత్యానికీ, ఒక సిద్ధాంత ప్రభుత్వానికీ సారథులుగా ఉదహరిస్తాం. వెనకటికి కప్పల తక్కెడగా ఉన్న ఓ ఇంటి కథకి *వియత్నాం వీడు* అని పేరు పెట్టారు. మా మిత్రుడొకాయన బాధపడ్డాడు. “అయ్యా, వియత్నాం ఒక సామ్రాజ్యవాదుల దౌష్ట్యానికి, వారు సృష్టించిన అవ్యవస్థకి కాదు, 23 సంవత్సరాలు ఆ దౌష్ట్యాన్ని తట్టుకుని తమ అస్థిత్వాన్ని నిలుపుకున్న వియత్నాం దేశం resilienceకి ఉదాహరణగా చెప్పుకోవాలి” అన్నాడు. నిజం Taj Mahal represents the genius of that period, not its decay.

ఓ పెద్దాయన – మహా పండితుడు నన్ను సాగనంపడానికి తన ఇల్లు దాటి చాలాదూరం నడిచి వస్తున్నాడు. నేను ఇబ్బంది పడి ‘ఇక మీరు ఆగండి’ అన్నాను. ఆయన నవ్వి “ఆత్మీయుల్ని చెమ్మ ఉన్న చోటు వరకూ సాగనంపాలి. పదండి” అన్నాడు.

ప్రపంచ చరిత్రలో మానవుడి వలసలన్నీ నీటి వనరుకి సమీపానే ఏర్పాటు చేసుకున్నాడు. ఏ చిన్న గ్రామమయినా ఏదో ఓ చిన్నపాటి వనరు సమీపానే వెలుస్తుంది. అలనాడు కణ్వుడు తను పెంచిన శకుంతలని అత్తారింటికి పంపుతూ– ఆశ్రమ ద్వారం దగ్గర దాకా కాక, నదీతీరం దాకా వచ్చి సాగనంపడంలో ఉద్దేశ్యం ఇదేనేమో. జీవాశ్రయం ఆత్మీయుడికి అందిందని రూఢి చేసుకున్నాక హితుడు ఆగిపోవచ్చునట. ఇవి సంస్కృతీ వైభవాన్ని చాటే ప్రతీకలు. మనకి చాలా తెలీవు. సుఖం ఏమిటంటే తెలియవన్న విషయం తెలియక పోవడం. ఇంకా సుఖం ఏమిటంటే తెలియక పోవడం వల్ల మరేం నష్టం లేదన్న ధీమా తెలుసు.

మధ్యధరా సంస్కృతికి తూర్పున ఉన్న కొన్ని దేశాలలో– తేలికగా చైనాను కూడా కలుపుకొని పరిశీలిస్తే – సంస్కృతీ వైభవానికి పెద్ద పీట భారతదేశానిదే. కారణం – ఆయా కాలాలలో మానవ జీవన వికాసానికి అవసరమైన, చైతన్య వంతమైన జీవితానికి ఆలంబన కాగల ఎన్నో మెలకువలనూ, పరిణతులనూ ఆయా దశలలో జాతి కనుగొంటూ, కలుపుకొంటూ ముందుకు సాగడమే This is a highly evolving civilization.

వీపు గోక్కోవడం అతి ప్రాథమికమైన పని. అందని భాగంలో సుఖంగా గోక్కోడానికి కర్రకి చిన్న కుచ్చు – ఆ మాత్రపు తెలివితేటలకి, అవగాహన, అవసరానికి – మనిషి ఏర్పరుచుకున్న సౌకర్యానికి – మించి కుశాగ్రతకి నిదర్శనం. ఆ కుచ్చుని జపాన్, సైబీరియాల్లో దొరికే అతి లలితమైన సున్నితమైన సేబుల్ అనే జంతువు వెంట్రుకలతో చేసుకోవడం పరిణతికి ఉదాహరణ. మరో పై మెట్టు.

ఇటలీలో నేపుల్స్ సమీపంలో వెసూవియస్ అనే అగ్ని పర్వతం బద్దలు కావడం వల్ల లావా ఓ భూస్థాపితమైన పాంపే పట్టణం 1500 సంవత్సరాల తర్వాత బయట పడింది. నేను స్వయంగా చూశాను. సమిష్టి జీవనంలో మనిషి తన బతుకుని సుగమం చేసుకునే పరికరాల దగ్గర్నుంచి, గృహనిర్మాణం దగ్గర్నుంచి, నీటి సరఫరా కాలువల్నీ, స్నానాల గదుల్నీ ఏర్పరుచుకున్న మొదటి శతాబ్దపు రోమన్ సామ్రాజ్య సంస్కృతీ వైభవం అది. ఒక మొహంజొదారోలో 4500 సంవత్సరాల నాటి సింధు నాగరకత వైభవం, ఆనాటి శిల్పకళా చాతుర్యం తెలుస్తుంది. ఈజిప్టు, మొసపటేమియాలలో 35 వేల మంది నివసించిన గ్రామ సమూహాలు, మట్టి కట్టడాలూ, ధాన్యం గోదాములూ, తెలుస్తాయి.

వీటన్నింటి కంటే భారతీయ సంస్కృతిని ఒక మెట్టు పైన నిలబెట్టడానికి కారణం ఏమిటి? నాకు తెలిసి – 'దేవుడు', అనగానే చాలా మంది భుజాలు తడుముకోవచ్చు. నేను చెప్పేది నల్లనివాడు పద్మనయనమ్ములవాడో, భుజంగధారీ, ఝటాజూటధారీ – మరెవరో మరోవరో కాదు. ఈ 'దేవుడు' మనం అలవాటు పడిన ఇప్పటి renominational దేవుడు కాదు. చాలా శతాబ్దాల లజ్జు గుజ్జుల తర్వాత క్రమంగా compartmentalise అయిపోయిన దేవుళ్ళు వీళ్ళు. నేను చెప్పే దేవుడికి మరో పేరు 'విశ్వాసం'. అలోచనకి అందని, అవగాహనకి లొంగని శక్తి.

సంస్కృతిలో తొలినాటి దేవుడు – మానవ జీవనానికి ఆధారమైన ప్రాథమిక ప్రాణశక్తి. అగ్ని జీవనాన్ని ఏమాత్రం జీవన యోగ్యం చేసుకోవాలన్నా అవసరమైన శక్తి ఇది. ఎక్కడ దొరుకుతుంది? ఎక్కడయినా దొరుకుతుంది. ఏ నిత్యాగ్నిహోత్రుని ఇంటికి వెళ్లినా అగ్ని సిద్ధంగా ఉంచుకుంటాడు.

కాల పరిమితి తెలియని అతి ప్రాచీనమయిన ఋగ్వేదంలో 10 మండలాలలో, 1128 సూక్తాలలో సుమారు 50 శాతం అగ్నిహోత్రం ప్రసక్తే ఉంది It is the elemental force for the earlier man. It was his God.

**"అగ్నిమీలే పురోహితం యజ్ఞస్య దేవ మృత్విజం హోతారం రత్న ధాతమం"**

అందరి క్షేమం కొరకు అగ్నిని ప్రార్థించుచున్నాను – అంది ఆనాడు వేదం.

(గమనిక : ఇవన్నీ తెలిసి చెప్తున్న విషయాలు కావు. తెలుసుకుని చెప్తున్నవి. నా ఆలోచనలను సమర్థించుకునే ఆధారాలను వెదుక్కుని పొందుపరిచినవి)

ఇది స్వానుభవంతో మానవుడు ఏర్పరుచుకున్న విశ్వాసం. తనకు తెలియని – తన అదుపులో లేని శక్తి. అది. చీకటి వెనక – కేవలం ఆలోచనలో మెరిసే గుర్తు. శతాబ్దాలు గడిచాక ఆలోచన అవగాహన బాగా సానదేలాక – పోతనగారు అద్భుతంగా వివరించారు. 'లోకంబులు లేకోశులు లోకస్థులు తెగిన తుది నలోకంబైన పెంజీకటి కవ్వల ఏకాకృతి వెలిగే వెలుగు'. విశ్వాసం అద్భుతమైన కళగా, కవిత్వంగా రూపు దిద్దుకున్న దశ ఇది. ఆలోచనకి నగిషీపట్టి, చిలవలూ పలవులూ అల్లుకుని, అపురూపమైన రూపం ఇచ్చిన glorious మజిలీ ఇది. కప్పదాటు వేస్తున్నాను. మన్నించండి.

ప్రాథమింకంగా reflexes తో మాత్రమే జీవించే మానవుడికి – ఆలోచనతో అన్వయించుకోగల 'విశ్వాసాలు' అవసరమయ్యాయి. అవి చాలు అతని జీవికకి. అటు పక్క బూచాడు ఉన్నాడు. అంటే పసివాడు చీకట్లోకి వెళ్లడు. ఈ అన్నం తింటే ఆకాశం మీంచి చందమామ దిగివచ్చి నిద్ర పుచ్చుతాడు అంటే పసివాడు నమ్ముతాడు. ఎదురు చూస్తాడు. చెప్పే అమ్మ మీద విశ్వాసం. 'చెప్పడం' లో సమస్యలకి పరిష్కారం లేదు. నమ్మడంలో ఉంది. అమ్మకీ తెలీదు – మొన్న మొన్నటిదాకా ఆకాశంలో ఉన్న చందమామ – నీరూ, ప్రాణ వాయువూ లేని భయంకరమైన గ్రహమని.

శతాబ్దాలుగా 'దేవుడు' అనే విశ్వాసాన్ని – అద్భుతమైన muse గా హిందూదేశం చేసినంత విస్తృతంగా మరే దేశమూ – కాదు – మరే మతమూ – కాదు మరే సంస్కృతీ చెయ్యలేదు. చెయ్యలేదు కూడా. అందుకే ఈ సంస్కృతికి ఇంత విస్తృతి. ఇంత సాంద్రత. ఇంత resilience. నేను

గుళ్ళల్లో దేవుళ్ల గురించి మాట్లాడడం లేదు. మన జీవనంలో సర్వే సర్వత్రా అన్ని రకాల వ్యావృత్తులలోనూ అల్లుకుపోయిన omnipotent, omniscent శక్తి మాట నేను చెప్పేది. సంస్కృతీ వికాసానికి ఆలవాలమయిన 'దేవుడు' గురించి నేను మాట్లాడుతున్నాను. తొలినాటి మేధావులు, జిజ్ఞాసువులూ, కళాకారులూ– పోనీ ఇవన్నీ పెద్ద మాటలు – ఆనాడు గుహల్లో రాతిమీద బొమ్మలు చెక్కిన తొలినాటి మానవుల దగ్గర్నుంచి ఆది శంకరుల దాకా – ఒక్క భారతీయ సంస్కృతిలోనే మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలకూ ఈ విశ్వాసంతో ముడిపెడుతూ వచ్చారు. ఆలోచనకు ప్రమేయంలేని శతాబ్దాల మానవుడు ఈ empirical విజ్ఞానాన్ని – కేవలం విశ్వాసం అనే పెట్టుబడితో, నిబద్ధతతో అనుసరిస్తూ వచ్చాడు. నెలకి మూడు వానలు, సంవత్సరానికి ఆరు రుతువులూ, సుభిక్షంగా రెండు పంటలూ, శాంతియుత సహజీవనం అలనాటి మానవుడి ఆలోచనతో సాధించుకున్నది కాదు, నిబద్ధతతో నిలుపుకున్నది. 'తెలిసి'కాదు. తెలియాల్సిన అవసరం కూడా లేదని సంప్రదాయాన్ని కొనసాగించడం వల్ల. ఇప్పుడు ఈ వ్యాసంలో మొదటి వాక్యాన్ని యిక్కడ గుర్తు చేస్తాను. కాలం రాసుకున్న ఆత్మకథలో కలం దస్తూరీ సంప్రదాయం.

తరతరాలుగా ఈ విశ్వాసానికి ఒదిగి, అవలంబించి, అనుసరించి, అనుస్పందించి– ఒక గొడుగుని చేసుకుని జీవించడానికి ఓ అందమయిన పేరు ఉంది – ధర్మం. సామాజిక నీతి, స్పృహ, ఒక నియతి Dharma is a loaded word - denoting the generalised code of conduct of the human kind, of a community, of a society, of a generation. It is all - pervasive and ever lasting.

"ధర్మమా విష్టితం జగత్" అన్నది వాల్మీకి ఉవాచ. ఈ జగత్తుని ధర్మం నడిపిస్తోంది.

అతి స్థూలమయిన ప్లేన్‌లో – ఈ 'ధర్మం' నీడలోకి – ఈ రెండు రోజులూ మన పెద్దలు చర్చించే విషయాలన్నీ వస్తాయి.

మిగతా సంస్కృతులకు ఇంత విస్తృతి లేదు. ఇంత విస్తృతికి ప్రయత్నించలేదు. ఆ vision ఆయా సంస్కృతులు ఆశించలేదు. కాస్త గర్వంగా చెప్పాలంటే ఆశించారేమో కాని సాధించలేదు. మొజార్ట్‌కీ, బితోవెన్‌కీ, డిలన్ థామస్‌కీ, ఎడ్విన్ లుత్యెన్స్‌కీ, థామస్ ఆల్వా ఎడిసన్‌కీ, ఏసు ప్రభువుకీ, దేవుడికీ, భక్తికీ ఏమీ సంబంధం లేదు. మళ్ళీ చెప్తున్నాను. నేను denominational దేవుడి గురించీ, మతం గురించీ మాట్లాడడం లేదు.

అలనాడు రోమన్ సంస్కృతిలోనే – వైభవం ఛాయలు – దాదాపు అంతే ఉన్నతంగా కనిపిస్తాయి. కాని ఇంత సమగ్రంగా కాదు. అందుకనే రోమన్ శిల్పకళ, సాహిత్యం, చిత్రలేఖనం, వ్యక్తి సౌందర్యం అన్నీ మతంతో ముడిపడ్డాయక్కడ. మైఖెలాంజిలో, రాఫేల్, లియొనార్డో డావిన్సీ – ఇలా ఎన్నయినా ఉదాహరణలున్నాయి. మరిచిపోవద్దు – ఆ కారణంగానే ఇవాళ విశ్వవ్యాప్తమైన క్రైస్తవ మతానికి – వాటికన్‌కి – అది కేంద్రమయింది. ఇక్కడే మరొక్క మాట. ఇస్లాం ప్రపంచ మతాల్లోకెల్లా evolved మతం. సాకారం లేని పరబ్రహ్మాన్ని ఆరాధించే మతం. ఆలోచనలో ఔన్నత్యానికి పెద్ద పీట వేసిన మతం. అయితే ఛాందసత్వం నేడు వేస్తున్న వెర్రితలలు ఈ ఔన్నత్యాన్ని మరుగు పరుస్తున్నాయి. అయితే ఆ దౌర్భాగ్యం ఎంతో కొంత అన్ని మతాలకూ వర్తిస్తుంది.

మళ్లీ మన కథకి వస్తే – తెలియని చీకటిలోంచి తెలిసిన, కావలసిన 'శక్తులను నిజ జీవితంలో అన్ని పార్శ్వాలకు వ్యాపింప జేసిన ఘనత ఈ సంస్కృతిది. బడే గులాం అలీఖాన్ పాడినా, భీమ్‌సేన్ జోషీ పాడినా, హీరాబాయ్ బరోడేకర్ పాడినా, బాలమురళీ కృష్ణ పాడినా ఆ ఠుమ్రీలో, ఆ దోహాలో, ఆ అభంగ్‌లో, ఆ జావళిలో 'మాలిక్' ఉన్నాడు. రవివర్మ వేసినా, నికోలస్ రోరిక్ వేసినా, దామెర్ల రామారావు వేసినా అతి నేలబారు చిత్రంలో కూడా



ఈ జాతి సంస్కృతి ప్రతిఫలిస్తుంది. ఒక ముగ్ధ 'సంస్కారం' ఉంటుంది. ఆ సంస్కారానికీ మన సంస్కృతికీ దగ్గర దారి ఉంటుంది. పాటలో తాదాత్మ్యం, శిల్పకళలో సంప్రదాయం, నిర్మాణంలో వాస్తు - అన్నిటికీ మూల ధాతువు - సంస్కృతి. భోజనం చేస్తూండగా పొలమారితే - కంఠ నాళంలో పొరమారి వాయునాళంలోకి ఆహారం వెళ్లి ప్రాణానికి ముప్పు వస్తుందేమోనని ఆముదం దీపం వెలుగులో మీ చిన్నతనంలో అవ్వ 'ఇష్ట దైవం పేరు, నచ్చిన మనిషి పేరు' చెప్పమనడంలో విశ్వాసం వాటా ఉంది. పండగకి ముంగిట పెట్టే బియ్యపు పిండి ముగ్గులో కీటకాలకు ఆహారం ఉంది. గొబ్బిళ్ళకి ధనుర్మాసంలో అవసరమైన antiseptic కవచం ఉంది. Antiseptic ధర్మం కారణంగానే తులసి 'తల్లి' అయింది. త్యాగరాజు కీర్తనల్లో అజరామరమయింది. కార్తీకమాసంలో ఉపవాసాలకు-వర్షరుతువులో పరోక్షంగా ఆరోగ్య పరిరక్షణ సూత్రాలున్నాయి. (ఇదే రుతువులో మరో మతం కూడా - రంజాన్ ఉపవాసాలను నిర్దేశిస్తుంది). జీవితంలో ప్రతి అంశానికీ మన ఆలోచన్తో ప్రమేయం లేని - సర్వే సర్వత్రా - తరతరాల మానవుడు అంగీకరించిన, అనుసరించిన ధర్మం ఉంది. అయ్యప్ప సిద్ధాంతంలో శివకేశవ అభేదం ఉంది. ఒక మండలం పాటు ఆరోగ్య ప్రణాళిక ఉంది. ఇది ఫక్తు ఐహికం. ఇలా అన్నిటికీ అన్వయాలున్నాయి. దస్తూరీ సరిగా చూసుకు జీవించు. నీ జీవితం జీవన యోగ్యం అవుతుంది - అనే సందేశం ఉంది.

30 ఏళ్ల క్రితం నాకు తల మీద సోరియాసిస్ వచ్చింది. నేను తెలివైన మాథమాటికల్ ఫిజిక్స్ పట్టా పుచుకున్న ఆధునిక మానవుడిని. అప్పుడే సినిమాల్లోకి వస్తున్నాను. అది నుదుటి మీదకి క్రమంగా వ్యాపిస్తోంది. చర్మ వ్యాధులలో డాక్టర్ బి.సి.రాయ్ అవార్డ్ అందుకున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ తంబయ్య గారిని కలిశాను - కష్టం మీద ఇంటర్వ్యూ సంపాదించి. చిన్నలుంగీ, షర్టుతో అతి ప్రశాంతంగా ఉన్నాడాయన. నన్ను పరీక్ష చేసి నువ్వుల నూనె తలకి రాసుకుని ఎండలో పదినిముషాలు కూర్చుని స్నానం చెయ్యమన్నాడు. గొప్ప డాక్టరు కనుక - యివ్వకపోతే నామోషీ కనుక - ఓ మందు రాసి ఇచ్చాడు. నువ్వుల నూనె రాసుకుని ఉదయం ఎండలో నిలబడి -

హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజత ... అంటూ సూర్యస్తవం చేస్తే ఎలాంటి చర్మరోగమయినా సూర్యుడు పోగొడతాడని మా నాయనమ్మ చిన్నతనంలో చెప్పింది. సూర్యస్తవం ఎంతసేపు? పదినిముషాలు. తంబయ్య చికిత్స పదినిముషాలు. ఎండలో నిలబడి హిందూ పేపరు చదువుకున్నా, అనూరుడినీ, సప్తాశ్వారూఢుడైన సూర్యుణ్ణి పొగిడినా అదే ఫలితం. సూర్యుడి తొలి కిరణాలలో సౌర శక్తి చర్మ వ్యాధిని నిర్మూలిస్తుంది. మొదటిది విశ్వాసం. సింబల్. తంబయ్య మీద నాకున్నదీ విశ్వాసమే! ఆయన ఆల్ఫా కిరణాలు, బీటా కిరణాల గురించి ఉపన్యాసం ఇవ్వలేదు. పద్ధతిని నిర్దేశించాడు. అంతే. అదే తరతరాల సంప్రదాయం మనకిచ్చినది.

మొన్న మొన్ననే పూరీ జగన్నాథుడి ఆలయానికి వెళ్ళాను. ఆలయం మీద బూతు బొమ్మలు కనిపించాయి. వెంటనే తాపీ ధర్మారావు నాయుడుగారు జ్ఞాపకం వచ్చారు. 'దేవాలయాల మీద బూతు బొమ్మలు' మీద వారు రాసిన పుస్తకం గుర్తుకొచ్చింది.

మనిషి 'విశ్వాసం' పెట్టుబడిగా - అతిథి మర్యాదల దగ్గర్నుంచి, చర్మవ్యాధి నివారణ దగ్గర్నుంచి, 33 కోట్ల దేవతల్ని ఆరాధించేదాకా - ఇందులో పందులూ, కుక్కలూ, గాడిదలూ (వసుదేవుడు పట్టుకున్న కాళ్లు), సాలె పురుగులూ, పాములూ, ఏనుగులూ, క్రిములూ కీటకాలూ- అన్నీ ఉన్నాయి. అన్నిటినీ ఒకే గొడుగు కిందకి తీసుకు వచ్చిన సంస్కృతీ వైభవం ఈ దేశానిది. సమస్త జీవరాశినీ గౌరవించి, ఆదరించి సహజీవనం నెరపాలన్న సూత్రానికి ఈ సంస్కృతి వేసుకున్న పునాదులివి. దురాశ పెరిగి కృత్రిమ ఎరువుల వాడకం ద్వారా సీతాకోక చిలుకలు పంటలకి దూరమయి పరపరాగసంపర్కం తగ్గిపోయిందని శాస్త్రజ్ఞులు వాపోతున్న వార్త చదివాను.

ఈ వైభవాన్ని తన్మయత్వంతో, తాదాత్మ్యంతో అనూహ్యమైన muse చేసిన శంకరాచార్య, వివేకానంద, భగవాన్ రమణులు, తొండరప్పడి ఆళ్వార్, కబీర్- వీరందరినీ ప్రవక్తల్నీ, అవధూతల్నీ చేసుకున్నాం.

ఇంత సమగ్రమయిన frame work లో తప్పనిసరిగా ఎన్నో అపశ్రుతులుంటాయి. అవకాశవాదులుంటారు. కొందరు over zealous మేధావులు, వ్యక్తులు, వ్యవస్థలు, స్వాములు, బాబాలు వీటిని చొరరాని బందిఖానాలు చేశారు. తప్పుడు అన్వయాలు కల్పించారు. అద్భుతమైన

సౌమనస్యానికి కారణమైన పునాదుల్ని బలహీన పరిచారు. అడ్డుగోడలు కట్టారు. సుభిక్షంగా సాగవలసిన పాలనా వ్యవస్థలోనే యింత అవినీతి, అరాచకం, భ్రష్టత ఉండగా – శతాబ్దాలుగా చెల్లుబాటవుతున్న ఇంత విస్తృతమయిన కాన్వాస్‌ని సొమ్ము చేసుకుని, వమ్ము చేసిన మహానుభావులు ఎందుకుండరు? అయితే విజ్ఞతతో మూల సూత్రాలను ఫోకస్‌లోకి తెచ్చుకోవడం తప్ప మరోమార్గం లేదు.

ఈ ప్రపంచంలో ఏ ధర్మానికయినా ప్రధాన లక్ష్యం – ఆ సమాజంలో మనిషి జీవితాన్ని జీవనయోగ్యం చెయ్యడమే. ఇప్పుడు నేను మన దేవుళ్ల గురించీ, మన మతాల గురించే మాట్లాడుతున్నాను.

విశ్వాసాన్ని పెట్టుబడిగా empirical సత్యాల్ని కాపాడుకుంటూ ధర్మాన్నీ – తద్వారా Earth’s Life supporting systemsనీ కాపాడుకుంటూ పురోగమించే స్థాయినుంచి మనిషి ‘ఆలోచన’కు పెద్ద పీట వేసే స్థాయి వచ్చింది. ఇది గొప్ప పరిణామం. టెస్టు ట్యూబుల్లో ప్రాణాన్ని పెంచడమే కాక – ఈ మధ్య కొత్తగా జన్యు కణాల్ని కనుగొన్నారని విన్నాం.

చంద్రమండలం మీద కాలు మోపి, ఆరువందల ఏభై సంవత్సరాల అన్నమయ్య కవితకి – ‘చందమామ రావే జాబిల్లి రావే’ అన్న పిలుపుకి విడాకులిచ్చాక ఇది అనూహ్యమైన పురోగతి.

కాని మనకి తెలియని బిలియన్ల గ్రహాలున్నాయి. కొన్ని లక్షల సంవత్సరాలు ఈ గ్రహం మీదే ప్రాణవాయువు లేదు. ప్రాణి లేదు. సరే. అప్పటి విశ్వాసాలకు తాడూ బొంగరం లేదని, అవన్నీ మనల్ని తప్పు తోవ పట్టించే మూర్ఖపు ఆలోచనలనీ ‘ఆలోచన’ చేసే స్థాయికి మనం వచ్చాం. అవగాహనలో ఎన్నడూ లేనంత పురోగతిని సాధించాం.

అయితే – పాంటు, షర్టు, సూటు వేసుకున్న మనం నాలుగు తరాల కిందట tropical వాతావరణంలో మన తాత గావంచా కట్టుకోవడాన్ని వెక్కిరించనక్కర లేదు. అర్థం చేసుకోగలిగితే – తంబయ్యకీ మా నాయనమ్మ ఆలోచనకీ సయోధ్యని వెదక గలిగితే – అసూరిడి రథం కదలికకీ సోరియాసిస్‌కీ ‘లంకె’ దొరుకుతుంది.

ఆది మానవుడు నగ్నంగా అడవుల్లో తిరిగాడు. ఆఫ్రికా అడవుల్లో – ఆరుషాకి దూరంగా అర్థ నగ్నంగా ఉన్నవారిని నేను చూశాను. మా తాత విశ్వాసానికి వెనక గల ‘ఉద్దేశ్యం’ మనకి దొరక్కపోవచ్చు. అలాగే ఎండలు మండించే దేశంలో ట్వీడ్ సూటూ, టై కట్టుకున్న మనల్ని చూసి రానున్న ఆరోతరం పగలబడి నవ్వవచ్చు. 150 సంవత్సరాల పరదాస్యం ప్రసాదించిన వెర్రితల అని ఈ తరం తోనే చాలామంది ఒప్పుకోకపోవచ్చు.

ఆనాటి విశ్వాసాలు సమాజ ధర్మాల్ని insulate చేసి కాపాడాయి. ఈనాటి మన తెలివితేటలు కొన్ని వేల సంవత్సరాల భూమి సహజ ధర్మాన్ని retard చేస్తున్నాయి.

ఈ చిన్న వ్యవధిలో, ఈ చిన్న ప్రసంగంలో ఇంత బృహత్తరమైన విషయాన్ని చర్చించడం సాధ్యం కాదు. విశ్లేషించడానికి నాకు శక్తి చాలదు. భూమి పరిణామ శీలాన్ని విశ్లేషించాలంటే కొన్ని లక్షల సంవత్సరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొన్ని బిలియన్ల గ్రహాలున్న విశ్వంలో మన పరిధి, మన జీవన పరిమాణం, సంస్కృతీ వికాసం – అత్యల్పం.

మరి ఎందుకీ గొడవ? ఎందుకీ కంఠశోష? ఈ మధ్య ఛానళ్ళు తిప్పుతుంటే వేంకటేశ్వర సుప్రభాతం బూతు అని ఎవరో చర్చిస్తున్నారు. కాళికాదేవి మహిషాసురుడిని చంపడంలో కుల వివక్ష ఉందని ఎవరో అంటున్నారు. అమ్మని చూస్తూ ఏ బిడ్డా స్థనాల ఆకర్షణ గురించి ఆలోచిస్తాడనుకోను.

తన ఉపాధికీ, ఆకలికీ పాథేయాలుగా చూస్తాడు. ఈ దృష్టి భేదంతో చూస్తే శంకరుడే స్వయంగా చెప్పాడని భావించే *సౌందర్య లహరి* అంతా బూతే. మూకకవి అంత భ్రష్టుడు మరొకడు ఉండడు. పూరీ జగన్నాథుడిని మనం దర్శించనక్కరలేదు – అది బూతుమయం కనుక.

శ్రీరాముడు ఏ బ్లేడుతో గెడ్డం గీసుకున్నాడు? సీతాదేవి అవసరాలకు దండకారణ్యంలో ‘టాయ్‌లెట్’ని నిర్మించారా? విశ్వామిత్రుడు గెడ్డాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి పేల దువ్వెన వాడే వాడా? లాంటి ఆలోచనలు perversions. Intellectual decadence. కొన్ని సంవత్సరాల పాటు కదలకుండా కొండ గుహల్లో కూర్చుని తపస్సు చేసుకునే రుషులు తమ శరీర రుగ్మతలకి కేవలం శరీరాన్ని అదుపులో ఉంచుకోడానికి సాధించుకున్న యోగాసనాలు అమెరికా ‘పేటెంట్’గా మనకి చేరితే రుచిగా ఉంటుంది.

అజీర్ణానికీ, కీళ్ళ నొప్పులకీ అమెరికా ఇంగ్లీషులో మనకి వారు బోధ చేస్తారు.

ఈ మధ్య కథలు, పాత్రలు, స్తుతులూ, దేవుళ్లూ, మతపరమైన సింబల్స్ - వీటిపై చర్చలు వింటున్నాం. మన ముత్తాత గోచీకి, కొత్త అన్వయం వెదకడం లాంటిదే ఇదని నా ఉద్దేశ్యం. ఆనాటి తరానికి ఇవి ఎందుకు, ఎలా అవసరమయ్యాయో, వాటి ప్రయోజనం - అర్థం ఏమిటో ముందు వివరంగా చర్చించడానికి కారణం ఇదే.

నిజానికి పురాణాల్ని వెక్కిరించే రచనలు - నాకు తెలిసి - మన తరంలోనే ఇద్దరు చేశారు. ఇద్దరూ మహానుభావులు. ఒకాయన గొప్ప పాత్రికేయులు - నార్ల, మరొకాయన మహారచయిత - చలం. సావిత్రి, పురూరవ వంటి నాటకాలు పురాణాలను వెక్కిరిస్తూ రాయడం వెనుక స్ఫూర్తి ఏమిటని 45 సంవత్సరాల క్రితం ఒక సావనీర్‌లో వ్యాసానికి చలం గారికి ఉత్తరం రాశాను. ఆయన సమాధానం ఇది : “ఆ నాటకాలన్నీ బుద్ధిలేక రాశాను.



ఇంకెన్నటికి అలాంటి పని చెయ్యను.”

నా అభిప్రాయం We need not destroy the institutions. వీలయితే, సాధ్యమయితే కొత్త వ్యవస్థల్ని సృష్టిద్దాం. అవి ఒక తరం, ఒక సమాజం, ఒక కాలం నిర్ణయించిన సత్యాలు కావు. శతాబ్దాల విలువలకి ప్రతీకలు. అప్పటి కవి vested values ఆ విలువల కిప్పుడు కాలదోషం పట్టిందా? భేష్, కొత్త విలువల్ని ప్రోదుచేద్దాం. కాలక్రమేణా ఇవీ పాతబడతాయి. పాడుబడతాయి. ఆరేడుతరాల తర్వాతి వారు మన్ని చూసి నవ్వుకోవచ్చు. నవ్వితే నవ్వనివ్వండి. పరిణామ శీలాన్ని ఒక్కరయినా బేరీజు వేయగలిగితే అది చరిత్ర అవుతుంది. అది కాలం రాసుకున్న సిసలైన ఆత్మకథ అవుతుంది.

ఆఫ్ఘనిస్థాన్‌లో భామియన్ బుద్ధవిగ్రహాల లాగ ఆ విలువల్ని నేలమట్టం చేయనక్కరలేదు. అక్కరలేదని చెప్పడానికే ఈ వ్యాసం మొదటి నుంచీ ఈ సంస్కృతిలోని ‘దేవుడి’ గురించి ఇంత విస్తృతంగా చెప్పవలసి వచ్చింది. ఈ సత్యాల్ని denominational పరిధుల్ని దాటి ఆలోచిస్తే సమాధానాలు దొరుకుతాయోమో! ఒక తాపీ ధర్మారావో, ఒక చలమో తారసపడేదాకా ఆగుదాం; మనకి అక్కరలేని, ఇప్పుడు చెల్లని కిందటి దశాబ్దపు నాణెం ఒక చరిత్రని చెప్తుంది. ఒక వ్యవస్థని వివరిస్తుంది. ఒకనాటి సంప్రదాయానికి సూచిక అవుతుంది. మించి - మన మేధస్సు పురోగతికి మార్గదర్శి అవుతుంది.

Institutions should not be judged - as you don’t judge a morning - an afternoon or an evering. ఉదయం పరిణామం. కాలానికి సంకేతం. అయితే ఉదయం నువ్వు చేసేపనిని చర్చించవచ్చు. విమర్శించవచ్చు. పదిగంటల దాకా పడుకోవడం సోమరితనం. పన్నెండుదాకా పడుకోవడం అనారోగ్యం, రాత్రంతా మేలుకోవడం విడ్డూరం. వికారం. విపరీతం. కాని మరో అయిదేళ్ల తర్వాత - అమెరికాతోనో, ఆస్ట్రేలియాతోనో సయోధ్య నేర్పరచుకున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే వ్యక్తి విధిగా రాత్రంతా పనిచేస్తాడు. పగలు నిద్రపోక తప్పదు. అలవాట్లు మారతాయి. అవసరాలు అలవాట్లను నిర్ణయిస్తాయి. మా తాత బతికుంటే ఆయన దృష్టిలో ఇది అరాచకం. కాని మన కాలానికి అవసరం. అయితే ఏనాడయినా ధర్మం మారదు. జీవన సరళి మారుతుంది. అందుకే ప్రతీ తరం, ప్రతీ మేధావీ భగవద్గీతకి ఎప్పటి కప్పుడు అన్వయాన్ని చెప్తూ వచ్చారు. అది జీవితానికి working guide కనుక.

ఇవి నా ఆలోచనలు. ఎవరికయినా వీటితో విభేదించే హక్కు ఉంది. కాని సరైనవనిపిస్తే ఇంతకంటే మేధావుల సమావేశం దొరకదన్న ప్రలోభంతో ఈ నాలుగు మాటలూ చెప్పాలనిపించింది.

ఆదర్శ సొసైటీ భవనాన్ని కూల్చండి. అక్కడ అవినీతి పేరుకుంది. కాని ఆదర్శాల్ని కూల్చనక్కరలేదు. అవి ఎప్పుడూ మారుతూ, పారుతూ ఉంటాయి.

ఆఖరుగా -

When you deify you don’t learn.
When you deify you refuse to learn
When you define you begin to learn.

*నమస్కారం.*

# సింహగిరి వచనాలు

– మల్లి వెంకట నరసింహా రెడ్డి,

**(61వ కొత్త వచనం – అముద్రితం)**

*కృష్ణమాచార్యులు :*

వచన సాహిత్యానికి ఆద్యుడుగా ఈయన సుప్రసిద్ధుడు. తెలుగులో కాలజ్ఞాన రచనకు కూడా ప్రథమాచార్యుడీయనే. ఏష్య – కాలజ్ఞానంలోని 29 మంది కాలజ్ఞానుల పట్టికలో కృష్ణమాచార్యులు ఒకరు. కృష్ణమాచార్యుల వచనాలను సంకీర్తనలని కూడ ఆయనే చెప్పుకున్నారు. "శ్రీకృష్ణ మాచార్యులు ఒక *కాలవిడంబమును* వ్రాసినారు" అని చేలంపాటి జండాభట్ల కాలజ్ఞానం చెవుతుంది. "కృష్ణమాచార్యులు తాము చేసిన చాతుర్లక్ష సంకీర్తనలోను మాయవతార మహిమ మా రాకడలు నిర్ణయము చేసినారు" అని వీరబ్రహ్మం గారు తన కాలజ్ఞానంలో చెప్పిన వాక్యాన్ని బట్టి సింహగిరి వచనాల కర్త కృష్ణమాచార్యులు, కాలజ్ఞాన వచనాలు వ్రాసిన కృష్ణమాచార్యులు ఒక్కరే – అని స్పష్టపడుతుంది.

కృష్ణమాచార్యులను గురించి ప్రతాపరుద్ర చరిత్రలో ఆసక్తికరమైన కథ ఒకటి ఉంది. అందులో కృష్ణమాచార్యులు మహిమోపేతుడైన వ్యక్తిగా కనిపిస్తాడు. అద్భుతాల మాట అలా ఉంచితే ఈ కథవల్ల కొన్ని చారిత్రకాంశాలు లభ్యమవుతాయి. కృష్ణమాచార్యులు కాకతీయ ప్రతాప రుద్రుని సమకాలికుడు. చక్రవర్తి ఈయన మహిమలకు అచ్చెరువొంది కనకగిరి సీమలో నాల్గవ భాగమైన 50 గ్రామాల మీద అధికారాన్ని ఒక అగ్రహారాన్ని దానం చేశాడు. దానం స్వీకరించి, కృష్ణమాచార్యులు సీమాంతర్భాగమైన తన నివాసం సంతూరును ప్రవేశించాడు. కల్లూరని ఒక గ్రామాన్ని కట్టించాడు. తాను ప్రభుత్వం నెరపిన కనకగిరి సీమలో వచ్చిన ఆదాయంతో తామ్ర పత్రికలు చేయించి, వాటి మీద తాను వ్రాసిన చాతుర్లక్ష గ్రంథాన్ని చెక్కించాడు. వాటిని బండ్ల మీద ఎక్కించుకొని శ్రీరంగం వెళ్ళాడు.

కృష్ణమాచార్యులు చాతుర్లక్ష వచనాలు లేదా సంకీర్తనలు వ్రాసినా ఇప్పటి వరకు లభించినవి కేవలం 60 వచనాలు మాత్రమే. ప్రస్తుతం లభించిన ఈ కాలజ్ఞానం 61వ వచనం. ఈ వచనాలు 'దేవా!' అన్న సంబోధనతో ప్రారంభమై – అనాథ పతీ స్వామీ! సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ!' 'మా యతి రామానుజముని వరము దాతారు, సింహగిరి నరహరీ నమో నమో దయానిధీ!' అన్న సంబోధనలతో ఏదో ఒకదాంతో ముగుస్తాయి. కాలజ్ఞాన వచనం కూడా ఆద్యంతాల విషయంలో అన్ని వచనాల్లాగే ఉంటుంది.

కాలజ్ఞాన వచనం– 'దేవా!' అన్న సంబోధనతో మొదలై – 'అనాథపతీ సింహగిరి నృసింహ దయానిధే!' అనే మకుటంతో అంతమవుతుంది. కాలజ్ఞాన వచనం చివర మకుటానికి ముందు – "కృష్ణమాచార్యుల ఏష్యం ఊరకే చెప్పుదురు అని లోకము నిందింతురు. ఇందుకు ప్రమాణము వెళ్ళనాడుచున్నాను. యమున, గోదావరి, తుంగభద్ర, గౌతమి, పుష్కరిణి, భాగీరథి, జాహ్నవి నదిలోను మా గురువును నారాయణయ్యను జీవహింస చేసి రక్తమాంసాలు భుజించిన పాపాన బోదును. ఈ తీరున కాలజ్ఞానం తప్పరాదు. తప్పితే సహోదరిని గోరిన పాపాన బోదును. మా నారాయణయ్య పాదమాన. మా లక్ష్మణయ్య పాదమాన. తప్పరాదు. అనాథ పతే సింహగిరి నృసింహ దయానిధే అని ఉంది. కాలజ్ఞానం కృష్ణమాచార్య కృతమే అనడానికి పై వాక్యంలోని నారాయణయ్య, లక్ష్మణయ్యలు ఒక ఆధారం.

నారాయణయ్య, లక్ష్మణయ్యలు అయిదు మంది పోతకమూరి భాగవతుల్లోని వారు. నిజానికి వారు కృష్ణమాచార్యులకు పరమ భక్తులు. అయితే వారు వేశ్యాలోలుడైన కృష్ణమాచార్యులకు కనువిప్పు కలగడానికి పరోక్షంగా దోహదం చేసినవారు కూడ.

"నేడుగదా పరమాచార్యులైన పోతకమూరి నారాయణయ్య, యౌబళయ్య, యచ్యుతయ్య, యనంతయ్య, లక్ష్మణయ్య, చెన్నయ్య గార్లవలన ... పరమపద మంపించితిరి" అని కృష్ణమాచార్యులు తన ఇష్టదైవం సింహగిరి నరహరితో అన్నాడు. జన్మసాఫల్యానికి భగవన్మూలకమైన కారణపురుషులుగా వారిని భావించాడన్నది స్పష్టం.

భక్తునికి పార్యంతిక ఫలమైన పరమపదానికి గమ్యం నిర్దేశించిన వానికంటె గురువు ఎవరుంటారు? ఈ కారణంగానే నారాయణయ్యను, లక్ష్మణయ్యను గురువులుగా కృష్ణమాచార్యులు సంభావించారేమో! ఏమైతేనేమి నారాయణయ్య, లక్ష్మణయ్యలు పోతకమూరి భాగవతుల్లోని వారు. కృష్ణమాచార్యులకు సన్నిహితులు. వారి ప్రశంస సింహగిరి వచనాల్లో చాలా చోట్ల వస్తుంది. కాబట్టి కాలజ్ఞాన వచనం కృష్ణమాచార్యులదే! పదకొండవ అవతారుడుగా కీర్తింపబడ్డ భక్తాగ్రణి కృష్ణమాచార్యులు.

> **భ**క్తునికి పార్యంతిక ఫలమైన పరమపదానికి గమ్యం నిర్దేశించిన వానికంటె గురువు ఎవరుంటారు? ఈ కారణంగానే నారాయణయ్యను, లక్ష్మణయ్యను గురువులుగా కృష్ణమాచార్యులు సంభావించారేమో!

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం దక్షిణాపథం మ్లేచ్ఛాక్రాంతమై కడగండ్ల పాలై కన్నీట మునిగినది. ఈ సంక్షోభ నేపథ్యంలో రెండు కాలజ్ఞానాలు ప్రభవించాయి. ఒకటి : విద్యారణ్య యతీంద్రులు *విద్యారణ్య కాలజ్ఞానమ్* సంస్కృతంలో. రెండు : *కృష్ణమాచార్యుల కాలజ్ఞాన వచనము* తెలుగులో. రెండూ అవతార పురుషుడైన వీరభోగ వసంతరాయుల ఆగమనాన్నే చెప్పాయి తప్ప భావి కాలగతులను కాదు. ఈ రెండు కాలజ్ఞానాల్లోని అవతార పురుష సమాహారమే వీరబ్రహ్మంగారి వీరభోగవసంతుల స్వరూప స్వభావాలు.

**కృష్ణమాచార్యుల *వీరభోగ వసుంధర* :**

వీడని జన్మతిథి : 'నందానందనయోర్మధ్యే వీరభోగ వసుంధరం' అనే విద్యారణ్య వాక్యాన్ని వీరవసంతుని జన్మతిథికి కృష్ణమాచార్యులు గ్రహించారు. ఆ వాక్యానికి ఆనంద నందనల మధ్య అని అర్థం. కృష్ణమాచార్యుల నిర్ణయం ప్రకారం వీరభోగవసంతుడు ఆనంద నందనల మధ్య వచ్చే బహుధాన్య సంవత్సరంలో జన్మిస్తాడు.

"కలియుగంబు పూనిన నాల్గువేలున్న ఎనిమిది నూర్లున్ను అరవై సంవత్సరంబులకు బహుధాన్య సంవత్సర కార్తీక శుద్ధ సప్తమీ, సోమవారం మకర లగ్నమందు, శ్రవణ నక్షత్రాన కలియుగంబులోన, గౌతమీ తీరంబున, ఈశాన్యపు దిక్కున వీరవసంతోత్సవుల వంశంబున ఉద్భవించి మీ (సింహగిరి నరహరి) మాయ చాతను, ద్వాదశ వర్షంబులు అజ్ఞాతవాసంబున బెరుగుతూ నుండును. ఆ వర్షంబులు వెళ్ళిన మీదట మీ ప్రకాశం చాతను నందన సంవత్సరంబందు సూర్యోదయమైన రీతని సూర్యపుటంబులు బిరుదు వడిగెలు, తిరుమణి విభూతి లలాటమందు ధరించి శైవ వైష్ణవుల చేపట్టి నడచును...

**వీరవసంతుని దేశాటన – నిధినిక్షేప సంగ్రహం :**

"అంతట నందన సంవత్సరమందు వీరవసంతోత్సవులు సకలభేరీ మృదంగంబులతోను భూప్రదక్షిణంబు శాయవలెనని తమలో నూహించి పరివారంబును కలుసుకొని ఇంద్రకీలాద్రి పర్వతంబునకు వచ్చి ఒక్కొక్క చినుకు తులా ఎత్తు కనకవర్షంబు గురిసిన ఆ మాధవ వర్మ వేసిన నిక్షేపంబు ఉన్న పర్వతము ప్రదక్షిణం చేసి వస్తూ యుండగా ఆ నిక్షేపంబునకు కావలియున్న భైరవుడు ఎదురు వచ్చి ఆ తావులోని నిక్షేపంబు జూపిన ఆ నిక్షేపంబు తన వశంబు జేసుకొని అక్కడనుంచి కుందాళ గళబ్బునకు తెలుగు బిజ్జలుడు వేసిన నిక్షేపంబులను వశంబు చేసుకొని ఈ నాల్గు దిక్కుల నిక్షేపంబులున్ను నన్నూట నలభైకోట్ల ద్రవ్యంబులు తన వశంబు జేసుకొని ఆ అవతారులు సకల దేశ సమేతంగా కదలివచ్చి గంగా గోదావరి మధ్యమందున చక్రవర్తి పట్టణంబు గావించుకొని నందన సంవత్సర మార్గశిర మాసమందు శుక్లపక్ష మందు త్రయోదశినాడు రోహిణి నక్షత్రమందు పట్టాభిషిక్తుడై సింహాసనమెక్కును.

అటు తరువాత వేయిన్ని నూటయెనిమిది దివ్య వర్షంబు లేలును. ఆ పట్టణ మధ్యమందున హరిహరుల దేవాలయంబులు నిలిపి, దేవ బ్రాహ్మణ సంతర్పణ, అతిథి సంతర్పణతోను నిత్యమున్నూ నేమంగాను నడచును.

అవతార సంతతివారు, అటవతల యాభైవేల యేండ్లు ఏలుదురు.''

కృష్ణమాచార్యుల కాలజ్ఞానం వీరవసంతుని ఆగమనకాల నిర్దేశం స్పష్టంగా చేసింది. కలియుగం 4860 సంవత్సరాలకు సరి అయిన బహుధాన్యతో వీరుని పుట్టుక అన్నాడు. కలిశకం 3102 సంవత్సరాల తరవాత క్రీ.శ. ప్రారంభమయ్యింది. కలిశకం 4860లో 3102 పోతే క్రీ.శ. 1758 వస్తుంది. అంటే వీరుని పుట్టుక క్రీ.శ. 1758కి సరియైన బహుధాన్యలో జరుగుతుంది. బహుధాన్యలో జన్మించి మూడు సంవత్సరాల పిల్లవాడైన తరువాత అజ్ఞాతవాసంలో 12 సంవత్సరాలు గడిపి తన 15వ యేట క్రీ.శ. 1772లో ప్రకాశమవుతాడట. దేశాటనం చేసి నిధినిక్షేపాలు సంగ్రహించుకొని అదే సంవత్సరం మార్గశిర బహుళ త్రయోదశి రోహిణీ నక్షత్ర కాలంలో సింహాసనం అధిష్టిస్తాడని చెప్పాడు.

దేశాటనంలో ఇంద్రకీలాద్రి పర్వతం మీద ఒక్కొక్క చినుకు తులా ఎత్తు కురిసిన మాధవవర్మ వేసిన నిధిని సంగ్రహించుకొని వస్తాడని కాలజ్ఞాన వచనం చెబుతోంది.

కాలజ్ఞానం పేర్కొన్న ఆ మాధవ వర్మ క్రీ.శ. 557 నుండి 616 వరకు ఆంధ్రదేశాన్ని పాలించిన విష్ణుకుండిన రాజన్యుడు 2వ మాధవవర్మ, చరిత్రకారులీయనను 3వ మహేంద్రవర్మ అని కూడ వ్రాశారు. ఈయన చాలా ధర్మప్రభువని పేరుగాంచాడు. ఈ ధార్మిక పక్షపాతాన్ని గురించి సుప్రసిద్ధమైన ఐతిహ్యం ఒకటుంది.

మాధవవర్మ కుమారుని రథచక్రం కింద ఒక నిరుపేదరాలి కుమారుడు పడి చనిపోయాడు. ఈ సంగతిని ఆమె రాజుకు విన్నవించి ధర్మం ప్రసాదించమని వేడుకుంది. మహారాజు విచారణ జరిపి తన కుమారునిదే నేరమని నిర్ధారించి యువరాజుకు మరణదండన విధించాడు. రాజకుమారుని వధించే సమయంలో మల్లికార్జునుడు ప్రత్యక్షమై రాజు న్యాయనిరతికి మెచ్చుకొని మరణించిన పేదరాలి కొడుకును బ్రతికించి, యువరాజుకు మరణదండన తప్పించి ఇంద్రకీలాద్రి పర్వతం మీద కనకవర్షం కురిపించాడని కథ.

ఈ జనశ్రుతిలోని కనకపు చినుకుల నిధినే కృష్ణమాచార్యుల వీరవసంతుడు దేశాటన సమయంలో సంగ్రహించుకొని వచ్చేది.

కృష్ణమాచార్యులు -వీరభోగవసంతరాయలు తిరుమణి విభూతి లలాట మందు ధరించి శైవవైష్ణవులు చేపట్టి నడుస్తాడని, తన రాజధానినగర మధ్యమందు హరిహర దేవాలయంబులు నిర్మిస్తాడని చెప్పాడు. వీరశైవ వైష్ణవ మత విద్వేషాలు ఉద్ధృతంగా ఉన్న ఆ కాలంలో వీరభోగవసంతరాయలను శైవవైష్ణవ సమన్వయ దృష్టికి ఒక ప్రతీకగా కృష్ణమాచార్యులు రూపొందించారు.

> దేశాటనంలో ఇంద్రకీలాద్రి పర్వతం మీద ఒక్కొక్క చినుకు తులా ఎత్తు కురిసిన మాధవవర్మ వేసిన నిధిని సంగ్రహించుకొని వస్తాడని కాలజ్ఞాన వచనం చెబుతోంది.

వీరభోగవసంతరాయలు ఉద్భవానికి ముందు లోకంలో పాపం పెరిగిపోయి ఉంటుంది. మ్లేచ్ఛుల దుష్కృత్యాలు మిక్కుట మవుతాయి. వీరవసంతుడు పుట్టిన తరువాత నాలుగేళ్లకు చిత్రభాను సంవత్సరంలో ప్రజానీకం కొత్త కాంతి కలిగి ఉంటుంది.

వీరవసంతుని రాకడ తథ్యమని, తన కాలజ్ఞానం తప్పదని కృష్ణమాచార్యులు ప్రతిజ్ఞ చేశారు.

"కృష్ణమాచార్యుల ఏష్యం ఊరకే చెప్పుదురు అని లోకము నిందింతురు. ఇందుకు ప్రమాణము వెళ్ళనాడుచున్నాను. యమున, గోదావరి, తుంగభద్ర, గౌతమి, పుష్కరిణి, భాగీరథి, జాహ్నవి నదిలోను మా గురువును నారాయణయ్యను జీవహింస చేసి రక్తమాంసాలు భుజించిన పాపాన బోదును. ఈ తీరున కాలజ్ఞానం తప్పరాదు. తప్పితే సహోదరిని గోరిన పాపాన బోదును. మా నారాయణయ్య పాదమాన. మా లక్ష్మణయ్య పాదమాన" అంటూ భరోసా ఇచ్చాడు.

అదీ కృష్ణమాచార్యులు తీర్చిన వీరవసంతుని వృత్తాంతం! ⓜ

**డాక్టరు మట్టి వెంకట నరసింహా రెడ్డి,**
**హైదరాబాదు. ఫోన్ : 9396388669**

# హిందూస్థానీ – కర్ణాటక : ఆచార్య బృహస్పతి వాదం

– *నండూరి పార్థసారథి*

*(ఏప్రిల్ సంచిక తరువాయి...)*

❖ **భా**రతీయ ముస్లిములు, వారివల్ల ప్రభావితులైన హిందూ గాయకులు వేర్వేరు థాటలకు చెందిన స్వరాలను మేళవించి కొత్తరాగాలను భారతీయ పద్ధతికి విరుద్ధంగా సృష్టించారు. ఆ రాగాలకు భారతీయ నామాలు తొడిగారు. ఖుస్రో, హుసేన్‌షా షర్కీ, తాన్‌సేన్, రామదాస్ మొదలైన వారు సృష్టించిన అటువంటి మిశ్రరాగాల మూలాలు బృహద్దేశి, సంగీత రత్నాకరం, సంగీత రాజ గ్రంథాలలో కనిపించవు. భైరవ, పూర్వీ, మారవ, తోడి థాటలకు చెందిన ఇప్పటి రాగాల పేర్లు భారతీయ భాషలలోవే అయినా వాటి మూలాలు మాత్రం ముకామ్ పద్ధతిలో ఉంటాయి.

❖ భారతీయ సంగీత సంప్రదాయానికి ప్రాతిపదిక స్వర 'సప్తకం'. 'మధ్యమం' యొక్క మధ్యమత్వం సప్తకంలోనే సాధ్యం – 'అష్టకం' (ఆక్టేవ్)లో కాదు. మంద్ర, మధ్య, తార స్థాయులు. ఒక్కొక్క దానిలో ఏడు స్వరాలుంటాయి. 'స–రి–గ–మ–ప–ద–ని–స' అనే దానిలో చివరి స్వరం 'స' ఆ తర్వాతి స్థాయికి మొదటి స్వరం అవుతుంది. 'అష్టకం' లో అది తప్పనిసరి. కాని, అష్టకం అనేది భారతీయ విరుద్ధ (Non-Indian) భావం. అష్టక ప్రాతిపదిక భారతీయ గ్రామ– మూర్ఛన పద్ధతికి పూర్తి విరుద్ధమైనది.

❖ గ్రామ – మూర్ఛన పద్ధతిలో సంపూర్ణ రాగానికి ఏడు స్వరాలుంటాయి. కాని, అష్టక పద్ధతిని అనుసరించే వెంకటమఖి సంపూర్ణరాగానికి ఎనిమిది స్వరాలని చెబుతాడు. 'షాడవ' అంటే ఆరు స్వరాలు కలది అని అర్థం. కాని, వెంకటమఖి పై స్థాయిలోని 'స'ని కూడా కలిపి షాడవ రాగాలకు ఏడు స్వరాలని చెబుతాడు. 'ఔడవ' రాగాలంటే ఐదు స్వరాలు గల రాగాలని అర్థం. కాని, వెంకటమఖి ఆరు స్వరాలు గల రాగాలని అర్థం చెబుతాడు.

**"భవన్త్యష్టౌ స్వరా రాగే సంపూర్ణే, సప్త షాడవో,**
**ఔడవే షట్ క్రమాత్తేషా మారోహః క్రమతః"**

– *చతుర్దండి ప్రకాశిక– ఆలాప ప్రకరణం, 13వ శ్లోకం.*

పారిభాషికపదాల అన్వర్థతను ఏమాత్రం పాటించని వెంకటమఖిని కొందరు పండితులు కర్ణాటక సంగీతపు పాణిని అని కీర్తించడం విడ్డూరం.

❖ రామామాత్యుడు శార్ఙ్గదేవుడిని సరిగ్గా అర్థం చేసుకోకుండా రత్నాకరంలోని స్వరనామాలను – ముస్లిములు ఒకస్థాయిలో స్థిరపరచిన – పన్నెండు స్వరాలపై అధ్యారోపం (సూపరింపోజ్) చేశాడు. గోవింద దీక్షితుడు రఘునాథ భూపాలుని పేరిట తాను రచించిన *సంగీత సుధ*లో *రత్నాకరం* అంతా దురవగాహంగా, గందర గోళంగా ఉందని అంటూ, *రత్నాకర* వ్యాఖ్యాతలైన కేశవ, కల్లినాథు లిద్దరిని కూడా అవహేళన చేశాడు. *రాగవిబోధ* లో సోమనాథుడు కూడా అలాగే దురవ గాహంగా, అస్పష్టంగా ఉందని పేర్కొన్నాడు. వీళ్ళంతా వైణికులు. ముస్లిముల 'ముకాం' పద్ధతి ప్రభావం వీళ్ళందరిపైనా ఉంది. రాగాలను 'మేళా'ల చట్రంలో వర్గీకరించడం వీళ్ళ మతం. సాంకేతిక పదాల అన్వర్థత పట్ల వీళ్ళకు దృష్టిలేదు, అవగాహనలేదు. వీళ్ళెవరూ స్వరాల 'శుద్ధత'కు అర్థం చెప్పలేదు. ఎటువంటి కారణం చెప్పకుండానే వీరు భరత, శార్ఙ్గదేవుల శుద్ధ స్వరాలను ముఖారి మేళస్వరాలుగా స్వీకరించారు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు – ఎందుకంటే, 'స్వరవ్యత్యాస' పద్ధతి ద్వారా కాఫీ థాట నుంచి రాబట్టిన పూర్వీ థాట యొక్క నిషాద మూర్ఛన నుంచి పుట్టినది ముఖారి మేళ.

❖ ఒక థాట/మేళంలోని కోమల స్వరాలను తీవ్ర స్వరాలుగా, తీవ్రస్వరాలను కోమల స్వరాలుగా మార్చుకోవడాన్ని 'స్వర వ్యత్యాస' అంటారు. ఈ మార్పిడి వల్ల ఒక థాట/మేళం మరొక థాట/మేళంగా మారిపోతుంది. ఉదాహరణకు – కాఫీథాటలో గ,మ,ని కోమల స్వరాలు, రి,ధ తీవ్ర స్వరాలు. వాటిలో గ,మ,ని స్వరాలను తీవ్రస్వరాలుగా, రి,ధ స్వరాలను కోమల స్వరాలుగా మార్చుకోకుంటే కాఫీథాట పూర్వీథాటగా మారిపోతుంది. దీన్ని ఉత్తరాదిని 'థాట లౌటనా' అనీ, దక్షిణాదిని 'మేళ భేదన' లేక 'స్వర వ్యత్యాస' అంటారు.

- శార్ఙ్గదేవుడు *రత్నాకరం* లో 264 రాగాలను వర్ణించాడు. ఆ రాగాలేవీ ఇప్పుడు వాడుకలో లేవు. అందుచేత నేను నా పరమాచార్యుడైన తానప్పాచార్యుల వారు లక్ష్యలక్షణ సమ్మతంగా సముద్ధరించిన 55 రాగాలను వర్ణిస్తున్నాను. ఆ రాగాలలో తానప్పాచార్యుల వారు *గీత, ఠాయ,* ప్రబంధాలను రచించారు. నేను చెప్పిన 'ఆలాప' నిర్వచనం తానప్పగారి 55 రాగాలకూ అన్వయిస్తుంది" అని వెంకటమఖి పేర్కొన్నాడు.
- వెంకటమఖి మాటలను బట్టి చూస్తే తానప్పాచార్యునిది ఒక ప్రత్యేక పంథా అనీ, అది రామామాత్యుని పంథాకు, ఆ కాలపు ఇతర లక్షణ కర్తల పంథాకు పూర్తిగా భిన్నమైనదనీ, రాగాల వర్గీకరణ విషయంలో ఆయన దృక్కోణమే వేరనీ తెలుస్తుంది. వెంకటమఖి తండ్రి (గోవింద దీక్షితుని) మార్గం తానప్పమార్గానికి భిన్నమైనది. వెంకటమఖి తన తండ్రిమార్గాన్ని కాక తన పరమాచార్యుని మార్గాన్ని అనుసరించాడు. అనేక విషయాల్లో అతడు రామామాత్యునితో విభేదించినట్లే తన తండ్రి అభిప్రాయాలతో కూడా విభేదించాడు. అయితే ఒక్కటే తేడా – అతడు రామామాత్యుడిని తీవ్ర పదజాలంతో విమర్శించాడు. తన తండ్రిని మాత్రం అలా విమర్శించకుండా మౌనం వహించాడు.
- మధ్యమ నిషాదాల మధ్య అంతరం, షడ్జ మధ్యమాల మధ్య అంతరం సమానంగా ఉంటాయని 'నాట్య శాస్త్రం' లో భరతముని పేర్కొన్నాడు. కాని, దాక్షిణాత్య సంగీతంలోని ఏ మేళంలోనూ ఇలా లేదు. అలాగే, గాంధార మధ్యమాల మధ్య, మధ్యమ పంచమాల మధ్య, నిషాద షడ్జమాల మధ్య అంతరాలు సమానంగా ఉంటాయని భరతముని చెప్పాడు. కాని, దాక్షిణాత్య సంగీతంలోని ఏ మేళంలోనూ ఇలా లేదు. పుండరీక విఠల, శ్రీకంఠ, అహోబల, శ్రీనివాస, రామామాత్య, సోమనాథ, వెంకటమఖి, భాత్ఖండేల పద్ధతికీ, భరతముని సంప్రదాయానికీ ఏ మాత్రం పొంతన లేదు.
- తన 'పరమగురువు' తానప్పాచార్యుడని వెంకటమఖి చెప్పుకున్నాడు. 'పరమగురువు' అంటే గురువుకు గురువని అర్థం. అంటే వెంకటమఖి తానప్పాచార్యుని ప్రశిష్యుడన్న మాట. అతడు తన గురువు పేరు మాత్రం చెప్పలేదు. తానప్పాచార్యుడు ఎక్కడి వాడో ఆ సంగతి కూడా చెప్పలేదు. కాని, ఆ తానప్ప తాన్‌సేన్ అయి వుండవచ్చునని ఊహించడానికి ఆస్కారం ఉంది. తాన్‌సేన్ అక్బర్ కొలువులో ఉండిన విద్వాంసుడు. దక్షిణాది నుంచి వెళ్ళిన పుండరీక విఠలునికి కూడా అక్బర్ ఆస్థానంతో సంబంధం ఉన్నది. అతడిపై తాన్‌సేన్ ప్రభావం చాలా ఉంది. ఉత్తర భారతీయ రాగాల స్వరూప స్వభావాలను గురించి తాన్‌సేన్ పుండరీకునికి బోధించి ఉంటాడు. వీణపై సారికలను అమర్చే విషయమై పుండరీక విఠలుడు తన *సద్రాగచంద్రోదయం* గ్రంథంలో శాస్త్రీయమైన పద్ధతిని వివరించలేదు. లక్ష్యజ్ఞానం గల వాద్య నిర్మాణ ప్రవీణుడు నిర్మించిన వీణను స్వీకరించాలని మాత్రమే చెప్పాడు.

వెంకటమఖి చతుర్దండి ప్రకాశికలో కూడా సరిగా అలాగే – ఇంచు మించు అవే పదాలతో – చెప్పాడు. *రసకౌముది* గ్రంథంలో శ్రీకంఠుడు కూడా అలాగే చెప్పాడు. దీన్నిబట్టి వెంకటమఖి, శ్రీకంఠుడు ఇద్దరూ పుండరీక విఠలుని శిష్యులై ఉంటారని అనుకోవచ్చు. పుండరీకుడు తాన్‌సేన్ శిష్యుడైతే వెంకటమఖి తాన్‌సేన్ ప్రశిష్యుడవుతాడు. అందుచేత వెంకటమఖి తన పరమాచార్యుడని చెప్పిన తానప్పాచార్యుడు తాన్‌సేన్ అనే అనుకోవచ్చు. అలాగే శ్రీకంఠుడు కూడా తాన్‌సేన్ ప్రశిష్యుడేననుకోవచ్చు. దాక్షిణాత్య సంగీత లక్షణ కర్తలలో వెంకటమఖి తప్ప మరెవ్వరూ 'ఆచార్య శేఖర తానప్ప' పేరును ప్రస్తావించ లేదు.

మంద్ర, మధ్య, తార స్థాయులలో పన్నెండు స్వర స్థానాల విషయమై శ్రీకంఠుడు తన 'గురువు' ప్రామాణ్యాన్నే పేర్కొన్నాడు. కాని, ఆ గురువు పేరును గాని, గ్రంథాన్ని గాని పేర్కొన లేదు. *రసకౌముది* గ్రంథ పరిష్కర్త మాత్రం శ్రీకంఠుని గురువు నిస్సందేహంగా పుండరీక విఠలుడేనని పేర్కొన్నాడు. ఒక స్థాయిలో పన్నెండు స్వర స్థానాలను గురించి పేర్కొన్న మొదటి గ్రంథం (ఇప్పటి వరకు మనకు దొరికిన వాటిలో) మాత్రం రామామాత్యుని *స్వరమేళకళానిధి.* అయితే శ్రీకంఠుడు తన 'గురువు'గా రామామాత్యుని పేరును చెప్పలేదు.

- **"ధైవత్, పంచమ్, మాధిమ్, గంధార్, రిఖబ్,**<br>**ఖరజ్ సుర్ సాధి సాధి గుని నిషాద్ రే!**<br>**తేరౌ అలంకార్ బాయిస్ శ్రుతి సాధి బాద్ ఉచారి**<br>**'సరెగమపదనిస' సుఘర్ 'సనిదపమగరె' !**

**త్రివిధ సురని మధి తృతీయ తృతీయరే విర్తత్ జ్యనత్**
**విదమాన్‌సప్త**
**సుర్ తీన్ గ్రామ్ ఇక్కీస్ మూర్ఛితా భేద్ నాద్‌వాద్ తాన్‌సేన్-**
**విధాన్ రే!**

ఇది తాన్‌సేన్ ధ్రుపద రచన. దీని అర్థం –

"దైవత, పంచమ, మధ్యమ, గంధార, ఋషభ, షడ్జ, నిషాద స్వరాలను, పదమూడు అలంకారాలను, ఇరవై రెండు శ్రుతులను సాధన చెయ్యండి. తర్వాత ఆరోహణ క్రమంలో 'స-రి-గ-మ-ప-ద-ని' అని గానం చెయ్యడి".

అంటే ప్రాచీన కాలపు 'ద-ప-మ-గ-రి-స-ని' ఆరోహణ క్రమంలో అక్బర్ కాలపు 'స-రి-గ-మ-ప-ద-ని' అయిందన్న మాట. అంతే కాక, షడ్జ- మధ్యమ భావంతో ప్రతి స్వరం తన తర్వాతి మూడవ స్వరంతో సంవదిస్తుంది. ఎలాగంటే –

షడ్జ గ్రామ ప్రథమ మూర్ఛన – స-రి-(అంతర) గ-మ-ప-ద-ని

మధ్యమ గ్రామ ప్రథమ మూర్ఛన- మ-ప-ద-ని-స-రి-గ

ఈ సూత్రం సంగీతజ్ఞులకు తెలుసు. తాన్‌సేన్ నాదవాదంలో ఏడుస్వరాలు, మూడు గ్రామాలు, ఇరవయ్యొక్క మూర్ఛనలు, ముప్పయ్యారు రాగరాగిణులు ఉన్నాయి. అక్బర్ కాలపు బిలావల్, దాక్షిణాత్యుల ధీర శంకరాభరణం, ముస్లిముల బుజుర్గ్ ముకాం – మూడూ ఒకటే. అయితే, బుజుర్గ్ ముకాంలో (మధ్యమ గ్రామ) మంద్ర పంచమం కూడా ఉంటుంది. బిలావల్‌లో, ధీర శంకరాభరణంలో అది ఉండదు.

గ్రామమూర్ఛన పద్ధతి పట్ల తాన్‌సేన్‌కు పూర్తి అవగాహన ఉన్నట్లు పైన పేర్కొన్న ధ్రుపద్ రచన వల్ల స్పష్టంగా తెలుస్తుంది. షడ్జ గ్రామం లోని ప్రథమ సాంతర మూర్ఛన మధ్యమ గ్రామంలోని ప్రథమ శుద్ధ మూర్ఛన అవుతుందని భరతముని చెప్పిన సూత్రం, షడ్జ గ్రామంలోని నిషాదాది శుద్ధ మూర్ఛనే బిలావల్, లేక ధీర శంకరాభరణ మేళం అన్న సంగతి కూడా తాన్‌సేన్‌కు పూర్తిగా తెలుసు. అలాగే, ముకాం పద్ధతి, స్వర వ్యత్యాస పద్ధతికూడా అతడికి తెలుసు. ఖమాజ థాట స్వరాలను తల క్రిందులు చేయడం ద్వారా అతడు మియాకి తోడి రాగాన్ని సృష్టించి ఉంటాడని అనుకోవచ్చు. సదారంగ సంప్రదాయానికి చెందిన రాంపూర్ గాయకులకు కూడా స్వర వ్యత్యాస పద్ధతి బాగా తెలుసు.

ఏదేమైనా, తాన్‌సేన్ ఒక ప్రత్యేక సంప్రదాయాన్ని నెలకొల్పాడనీ, అయితే మూర్ఛన పద్ధతి సూత్రాన్ని అతడు గుప్తంగా ఉంచాడనీ పై ధ్రుపద రచనను బట్టి గ్రహించ వచ్చు.

**దక్షిణ భారతం పై ముస్లిముల ప్రభావం :**

❖ అరబ్ యాత్రికులు, వ్యాపారులు మనదేశ సముద్రపు రేవులకు రావడం, ఇక్కడ నుంచి చైనా వెళ్ళడం కొన్ని వేల సంవత్సరాలుగా జరుగుతున్నది. క్రీస్తుశకం 815 వ సంవత్సరంలో – అంటే మహమ్మద్ ఘజినీ దండయాత్రకు 175 సంవత్సరాల పూర్వమే – మలబార్‌లోని కడంగనూర్ పట్టణ పాలకుడు ఇస్లాం మతం పుచ్చుకున్నాడు. అతడు దక్షిణభారతంలో ముస్లిం కాలనీలు నెలకొల్పాడు.

జలాలుద్దీన్ ఖిల్జీ పరిపాలనా కాలంలో కోరమండలం అంతటా ముస్లిముల పలుకుబడి బాగా ఉండేది. సుందర పాండ్యుని ముఖ్య అమాత్యుడు మాలిక్ తకియుద్దీన్ అనే ముస్లిము. 14వ శతాబ్దపు చివరి దశాబ్దంలో సుందర పాండ్యుని పై మాలిక్ కాఫర్ దండయాత్ర చేసినప్పుడు దక్షిణ భారతీయ ముస్లిములంతా సుందర పాండ్యుని పక్షాన యుద్ధం చేశారు.

చిష్టియా సంప్రదాయానికి చెందిన సూఫీ భక్తులు, యోగులందరూ సంగీతారాధకులు. భగవంతుని కను గొనడానికి సంగీతమొక సన్మార్గమని వారి విశ్వాసం. వారిదొక గొప్ప గురుశిష్య పరంపర. ఖ్వాజా మొహియుద్దీన్ చిష్టి అజ్మీర్ గొప్ప సూఫీ యోగి. ఆయన ఎప్పుడూ భక్తి సంగీతం వింటూ ఉండేవాడు. ఆయన శిష్యుడు కుతుబుద్దీన్ బఖ్తియార్ కాకీ ఖవ్వాలీ భక్తి గీతాలు వింటూనే మరణించాడట. షేక్ బహాయుద్దీన్ జకారియా ముల్తానీ గొప్ప యోగి, గాయకుడు. ఆయన 'ముల్తాని శ్రీ' అనే రాగాన్ని సృష్టించాడు. ముకాం పద్ధతి ఆధారంగా ఆయన పెక్కు మిశ్రరాగాలు సృష్టించాడు.

సూఫీయోగుల పరంపరలో అతి ప్రసిద్ధుడు షేక్ నిజాముద్దీన్ చిష్టీ. ఆయన శిష్యుడే అమీర్ ఖుస్రో. నిజాముద్దీన్ చిష్టీ దక్షిణ భారతంలో మత ప్రచారానికై నాలుగు వందల మంది సూఫీలను పంపించాడు.

❖ అమీర్ ఖుస్రో తండ్రి తుర్క్ జాతీయుడు. తల్లి, మాతామహుడు హిందువులు. మాతామహుడు ఇస్లాం

మతం పుచ్చుకున్నాడు. ఆ విధంగా ఖుస్రో తల్లి కూడా ముస్లిం మహిళ అయింది. ఖుస్రో బ్రజ భాషా ప్రాంతమైన ఏటా జిల్లా (ఉత్తర ప్రదేశ్)లోని పటియాలీలో జన్మించాడు. అతడికి తల్లి ద్వారా భారతీయ 'సంస్కారం' అబ్బింది. అతడి మాతృభాష బ్రజ భాష. తండ్రి ద్వారా అతడికి ఇస్లాం, సూఫీ తత్త్వాల పరిజ్ఞానం, తుర్కీ, పర్షియన్, అరబిక్ భాషల జ్ఞానం లభించాయి.

ఖుస్రో హిందూ బ్రాహ్మణ గురువుల వద్ద కూడా శిష్యరికం చేశాడు. భారతీయ సంగీతాన్ని ఎంతగానో ప్రస్తుతించాడు. బ్రాహ్మణ పండితులు అరిస్టాటిల్ అంతటి వారనీ, భారతదేశం అనేక విషయాల్లో ఇతర దేశాల కంటే ఎంతో గొప్పదనీ ఖుస్రో ప్రకటించాడు.

❖ గ్రామ రాగాలు వైదిక సంప్రదాయానికి సంబంధించినవి. వాటిని లౌకిక వినోదం కోసం ప్రయోగించరాదు. మానసోల్లాస గ్రంథంలో సోమేశ్వరుడు ఈ నిషేధం గురించి ప్రస్తావించాడు. (సోమేశ్వరుడు ఖుస్రో కంటే సుమారు 150 సంవత్సరాల పూర్వుడు) అందుచేత ఖుస్రోకు గ్రామ-మూర్ఛన పద్ధతి తెలిసి ఉండదని అనుకోవచ్చు. అయితే, ఇరానీ సంగీతంలోని నాలుగు 'ఉసులా'ల (సిద్ధాంతాల) గురించి, పన్నెండు స్వరస్థానాల గురించి అతడికి క్షుణ్ణంగా తెలిసి ఉంటుంది.

❖ తంత్రీవాద్యాల మీది సారికలను పర్షియన్ భాషలో పర్దాలంటారు. ఆ వాద్యాలను వాయించేటప్పుడు ఎడమ చేతి వ్రేలితో తీగను నొక్కుతూ, కుడి చేతి వ్రేలికి తొడిగిన 'మిజ్రాబ్' (నక్కీ)తో తీగను మీటితే పలికే ధ్వనిని 'నగమా' (స్వరం) అంటారు.

ఇరానియన్ (పర్షియన్) సంగీతంలోని పన్నెండు స్వరాల వేర్వేరు మేళనాలతో ఏర్పడినవే 'ముకాం'లు. అవే దక్షిణ భారతానికి చేరి 'మేళా' లైనాయి.

❖ క్రీ.శ. 1296లో అల్లాఉద్దీన్ ఖిల్జీ సైన్యాధిపతులు ఉలుగ్ ఖాన్; నుస్రత్ ఖాన్‌లు గుజరాత్‌పై దండయాత్ర సాగించారు. ఆ దాడిలో వీరు గుజరాత్ రాణి కర్మావతిని బందీగా పట్టుకొని అల్లాఉద్దీన్ జనానాకు పంపించగా, గుజరాత్ రాజు కర్ణ తన కుమార్తె దేవళ దేవితో దేవగిరికి వెళ్ళి ఆశ్రయం పొందాడు. గుజరాత్ పై దాడిలోనే ఉలుగ్ ఖాన్, నుస్రత్ ఖాన్‌లు సంగీత నృత్యాలలో ప్రవీణులైన పెక్కుమంది 'పర్వర్' అనే అగ్రవర్ణ స్త్రీ పురుషులను పట్టుకొని ఢిల్లీకి పంపించారు. ఆ దాడిలోనే ఒక నపుంసక అందగాడిని వెయ్యి దీనార్లకు కొనుగోలు చేసి అల్లాఉద్దీన్ కొలువుకు పంపారు. ఆ అందగాడే తర్వాత గొప్ప సైన్యాధిపతిగా పేరు గడించిన మాలిక్ కాఫర్.

క్రీ.శ. 1306లో అల్లా ఉద్దీన్ ఖిల్జి దక్షిణభారతం పై దండయాత్రకు మాలిక్ కాఫర్‌ను పంపించాడు. ఆ దండయాత్రలో మాలిక్ కాఫర్ దేవళ దేవిని బందీగా ఢిల్లీకి తీసుకు వచ్చి అల్లాఉద్దీన్ కుమారుడు ఖిజ్రాఖాన్‌కు ఇచ్చి పెళ్ళి చేశాడు. తర్వాత దేవగిరి రాజు రామచంద్రుడు ఢిల్లీకి వచ్చి అల్లాఉద్దీన్ ఖిల్జీకి తన లొంగుబాటును ప్రకటించాడు. అప్పుడే దక్షిణ భారతం నుంచి పెక్కుమంది సంగీత కళాకారులు కూడా ఢిల్లీకి వచ్చారు. వారిలో బహుశా గోపాల నాయక్ కూడా ఒకడు.

గోపాల నాయక్ ముద్రతో గల ఒక ధ్రుపద్ రచన- అల్లాఉద్దీన్ ఖిల్జీని ప్రస్తుతిస్తూ రచించినది- ఒక వ్రాత ప్రతిలో దొరికింది.

**ఇంద్రప్రస్థ మతం :**

❖ అమీర్ ఖుస్రో బ్రజభూమిలో పుట్టినా, అతడి ప్రధాన కార్యస్థానం ఢిల్లీఅయినా, ముల్తాన్‌లో, అవధ్ (అయోధ్య) లో, బెంగాల్‌లో కూడా నివసించాడు. గుజరాతీ 'పర్వర్'లు ఢిల్లీలో స్థిరపడ్డారు. దక్షిణ భారతం నుంచి వచ్చిన సంగీత కళాకారులు కూడా వారితో కలిసి పోయారు. ఈ కలయికల ఫలితంగా 'ఇంద్రప్రస్థ మతం' అనేది ఒకటి రూపు దిద్దుకుంది. అందులో (1) భారతీయ రాగాలు ఇరానీ సంగీతంలోని ముకాం పద్ధతి ప్రకారం వర్గీకరింపబడినాయి (2) భారతీయ, ఇరానీ ఫణితుల మేళనంతో సృష్టించిన రాగాలకు భారతీయమైన పేర్లు పెట్టడం జరిగింది (3) ప్రాచీన నామాలు గల రాగాలను 'స్వర వ్యత్యాస' పద్ధతి ప్రకారం ఒక థాటనుంచి మరొక థాటకు మార్చడం జరిగింది. ఉదాహరణకు - వసంత, శ్రీరాగాలు కాఫీ థాట నుంచి పూర్వీ థాటలోకి వచ్చిచేరాయి. ఈ కొత్త పద్ధతిని మొదట 'ఖవ్వాల్ బచ్చా' సంప్రదాయం అన్నారు. తర్వాత అదే 'ఇంద్రప్రస్థ మతం' అయింది.

**విజయనగర సామ్రాజ్యం - ముస్లిమ్ ప్రభావం :**

❖ విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర రాయలు,

బుక్కరాయలు అంతకు ముందు చాలా కాలం ఢిల్లీలో బందీలుగా ఉన్నారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల వారిని విడుదల చేయడం జరిగింది. తర్వాత విద్యారణ్యుని ఆశీస్సులతో, ఆదేశంతో వారు 1336 లో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. 1347 లో మొదటి మహమ్మద్ షా బహమనీ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. అతడు నిజాముద్దీన్ చిష్టీ భక్తుడు. విజయనగర, బహమనీ రాజ్యాల మధ్య ఎప్పుడూ శత్రుత్వం ఉండేది.

❖ మహమ్మద్ షా కొలువులో 300 మంది గాయకులుండేవారు. ఆ గాయకులు ఎక్కువగా అమీర్ ఖుస్రో గేయరచనలను గానం చేస్తూ ఉండేవారు. ఒకసారి మహమ్మద్ షా వారి గానం విని ఆనందం పట్టలేక, వారందరికీ విజయనగర కోశాగారం నుంచి బహుమతులు సమర్పించి సన్మానించ వలసిందని ఆజ్ఞాపిస్తూ బుక్కరాయలుకు లేఖ పంపించాడు. స్వతంత్ర పరిపాలకుడైన తనను మహమ్మద్ షా ఆజ్ఞాపించడం ఘోర అవమానంగా భావించిన బుక్కరాయలు బహమనీ రాయబారిని అవమానించి పంపాడు. దాని ఫలితంగా రెండు రాజ్యాల మధ్య భీకర సంగ్రామం జరిగింది. బుక్కరాయలు ఓడిపోయి సంధి కుదుర్చుకొని మహమ్మద్ షా చెప్పినట్లుగా గాయకులందరికీ బహుమతులు సమర్పించుకున్నాడు.

❖ 1398లో బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌కు, హరిహరరాయలుకు మధ్య యుద్ధం జరిగింది. ఫిరోజ్ గొప్ప సంగీత ప్రియుడు. అతడి ఖాజీ సిరాజ్ సంగీత నృత్యాలలో ప్రవీణుడు. అతడు ఆడవేషంతో తన కళాబృందాన్ని విజయనగరానికి తీసుకువెళ్ళి హరిహరుని కుమారుని ఎదుట ప్రదర్శన ఇచ్చాడు. ఆడవేషంతోనే అతడు హరిహరుని కుమారుడిని హత్య చేశాడు. ఖుస్రో సంగీతం బహమనీ రాజ్యం ద్వారా విజయ నగర ఆస్థానంలోకి ఎలా చొచ్చుకు పోయిందో ఈ సంఘటనల వల్ల తెలుస్తుంది.

* * *

❖ క్రీ.శ. 1403 లో విజయనగర రాజు మొదటి దేవ రాయలు తన కుమార్తెను బహమనీ సుల్తాన్ ఫిరోజ్ కుమారుడైన హసన్‌కు ఇచ్చి వివాహం జరిపించవలసి వచ్చింది. ఆ వివాహ సందర్భంగా ఫిరోజ్ మూడు రోజులపాటు విజయనగరంలో మకాం వేసి అతిథి మర్యాదలందుకున్నాడు. ఆ మూడు రోజులూ విజయనగర కళాకారులు మగపెళ్ళివారి వినోదం కోసం ప్రదర్శనలిచ్చారు.

తర్వాత కాలంలో రెండవ దేవరాయలు అప్పటి బహమనీ సుల్తాన్ రెండవ అల్లా ఉద్దీన్ చేతిలో ఓడిపోయి విజయనగరం నుంచి రెండు వందల మంది బానిస స్త్రీలను బహుమతిగా పంపాడు.

❖ 1442లో రెండవ దేవరాయలు తన కొలువులో పనిచేస్తున్న ముస్లిములకు భూములు కానుకగా ఇచ్చాడు. వారి కోసం విజయనగరంలో ఒక మసీదు నిర్మించాడు. ముస్లిముల మతాచారాలలో ఎవరూ జోక్యం చేసుకోరాదని ఉత్తర్వు జారీ చేశాడు. తన సింహాసనం ఎదుట ఎత్తైన పీఠంపై పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని ఉంచాలని ఆజ్ఞాపించాడు. ముస్లిములు వారి మత సంబంధమైన మర్యాదలకు భంగం కలగని రీతిలో రాజుకు వందన మాచరించడానికి వీలుగా ఈ ఏర్పాటు చేయడం జరిగింది. హిందువులు విలువిద్యను, ఇతర సైనిక విధులను ముస్లిముల నుంచి నేర్చుకోవడానికి అవకాశం కల్పించాడు. దాని ఫలితంగా ఆరువేల మంది హిందువులు, రెండువేల మంది ముస్లిములు విలువిద్యలో ప్రవీణులయ్యారు.

❖ రెండవ దేవరాయలు ముస్లిముల పట్ల అనుసరిస్తున్న వైఖరికి ఎంతో సంతోషించిన ఇరాన్ చక్రవర్తి తన రాయబారి అబ్దుల్ రజాక్‌ను విజయనగరానికి పంపించాడు. రజాక్ విజయనగరానికి వచ్చి 1443 వరకు మర్యాదలందు కున్నాడు. దేవరాయలు వారానికి రెండు సార్లు రజాక్‌ను తన ఆస్థానానికి ఆహ్వానించి సత్కరిస్తూ ఉండేవాడు.

❖ దక్షిణ భారతంలో ముస్లిముల పలుకుబడి చాలా ఎక్కువగా ఉన్నటువంటి పరిస్థితిలో కల్లినాథుడు సంగీత *రత్నాకరానికి* వ్యాఖ్య రచించాడు. అప్పట్లో *రత్నాకరాన్ని* అర్థం చేసుకోగల యోగ్యత అతడికి మాత్రమే ఉంది.

*ఇంకావుంది...*

నండూరి పార్థసారథి,
హైదరాబాదు, ఫోన్ : 9959734534

# జ్ఞాపకాలలో ఘంటసాల

– కోడూరు పుల్లారెడ్డి



కడప జిల్లా పాలగిరిలో నా చిన్నతనంలో నేను త్రోవన వెళ్ళేటప్పుడు ఎప్పుడైనా ఒక రాగ యుక్తమైన పద్యం వినపడితే అక్కడి కక్కడే నిలబడిపోయి ఆ సంగీతధార ముగిసినంత వరకు అచేతనంగా ఉండిపోయిన సందర్భాలు కొల్లలని మా తండ్రి చెపుతుండేవారు. అందువల్ల నేననుకుంటాను– సంగీతాన్ని ఆస్వాదించే గుణం నాకు జన్మతః వచ్చిందని. ఆ అభిరుచిని నేను పెరిగిన పరిసరాలు నాలో పెంచి పోషించాయి. గమనించండి.

ఆనాడు కడప జిల్లాలో శాస్త్రీయ సంగీతాన్ని బాగా అధ్యయనం చేసియున్న ఒకరిద్దరిలో మా తండ్రి మేనమామ స్థానం సుస్థిరం. సరాసరి ఆయన యింటి పేరునే సంగీతం చేసి ఆయనను సంగీతం పాలేటి రెడ్డి అనేవారు. ఆయన మంచి స్టేజి నటుడు కూడా. నా చిన్నతనంలో ఆయన శ్రీకృష్ణరాయబారం నాటకంలో దుర్యోధన పాత్ర పోషించడం నేనెరుగుదును. మా యింట్లో నుండి బయటికి వెళ్లాలన్నా, బయట నుండి లోనికి రావాలన్నా ఆయన యింటి మండువా లోగిలిలో నుండి వెళ్లితీరాలి.

ప్రతిరోజు ఆయన ప్రొద్దున, సాయంత్రం సంగీత సాధన చేసేవాడు. బయటికి వెళ్లేటప్పుడు, లోనికి వచ్చేటప్పుడు ఆయన పాడే సంగీతం మృదుమధురంగా వీనులకు విందు చేసేది. నేనెన్నోసార్లు ఆయన పాడడం ఆపేసినంత వరకు ఆ యింటి ద్వారం దగ్గర నిలబడి వినేవాడినట. ఈ ప్రక్రియ నేను 1948లో నా పదకొండేండ్ల వయస్సులో కడప జిల్లా వేంపల్లె హైస్కూలులో చేరినంతవరకు నిరంతరాయంగా సాగింది. 1947లో నేను ట్యూషన్ చెప్పించుకొనేవాడిని. మా ట్యూషన్ మాస్టారు సెకండరీ గ్రేడు పాసై ప్రక్క పల్లెలో మేనేజ్‌మెంట్ ఎలిమెంటరీ స్కూలు నడిపేవారు. అయితే ఎప్పుడూ అక్కడికెళ్ళేవారు కాదు. మధ్య తరగతి స్థాయి కంటే ఉన్నతులు. ప్రొద్దు పోవడానికి నలుగురికి ట్యూషన్ చెప్పేవారు. అందులో నేనొకణ్ణి. ఆయన దగ్గర ఒక గ్రామ్ ఫోన్ ఉండేది. ఆనాటికి విడుదలైన ప్రసిద్ధ సినిమాల 78 ఆర్‌పిఎం రికార్డులు కూడా ఉండేవి. వారానికి రెండు సార్లు గ్రామ్‌ఫోన్ పెట్టి మాకు సినిమా పాటలు వినిపించేవారు. ఆ పాటలు వింటుంటే నాకెంతో ఆనందం కలిగేది. ఒకరోజు ఉండబట్టలేక గ్రామ్‌ఫోను ప్రతిరోజు పెడితే బాగుంటుంది సార్ అని అన్నాను. అంతే. వెధవా! అంటూ నన్ను చెంప దెబ్బతో సన్మానించారు. ఆనాడు నేను విన్న గ్రామ్‌ఫోన్ పాటలలో నా మనస్సులో చిరస్మరణీయంగా నిలిచిపోయినవి. 1. రాదే చెలి, నమ్మరాదే చెలి మగవారినిలా నమ్మరాదే చెలి, 2. వస్తాడే మా బావ, రేపోమాపో వస్తాడే మా బావ, 3. దేవుని మహిమ తెలియగ వశమా, పాపులకీ ఇలలో, 4. నల్లవాడే గొల్లపిల్లవాడే, 5. నా సొగసే కని మరుడే నా దాసుడు కాడా, 6. పావన గుణరామా హరే, 7. ఓహోహో పావురమా, 8. భూపతి జంపితిన్ మగడు భూరి భుజంగము చేత జచ్చె, 9. ప్రేమ మధువు గ్రోల అనురాగ జలధిదేల, 10. ఎన్నాళ్ళుండెదవే యిహ సుఖములతో కొన్నాళ్లే కదా మనసా, 11. ఆడబ్రతుకే మధురం, 12. నేనే రాణినైతే. 1947 నాటికి ఘంటసాల పాటలు పాడిన సినిమాలు, స్వర్గసీమ, యోగివేమన, పల్నాటియుద్ధం, రత్నమాల. వీటిలోనైనా ఒకటి రెండు పాటలు మాత్రమే పాడియున్నారు. అవి అన్నీ కూడా 78 ఆర్‌పిఎం రికార్డులలో వచ్చినట్టు లేదు ఆనాటికి.

వేంపల్లెలో నేను 1948లో థర్డు ఫారంలో చదువుకొనేటప్పుడు మా యింటి ప్రక్కన వృషభాచలేంద్రస్వామి వారి పూజారి యిల్లు ఉండేది. అక్కడ ఆయన కూతురుకు మరో నలుగురు అమ్మాయిలకు సంగీతం నేర్పించడానికి వరదరాజస్వామి అనే సంగీతం మాస్టారు రోజూ వచ్చేవారు. ఆయన ఒక చేత్తో హార్మోనియంకు బత్తా వేస్తూ రెండో చేత్తో పీకలు నొక్కుతూ సంగీత పాఠం చెప్పుతుండేవారు. ఎప్పుడైనా నేను కనపడ్డానంటే లాక్కొనిపోయి పాఠం చెప్పడం అయిపోయినంత వరకు నాచేత బత్తా వేయించేవాడు. బత్తా వేస్తూ నేను కూడా శ్రద్ధగా పాఠం వినేవాడిని. క్రొత్త పాఠం మొదలు పెట్టే ముందుగా ముందు చెప్పిన పాఠాలలో ప్రశ్నలు అడగడమే కాకుండా, ఏదో ఒక రాగం హార్మోనియంలో వాయించి ఆరోహణ, అవరోహణలు చెపుతూ ఆ రాగమేతో చెప్పమనేవారు. చాలా సందర్భాలలో ఆ అయిదు గురమ్మాయిలూ తప్పు చెప్పేవారు. అప్పుడాయన నన్ను

ప్రశ్నించేవారు. ఆ ప్రశ్న నేను బత్తా వేసే రోజులో విన్న పాటమైతే ఆరోహణ, అవరోహణలతో సహా అది ఏ రాగమైందీ సరిగ్గా చెప్పేవాడిని. ఆయన నన్ను కూడా సంగీతం నేర్చుకొమ్మని సలహా యిచ్చారు. సంగీతం ఆడపిల్లలు మాత్రమే నేర్చుకొంటారు, మగపిల్లలు సంగీతం నేర్చుకొన్నారంటే సిగ్గుపోతుందని ఆ రోజుల్లో నేను అనుకొనేవాడిని. అందువల్ల నేను ఆ ఆలోచనను దగ్గరికి రానివ్వలేదు. ఆనాడు ఆ అవకాశాన్ని జారవిడుచుకొన్న నేను అందుకు తరువాతి కాలంలో చాలాసార్లు నొచ్చుకొన్నాను. నా సంగీతాభిలాషకు మెరుగులు దిద్దినది యీ రెండవ మజిలి. నేను ఘంటసాల వారి అద్భుత గాన మాధుర్యాన్ని గ్రోలడానికి నా సంగీతాభిలాషకు పదును పెట్టిన నేపథ్యమిది. ఇక్కడే నేను కొన్ని మేళకర్త, జన్య రాగాలను – కళ్యాణి, శంకరాభరణం, కాంభోజి, కానడ, బిలహరి, మోహన, అఠాన, కాఫీ, షణ్ముఖప్రియ మొదలగునవి – వినికిడి జ్ఞానంతో గుర్తించడం నేర్చుకొన్నాను. ఘంటసాల వారు ఏ రాగం పాడినా అద్భుతంగా వుంటుంది. కాని కళ్యాణి రాగం ఎవ్వరు పాడినా కొంచెం హెచ్చుతగ్గులతో బాగుంటుంది. అది ఆ రాగం ప్రత్యేకత.

మొదటిసారిగా ఘంటసాల వారి పాటలు 1949లో బాలరాజు, పల్నాటి యుద్ధం సినిమాలు చూసినపుడు విన్నాను. తరువాత 1950లో స్వప్నసుందరి, లైలా మజ్ను, కీలుగుఱ్ఱం సినిమాలు చూసినపుడు వారి పాటల మాధుర్యంలో కొట్టుకొని పోయానంటే అతిశయోక్తి కాదు. ఆ అద్భుత కంఠమాధుర్యానికి ముగ్ధుడనై ఎన్నిసార్లు ఆ మూడు సినిమాలు చూశానో చెప్పలేను. ఇప్పుడు కూడా నేనుండే టౌన్లో ఘంటసాల పాటలు పాడిన ఏ సినిమా వచ్చినా వెళ్లి చూస్తూ వుంటాను.

నేను ఘంటసాల వారిని దర్శించడమొక విధి వైచిత్రి. అనంతపురం లలితకళాపరిషత్ ప్రాంగణంలో ఘంటసాల వారు 23-11-1960న వైశ్యులైన మేడా వారి పెళ్లిలో సంగీత కచేరి చేశారు. నేనప్పుడక్కడ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని. ఆనాడు ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం, కాకినాడ, వాల్తేరు, హైదరాబాద్‌లలో మాత్రమే నాలుగు ఇంజనీరింగు కళాశాలలు ఉండేవి. ప్రేక్షకులతో కిక్కిరిసిపోయిన ఆ లలితకళాపరిషత్ ప్రాంగణంలో నేనూ ఒక ప్రేక్షకుడ్ని. సంగీత కచేరి రాత్రి 8 గంటలకు ప్రారంభమైంది. ఆదిలోనే ఘంటసాల వారు ప్రేక్షకులకు "ఫలాన పాట కావాలని చీట్లు పంపవద్దు. మీరు కోరిన పాట, సాహిత్యం నాదగ్గరున్న పుస్తకంలో లేకపోవచ్చు. ఒక వేళ ఉన్నా అందరి కోర్కెలు తీర్చడం సాధ్యం కాదు. కాన నాకు తోచిన పాటలేవో పాడుతాను. క్రమశిక్షణతో విని ఆశీర్వదించండని" మనవి చేశారు. 'వాతాపి గణపతింభజే' అన్న ప్రార్థన పాటతో ప్రారంభించి దేవదాసులోని 'జగమే మాయ' పాటతో ముగించారు. మధ్యలో 'బహుదూరపు బాటసారి', 'అత్తలేని కోడలుత్తమురాలు', 'పోలీస్ వెంకటస్వామి', కొన్ని పుష్పవిలాపం, అద్వైతమూర్తి పద్యాలు, వినుడు వినుడు రామాయణ గాథ, పోదువో పయనమయే ప్రియతమ' పాడనట్టు నాకు గుర్తు.

మొత్తం మీద చాలా పాటలు పాడనట్టు నాకింకా జ్ఞాపకం. కచ్చేరి 10 గంటలకు ముగిసింది. వెంటనే చాలామంది ఘంటసాలవారిని చూడటానికి స్టేజిని చుట్టుముట్టారు. అందులో నేను కూడా ఒకణ్ణి. లోపలికి ఎలానో సగం శరీరం చొచ్చుకు పోయింది. కాని నిర్వాహకుల మనుష్యులు నన్ను అవతలికి లాగేశారు. నేను క్రింద పడ్డాను. ఒక మోస్తరు దెబ్బతగిలి రక్తం కూడా కారింది. ఘంటసాల వారు నన్ను లాగివేయడం, నేను క్రింద పడడం గమనించి, "ఆ అబ్బాయిని రానివ్వండ"న్నారు. నేను వెళ్లి నమస్కారం చేశాను. "ఇక్కడే ముందని కాళ్ళూ చేతులూ విరగ్గొట్టుకొంటావు బాబూ" అని అన్నారు. "మీకు పాదాభివందనం చేయాలన్నది నా కోరిక, అందుకే వచ్చానన్నాను." అప్పుడాయన "చూడు బాబూ! యీ పాదాభివందనాలు అందుకున్న మానవుడు తనను తాను మరిచి గర్వాంధుడౌతాడు. తదుత్తర క్షణమే అతని పతనం ప్రారంభమవుతుంది. నీకు నాపై వున్న గౌరవాభిమానాలు నా పతనానికి హేతువు కాకూడదు. కావున భగవంతుడు, తల్లిదండ్రులు, గురుబ్రహ్మలకు తప్ప వేరెవరికి పాదాభివందనం చేయవద్దని" నీతి గరిపారు.

నేను ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినని తెలుసుకొన్న ఆయన నన్ను బంగారు భవిష్యత్తులోకి అడుగు పెట్టమంటూ ఆశీర్వదించి కరచాలనం చేసి పంపించేశారు. ఇలా మరెందరి ఆశీర్వాద బలం వల్లనో నేను ఎలక్ట్రిసిటీ బోర్డులో సూపరింటెండెంట్ ఇంజనీరుగా పనిచేసి రిటైరు కావడం, నా ముగ్గురు పిల్లలు కర్నూలు మెడికల్ కాలేజిలో చదివి పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్లు కావడం జరిగిందని నా నమ్మకం. ఈ సంఘటన నా మనస్సులో ఆనాటి నుంచి గూడు కట్టుకొని వుంది.

కోడూరు పుల్లారెడ్డి - తలపుల జలధిలో నుంచి...
ఫోన్ : 9550818495



నెరుడా...
(రికార్డో ఎలీజర్ నెఫ్తాలీ రెమెస్‌లై బసాల్టో)

# కవిత్వం ఒక ఆల్కెమీ మరణం ఒక మిస్టరీ

– ముక్తవరం పార్థసారథి

**లా**టిన్ అమెరికా ఒరలోని కరవాలం చిలీ. ఆ ఖడ్గానికి మణిరత్న ఖచితమైన పిడికిలి నెరుడా కవిత్వం. మంచుటెడారి అంటార్కిటికా అంచున వున్న చిలీ, ప్రపంచంలోని సాహిత్యప్రియులందరికీ సాక్షాత్కరించింది ఆయన కవిత్వపు వెలుగులోనే. "లాటిన్ అమెరికా జీవన వైవిధ్యాన్ని, స్వప్నాల్ని కవిత్వీకరించినందుకు 1971లో నెరుడాకు నోబెల్ బహుమతి లభించింది. కాని అప్పటికే ఆయన పేరు జగద్విదితం. ప్రణయకవిగా, ప్రజాకవిగా, ప్రపంచ పౌరుల మధ్య శాంతి సౌభ్రాతృత్వాలను పెంచటానికి నిరంతరం కృషి చేస్తున్న సాహితీప్రవక్తగా, ప్రాక్పశ్చిమాల మధ్య వారధిగా భారతీయులకు కూడా సుపరిచితుడే.

ఈయన అసలు పేరు *రికార్డో ఎలీజర్ నెఫ్తాలీ రెమెస్‌లై బసాల్టో*. 1927-35 మధ్య బర్మా, సిలోన్, జావా, సింగపూర్‌లలో తన దేశం తరఫున కాన్సల్‌గా పనిచేశాడు. మన స్వాతంత్రోద్యమాన్ని ప్రత్యక్షంగా చూశాడు. జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో గాంధీ, నెహ్రూలను కలిశాడు.

'జ్ఞాపకాలలో' ఇండియా గురించి ఇలా రాసుకున్నాడు: "ప్రపంచశాంతికి కృషిచేస్తున్న ఇండియన్లతో చర్చించాలని "పార్టిసాన్స్ ఫర్ పీస్" (ఒక అంతర్జాతీయ సంస్థ) తరఫున 1950లో ఇండియా వెళ్ళాను. ప్రైమ్మినిస్టర్ నెహ్రూకోసం మా ప్రెసిడెంట్ పంపిన లేఖ కూడా నావద్ద వుంది. నెహ్రూకు 'శాంతి దూత' గా మంచి పేరుంది.

సుమారు ముప్పై ఏళ్ళ తరువాత తిరిగి ఇక్కడికి రావటం సంతోషంగా వుంది...గాంధీ కలలు నెరవేరాయి. స్వాతంత్ర్యం వచ్చింది.

బొంబాయిలో కస్టమ్స్ వాళ్ళు నన్ను అనుమానంగా చూశారు. దుస్తులున్న సూట్‌కేస్, ఒక చిన్న లెదర్‌బ్యాగ్ మాత్రమే వెంట తెచ్చాను. అయినా ప్రతి వస్తువూ నిశితంగా పరిశీలించారు. జేబులు వెదికారు. రెండు గంటలపాటు ఆ 'సెర్చ్' కొనసాగింది. నెహ్రూను కలవటానికి మాత్రమే వచ్చానన్నాను. చివరికి, ట్రావెల్ డాక్యుమెంట్స్, పాస్‌పోర్ట్ తీసుకొని నన్ను వదిలారు. చిలీ దేశస్థుల సహనం ప్రపంచ ప్రసిద్ధం. అయినా, దానికీ ఓ హద్దుంటుంది.

తెల్లారి, నెహ్రూసోదరి (పేరు గుర్తుకు రావటం లేదు)తో లంచ్ ఏర్పాటు చేశారు కొందరు. ఆమె గొప్ప అందగత్తె. ఆ చీరకట్టు, ఆ రంగుల కలయిక అద్భుతం. అంతటి సౌందర్యవతి కూడా వేళ్లతో భోజనం చెయ్యటం ఆశ్చర్యమేసింది. ప్రపంచశాంతి ఉద్యమాన్ని గురించి నాకు తోచింది చెప్పాను. ఆ సాయంత్రం నా పేపర్లు తిరిగి వచ్చాయి. ఢిల్లీలో అనేకమంది వుద్యమ నాయకుల్ని కలిశాను. మరుసటిరోజు నెహ్రూతో అపాయింట్‌మెంట్ దొరికింది.

నన్ను ఆహ్వానించి షేక్‌హ్యాండ్ చేశాడుగాని మొహంలో చిరునవ్వు లేదు. ముప్పైఏళ్ళ క్రితం అతణ్ణీ, అతడి తండ్రినీ చూశాను. అప్పుడు వాళ్ళెన్ని విషయాలు మాట్లాడారు. ఎన్ని గంటలసేపు కబుర్లు చెప్పారు! అవన్నీ గుర్తుచేశాను. అయినా అతనిలో మార్పురాలేదు. లేఖ అందచేశాను. నేను చేస్తున్న శాంతి ప్రయత్నాలకు నెహ్రూ సహకారం అందించాలని వుందందులో. చదివి మాట్లాడకుండా పక్కన పెట్టాడు. ఎందుకో గాని, ఆ క్షణాన అతడంటే అయిష్టం ఏర్పడింది.

బహుశా, దేశసమస్యలు, అతణ్ణి సతమతం చేస్తూ వుండి వుండాలి. అధికారంలో వున్నవాళ్ళకు ఆజ్ఞలివ్వడమే అలవాటు. ఆయన తండ్రి మోతీలాల్‌ది జమీందార్ల వంశం. నెహ్రూలోనూ ఆ పోలికలు కనిపించాయి.

"ఉత్తరానికి ఏం సమాధానం చెప్పమంటారు?"

"నేను రాస్తాను లెండి."

"అణ్వస్త్రాల ప్రమాదం ముంచుకొస్తున్నవి. అందరూ నిగ్రహంతో వ్యవహరించాలి."

"పరస్పర ఆరోపణలతోనే రోజులు గడచిపోతున్నాయి" అన్నాడు నెహ్రూ.

నేను సెలవు తీసుకొని లేచాను. మాట్లాడటానికేమీ మిగల్లేదు..

"వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" బొంబాయిలో కస్టమ్స్ గొడవ గురించి చెప్పాను. మనసు తేలికపడింది. 'విశ్వశాంతి' కాముకుల ప్రస్తావన ఇలా వుంటుంది! ఐదేళ్ళ తర్వాత మాస్కోలో లెనిన్ పీస్ ప్రైజ్ కమిటీ సమావేశమైంది. బహుమతి గ్రహీతల్ని ఎంపిక చెయ్యాలి. భారత ప్రతినిధి, నెహ్రూపేరు ప్రతిపాదించాడు. నేను చిరునవ్వు నవ్వకుండా వుండలేకపోయాను. అక్కడున్న వాళ్ళెవరికీ నా నవ్వు అర్థం తెలిసుండదు. మొత్తం మీద అతణ్ణి సమర్థించాను."

* * *

మరో నోబెల్ గ్రహీత, ప్రముఖ లాటిన్ అమెరికన్ రచయిత గాబ్రియల్ గార్షియా మార్క్వెజ్, నెరుడా అంటే అపారమైన గౌరవం, ఆరాధనాభావం. ఒక కథలో, ఆయన గురించి ప్రేమగా ఇలా గుర్తుచేసుకుంటాడు.

"రెండవ ప్రపంచయుద్ధం తర్వాత తొలిసారి స్పానిష్ నేలమీద అడుగు పెట్టాడు నెరుడా. వాల్పరేసో (చిలీ) వెళ్ళటానికి బార్సిలోనా వచ్చాడు. ఉదయమంతా మేం పాత పుస్తకాల షాపుల్లో వేటాడాం. రంగూన్ కాన్సులేట్‌లో ఉద్యోగం చేసినప్పుడు వచ్చిన నెల జీతమంతా పెట్టి అట్టలు చిరిగిన పాత పుస్తకమొకటి కొన్నాడు నెరుడా. ఆయన కళ్ళకీలోకం మరబొమ్మలా కనిపిస్తుంది. ఎవరో 'కీ' ఇచ్చి వదిలినట్టుగా కదులుతుంటారు జనం.

రెనాసెన్స్ కాలంలోని పోప్‌లాగుంటాడు నెరుడా. మర్యాదలు తెలియవనిగాదు గాని మహా తిండిపోతు. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోగానే అతని భార్య మెటిల్డా, భర్త మెడకో నాప్‌కిన్ కడుతుంది. (మంగలిషాపులోని నాప్‌కిన్‌లా వుంటుందది). మహాకవి సూప్‌తో స్నానం చెయ్యకూడదను కొంటే ఈ మాత్రం జాగ్రత్త తీసుకోక తప్పదు మరి. స్కాల్పెల్‌ను పట్టుకున్న సర్జన్‌లాగ నైఫ్‌తో రెడీగా కూర్చున్నాడు నెరుడా. ఒకదాని తర్వాత మరొకటి మూడు ఆరగించి మా ప్లేట్లవైపు ఆశగా చూశాడు. ఆ కళ్ళలోని అమాయకత్వానికెవరైనా ముగ్ధులు కాక తప్పదు. నత్తలు, ఆల్చిప్పల్లోని పురుగులు, రొయ్యలు, అనేక ఇతర జలచరాలు లాగించి తనకు (ఇంకా) తినాలనిపించిన భోజన పదార్థాల గురించి వుపన్యసించాడు. చిలిలో మాత్రమే దొరికే ప్రీహిస్టారిక్ షెల్ ఫిష్ అంటే మహాయిష్టం.

సంభాషణలో భాగంగా అతీంద్రియ శక్తులున్న ఒక వ్యక్తి నాకు తెలుసునని చెప్పాను. "ఇవన్నీ నేను నమ్మను. 'Only poetry is clairvoyant' అన్నాడు నెరుడా. లంచ్ తర్వాత మళ్ళీ బార్సిలోనా వీధుల్లో నడక కొనసాగించాం. పరధ్యానంగా నాలుగడుగులు వేశానో లేదో, అప్పటిదాకా మా ప్రక్కనే నడిచిన నెరుడా కనిపించలేదు. వెనక్కు తిరిగి చూస్తే ఓ మూలన, తన చిలియన్ యాసలో చిలుకలతో కబుర్లు చెబుతున్నాడు....

మూడయింది. అది నెరుడా కునుకుతీసే సమయం. నిద్రక్కూడా చాలా సౌకర్యాలు కావాలాయనకు. జపనీస్ టీ సెరెమనీ అంత సంక్లిష్టమైన విషయమది. కొన్ని కిటికీలు తెరవాలి. మరికొన్ని మూయాలి. చలిగానూ వుండకూడదు. ఉక్కగానూ వుండకూడదు. పూర్తి నిశ్శబ్దం అత్యవసరం. చీమ చిటుక్కుమనకూడదు. క్షణంలో నిద్రలోకి జారుకొని పదినిమిషాల్లో కళ్ళు తెరిచాడు నెరుడా. అంతా పసిపిల్లల్లాగే. మనం వూహించనప్పుడు లేచి కూర్చుంటారు వాళ్ళు. ఫ్రెష్‌గా మిలమిలా మెరిసే కళ్ళతో హాల్లోకి ప్రవేశించాడు. ఒక చెంపకు దిండుమీద అల్లిన డిజైన్లముద్ర స్పష్టంగా కనిపించింది."

1920 ల నాటి తూర్పుదేశాల అనుభవంతో రాసిన 'Residence on Earth' నుండీ ఆయన జీవితం తెరిచిన పుస్తకమే. ఆ స్వేచ్ఛాగాన ఝరులు ప్రతిదేశంలోనూ ప్రవహిస్తూనే వున్నాయి. 1945లో బ్రెజిల్‌లోని సావోపాలో స్టేడియంలో, ఆయన కవితాపఠనం వినటానికి లక్షమందికి పైగా తరలివచ్చారు.

అయితే, ఇటీవలి రోజుల్లో, నెరుడా పేరు మీడియాలో కనిపించటానికి కారణం ఆయన కవిత్వం కాదు. నలభైఏళ్ళ

నాటి మరణం గురించి కొన్ని సందేహాలు తలెత్తాయి. ఆ మిస్టరీ ఛేదించటానికి, పసిఫిక్ తీర నగరం ఐలానెగ్రాలో, సమాధి నుండి ఏప్రిల్ 8 నాడు ఆయన అవశేషాలను వెలికితీశారు.

దీర్ఘకాలం పాటు నెరుడాకు డ్రైవరుగా పనిచేసిన మాన్యుయెల్ అరామా, ఆయనది సహజ మరణం కాదని కొంతకాలంగా వాదిస్తున్నాడు. ఒకసారి, ఆనాటి సంఘటనలను పునస్సమీక్షించుకుంటే 1973 సెప్టెంబర్ 11 నాడు ప్రజాస్వామికంగా ఎన్నికైన దేశాధ్యక్షుడు సాల్వడార్ అలెండెను కూలదోసి, మిలటరీ జనరల్ అగస్టోపినోచె అధికారాన్ని దక్కించుకున్నాడు. (కమ్యూనిస్టు అలెండె మీద) తిరుగుబాటు వెనుక అమెరికా హస్తమున్నదని అమెరికన్ మీడియానే ఘోషించింది. అధ్యక్షభవనం లామొనిడాలో, సైనికులు అలెండెను కాల్చిచంపారని మొదట అనుకున్నారుగాని, శత్రువులకు సజీవంగా పట్టుబడటం యిష్టంలేని అలెండె తనను తాను కాల్చుకున్నాడని తరువాత తెలిసింది. ఆ తర్వాత పన్నెండు రోజులకు నెరుడా మరణించాడు.

ఇక, నెరుడా చివరి రోజుల్ని పరిశీలిస్తే సాంటియాగో(రాజధాని)లోని (అప్రతిష్ఠపాలైన) సాంటా మారియాక్లినిక్‌లో తుది 72 గంటలు గడిపాడాయన. సెప్టెంబర్ 19 నాడు ఐలానెగ్రా నుండి ప్రోస్టేట్‌కాన్సర్ చికిత్సకోసం అక్కడికి వచ్చాడు. అప్పటికే స్వగ్రామం (ఐలానెగా)లోని ఇంటిని సైనికులు నేలమట్టం చేశారు. మెక్సికన్ అధ్యక్షుడు లూయీఎకెవేరియా తన దేశానికి రమ్మని ఆహ్వానించాడు. ఒక ప్రత్యేక విమానం సాంటియాగో ఎయిర్‌పోర్టులో నెరుడా కోసం నిరీక్షిస్తున్నది. కాని తొందరేముంది. నా పుస్తకాలు, వ్రాత ప్రతులు తీసుకొని రెండు మూడు రోజుల తర్వాత వెళ్ళిపోవచ్చనుకున్నాడు. భార్య మెటిల్డా, డ్రైవర్ ఆరామో ఆపని మీదే వున్నారు.

ఎవరూ లేనప్పుడు, సాంటామారియా క్లినిక్‌లో నెరుడా పొట్టకో ఇంజెక్షన్ చేశారు. ఆ వెంటనే మరణించాడు మహాకవి. అది విషం ఇంజెక్షనని ఇప్పుడు అనుమానాలు ధృవపడుతున్నాయి.

*ది డబుల్ మర్డర్ ఆఫ్ పాబ్లో నెరుడా* పుస్తకంలో రచయిత, ఫ్రాన్సిస్కో మారిన్ ఇదే విషయం స్పష్టం చేశాడు. నెరుడాకు ప్రోస్టేట్ కాన్సర్ వున్న మాట నిజమే గాని అది 'టెర్మినల్' దశకు చేరుకోలేదు. ఆస్పత్రిలో చేరినప్పుడు నెరుడా ఆరోగ్యంగా, ఉత్సాహంగా కనిపించాడని ఇతర సిబ్బంది వాంగ్మూలమిచ్చారు. తదుపరి విచారణలో, కొందరి మీద హత్యానేరం కూడా నమోదు చేశారు.



ఇంజెక్షన్ చేసిన వెంటనే నెరుడా గుండె ఆగిపోవడం మరెలా అర్థం చేసుకోవాలంటారు అని అడిగారు పలువురు వైద్య నిపుణులు. మొత్తం మీద, పుస్తకాల మీది ప్రేమ నెరుడా ప్రాణాలు తీసింది. 1911లో, జడ్జి మారియో కరోజా, నెరుడా అవశేషాలకు మళ్ళీ వైద్య పరీక్షలు జరపాలని ఆదేశించాడు.

ఒకవేళ విషప్రయోగం జరిగివుంటే, ఆ 'traces' కనిపిస్తాయంటారు కొందరు. అవును. ఫొరెన్సిక్ సైన్సు బాగా అభివృద్ధి చెందినమాట నిజమే. "అంతా వృథా ప్రయాస. నలభై ఏళ్ళ తర్వాత ఇంకా ఏం మిగిలివుంటుందని, నెరుడా మరణం ఒక మిస్టరీగానే మిగిలిపోక తప్పదు" అంటారు మరికొందరు. మి

ముక్తవరం పార్థసారథి
ఫోన్ : 9177618708



# కట్టుబాట్లతో కాపురం – అదే అక్బర్ అంతఃపురం

*– ఈమని శివనాగిరెడ్డి*

ప్రతి రాజధాని నగరంలోనూ ఒక అంతఃపురం ఉంటుంది. హిందూ రాజప్రాసాదాల్లో అంతఃపురం ఒక భాగం. భద్రతాపరమైన కొన్ని కట్టుబాట్లున్నా, అనుమతి పొందిన వారెవరైనా అంతఃపురంలో ప్రవేశించవచ్చు. మధ్య యుగంలో మన దేశాన్ని పాలించిన ముస్లిం రాజుల అంతఃపురాలు, ఒక్క రాజుకు, రాజ వైద్యునికి తప్ప ఎవరినీ అనుమతించవు. మొఘల్ సామ్రాజ్య స్థాపకుడైన బాబర్, అతని కొడుకు హుమయూన్‌ల అంతఃపురాలు చిన్నపాటివే అయినా పర పురుష ప్రవేశ నిషేధం గట్టిగా అమలైంది. హుమయూన్ కుమారుడైన అక్బర్, అంతఃపురాన్ని ప్రత్యేకంగా నిర్వచించి, నిర్మించి, నిర్వహించి ఒక వ్యవస్థగా తీర్చిదిద్దాడు. అరబ్బీ భాషలో 'హరెం' అంటే పవిత్రమైన అనీ, నిషిద్ధ ప్రదేశమనీ రెండు అర్థాలున్నాయి. మొఘల్ అంతఃపురాన్ని హరెం అంటారు. దీన్నే జనానా, జనానీద్యోధి, హరెం–సర, హరెం–గాహ, మహల్ – సర, రాణీవాసమని కూడా పిలిచారు. ఈ అంతఃపుర వ్యవహారాలను చూసే అధికారిని నజీర్ అనీ, నజీరీ మహల్ అనీ, నజీరీ–మఖ్మయా అనీ, ఖ్వాజా – సర అనీ పిలిచేవారు.

మొఘల్ అంతఃపురంలో వివిధ ప్రాంతాలు, జాతులు, సంస్కృతులు, భాషలకు సంబంధించిన స్త్రీలుండేవారు. పెళ్లి పల్లకిలో అంతఃపురంలోకి ప్రవేశించిన స్త్రీ, మరణించిన తరువాత తప్ప బయటకెళ్లటానికి వీల్లేని కఠిన నియమ నిబంధనలున్నాయి.

ఎత్తైన గోడల లోపల గల రాణీవాసాలు, రంగ మహల్లు అన్ని సౌకర్యాలతో విలాసవంతంగా నిర్మించ బడినాయి. ఒక్కో రాణికి ఒక్కో ఆవాసం, ఉంపుడు గత్తెలు, బానిస వనితలు, కొజ్జాలు, పరిచారికలు, ఇతర స్త్రీలకు విడివిడిగా నివాసాలుండేవి. ఒకటికి మించిన అంతస్తులున్న ఈ భవనాల పైన పరిసరాలను పరికించటానికి కిటికీలుంటాయి. ప్రతి కట్టడంలోనూ పడక గదులు, వసారాలు, అన్నింటికీ కలిపి ఒక ఆరు బయలు ప్రదేశం ఉంటుంది. ప్రతి ఆవాస ద్వారం ముందు నుంచి జాలువారే నీటి ప్రవాహం, ముందు తోటలు, ఉద్యానాలు, ఫౌంటేన్లూ... ఒకోసారి ప్రార్థనా మందిరాలు, ఒక మూలగా మరుగు దొడ్లుంటాయి. ప్రధాన ద్వారం తప్ప, బయటికెళ్లటానికి ఎలాంటి ఏర్పాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. రాణీవాసంలో భద్రతకోసం, నిధుల నుంచటానికి భూ గృహాలు కూడా ఉంటాయి. ఆగ్రా కోటలోని అక్బరీ మహల్, జహంగీరీ మహల్ ఈ కోవకు చెందినవే. ఇన్ని హంగులున్న అక్బర్ కాలం నాటి వ్యవస్థీకృత అంతఃపురాలను యమునా తీరంలో ఆగ్రా, ఫతేపూర్ సిక్రీలలో ఇప్పటికీ చూడొచ్చు.

సాధారణంగా పట్టమహిషి అంతఃపురానికి సర్వాధికారిణిగా ఉండి అన్ని వ్యవహారాలను చక్కబెడుతుంది. ఒక్కోసారి రాజమాత కూడా ఆ బాధ్యతల్ని నెరవేర్చిన సందర్భాలున్నాయి. బాబరు అమ్మమ్మ ఐసాన్ దౌలత్ బేగం, షాజహాన్ కూతురు జహనారా, ఔరంగజేబు చెల్లెలు రోషనారా అంతఃపురాలపై అధిపత్యం చెలాయించారు. చక్కటి నడత, అపారమైన నమ్మకమున్న స్త్రీలను అంతఃపురంలోని ఒక్కోవిభాగానికి అధికారిణి (దరోగా) గా నియమించాడు అక్బర్. లోపలి స్త్రీల జీతభత్యాలనిచ్చి లెక్కలు రాసే నవీస్‌లుండేవారు. దృఢకాయులైన దేశ, విదేశీ వనితల్ని ఎంపిక చేసి అంతఃపుర కాంతల రక్షణ బాధ్యతల నప్పజెప్పాడు. అంతఃపురం గోడల వెలుపల మాత్రం కొజ్జాలనే నియమించాడు. అనుమతి పొంది లోనికెళ్లే వారిని కొజ్జాలు, క్షుణ్ణంగా తనిఖీ చేసి, గంజాయి, మద్యం లాంటి మాదకద్రవ్యాలు, మత్తు పానీయాలను లోనికి పోకుండా

జాగ్రత్తలు తీసుకున్నాడు. అంతేకాదు, లోపల వడ్రంగి లాంటి పనివాళ్ల అవసరముంటే, ప్రతి గేటు దగ్గరా అనుమతి పత్రముంటేనే రానిచ్చేవాడు. కాశ్మీరీ స్త్రీలను ద్వారపాలికలుగా నియమించి, ఇప్పటి విమానాశ్రయాల్లో మాదిరిగా ఒళ్లంతా తడిమి చూసి బురఖాల్లో మగవాళ్లు అంతఃపురంలోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకొన్నాడు అక్బర్.

తాను విహారయాత్రలకు, దండయాత్రలకు వెళ్లేటప్పుడు తనతోపాటు అంతఃపుర స్త్రీలు రావటానికి వీలుగా, ఏనుగులపై అన్ని హంగులున్న చిన్నపాటి ఇళ్లను నిర్మింప జేశాడు. సాధారణంగా చక్రవర్తికి నలుగురు భార్యలుండొచ్చు. ఒక్కోసారి ఈ సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది కూడా. తాను పెళ్లి చేసుకున్నవారికి తలాఖ్ చెప్పకుండా, జీవితాంతం తనతోనే ఉండేట్లు, తన తరువాత కూడా భరోసాగా జీవించేట్లు ఆగ్రాలో యమునాతీరంలో ఒక అంతఃపురాన్ని నిర్మించి దానికి సోహాగ్‌పురా అని పేరు పెట్టాడు. పెళ్లంటే నూరేళ్ల పంట అని నమ్మిన అక్బర్ పెళ్లిళ్లకు సంబంధించి ఎన్నో సంస్కరణలు చేశాడు. పిల్ల పెద్దమనిషి కానిదే పెళ్లి చెయ్యొద్దన్నాడు. ఇద్దరికీ ఇష్టమై, తల్లి తండ్రులు ఒప్పుకుంటేనే పెళ్ళి చేయమన్నాడు. కట్నాలు, కానుకలను గుంజొద్దన్నాడు. ఈ సంస్కరణలను అమలు చేయటానికి తూయీ-బేగీ అన్న పెళ్ళిళ్ల పేరయ్యలను నియమించాడు. ఆస్తీ, అంతస్తు, హోదాను బట్టి పది బంగారు మొహర్ల నుంచి ఒక్క రూపాయిదాకా పెళ్ళి సుంకాన్ని వసూలు చేశాడు.

ఎంతటి సంస్కారి అయినా, 'బ్రహ్మకైనా బుట్టు రిమ్మతెగులన్నట్లు' అందచందాలున్న కుర్రది కనబడితే చాలు ఆమెతో కులకటానికి ఉబలాట పడేవాడు. నియమ నిబంధనలతో పెళ్లి చేసుకొన్న పన్నెండు మంది భార్యలతో పాటు, అనేక మంది ఉంపుడు గత్తెలు, బానిస యువతులతో అక్బర్ సరస సల్లాపాల్లో మునిగి తేలాడు. అదీ అక్బర్ అంతఃపురం, ఆసాంతం శృంగార రసాన్వితకాసారం.

అక్బర్, సుల్తాన్ రుఖయ్యా బేగం (మొదటి భార్య), సుల్తాన్ సలీమా బేగం (జహంగీర్ తల్లి), బీబీ దౌలవత్ షాద్, అబ్దుల్లాఖాన్ మొఘల్ కూతురు, ఖాందేష్‌కు చెందిన మీరన్ ముబారక్‌షా కూతురులను పెళ్లాడాడు. రూప లావణ్యంతో, అబ్బురపరిచే అంగసౌష్టవంతో అందమంటే నాదేనన్నట్లున్న అతిలోక సుందరిగా పేరుగాంచిన అబుల్‌వసీ పెళ్ళాం పట్ల మోజుపడిన అక్బర్, ఆమెను సొంతం చేసుకోవటానికి, బలవంతంగా మొగుడికి విడాకులిప్పించాడు. ఆ తరువాత ఆమెను పెళ్లాడి రసార్ణవసుధాకరుడైనాడు. బానిస స్త్రీలలో అందగత్తెల్ని ఉంపుడు కత్తెల స్థాయికి తెచ్చాడు. వాళ్లతో కాపురం చేసి పిల్లల్ని కూడా కన్నాడు. తాను పెళ్లాడిన రాజపుత్ర స్త్రీలను, వారి వారి ఆచార వ్యవహారాలకు భంగం వాటిల్ల కుండా చూశాడు.

ఉదయాన్నే లేచి చక్కటి సంగీతాన్నాస్వాదించే అక్బర్, అటు తరువాత ఝరోకాలోకొచ్చి ప్రజల్ని పలకరించేవాడు. రాజకీయ కార్యకలాపాల తరువాత అంతఃపురానికి వెళ్లి నచ్చిన రాణీవాసంలో కొంచెం కాలం గడిపేవాడు. మధ్యాహ్నం దివాన్-ఇ-ఖాన్ కెళ్లి రాజకీయ ప్రముఖులతో మంతనాలాడి, భోజనానికెళ్ళేవాడు. సాయంత్రం వివిధ శాఖలు, కర్మాగారాలను తనిఖీ చేసి, కొంచెం సేపు ధ్యానం తరువాత, సూఫీ గురువులు, పండితులు, వేదాంతుల బోధలను వినేవాడు.

రాత్రికి మళ్లీ అంతఃపురానికి చేరుకొని కొద్ది మోతాదులో మద్యాన్ని సేవించి, పడుకొనే ముందు



అందగత్తెలతో ఆనందడోలికల్లో ఓలలాడేవాడు. తనకు నచ్చిన భార్య, ఉంపుడుగత్తె, బానిస యువతుల్లో, ఒకరితో ఆ రాత్రి గడిపేవాడు. అబుల్ ఫేజల్ ప్రకారం, అక్బర్ అంతఃపురంలో ఐదు వేల మందికి పైగా స్త్రీలుండేవారని, మహిళాధికారులకు నెలకు 27 నుంచి 1610 రూపాయల వరకు జీతమిచ్చేవాడని తెలుస్తుంది.

విలాసం, భోగలాలసలతో కూడుకొన్న అంతఃపుర జీవితానికొచ్చిన స్త్రీలు ఎంబ్రాయిడరీ, కుట్టుపనులు, బొమ్మలకు రంగులేయటం, భవంతులను దీపాలతో, ముగ్గులతో అలంకరించటం, గారడీ విద్యలను తిలకించటం, గాలి పటాలనెగరేయటం, పావురాలు, గద్దలతో ఆడుకోవటం, పాటలు పాడటం, నాట్యం చేయటం లాంటి కార్యకలాపాలతో ఆనందించేవారు. కోట లోపల వారం రోజులపాటు జరిగే మీనాబజార్‌లో వారికి ఇష్టమైన వాటిని కొనుక్కోవటమే కాక, పెళ్లిళ్లు కుదర్చటం, శోభనాలు ఏర్పాటు చేయటం, విందు వినోదాలతో కాలం గడిపేవారు. ఒక్కోసారి యమునా నదీతీరంలో సంవత్సరాదిని వేడుకగా జరుపుకొని 'ఖుష్‌రోజ్'గా పిలుచుకునేవారు.

అక్బర్ అంతఃపుర కాంతలు పలుచటి, ఖరీదైన బట్టల్ని ధరించేవారు. వాటి నాణ్యాన్ని, నేసిన నైపుణ్యాన్ని బట్టి వాటికి అబి-ఇ-రవాన్, షబ్నమ్, దఫ్త్ హవా అని పిలిచేవారు. ఒక్కసారి వేసుకొన్న బట్టల్ని మళ్లీ వేసుకొనేవాళ్లు కాదు. జీనత్ కౌసర్ పరిశోధనల ప్రకారం, అక్బర్ అంతఃపుర స్త్రీలు, తలకు 8, నొసటకు 16, చెవులకు 31, ముక్కుకు 15, పళ్లకు 1, మెడకు 29, బాహువులకు 16, మోచేతికి 24, అరచేతికి 3, కాలివేళ్లకు 9, నడుముకు 9, కాళ్లకు 15, కాలివేళ్లకు 5 రకాల ఆభరణాలను ధరించేవారు. అందుకనే అక్బర్ భార్యల్ని కదిలే నిధులనేవారట! రకరకాల స్వదేశీ, విదేశీ సుగంధ, పరిమళ ద్రవ్యాలతోపాటు, చేతులు కాళ్లకు గోరింటాకుతో అలంకరించుకునేవారు. మొత్తం నిధులను సంగీత, సాహిత్య, కళా రంగాలను ప్రోత్సహించటానికే కాక, దాన ధర్మాలకూ, చక్కటి భవంతుల నిర్మాణానికీ ఖర్చు చేశారు. రాణీవాసంలో ఆడ నౌకర్లందించే సేవలనందుకుంటూ, ఎవరి భవనాలు, గదుల్లో వారుంటూ, వంటశాల నుంచి ఆహార పదార్థాలను తెప్పించుకొంటూ విలాసవంతమైన జీవితాన్ని గడిపినా, శృంగార పరంగా, కోరికలు తీరక విరహ వేదనను భరిస్తూ, లైంగిక సుఖం దక్కితే ఈ విలాస జీవనాన్ని వదులుకొని బిచ్చగత్తెల మవటానికి కూడా వెనుకాడబోమని గోడును వెళ్ల బుచ్చుకున్నారు ఎందరో రాణీవాసపు స్త్రీలు. అక్బర్ అంతఃపురంలో నిబంధనల నతిక్రమించిన ఎలాంటి ఆధారాలు దొరక్కపోయినా, మొఘల్ అంతఃపుర కాంతలు పరపురుషుల్ని లోనికి రప్పించుకొని వారితో గడపటం, అందుబాటులో ఉన్న కొజ్జాలతో ప్రేమలో పడటం లాంటి ఆధారాలు కోకొల్లలు.

వివరాల్లోకెళితే, ఒక చిన్న తరహా ఉద్యోగితో గడుపుతున్న జహనారాను పట్టుకొన్న షాహజాన్ అతణ్ణి నిర్దాక్షిణ్యంగా చంపించాడు. మళ్లీ కొంతకాలానికి జహనారా, ఒక పర్షియన్ రాకుమారునితో గడుపుతుండగా, గమనించిన షాహజాన్ అతనికి తెలియకుండా తాంబూలంలో విషం కలిపి చంపించాడు. అంతఃపుర జీవనంతో విసుగు చెందిన రోషనారా ఇద్దరు యువకుల్ని ఎలాగో లోనికి తెప్పించుకొన్న సంగతి తెలిసిన ఔరంగజేబు ఆ ఇద్దర్నీ కఠినంగా శిక్షించాడు.

అణగారిన వాంఛలు, ఒక్కోసారి పెచ్చురిల్లి హెచ్చరికల్ని కూడా లెక్కచేయక, ప్రాణాలను పణంగా పెట్టి ఇతరుల పొందుకోసం వెంపర్లాడిన సంఘటనలు మొఘల్ అంతఃపురాల్లో ఎన్నో జరిగాయి. గత్యంతరం లేక కొందరు అంతఃపుర కాంతలు కొజ్జాలనే మచ్చిక చేసుకొన్నారు. నూర్జహాన్ పరిచారిక ఒకామె ఒక కొజ్జాతో గడుపుతుండగా, అదే పరిచారికను ప్రేమించిన మరో కొజ్జా, ఆ కొజ్జాను దారుణంగా చంపాడు. షాజహాన్ అంతఃపురంలోని కొజ్జా ప్రముఖుడైన దీదార్ ఖాన్, ఒక హిందూ పరిచారికతో గడుపుతున్నట్లు తెలుసుకున్న ఆమె సోదరుడు, వారిద్దరినీ అదే మంచం మీద కత్తితో పొడిచాడు. అంతఃపుర కాంతలంతా ఆ కొజ్జాకు మరణదండన శిక్ష విధించాలని పట్టుబట్టగా, ఔరంగజేబు జరిగిన తప్పుకు అతన్ని ముస్లింగా మార్చి క్షమించి వదిలేశాడని బెర్నియర్ రాశాడు.

ఇలా మనకు తెలియని మన చరిత్రలో అంతఃపుర కాంతల వింత వింత చేష్టలెన్నెన్నో.

ఆచార్య ఈమని శివనాగిరెడ్డి, (స్థపతి)
హైదరాబాద్, ఫోన్ : 9848598446



# మునిమాణిక్యం

- వి. ప్రమోద్ కుమార్

**చి**త్ర పరిశ్రమలో విజయ : అన్నపూర్ణ వంటి ప్రముఖ సంస్థలకు రచయితగా డి.వి. నరసరాజు గారు లబ్ధప్రతిష్టులు. చెన్నైలో ఆ రోజు స్క్రిప్టు రాసే పనిలో బిజీ బిజీగా ఉన్నారు. వారి శ్రీమతి గారు ఎవరో గేటు ముందు నిలబడటం గ్రహించి గేటు దగ్గరకు వచ్చి సౌమ్యంగా ఎవరండీ మీరు? ఎవరు కావాలండి? అని అడిగింది. ఆ ఆగంతకుడు ఓ వయసు మళ్ళిన వ్యక్తి. పంచెకట్టు, కండువా కళ్ళజోడూ; మాసిన గెడ్డం, చేతిలో ఓ సంచితో 'పెద్దమ్మకు దత్త పుత్రుడి'లా ఉన్నాడు.

"నమస్కారం అమ్మా! రాజుగారిల్లు ఇదే కదా? వారున్నారా అమ్మా"

"ఉన్నారు రండి" అంటూ గేటు తెరచి మీరూ... అంటూ అర్ధోక్తితో ఆగారు.

నేను వారి అభిమానిని. ఒక్కసారి కలవాలని వచ్చాను. వారి కాలం అమూల్యం అని తెలుసు దయచేసి వారిని పిలవగలరా? ఆశతో కూడిన అభ్యర్థనా స్వరంతో !

ఆమె లోపలికి వెళ్ళి చెప్పబోతుండగానే

'ఎవరదీ?' రాత ఆపకుండానే రాజుగారు

"ఎవరో పెద్దాయన, మీ అభిమానట. ఒక్కసారి మిమ్ములను కలవాలని వచ్చారు"

రాజుగారి భాషలో డైలాగులు ముగించి ఫేడవుట్ అయ్యారు ఆమెగారు.

"ఆ! అభిమానులంటూ వస్తారు. ఎంతో కొంత చదివింపులు; వాళ్లతో కూర్చుంటే పని పాడవుతుంది, ఏమిటో!" అంటూ మరలా రాత కార్యక్రమంలో మునిగి పోయారు. ఏదో అర్జంటు స్క్రిప్టు లాగుంది.

కొంత సమయం గడచింది. బయట ఎండ.

ఆ ఇల్లాలిది ఎంతైనా మాతృహృదయం కదా!

కొంచెం భయంతో "వారు బయట ఎండలో ఉన్నారు ఒక్కసారి... అర్థోక్తిగా అన్నారామె.

"ఆ... సరిసరి" అంటూ పెన్ను ప్రక్కన పెట్టి "ఎవరూ" అంటూ వరండాలోకి వెళ్లారు. ఆయన పెట్టిన నమస్కారం అందుకొంటూనే రాజుగారు "అయ్యా కొంచెం అర్జంటు పనిలో ఉన్నాను. తమరూ... మర్యాదతో కించిత్ అసహనం ఛాయలతో...

"క్షమించాలి అంతరాయం కల్గించినందుకు. నేను మద్రాసు వచ్చిన పనుల్లో మిమ్మల్ని కలవటం కూడా ఓ ముఖ్యమైన పని".

తన పేరు .......... చెప్పారాయన

అంతవరకూ పిసరంత అసహనంతో ఉన్న నరసరాజు గారు, ఒక్కసారిగా చేతులు జోడించి, సంతోషంతో కూడిన సిగ్గుతో, అయ్యా... ఎంత పని జరిగింది. తమంతటి వారిని గేటులో, నిలబెట్టి ఎంత తప్పు చేశాను, లోపలికి దయచేయండి, నరసింహారావుగారూ అని సాదరంగా ఆహ్వానిస్తూ, "ఇదుగో నిన్నే" ఓ ప్రక్కన అర్ధాంగిని పిలుస్తూ, రావుగారి చేయి పట్టుకొని లోపలికి తీసుకు వెళ్ళి, పడక కుర్చీలో కూర్చుండ బెట్టి, ఫ్యాను స్పీడు పెంచి, కొంచెం కిందా మీదా పడుతూ, ప్రక్క కుర్చీలో కూర్చుంటూ రాజుగారు;

"అయ్యా మా అజ్ఞానం అపారం. అపార్థం చేసుకోకండి" అంటుండగానే శ్రీమతి గారు చిన్న శబ్దం లోపలి నుంచి చేసి గ్లాసు చల్లటి మజ్జిగ అందించారు.

"ఎండన పడి వచ్చారు, కొంచెం మజ్జిగ తేట తీసుకోండి" అంటూ రావుగారికి అందించారా గ్లాసు.

రాజుగారు, శ్రీమతిని పిలిచారు.

ఆమె, చీరతాలూకు ఏదో గజం, భుజం చుట్టూ కప్పుకొంటూ వచ్చారు.

'చూడూ! వీరు నాకు గురుతుల్యులు. తెలుగు నాట సుప్రసిద్ధులు. కాంతం కథల రచయితగా, ఇంటింటా వెలుగుతున్న మాణిక్యం, వీరే మునిమాణిక్యం నరసింహారావుగారు.

వారి వైపు తిరిగి,

"అయ్యా నేనీనాడు రచయితగా కొద్దో గొప్పో పేరు సంపాదించానంటే దానికి ప్రేరణ మీరే. మీకు ఓ రకంగా ఏకలవ్యుణ్ణి" అన్నారు రాజుగారు. ఇంకా చెప్పాల్సింది చాలా ఉంది ఆయన రచయిత అయినా సకాలంలో సరఫరా కాని మాటల బద్ధకానికి నొచ్చు కొంటూ...




అప్పటి వరకు 'మౌన ముని' మాణిక్యం గారు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, అయ్యా రాజుగారూ! మీ రచనలు, మీరు పనిచేసిన చిత్రాలు, మీ హాస్య చతురత, నా కెంతో ఇష్టం. కాని మీరు దానికి తద్భిన్నంగా మరోలా చెప్పటం... కొంచెం బిడియ పడుతూ, అంత అర్హత స్థాయీ నాలో ఉందను కోను? అన్నారు నరసింహారావు గారు మోడెస్టీతో.

ఆరడుగుల రాజుగారు వినయంగా 'అర్ధగజాను బాహులై' చేతులు జోడించి, ''నా అభిమానినంటూ నన్నే ఇబ్బంది పెడుతున్నారు. ఒక్క క్షణం విశ్రాంతి తీసుకోండి' అని, లోపల వారి శ్రీమతితో భోజన సదుపాయాలు, సత్కారాలు చెప్పి హాలులోకి వచ్చి చూడగా సుప్రసిద్ధ రచయిత, తెలుగును తన సునిశిత హాస్యంతో సుసంపన్నం చేసిన కాంతం కథల మునిమాణిక్యం నరసింహారావు గారి పేరు తెలియని వారుండేవారు కాదు. కారణం ఆనాటికి ఇంటింటికీ ఓ కాంతం ఉండేవారు. (నేటి 'అద్వాన్నుడు కల్చర్' ఆనాడు లేదు, స్వచ్ఛంగా ఉండేది) కాంతం గురించిన చమత్కారాలు, ప్రహసనాలతో నవ్వుకోవడం, ఆనందించడం ఇంటింటికీ ఓ మధురమైన అనూభూతి. నరసింహారావుగారు పడక్కుర్చీలోనే సేదతీరుతూ ఏదో శబ్దానికి నిద్రాభంగమైంది.

''రాజుగారూ, అనుకోకుండా రెప్పంటుకొని మాగన్నులోకి జారాను, మీరు శలవిప్పిస్తే బయల్దేరతాను" అంటూ లేవబోయారు.

రాజుగారు, "ఈ పూట ఈ శిష్యుడి ఆతిథ్యం మీరు స్వీకరించి మా ఇంట చేయి కడిగితే నన్ను గౌరవించినట్లవుతుంది'' అంటూ భుజాలు పట్టుకొని మరలా కుర్చీలో కూర్చో బెట్టారు రాజుగారు.

ఆ తరువాత సుప్రసిద్ధ రచయితలు ఇద్దరూ, రచనా వ్యాసంగం ప్రధాన పాత్రగా, స్వల్ప కాలం యిష్టాగోష్ఠి చేశారు. ఆ తరువాత షడ్రషోపేతమైన విందు నారగింపచేశారు. ఓ గంట విశ్రమించిన తరువాత తేనీరు, ఫలహారాదులు స్వీకరించిన పిమ్మట రాజుగారు, పండ్లు, పంచెలచాపులో ఓ వెయ్యి నూటపదహార్లు వారికి కనబడకుండా ఓ పళ్లెంలో పెట్టి మునిమాణిక్యం గారికి భక్తి శ్రద్ధలతో నందించగా మునిమాణిక్యం ఆనంద భాష్పాలతో, నేను ఊహించని ఇంతటి ఆత్మీయ సత్కారం, ఆలింగనంతో పరస్పర గౌరవాలను గారవించుకొన్నారు ఆ మహారచయితలు. ఇంతలో స్క్రిప్టు కోసం వచ్చిన సహాయ దర్శకుణ్ణి తోడిచ్చి కారులో రావుగారిని వారి విడిదికి పంపించారు నరసరాజుగారు.

"ఇది నాకెంతో ఆనందాన్ని కల్గించిన కలయిక ప్రమోద్‌కుమార్" అంటూ ముగించారు రాజుగారు నాటి కలయిక కనులలో కన్నీటితో పాటు కదలగా...

అప్పట్లో మదరాసు రంజిత్ హోటల్‌లో డి.వి. నరసరాజుగారు "వయ్యారి భామలు వలగలమారి భర్తలు" (యన్.టి.ఆర్, కృష్ణ) కు స్క్రిప్టు వ్రాస్తుండగా ఆ చిత్రానికి పి.ఆర్.ఓగా పని చేస్తున్న నేను కలిశాను. అప్పటికి దర్శకుడు కట్టా సుబ్బారావుగారు రావటానికి ఆలస్యం అయింది. ఈ లోపుగా మాటల సందర్భంలో రాజు గారు స్వయంగా చెప్పిన మధుర సంగమం సంగతులు ఇవి-

వి. ప్రమోద్ కుమార్
ఫోన్ : 9573126568

# తాతాచార్యులు

– కాండ్రేగుల నాగేశ్వరరావు

తెలుగు సాహిత్యం మృతప్రాయమై ఉండటం చూశాను. ముప్పై ఏళ్ళు పరిశ్రమించి దానికి జీవం పోశాను అన్నాడు బ్రౌన్ 1825వ సం॥లో.

1798 నవంబరు 10న జన్మించిన బ్రౌన్ తండ్రి కలకత్తాలోని ఒక ఆంగ్లేయ అధికారి కుమారుడు. పన్నెండు సంవత్సరాల వయసపుడు తండ్రి మరణించటంతో లండన్ వెళ్ళి అక్కడే విద్యాభ్యాసం కొనసాగించాడు.

అప్పటి ఈస్ట్ ఇండియా కంపెనీ బ్రౌన్‌ను సివిల్ సర్వీసుకు ఎంపిక చేసి మద్రాసుకు పంపింది. 1817లో మద్రాసు వచ్చి సెయింట్ జార్జి కళాశాలలో చేరి తెలుగును ఐచ్ఛిక భాషగా ఎంపిక చేసుకొని సెకండ్ క్లాసులో ఉత్తీర్ణుడైనాడు.

1820 లో తెలుగు ప్రాంతంలో కాలుపెట్టాడు. అక్కడ నాలుగు సంవత్సరాలు తెలుగుభాషను అమితంగా ప్రేమించటం మొదలు పెట్టాడు. పది సంవత్సరాల కాలంలో తెలుగు వ్యాకరణం, ఛందస్సు, అలంకార శాస్త్రాలపై పట్టు సాధించాడు. పండితులచే తెలుగు కావ్యాలను పరిష్కరించి శుద్ధ ప్రతులను తయారు చేయించాడు. కావ్య భాషలోని సొగసులను, అందాలను, సామాన్యునికి సహితం అర్థం చేసుకునే వీలుగా వాటికి తాత్పర్యాలు వ్రాయించారు.

Proceeds of the Telugu and Sanskrit languages explained, The verses of Vemana లాంటి గ్రంథాలను ముద్రించాడు.

ఇంగ్లీషు తెలుగు; తెలుగు ఇంగ్లీషు, నిఘంటువులను తయారు చేయించాడు. 1855వ సం॥లో అనారోగ్యానికి గురికావటంతో లండన్ వెళ్ళి 1884లో అక్కడే తనువు చాలించాడు.

మన దేశాన్ని వదలి వెళ్ళేముందు తాతాచార్ల కథలను సంకలనం చేసి, పీఠిక వ్రాసి, ముద్రించి మనకందరికీ అందించి వెళ్ళాడు.

ఈ కథలలో పుష్కలంగా వినోదం–చమత్కారాలతో ఆనాటి చారిత్రక అంశాలను రంగరించబడిన ఆనాటి భూస్వామ్య, వ్యవసాయ జీవన రీతులను, సంప్రదాయలను మనకు చెప్పకనే చెబుతాయి.

బ్రౌన్ దీనిని ముద్రించి, విడుదల చేసిన 60 సం॥ల తరువాత వావిళ్ళ వారు 1916లో దీనిని పునర్ముద్రించి దాని అట్టపై Edited by Gurajada Appa Rao Author of Kanyasulkam అని అచ్చు వేయించి ప్రచురించారు. తిరిగి 1920, మళ్ళీ 1951 లో మరో సారి ప్రచురించారు. చివరిగా 1971వ సం॥లో EMESCO వారు బాపు అట్ట మీద బొమ్మతో రూ.5 ల కే దీనిని మనకందించారు.

బ్రౌన్ సేకరించిన అసలు వ్రాత ప్రతి Madras Oriental Longmans Manuscript Library లో పదిలంగా ఉందని బంగోరె పేర్కొన్నారు.

ఇంతకీ తాతాచార్యులు ఎవరు? బంగోరె ఎంతో పరిశోధించారు, అది తెలియరాలేదు. ఇప్పటితరం వారికెవరికీ బంగోరె కున్నంత ఓపిక లేదు. కాలం గడిచే కొద్దీ చారిత్రక అంశాలు కనపడి, వినబడనంతగా కాలంలో కరిగిపోతాయి. శిలలు కరిగి జీర్ణములైనవి తుంగభద్రలో, ఇక తాళపత్రాలు – మిగులుతాయా? ఇక రచనలేం మిగులుతాయి? చందమామ మాసపత్రిక అక్టోబరు 1972 సం॥లో తాతాచార్యుల కథలు కొన్ని మార్పులతో మరొకరి పేరుతో ప్రచురించారు.

1915లో గురజాడ పరిష్కరించిన తరువాత వావిళ్ళ వారు గురజాడ పేరుతో 1916లో అవి తిరిగి ప్రచురించారు. వావిళ్ళవారి ప్రతిలో అక్కడక్కడా అరసున్నలు, బండి అలు ఉన్నాయి. బ్రౌన్ యొక్క వ్రాత ప్రతిలో అవి లేవు.

బ్రౌన్ తన గురించి I was fond of chronlogical and historical research అని చెప్పుకున్నాడు.

# చదవండి...

– ఎన్నార్కె



✦ **బుద్ధధర్మ కరదీపిక :** ఆచార్య బుద్ధ దాస భిక్కు థాయ్‌లాండ్‌లో బౌద్ధధర్మంపై విద్యార్థి బృందానుద్దేశించి చేసిన ధారావాహిక ప్రసంగాలు. తెలుగు సేత, రచయిత డి. చంద్ర శేఖర్. బౌద్ధంలోని గంభీరమైన విషయాలు ప్రతి ఒక్కరూ తమ జీవితాలకు అన్వయించుకునే రీతిలో యివ్వబడ్డ కరదీపిక.

*పేజీలు : 100, వెల : ₹ 50/-, ప్రతులకు – విశాలాంధ్ర పబ్లికేషన్స్.*



✦ **కత్తి అంచుపై... కొన్ని ముంబాయి, కొన్ని నిశీధి కథలు :** రచయిత డాక్టర్ లంకా శివరామప్రసాద్. వారు తాము ముంబాయిలో ఉండగా గమనించిన కొన్ని వాస్తవ సంఘటనలను కథలుగా మలిచారు. కథలలో కొంత వ్యాస ధోరణి ఉన్నా, మానవ సంవేదనను గుర్తించి, బయటకు తీసుకు రావటంలో రచయిత కృతకృత్యులైనారు. చాలా కథలకు అధఃసూచిక లిచ్చారు. దానిలో ఎంతో లోతైన వాస్తవాలను విపులీకరించారు.

*పేజీలు 200, వెల : ₹ 200/-, ప్రతులకు – ఫోన్: 08897849442.*



✦ **విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధన :** భాషా పరిశోధకులకు, పర్యవేక్షకులకు కరదీపిక. వెలువరించిన వారు ఆచార్య వెలుదండ నిత్యానందరావు. విశ్వవిద్యాలయాలలో ఏ విషయాల మీద పరిశోధన సాగుతుంది? అసలేం జరుగుతున్నదక్కడా? ఎవరికీ సమగ్రంగా తెలియదు. ఈ పరిశోధనల వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటి? ఈ నేపథ్యంలో వీటి గురించి విషయసేకరణ గావించి, విగ్గడించి, కరదీపికలాంటి పుస్తకాన్ని ఇంపైన ముఖచిత్రంతో బైండ్ చేయించి మన ముందుంచారు ప్రచురణ కర్తలు. ఈ పుస్తకం మొత్తం 61 వ్యాసాలు ఇంకా కొన్ని అనుబంధాలు– ఇంత వరకూ జరిగిన అనుబంధాలు. ఒక్క చేతితో తీర్చిదిద్దిన వెలుదండ వారు అభినందనీయులు.

*పేజీలు : 550, వెల : ₹ 600/-, ప్రతులకు –నవోదయ*



✦ **ఆచంద్రార్కం కొన్ని తెలంగాణా కొత్త శాసనాలు :** పరిష్కర్త దక్కన్ ఆర్క్యలాజికల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపక సభ్యులైన దామరాజు సూర్యకుమార్. చరిత్ర పునర్నిర్మాణానికి కొత్త ఊపిరులందించే శాసనాలు అనేక అపోహలను త్రోసిరాజంటూ వాస్తవాలను వెలికి తీసి నిజాలకు పట్టంగడతాయి. తెలంగాణా శాసనాల పేరిట వస్తున్న గ్రంథాలలో ఇది ఐదవది. చారిత్రక సత్యాలను తెలుసు కొనగోరే వారు, తెలుగు భాషపై అభిమానం గలవారు తప్పక చదవ వలసిన పుస్తకం.

*పేజీలు 152, వెల : ₹ 125/-, ప్రతులకు – ఫోన్: 9666066529.*



✦ **నీటి చుక్క :** ఈతకోట సుబ్బారావు వ్రాసిన దీర్ఘకవిత. పర్యావరణ విధ్వంస కారణంగా ఏర్పడిన నిటి ఎద్దడిపై నారి లేని ధనువు, నీరు లేని బావి, సందర్భశుద్ధిగా ఉండవంటూ చిత్రించిన రాబోయే రోజుల వాస్తవ చిత్రణ. ప్రతి పేజీలోనూ ఉన్న బొమ్మలు ఆకర్షణీయమైనవే కావు, ఆలోచింప చేసేలా ఉన్నాయి. పాలపిట్ట ప్రచురణ.

*పేజీలు : 52. వెల : ₹ 50/- ప్రతులకు – ఫోన్ : 040-27678430*



✦ **ఆలోచనా సులోచనాలు :** కూర చిదంబరం. దినపత్రికలో వచ్చిన చిత్ర విచిత్ర వార్తలకు ఆయన తాను పొందిన స్పందనలు అనుస్పందనలను ఆశ్చర్యం కలిగించేవిలా, నవ్వించేవిగా, భయం కలిగించేవిగా ఈ వ్యాసాలలో పొందు పరిచారు.

*పేజీలు : 135, వెల : ₹ 60/-, ప్రతులకు – పాలపిట్ట ప్రచురణ.*

✦ **కాలరేఖలు :** 1948 సం॥ కాలానికి అటు ఇటు సాగిన తెలంగాణా విముక్తి పోరాటం దీని నేపథ్యం. రచయిత తాను విన్నవి, కన్నవి గుది గుచ్చి ఒక అందమైన నవలగా మలచి యాభైసంవత్సరాల తెలంగాణా ప్రజా జీవిత సంఘటనల పరిణామాల మాలికను దృశ్యమానం చేశారు. అందమైన ముఖచిత్రాన్ని లక్ష్మణ్ ఆలే అందించారు.



*పేజీలు 560, వెల : ₹ 200/-, ప్రతులకు - నవోదయ, విశాలాంధ్ర.*

✦ **మేధావి చిలకమర్తి :** చిలకమర్తి లక్ష్మీనరసింహం తెలుగు సాహిత్యానికి, సంఘ సంస్కర్ణోద్యమానికి, నాట్యరంగానికి చేసిన సేవ అపారం. వారి స్వీయ చరిత్ర 1944వ సంవత్సరములో వారు బ్రతికుండగానే ప్రచురితమైంది. ఈ గ్రంథము (స్వీయ చరిత్ర) వ్రాయుటకు “నే నంధుడ నగుటచే నా జ్ఞాపక శక్తి యొక్కటే నాకాధారము” అని చెప్పుకున్నారు. వారి స్వీయ చరిత్ర నుండి కొన్ని ముఖ్యమైన సంఘటనలను, వారి అభిప్రాయములను ఏరి కూర్చి చేసిన ప్రత్యేక సంపుటి ఇది. దీని వెల పేర్కొన బడలేదు. చంద్రమౌళిగారు ప్రత్యేక శ్రద్ధ వహించి ఇప్పటి తరానికి అందించిన అపురూప కానుక ఇది.



*పేజీలు : 45, ప్రతులకు - ఫోన్ :* 040-23402480

✦ **సన్నిధి :** కవితా సంపుటి. రచయిత గోవిందరాజు రామకృష్ణారావు. 36 కవితలున్న ఈ సంపుటిలో ప్రతి కవిత ఎనిమిది పంక్తులున్న అష్టపదులే. ఇవన్నీ భారతి, ఆంధ్రభూమి, ఆంధ్ర పత్రికలో మూడుపదుల సంవత్సరాల క్రితం ప్రచురితమయినప్పటికీ ఇప్పటికీ పలుకులోని తళుకు కనుమరుగు కాలేదు.



*పేజీలు 52, వెల : ₹ 60/-, ప్రతులకు - వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, ఫోన్: 9908754008*

✦ **విశాల నేత్రాలు:** ధారావాహికంగా ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురింపబడి, నాలుగు దశాబ్దాల క్రితం ఎందరినో అలరించిన పిలకా గణపతి శాస్త్రి వ్రాసిన విశాల నేత్రాలు రెండవ ముద్రణ. ఒకనాటి చారిత్రక సామాజిక నేపథ్యంలో ఒక ప్రేమకథను రంగరించి రచించిన నవలగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతి దక్కించుకున్న నవల ఇది.



*పేజీలు : 200, వెల : ₹ 90/- ప్రతులకు - ఎమెస్కో బుక్స్*

✦ **జై కిషన్ :** తెలంగాణాలోని కోటలు, ఖిల్లాలు విస్తరించి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి సహకారం లభ్యం కానప్పుడు డాక్రా (దక్కన్ ఆర్క్యలాజికల అండ్ కల్చరల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్) తరపున అనేక పురాతత్వ పరిశోధనలు చేయించడమేగాక లోహ పరిశోధనపై సెమినార్లు నిర్వహించి, తెలంగాణా ప్రాంతంలో అధ్యయనం చేయడానికి ఎందరినో పురికొల్పిన జై కిషన్ గారి పదవీ విరమణ సంబంధంగా వెలువడిన పుస్తకమిది. వివిధ విషయాలపై 36 పైచిలుకు వ్యాసాలున్నాయి ఇందులో.



*పేజీలు : 230, వెల : ₹ 200/-, ప్రతులకు - ఫోన్ : 9666066529.*

✦ **నోబెల్ తారలు :** విపుల, ప్రజాశక్తి, సాక్షి పత్రికలలో వచ్చిన వ్యాసాల సంపుటి. సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన లబ్దప్రతిష్ఠులయిన రచయితలు వ్రాసిన చిన్న చిన్న రసగుళికలివి. మహాకావ్యం కావడానికి పద్దెనిమిది పర్వాలు అవసరంలేదు. పద్దెనిమిది పేజీలు చాలు, అన్న శ్రీశ్రీ మాటలకు ఈ చిన్న కథలు ఉదాహరణలుగా నిలుస్తాయి. ముక్తవరం పార్థసారథి అనువాదం సరళంగా, సాఫీగా సాగింది. హాయిగా చదివించే పుస్తకం ఇది.



*పేజీలు : 290, వెల : ₹ 250/-, ప్రతులకు - ఫోన్ : 9177618708*

# పిటకేతర సాహిత్యం

- ఎమ్. రాజగోపాలరావు

*గతసంచిక తరువాయి...*

**పితకేతర పాళీ గ్రంథాలు :**

**1. నేత్తిప్పకరణ:** 'నేత్తిప్పకరణ' అంటే సద్ధమ్మ సక్రమావ గాహనకు దోహదంజేసే వివరణ అని 'ధమ్మపాల' వివరించాడు. పిటక గ్రంథాలను సక్రమంగా అర్థంజేసుకొనే విధానాలను సమీకరించి క్రమపద్ధతిలో అందించటమే నేత్తిప్పకరణ ప్రత్యేకత. కొందరు మహా కచ్చాయనను (కాత్యాయన) దీని కర్తగా పరిగణిస్తున్నారు. వేదాలను సక్రమంగా అర్థంజేసుకోవటానికి యాస్కాచార్యుని 'నిరుక్తికి' ఎంత ప్రాధాన్యముందో పిటకాలను అర్థం జేసుకోవటంలో నేత్తిప్పకరణకు అంతప్రాధాన్యముంది.

సమగ్ర స్వరూపాన్ని ప్రతిబింబించే "సంఘూవారం"తో నేత్తిప్పకరణ ప్రారంభమవుతుంది. తరవాతి 'విభంగవార" విషయ వర్గీకరణ మందిస్తుంది. విభంగవారలో మూడు విభాగాలుంటాయి: 1) ఉద్దేసవార; 2) నిద్దేసవార; 3) పటినిద్దేసవార. ఉద్దేసవార విషయసూచిక వంటిది. నిద్దేసవార సిద్ధాంతాలను నిర్వచిస్తుంది. పటినిద్దేసవార వాటిని విశ్లేషించి విస్తరిస్తుంది. ఉద్దేసవారలో మూడు పట్టికలుంటాయి: 1) 16 హారాల పట్టిక; 2) 5 నయాల పట్టిక; 3) 18 మూల పదాల పట్టిక. వీటిని నిద్దేసవార నిర్వచిస్తుంది. వీటిని సమగ్రంగా వివరించే పటినిద్దేసవారలో స్థూలంగా నాలుగు విభాగాలుంటాయి. 1) హారవిభంగ - హార సంబంధాల వివరణ 2) హారసంపాత - హారాల ప్రాధాన్యతల వివరణ 3) నయసముట్ఠాన - పరిశీలనా పద్ధతుల వివరణ 4) సాసనపట్ఠాన.

నేత్తిప్పకరణ ముందుగా 16 హారాలను వివరిస్తుంది: 1) దేసనాహార, 2) విచయహార, 3) యుత్తిహార, 4) పదట్ఠానహార, 5) లక్ఖణహార, 6) చతుబ్యూహహార, 7) ఆవత్తహార, 8) వివత్తహార, 9) పరివత్తానహార, 10) వివేచనహార, 11) పఞ్ఞత్తిహార, 12) ఓతరణహార, 13) సాధనహార, 14) అధిట్ఠానహార, 15) పరిక్ఖారహార, 16) సమారోపనహార. ఈ 16 హారాలను అనుసరించి వచ్చే హారసంపాతాలను తరవాత వివరిస్తుంది. హారాల ద్వారా లభించే ముఖ్యనైతిక సూత్రాలను హారసంపాత వివరిస్తుంది. హారాల పేరుతోనే ఉండే హారసంపాతాలు గూడా 16 ఉంటాయి: 1) దేసనాహార సంపాత, 2) విచయహార సంపాత, 3) యుత్తిహార సంపాత, 4) పదట్ఠానహార సంపాత, 5) లక్ఖణహార సంపాత, 6) చతుబ్యూహహార సంపాత 7) ఆవత్తహార సంపాత, 8) వివత్తహార సంపాత, 9) పరివత్తనహార సంపాత,10) వివేచనహార సంపాత, 11) పఞ్ఞత్తిహార సంపాత, 12) ఓతరణహార సంపాత, 13) సాధనహార సంపాత, 14) అధిట్ఠానహార సంపాత, 15) పరిక్ఖారహార సంపాత, 16) సమారోపనహార సంపాత.

నయసముట్ఠానమనే మూడో విభాగంలో విషయావ గాహనకు అవసరమయే 5 విశిష్ట దృక్పథాలను వివరిస్తుంది. 1) నందియా వత్త - అవిద్యవల్ల ప్రపంచమూలాన్ని అర్థంజేసుకోవటం అసాధ్యమంటుంది. ఆనందంగా జీవించటానికి ప్రయత్నించేవారు తీర్థికుల లాగానే ఆర్యసత్యాలను అర్థంజేసుకోలేరనీ వస్తువాంఛ వదలి, కర్మబంధాల నుంచి బయటబడి మధ్యేమార్గాన్ని అనుసరించటంద్వారా పాక్షిక దృక్పథాల నుంచి (దిట్ఠి) బయటబడి యథార్థాన్ని యథాతథంగా దర్శించు కోగలుగుతారని ఇది వివరిస్తుంది. ఆ తరవాత, 4 ఆసవాలను, 4 మార్గాలను, 4 స్మృతి ప్రస్థానాలను (సతిపట్ఠాన), 4 ధ్యానాలను, నాలుగు సమ్యక్ప్రహాణాలను (సమ్మాపహాన), 4 ఆనంద స్థితులను రాగద్వేషమోహ మిథ్యా దృష్టుల నుంచి బయటబడే మార్గాలుగా వాటిని వివరిస్తుంది. తరవాత బుద్ధ, ప్రత్యేక బుద్ధ, అర్హతులు వంటి వారిని వివరిస్తూ మానవులను నాలుగు వర్గాలగా విశ్లేషిస్తూ క్రమమయిన శిక్షణ ద్వారా వారు రాగ, ద్వేష, మోహాల నుంచి బయటబడగలరని వివరిస్తుంది.

సాసనపట్ఠాన బుద్ధుడు ధర్మదేశనలో ఉపదశించే విషయాన్ని బట్టి 16 రకాలుగా విభజిస్తుంది- 1) సంకిలేసభాగియ, 2) వాసనాభాగియ, 3) విచ్ఛేదభాగియ, 4) అసేఖభాగియ 5) సంకిలేస వాసనాభాగియ, 6) సంకిలేస - నిబ్బేదభాగియ, 7) సంకిలేస - అసేఖభాగియ, 8) సంకిలేస - నిబ్బేద - అసేఖ భాగియ, 9) సంకిలేస -

వాసనా - నిబ్బేద - భాగియ, 10) వాసనా - నిబ్బేద భాగియ, 11) తణ్హా సంకిలేస భాగియ, 12) దిట్ఠిసంకిలేస భాగియ, 13) దుచ్చరిత సంకిలేస భాగియ, 14) తణ్హావొదాన భాగియ, 15) దిట్ఠివేలాభ భాగియ, 16) దుచ్చరిత వొదాన భాగియ.

అటు తరవాత 18 ముఖ్యపదాలను లోకియ, లోకోత్తరాలుగా విభజిస్తుంది. వీటి వివరాలను గ్రహించుకొంటే అవి బౌద్ధ ధర్మ సక్రమావగాహనకు ఎంతగా తోడ్పడతాయో అర్థంజేసుకోవచ్చు.

**2. పేటకోపదేస:** నేత్తిప్పకరణలో పరిశీలించిన విషయాలను మరోవిధంగా వివరిస్తుంది పేరు కోపదేస. అయితే అందులో స్థానం పొందని కొన్ని విషయాలను వెలికితీసి వివరిస్తుంది. పిటకాల ఉపదేశాల సారాన్ని సంక్షిప్తంగా అందించటమే ఈ గ్రంథ లక్ష్యమని 'పేటకోపదేస' అనే పేరే స్పష్టంజేస్తుంది. దీనికి గూడా మహాకచ్చాయనను కర్తగా సంప్రదాయం విశ్వసిస్తున్నది. ధర్మాల వివరణలో పిటక భాగాలను ఉటంకించినప్పుడు వాటిని ఏ నికాయం నుంచి గ్రహించటం జరిగిందో స్పష్టంజేయటం దీని విశిష్ఠత. చతురార్య సత్యాలను బౌద్ధ దర్శన సారంగా ఇది తీర్మానిస్తుంది. సర్వాస్తి వాదుల సాహిత్యంలో గూడా వాటికే విశేష ప్రాధాన్యం లభించటం ఈ సందర్భంగా స్ఫురణకు వస్తుంది. నేత్తిప్పకరణలో గూడా వివరణలన్నిటికీ చతురార్యసత్యాలే కేంద్ర బిందువుగావటం గూడా ఈ సందర్భంగా ప్రాధాన్యం పొందుతుంది. ఆ విధంగా పేటకోపదేస ఒక వివరణ గ్రంథంగా గూడా గుర్తింపు పొందింది. గ్రంథం చిన్నదే అయినా లభించిన గౌరవం అపారం.

**3. మిళిందపఞ్హా :** ఇది పిటకేతర పాళీ సాహిత్యంలో అత్యంత ప్రాధాన్యమందిన గ్రంథం. ఇది శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలలో అత్యంత గౌరవం పొంది *ఖుద్దకనికాయంలో* అంతర్భాగంగా గుర్తింపు పొందింది. దీని మూల గ్రంథమెక్కడా లభించటం లేదు. శ్రీలంకలో తయారయిన గ్రంథమే ప్రామాణిక గ్రంథంగా కొనసాగుతున్నది. అక్కడినుండే ఇది ఇతర థేరవాద దేశాలకు - మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలకు చేరింది. రాజా మిళింద భిక్షునాగసేనల మధ్య బౌద్ధ ధర్మంలోని అనేక అంశాలమీద జరిగిన చర్చలో మిళిందుడు ప్రశ్నించటం (పఞ్హా) నాగసేన తగినవిధంగా సమాధానలు చెప్పటం ద్వారా అనేక ధార్మిక విషయాలను ఈ సంవాద రూపంలో అందరూ తేలికగా గ్రహించుకొనే అవకాశమేర్పడింది. మినాండర్‌ను బాక్ట్రియారాజు మినాండర్‌గా గుర్తించటంతో దీనికి చారిత్రక ప్రాధాన్యం గూడా లభించింది. అయినా దీని గ్రంథకర్తగానుగానీ, కాలాన్నిగానీ ఇదమిత్థంగా గుర్తించటం సాధ్యంగాలేదు. ఇది పిటక సాహిత్యం తరవాతదనీ అట్ఠకథలకు ముందుదని మాత్రవే స్పష్టమవుతంది. దీనిలో కనిపించే అలంకారిక భాషనుబట్టి ఖారవేలుని హాథిగుంఫా శాసనాల తరవాతిదని భావించే ఆధారాలు లభించటంవల్ల క్రీ.శ. ప్రథమ శతాబ్ది ద్వితీయార్ధానికి చెందినదిగా భావిస్తున్నారు.

మిళింద పఞ్హాలో ఏడు వర్గాలుంటాయి. ప్రథమవర్గం మిళింద - నాగసేనుల పూర్వవృత్తాంతంతో ప్రారంభ మవుతుంది. నాగసేన గంగానదీ ప్రాంతంలో ఉన్న ఒక భిక్షుసంఘ సభ్యుడనీ మిళింద నాగసేన శిష్యుడనీ పూర్వజన్మ సుకృతంవల్ల మిళింద మహామేధావిగా సాగలనగర రాజుగా జన్మించాడనీ చెబుతుంది. నాగసేన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడనీ ఏడు సంవత్సరాలకే వేదత్రయపారం గతుడయాడనీ తరవాత పరిత్యజించి ఏకాంత ధ్యానమార్గంలో సాగి భిక్షుసంఘంలో ప్రవేశించి థేర రోహణ శిష్యరికంచేశాడనీ, రోహణ నాగసేనను పాటలీపుత్ర నగారనికి పంపించగా అక్కడ థేర ధర్మరక్ష శిక్షణలో అర్హతుడయాడనీ చెబుతుంది. హిమాలయ సానువుల్లో ఉండే బౌద్ధ భిక్షువులు మిళిందుడు సంధించే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సతమతమవుతుంటే నాగసేన అక్కడికి చేరి, బౌద్ధ భిక్షువులకు అండగా నిలిచి, మిళిందుడి ప్రశ్నలకు సమాధానాలు చెప్పి గౌరవమందుకొన్నాడనే వృత్తాంతాన్ని ప్రథమ వర్గమందిస్తుంది.

నైతిక లక్షణాల చర్చతో రెండోవర్గం ప్రారంభ మవుతుంది. తరవాత నామ-రూప సంబంధం మీద చర్చసాగుతుంది. ఈ చర్చలలో మిళిందుని రాజుగాకాక పండితునిగా భావించి వివరిస్తున్నానని నాగసేన స్పష్టంజేస్తాడు. ఉదాహరణల ద్వారా ఉపమల ద్వారా మిళిందుని ప్రశ్నలకు సమాధానాలు చెప్పి మిళిందుని సంతృప్తిపరుస్తాడు. పునర్జన్మకు ఆత్మను హేతువుగా అర్థంజేసుకోవటం గురించి హేతువుకు - ప్రజ్ఞకు, ప్రజ్ఞకు - బుద్ధికి ఉండే సంబంధాలను గురించి ప్రవ్రజ్యకు, నిర్వాణానికి దోహదంజేసే పంచబలాలు - శ్రద్ధ, వీర్య,

స్మృతి, సమాధి, ప్రజ్ఞలను గురించీ చర్చసాగుతుంది. ఒక వ్యక్తి జన్మించినప్పటి నుంచి క్రమక్రమంగా పెరుగుతూ చివరికి మరణిస్తాడు కదా అతని పునర్జన్మకు అతని ఆత్మ ఆధారమా, శరీరం ఆధారమా, పూర్వజన్మ - పునర్జన్మ ఒకటేనా వేరా వంటి అనేక ప్రధాన సమస్యలమీద చర్చజరుగుతుంది. ఇంకా చిత్తం, విజ్ఞానం, చక్షు విజ్ఞానం చేతన - సంజ్ఞ - విజ్ఞాన సంబంధాలు, స్పర్శ - వేదన సంబంధాలు, వితర్క, విచారాలు వగయిరా ఈ వర్గంలో చర్చకు వస్తాయి.

మూడో వర్గంలో ప్రవ్రజ్య మార్గంలో తటస్థపడే ఇబ్బందులను గురించి తలెత్తే సందేహాలను నివారించే ప్రయత్నం జరుగుతుంది. మనిషికీ మనిషికీ మధ్య భేదాలెందుకు వస్తాయి, ప్రవ్రజ్యను సాధించటమెట్లా, కర్మప్రభావమేమిటి, నిర్వాణమంటే ఏమిటి, అది అందరికీ అందుతుందా లేదా అన్న సందేహాలు లేవనెత్తుతాడు మిళింద. పునర్జన్మ - జన్మాంతరత ఒకటేనా, వేరే ఆత్మగానీ మరేదైనాకానీ ఈ జన్మనుంచి మరోజన్మకు తరలిపోతుందా వంటి సందేహాలు గూడా వ్యక్తంజేస్తాడు మిళింద. అర్హతునికి శరీరం ప్రధానమా కాదా, బుద్ధునికి 32 మహా పురుషలక్షణాలున్నాయా లేవా, బుద్ధుని ప్రవర్తనమంతా కుశల ప్రవర్తనమేనా కాదా, ఉపసంపదా దీక్షలు మంచివేనా, రాగసహితునికి - రాగరహితునికి ఉన్న భేదమేమిటి వంటి ప్రశ్నలు గుప్పిస్తాడు మిళిందుడు. వాటన్నిటినీ తగిన విధంగా వివరించి మిళిందుని సంతృప్తుని గావించటం ఈ వర్గంలో ప్రాధాన్యం పొందుతుంది.

నాలుగో వర్గంలో బుద్ధుని ఉపదేశాలలో గోచరించే పరస్పర వైరుధ్యాలమీద చర్చ సాగుతుంది. వాటిని 82 మెండక ప్రశ్నలలాగా (మెండకపఞ్హా - పొట్టేలు కొమ్ముల వంటివి) క్రోడీకరించటం జరిగింది. ఇవి చాలా ఆసక్తికరంగా విజ్ఞానదాయకంగా ఉంటాయి. వాటిలో కొన్నిటిని వాచవిగా పరిశీలించటంవల్ల వాటి స్వరూప స్వభావాలు అర్థమవుతాయి. బుద్ధుని ఉపదేశాలలో గోచరించే వైరుధ్యాలు యథార్థకాలు కావని నాగసేన నిరూపిస్తాడు. బుద్ధుడు నిజంగా మహాపరినిర్వాణమంది నప్పుడు బుద్ధుని అస్థికలను ఆరాధించటంవల్ల లభించే ప్రయోజనమేమిటి అని మరోప్రశ్న. బుద్ధుని సమ్యక్సంబోధిని ఆరాధించటం ద్వారా ఆ ప్రజ్ఞాసంపదను వారుగూడా అందుకొని సమాపత్తులు అందుకొంటారనే నాగసేన వివరణ ఆసక్తి కలిగిస్తుంది. విత్తనాలు మొలకెత్తి పెరిగి వృక్షాలయి వేళ్లు భూమిలో దిగిపోయి భూమిమీద స్థిరంగా పాతుకుపోయినట్లుగా బుద్ధుని ధమ్మనియాలు, ఇతర ఉపదేశాలు స్థిరంగా కొనసాగుతూనే ఉంటాయి. దుఃఖార్తులయిన వారు వాటిని అనుసరిస్తారు, అనుసరిచటంవల్ల దుఃఖ విముక్తులయి సమాపత్తులందు కొంటారనే నాగసేన వివరణ ఎందరో సామాన్యుల సందేహాలు తీరుస్తుంది.

ఇటువంటి క్లిష్ట ప్రశ్నలను ఎన్నిటినో మిళిందుడు లేవనెత్తుతాడు. బుద్ధుడు గూడా ఆలోచిస్తాడు, వివేచిస్తాడు అంటున్నారు కదా, అప్పుడు బుద్ధుడు సర్వజ్ఞుడనటం ఎట్లా పొసుగుతుంది? దేవదత్తుని ఎత్తుగడలు తెలిసి కూడా బుద్ధుడు దేవదత్తునికి సంఘప్రవేశం ఎందుకు కలిగించాడు? అర్హతులు తప్పులు చేయరనట మెట్లా కుదురుతుంది? పాటిమొక్ఖ నియమాలను అప్పుడప్పుడు-అవసరమయి నప్పుడు బుద్ధుడు నిర్దేశించాడంటారు కదా అవన్నీ ఒక్కసారే ఎందుకు నిర్దేశించలేదు? వెస్సంతర తన బిడ్డలనందరినీ సమర్పించినప్పుడు బుద్ధుడెందుకు ఆమోదించాడు? నిర్వాణమంటే అంతా ఆనందమేనా? దాని స్వరూప స్వభావాలేమిటి? దానికి ఒక అవధి ఉంటుందా లేదా? వంటి ప్రశ్నలు, అత్యంత క్లిష్టమయిన ప్రశ్నోపప్రశ్నలు మిళిందుడు అడగటం, వాటికి నాగసేన సమాధానాలు చెప్పి మిళిందుని సంతృప్తిపరచటం ఈ వర్గంలో సాగుతుంది.

అనుమానానికి సంబంధించిన అనేక ప్రశ్నలు అయిదో వర్గంలో చర్చకు వస్తాయి. బుద్ధుడు ఒకప్పుడు భూలోకంలో జీవించాడని ఎట్లా చెబుతారు? అని మిళింద ప్రశ్న. దానికి నాగసేన ఒక ఉదాహరణ ద్వారా వివరించటం ఆసక్తికరంగా ఉంటుంది. ఒక దేశం రాజు మరణించినా అతని ముద్ర ఆధారంగా ఆ రాజు ఫలానా కాలంలో ఉండేవాడని నిర్ణయించినట్లుగానే బుద్ధుని రాజలాంఛనాలవల్ల, మహాపరినిర్వాణకాలంలో ఉపదేశించిన 35 అర్హతా అంగాలవల్ల దేవమానవులందరూ బుద్ధుడు భూలోకంలో జీవించాడని అంగీకరిస్తారని వివరిస్తూ అందంగా నిర్మించిన ఒక భవనాన్ని చూసి దాని నిర్మాతను అందరూ అభినందించినట్లుగానే బుద్ధుడు నిర్మించిన "ధమ్మనగర" నిర్మాణాన్ని గ్రహించే వారందరూ బుద్ధుని భూలోక అస్తిత్వాన్ని అంగీకరిస్తారని సోదాహరణంగా వివరించి మిళిందుని సందేహాలు తీరుస్తాడు నాగసేన.

*ఇంకావుంది...*



కలల జడిలో...

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



సొగసు తడిలో...